

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 204

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

కాంగ్రెస్‌లో 'బీసీ' కాక!

పార్టీతో 45 ఏళ్ల అనుబంధాన్ని తెంచుకున్న పీసీసీ మాజీ చీఫ్ పొన్నాల

అవమానాలు భరించలేక పార్టీని వీడుతున్నానంటూ ఏఐసీసీ అధ్యక్షుడికి లేఖ

మీడియాతో మాట్లాడుతూ కన్నీటి పర్యంతమైన సీనియర్ నేత

బీసీలకు కాంగ్రెస్ తగిన ప్రాధాన్యమివ్వడం లేదని ఆరోపణ

ఇటీవల ఢిల్లీ వెళ్లిన బీసీ నేతలకూ తప్పని భంగపాటు

రోజుల తరబడి నిరీక్షించినా దొరకని అపాయింట్‌మెంట్

టికెట్ల విషయంలో అన్యాయం వద్దంటూ గాంధీభవన్‌లో ధర్నాకు యత్నం.. హెచ్చరించి విరమింపజేసిన అధిష్టానం

ఈసారి బీసీ నేతలకు టికెట్లలో కోత తప్పదనే సంకేతాలు!

పార్టీలో కలకలం సృష్టిస్తున్న పరిణామాలు

బీసీలకు ఎన్ని టికెట్లు వస్తాయో తేలాక పొన్నాల బాటలో మరికొందరు..!



సాక్షి, హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీకి బీసీల కాక మొదలైంది. బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తూ గత 45 ఏళ్లుగా కాంగ్రెస్‌లో పనిచేస్తున్న సీనియర్ నేత, టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య పార్టీకి రాజీనామా చేశారు. పార్టీకి నాలుగు దశాబ్దాలకు పైగా సేవ చేసిన తనకు చివరకు అవమానాలే మిగిలాయని, ఈ ఆవేదనతోనే తాను పార్టీని వీడుతున్నానంటూ ఆయన శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖ పార్టీవర్గాల్లో సంచలనం సృష్టించింది. పార్టీకి విధేయుడిగా పేరొందిన పొన్నాల రాజీనామా చేయడం, బీసీ నేతలు ఏకంగా గాంధీభవన్‌లోనే ధర్నా నిర్వహించాలని

మిగతా 4వ పేజీలో ▶

కాంగ్రెస్ అభ్యర్థులు 70 మంది ఖరారు! -2లో

కల్లోలాలు మంచివి కావు

జీ 20 పార్లమెంటరీ స్పీకర్ల సదస్సులో మోదీ



ప్రపంచంలో పలు చోట్ల ప్రస్తుతం ఏం జరుగుతోందో మనందరికీ తెలుసు. కలసికట్టుగా ముందుకు సాగాల్సిన సమయమిది. ఇజ్రాయెల్, హమాస్ పోరుకు తక్షణం తెరపడాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసంతో మానవ విలువలకు పెద్దపీట వేయడమే ఇందుకు మార్గం. - మోదీ

- వివరాలు 6లో

టీఆర్టీ వాయిదా

- పాఠశాల విద్య డైరెక్టరేట్ వెల్లడి
- తదుపరి తేదీపై తర్వాత ప్రకటన
- ఇది నిరుద్యోగులను మోసగించడమేనని ఏఐఎస్ఎఫ్ మండిపాటు

4 లో

బరువు తక్కువ డ్రామా!

- చంద్రబాబుకు అనారోగ్యమంటూ టీడీపీ హడావుడి
- ఆసుపత్రిలో చేర్చేందుకే 'అనారోగ్యం' పథకం.. బాబు బరువు తగ్గలేదు..
- బెడిసికొట్టిన రాజకీయ కుతంత్రం

9 లో

"మూడో స్పిన్నర్‌ను ఆడించే విషయంపై ఇప్పుడే చెప్పలేను. పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటాం. తుది జట్టులో అవసరమైతే ఒకటి రెండు మార్పులు చేస్తాం. గత నాలుగేళ్లలో నేనేమీ పెద్దగా మారలేదు. బ్యాటర్‌గా చూస్తే ప్రతీ మ్యాచ్‌కు ముందు నా లోపాలు సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తా. దాని వల్ల ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సన్నద్ధతలో లోటు ఉండదు. ప్రతీ రోజు కొత్త సవాలే. అన్నింటికీ సిద్ధంగా ఉంటా. నా ఆటేంటో, జట్టుకు నా అవసరం ఏమిటో బాగా తెలుసు. కెప్టెన్‌గా ఈ మ్యాచ్ కోసం సహచరులకు ప్రత్యేక సూచనలేమీ చేయను. వరల్డ్‌కప్‌లో అన్ని మ్యాచ్‌లలాగే ఇదీ ఒకటి. –రోహిత్ శర్మ, భారత కెప్టెన్



సారథిగా నాపై ఎలాంటి ఒత్తిడీ లేదు. ఒక్క మ్యాచ్ వల్ల నాకు కెప్టెన్సీ రాలేదు. ఈ ఒక్క మ్యాచ్ వల్ల అది పోదు. దేవుడు ఎంత ఇస్తే అంతే దక్కుతుంది. భారీ సంఖ్యలో ఉన్న ప్రేక్షకుల మధ్య గతంలో ఎన్నోసార్లు ఆడాం కాబట్టి ఇదేమీ కొత్త కాదు. పాక్ అభిమానులను అనుమతిస్తే బాగుండేది. కానీ మద్దతు లేకపోయినా మేం దీనికి సిద్ధమయ్యే ఉన్నాం. చరిత్ర గురించి నేను పట్టించుకోను. రికార్డులు ఏదో ఒక రోజు బద్దలవుతాయి. 2021 టి20 ప్రపంచకప్‌లో మేం భారత్‌ను ఓడించాం. అంతకుముందు అదీ లేదు కదా. కాబట్టి దేనికైనా ఎక్కడో ఒక చోట ముగింపు తప్పదు." –బాబర్ ఆజమ్, పాకిస్తాన్ కెప్టెన్

చలో చిరకాల సమరానికి...


నేడు భారత్, పాకిస్తాన్ మధ్య వరల్డ్ కప్ మ్యాచ్



రోహిత్ శర్మ

- అభిమానుల్లో అమితాసక్తి, ఉత్కంఠ
- మూడో విజయంపై టీమిండియా గురి
- ఆత్మవిశ్వాసంతో బరిలోకి పాక్

మధ్యాహ్నం గం. 2 నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం





బాబర్ ఆజమ్

ప్రపంచకప్‌లో 51 మ్యాచ్‌లు ఉన్నా, అందరూ ఎదురు చూసేది 'ఈ' మ్యాచ్ కోసమే... ఈ మ్యాచ్ కోసమే ప్రసారకర్తలు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు సిద్ధం చేస్తారు... ఈ మ్యాచ్ కోసమే ఫ్లయిట్ టికెట్లు, ప్రకటనల రేట్లు ఆకాశానికి అంటుతాయి... ఈ మ్యాచ్ కోసమే అభిమానులు ఎన్ని కష్టాలకోర్చి అయినా మైదానంలోకి అడుగు పెట్టాలని ఆశపడతారు... ఈ మ్యాచ్ కోసమే ఆస్పత్రి మంచాలు కూడా హోటల్ బెడ్‌లుగా మారిపోతాయి... ఈ మ్యాచ్ కోసమే సినీ తారలతో ప్రత్యేక సంగీత కార్యక్రమం ఉంటుంది... ఈ మ్యాచ్ అంటే బీసీసీఐ, ఐసీసీ దృష్టిలో 'నవరాత్రి' సంబరం...

చరిత్ర అంతా ఒక వైపే ఉండవచ్చు... వన్డే ప్రపంచకప్‌లో ఏడుసార్లు తలపడితే ప్రతీసారి భారత్‌నే విజయం వరించి ఉండవచ్చు... ప్రస్తుత బలాబలాలు, ఇటీవలి ప్రదర్శన చూస్తే మరో మాటకు తావు లేకుండా టీమిండియానే ఫేవరెట్ అనవచ్చు... అయినా సరే ఈ పోరుకు ఎక్కడ లేని ఆకర్షణ... సరిహద్దు ఉద్రిక్తతలు, రాజకీయాల కారణంగా ఇది ఆట మాత్రమే కాకుండా అంతకు మించిన భావోద్వేగ సమరం... ఆటగాళ్లు మాకు అన్ని మ్యాచ్‌లాగే ఇదీ ఒకటి అని పైకి చెప్పవచ్చు కానీ వారికీ తెలుసు... మైదానంలో దిగాక తమ గుండె చప్పుడు ఎలా ఉంటుందో...

దాదాపు ఏడాది క్రితం అక్టోబర్ 23, 2022న టి20 ప్రపంచకప్‌లో రవూఫ్ బౌలింగ్‌లో కోహ్లి బాదిన రెండు వరుస సిక్సర్లు గుర్తుకొచ్చాయా... నాడు 90 వేల మంది సామర్థ్యం గల మెల్‌బోర్న్ స్టేడియం దద్దరిల్లింది. ఇప్పుడు 1,32,000 మంది ప్రేక్షకులతో నరేంద్ర మోదీ మైదానం మోతెక్కడం ఖాయం. ఈ రెండింటి మధ్య ఆసియా కప్‌లో తలపడినా వరల్డ్‌కప్ లెక్క వేరు... మన అభిమానులతో స్టాండ్‌లు 'నీలి సముద్రం'గా మారబోతుండగా, ఏడేళ్ల తర్వాత భారత గడ్డపై భారత్‌ను ఎదుర్కొంటూ తమకు మద్దతిచ్చే ఒక్క అభిమానీ లేని పాక్ తట్టుకోగలదా అనేది ఆసక్తికరం.

అహ్మదాబాద్: వరల్డ్‌కప్‌లో అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న మెగా సమరానికి రంగం సిద్ధమైంది. ఉత్కంఠ, భారీ అంచనాల నడుమ నేడు నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే లీగ్ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో గెలిస్తే పాక్‌పై వన్డే వరల్డ్‌కప్ మ్యాచ్‌లలో భారత్ ఆధిక్యం మరింత పెరుగుతుంది. మరోవైపు ఒక్కసారైనా టీమిండియాను ఓడించి పేలవ గణాంకాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలని పాక్ భావిస్తోంది. టోర్నీలో తమ తొలి రెండు మ్యాచ్‌లలో ఆస్ట్రేలియా, అఫ్గానిస్తాన్‌లపై భారత్ భారీ విజయం సాధించగా... నెదర్లాండ్స్, శ్రీలంకలను ఓడించిన పాక్ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగుతోంది. ఇటీవలి ఆసియా కప్ ప్రదర్శనను బట్టి చూస్తే అన్ని రంగాల్లో భారత్ ఆధిక్యం స్పష్టంగా కనిపిస్తోంది. అయితే అనూహ్యంగా ఆడే పాక్‌ను తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు.

గిల్ బరిలో దిగుతాడా...

భారత్ తుది జట్టు విషయంలో మామూలుగానైతే ఎలాంటి సమస్య లేదు. కానీ డెంగీ జ్వరం కారణంగా గత రెండు మ్యాచ్‌లు ఆడని శుబ్‌మన్ గిల్ బరిలోకి దిగడంపైనే ఉత్కంఠ నెలకొంది. అనారోగ్యం నుంచి కోలుకున్న అతను గురువారం స్వల్ప సమయం పాటు సాధన చేసినా... శుక్రవారం మాత్రం సుదీర్ఘంగా బ్యాటింగ్ చేశాడు. కెప్టెన్ రోహిత్ 'గిల్ 99 శాతం ఫిట్‌గా ఉన్నాడు' అని చెప్పడం అతను ఆడే అవకాశాలను మెరుగుపర్చింది. ఈ ఏడాది అద్భుత ఫామ్‌లో ఉండటంతో పాటు ఐపీఎల్‌లో ఇది అతని సొంత మైదానం కావడం కూడా మరో కారణం. అయితే ఆ ఒక్క శాతం పూర్తిగా కోలుకోకపోతేనే సమస్య. గిల్ లేకపోతే ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా బరిలోకి దిగుతాడు. రోహిత్, కోహ్లి, కేఎల్ రాహుల్‌ల బ్యాటింగ్ ఫామ్ భారత్‌కు పెద్ద బలం. అఫ్గాన్‌పై సెంచరీతో రోహిత్ తన స్థాయిని చూపిస్తే కోహ్లి ప్రశాంతంగా రెండు అర్ధ సెంచరీలు సాధించాడు. 2015లో కోహ్లి, 2019లో రోహిత్ పాక్‌పై సెంచరీలతో చెలరేగారు. రాహుల్ కూడా తన విలువను ప్రదర్శిస్తుండగా, మిడిలార్డర్‌లో శ్రేయస్ అయ్యర్ మరింత మెరుగైన ప్రదర్శన ఇవ్వాల్సి ఉంది. పాండ్యా, జడేజా ఆల్‌రౌండ్ ప్రదర్శనకు సిద్ధం కాగా, కుల్దీప్, సొంతగడ్డపై ఆడనున్న బుమ్రా బౌలింగ్‌ను పాక్ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి. ఎనిమిదో స్థానంలో శార్దుల్ ఠాకూర్‌ను తప్పించి అశ్విన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వవచ్చు. అయితే రెండు సీజన్లుగా ఈ మైదానంలో ఉత్తమ రికార్డు ఉన్న షమీ కూడా పరిశీలనలో ఉన్నాడు.

జోరు కొనసాగేనా...

శ్రీలంక బౌలింగ్ బలమైనది కాకపోయినా సరే వరల్డ్‌కప్ మ్యాచ్‌లో 345 పరుగుల లక్ష్యఛేదన అంత సులువు కాదు. కానీ దీనిని సాధించడం కచ్చితంగా పాకిస్తాన్ జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. ఆ మ్యాచ్‌కు ముందు నెదర్లాండ్స్‌తో తడబడిన తీరుతో పోలిస్తే ఆ జట్టు పరిస్థితి మారింది. హైదరాబాద్‌లో ఆడిన తుది జట్టునే పాక్ ఇక్కడా కొనసాగించవచ్చు. రిజ్వాన్ ఫామ్‌లో ఉండగా, అబ్దుల్లా షఫీక్ రూపంలో దూకుడైన ఓపెనర్ వెలుగులోకి రావడం సానుకూలాంశం. మిడిలార్డర్‌లో షకీల్, ఇఫ్తికార్ తమ వంతు పాత్ర పోషించగలరు. అయితే ఇమామ్ పేలవ ఆటతో పాటు జట్టు నంబర్‌వన్ బ్యాటర్ బాబర్ ఆజమ్ విఫలం కావడమే టీమ్‌ను ఆందోళన పరుస్తోంది. గత ఐదు ఇన్నింగ్స్‌లలో కలిపి బాబర్ 71 పరుగులే చేశాడు. అతను తన స్థాయికి తగినట్లుగా ఆడితే జట్టుకు ప్రయోజనం కలుగుతుంది. బౌలింగ్‌లో ఇప్పటికీ ప్రధాన అస్త్రం షాహిన్ అఫ్రిదినే. తన పదునైన లెఫ్టార్మ్ పేస్‌తో ఆరంభ ఓవర్లలో అతను భారత బ్యాటర్లను నిలువరించాలని జట్టు కోరుకుంటోంది. ఆపై రవూఫ్ కూడా కీలకం కానున్నాడు. భారీగా పరుగులిచ్చే హసన్ అలీ స్థానంలో వసీమ్ ఆడే అవకాశం ఉంది. టీమ్‌లో ఒక ప్రధాన స్పిన్నర్ లేకపోవడం పాక్ జట్టు పెద్ద బలహీనత. షాదాబ్, నవాజ్‌లను భారత బ్యాటర్లు అలవోకగా ఎదుర్కోగలరు.

పిచ్, వాతావరణం

గత రెండేళ్లలో ఇక్కడ జరిగిన నాలుగు వన్డేల్లో 59.8 శాతం వికెట్లు తీసి పేసర్లు ఎక్కువ ప్రభావం చూపించారు. అయితే ఈ మ్యాచ్ కోసం నల్లరేగడి మట్టి ఉన్న పిచ్‌ను ఎంచుకున్నారు. అంటే పిచ్ నెమ్మదిగా మారిపోయి బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. ప్రేక్షకుల కోణంలో పరుగుల వరద కోసమే నిర్వాహకులు సిద్ధమైనట్లు అర్థమవుతోంది. వేడి వాతావరణం, వర్ష సూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), గిల్/ఇషాన్ కిషన్, కోహ్లి, శ్రేయస్, రాహుల్, పాండ్యా, జడేజా, అశ్విన్/షమీ, బుమ్రా, కుల్దీప్, సిరాజ్.

పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), షఫీక్, ఇమామ్, రిజ్వాన్, షకీల్, ఇఫ్తికార్, షాదాబ్, నవాజ్, షాహిన్ అఫ్రిది, హసన్/వసీమ్, రవూఫ్.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
న్యూజిలాండ్	3	3	0	6	1.604
దక్షిణాఫ్రికా	2	2	0	4	2.360
భారత్	2	2	0	4	1.500
పాకిస్తాన్	2	2	0	4	0.927
ఇంగ్లండ్	2	1	1	2	0.553
బంగ్లాదేశ్	3	1	2	2	-0.699
శ్రీలంక	2	0	2	0	-1.161
నెదర్లాండ్స్	2	0	2	0	-1.800
ఆస్ట్రేలియా	2	0	2	0	-1.846
అఫ్గానిస్తాన్	2	0	2	0	-1.907

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

కివీస్ 'హ్యాట్రిక్' విక్టరీ

- 8 వికెట్లతో బంగ్లాదేశ్‌పై విజయం
- రాణించిన విలియమ్సన్, మిచెల్



విలియమ్సన్, మిచెల్

చెన్నై: గత ప్రపంచకప్‌ను త్రుటిలో కోల్పోయిన రన్నరప్ న్యూజిలాండ్ ఈ మెగా ఈవెంట్‌లో వరుస విజయాలతో దూసుకెళుతోంది. శుక్రవారం బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో గెలుపొందిన కివీస్ 'హ్యాట్రిక్' విజయాన్ని నమోదు చేసింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 245 పరుగులు చేసింది. ముష్ఫికర్ రహీమ్ (75 బంతుల్లో 66; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు), మహ్ముదుల్లా (49 బంతుల్లో 41 నాటౌట్; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), షకీబుల్ హసన్ (51 బంతుల్లో 40; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. కివీస్ బౌలర్లలో 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫెర్గూసన్ 3, బౌల్ట్, హెన్రీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన న్యూజిలాండ్ 42.5 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 248 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ విలియమ్సన్ (107 బంతుల్లో 78 రిటైర్డ్‌హర్ట్; 8 ఫోర్లు, 1 సిక్స్), డారిల్ మిచెల్ (67 బంతుల్లో 89 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) కివీస్‌ను గెలిపించారు. ఓపెనర్ కాన్వే (59 బంతుల్లో 45; 3 ఫోర్లు) రాణించాడు. ముస్తఫిజుర్, షకీబ్ చెరో వికెట్ తీశారు.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: లిటన్ దాస్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 0; తంజిద్ (సి) కాన్వే (బి) ఫెర్గూసన్ 16; మిరాజ్ (సి) హెన్రీ (బి) ఫెర్గూసన్ 30; నజ్ముల్ (సి) కాన్వే (బి) ఫిలిప్స్ 7; షకీబ్ (సి) లాథమ్ (బి) ఫెర్గూసన్ 40; ముష్ఫికర్ (బి) హెన్రీ 66; తౌహిద్ (సి) సాన్‌ట్నర్ (బి) బౌల్ట్ 13; మహ్ముదుల్లా (నాటౌట్) 41; టస్కిన్ అహ్మద్ (సి) మిచెల్ (బి) సాన్‌ట్నర్ 17; ముస్తఫిజుర్ (సి) లాథమ్ (బి) హెన్రీ 4; షోరిఫుల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (50 ఓవర్లలో 9 వికెట్లకు) 245. **వికెట్ల పతనం:** 1-0, 2-40, 3-56, 4-56, 5-152, 6-175, 7-180, 8-214, 9-225. **బౌలింగ్:** బౌల్ట్ 10-0-45-2, హెన్రీ 10-0-58-2, ఫెర్గూసన్ 10-0-49-3, సాన్‌ట్నర్ 10-1-31-1, ఫిలిప్స్ 2-0-13-1, రచిన్ రవీంద్ర 7-0-37-0, మిచెల్ 1-0-11-0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: కాన్వే (ఎల్బీడబ్ల్యూ) (బి) షకీబ్ 45; రచిన్ (సి) ముష్ఫికర్ (బి) ముస్తఫిజుర్ 9; విలియమ్సన్ (రిటైర్డ్‌హర్ట్) 78, మిచెల్ (నాటౌట్) 89; ఫిలిప్స్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 11, **మొత్తం** (42.5 ఓవర్లలో 2 వికెట్లకు) 248. **వికెట్ల పతనం:** 1-12, 2-92. **బౌలింగ్:** ముస్తాఫిజుర్ 8-0-36-1, షోరిఫుల్ 7.5-1-43-0, టస్కిన్ అహ్మద్ 8-0-56-0, షకీబ్ 10-0-54-1, మిరాజ్ 9-0-58-0.

మ్యూజిక్... మస్తీ!

భారత్, పాక్ మ్యాచ్‌కు ముందు వినోద కార్యక్రమం



అరిజిత్

అహ్మదాబాద్: సరిహద్దులో తీవ్రవాదుల చేతుల్లో భారత సైనికులు చనిపోయి నెలరోజులు కూడా కాలేదు... కానీ పాకిస్తాన్ ఆటగాళ్లకు 'గర్బా' నృత్యాలతో పూలు చల్లుతూ స్వాగతం చెబుతారా? వరల్డ్ కప్ టోర్నీకి ప్రారంభోత్సవం జరపలేదు కానీ ఈ మ్యాచ్‌కు ముందు ఉత్సవం నిర్వహించి పాక్ టీమ్‌కు ఎక్కడలేని ప్రాధాన్యతనిస్తారా? ఆర్మీకి మాత్రమే బాధ్యత ఉంటుంది తప్ప వేరేవారికి దేశం గురించి బాధ్యత లేదా? బీసీసీఐకి ఆదాయం మినహా త్యాగాలు, ప్రజల భావోద్వేగాలంటే లెక్క లేదు? ఇలా నేటి మ్యాచ్ గురించి దేశవ్యాప్తంగా ఎంత ఆసక్తి ఉందో అంతే స్థాయిలో తీవ్ర విమర్శలు కూడా వస్తున్నాయి. అయితే వీటన్నింటిని బీసీసీఐ పట్టించుకునే పరిస్థితిలో లేదు! ముందే ప్రకటించినట్లుగా భారత్, పాక్ మ్యాచ్ ఆటకు ముందు రంగురంగుల వేడుకను జరపనుంది. టాస్‌కు ముందు ప్రముఖ గాయకులు అరిజిత్ సింగ్, శంకర్ మహదేవన్, సుఖ్వీందర్ సింగ్, సునిధి చౌహాన్‌ల సంగీత ప్రదర్శన ఉంటుంది. ఇది 45 నిమిషాల పాటు సాగుతుంది. ఇన్నింగ్స్ విరామం మధ్యలో కూడా నేహ కక్కడ్, దర్శన్ రావల్ తమ గాత్రంతో అలరిస్తారు. ఈ మ్యాచ్‌కు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులతో పాటు అమితాబ్ బచ్చన్, రజినీకాంత్‌వంటి స్టార్లు హాజరు కానున్నారు.



భారత్ 7 పాకిస్తాన్ 0

వన్డే ప్రపంచకప్‌లో భారత్, పాక్ జట్ల మధ్య 7 మ్యాచ్‌లు జరగ్గా ఏడింటిలోనూ భారతే నెగ్గింది. 2007లో వెస్టిండీస్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు గ్రూప్ లీగ్ దశలోనే నిష్క్రమించడంతో రెండు జట్లు ముఖాముఖిగా తలపడే అవకాశం రాలేదు.

1992 ప్రపంచకప్ (మార్చి 4 : సిడ్నీ)
భారత్ ఇన్నింగ్స్: 216/7 (49 ఓవర్లలో) (సచిన్ 54 నాటౌట్); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 173 ఆలౌట్ (48.1 ఓవర్లలో). ఫలితం: భారత్ 43 పరుగులతో గెలుపు

1996 ప్రపంచకప్ (మార్చి 9 : బెంగళూరు)
భారత్ ఇన్నింగ్స్: 287/8 (50 ఓవర్లలో) (సిద్ధూ 93); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 248/9 (49 ఓవర్లలో). ఫలితం: భారత్ 39 పరుగుల తేడాతో విజయం

1999 ప్రపంచకప్ (జూన్ 8 : మాంచెస్టర్)
భారత్ ఇన్నింగ్స్: 227/6 (50 ఓవర్లలో) (ద్రవిడ్ 61, అజహరుద్దీన్ 59): పాకిస్తాన్ ఇన్నింగ్స్: 180 ఆలౌట్ (45.3 ఓవర్లలో) (వెంకటేశ్ ప్రసాద్ 5/27). ఫలితం: భారత్ 47 పరుగులతో గెలుపు

2003 ప్రపంచకప్ (మార్చి 1 : సెంచూరియన్)
పాకిస్తాన్ ఇన్నింగ్స్: 273/7 (50 ఓవర్లలో) (అన్వర్ 101): భారత్ ఇన్నింగ్స్: 276/4 (45.4 ఓవర్లలో) (సచిన్ 98,యువరాజ్ 50 నాటౌట్). ఫలితం: భారత్ 6 వికెట్ల తేడాతో విజయం

2011 ప్రపంచకప్ (మార్చి 30 : మొహాలీ)
భారత్ ఇన్నింగ్స్: 260/9 (50 ఓవర్లలో) (సచిన్ టెండూల్కర్ 85, వహబ్ రియాజ్ 5/46): పాకిస్తాన్ ఇన్నింగ్స్: 231 ఆలౌట్ (49.5 ఓవర్లలో). ఫలితం: భారత్ 29 పరుగులతో విజయం

2015 ప్రపంచకప్ (ఫిబ్రవరి 15 : అడిలైడ్)
భారత్ ఇన్నింగ్స్: 300/7 (50 ఓవర్లలో) (ధావన్ 73, కోహ్లి 107, రైనా 74); పాకిస్తాన్ ఇన్నింగ్స్: 224 ఆలౌట్ (47 ఓవర్లలో) (మిస్బా 76, షమీ 4/35). ఫలితం: భారత్ 76 పరుగులతో విజయం

2019 ప్రపంచకప్ (జూన్ 16 : మాంచెస్టర్)
భారత్ ఇన్నింగ్స్: 336/5 (50 ఓవర్లలో) (రోహిత్ శర్మ 140, కోహ్లి 77, ఆమిర్ 3/47): పాకిస్తాన్ ఇన్నింగ్స్: 212/6 (40 ఓవర్లలో). ఫలితం: డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ 89 పరుగులతో విజయం

'భారత జట్టే ఫేవరెట్'

గౌతమ్ గంభీర్

అహ్మదాబాద్‌లో ఈ రోజు ఏదో అనూహ్యం జరగబోతోందని, దానిని మనం నమ్మాలి అనే విధంగా కొందరి 'అతి' మళ్లీ మొదలైంది. భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్ అంటే కొన్ని మార్కెటింగ్ వర్గాలకు తమ లక్ష్యాలను అందుకునే లాభనష్టాల లెక్క. కానీ నా దృష్టిలో ఇది ప్రపంచకప్‌లో మరో మ్యాచ్ మాత్రమే. ఇరు దేశాల మధ్య ఉన్న రాజకీయ వాతావరణం వల్ల ఆటగాళ్ల ప్రతిభకంటే ఇతర అంశాలపైనే ఎక్కువగా దృష్టి వెళుతోంది. ఎలా చూసిన భారత జట్టే ఫేవరెట్. ఒకవేళ ఓడినా నష్టం లేదు. ఇదేమీ యుద్ధం కాదు. ఎవరూ చనిపోరు. పాకిస్తాన్‌లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. 2005-06లో పాక్ జట్టులో సభ్యుడైన ఒక ఆటగాడు ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. తాను ఒక అమ్మాయినే ప్రేమిస్తే వారి కుటుంబసభ్యులు ముందుగా ఒప్పుకోలేదని, భారత్‌పై మంచి ప్రదర్శన ఇచ్చాక అంగీకరించారని అతను చెప్పాడు. పాకిస్తాన్ టీమ్‌ను ఎవరూ అంచనా వేయలేరు. భారత్‌తో పోలిస్తే ఒక క్రమపద్ధతిలో ప్లేయర్‌ను తీర్చి దిద్దకుండా ప్రతిభ కనిపిస్తే చాలు ఇంకా పూర్తిగా సిద్ధం కాని ఆటగాడిని కూడా తీసుకొచ్చి ఆడిస్తారు. దాంతో అనూహ్య ఫలితాలు వస్తాయి. లంకపై చెలరేగిన అబ్దుల్లా షఫీక్ కూడా అలాంటివాడే. ఒకప్పుడు ఖాదిర్, సక్లాయిన్‌లాంటి స్టార్లను అందించిన పాక్ జట్టులో ఇప్పుడు చెప్పుకోదగ్గ స్పిన్నర్ ఒక్కడూ లేకపోవడం విషాదం. ఒంటిచేత్తో మ్యాచ్‌లు గెలిపించే స్పిన్నర్లు మన వద్ద ఉన్నారు. పేస్ బౌలింగ్‌లోనూ ఒక్క షాహిన్ అఫ్రిదిపై పాక్ ఆధారపడుతోంది. భారత్, అఫ్గానిస్తాన్ మధ్య ఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో బౌలర్లను ఏమాత్రం సహకరించకుండా పిచ్ పేలవంగా ఉంది. దీంతో వన్డే క్రికెట్‌ను ఎలా బతికిస్తారు. అహ్మదాబాద్‌లో అలాంటి పిచ్ ఎదురు కాదని ఆశిస్తున్నా. మొత్తానికి కోహ్లి, నవీన్ మధ్య సంధి కుదరడం నాకు ఢిల్లీలో ఆనందం కలిగించిన అంశం. ఇద్దరిలో ఒకరు అహం వదిలి ముందుకు వస్తేనే ఇది సాధ్యమవుతుంది. అయితే ఢిల్లీ ప్రేక్షకుల ప్రవర్తన నాకు నచ్చలేదు. వారు ఇలా చేస్తే భారత్ పరువు పోవడమే కాదు, క్రికెట్ అంటే ఆటకు మించి ఇంకేదో ఉంది అన్నట్లుగా చాలా మంది మళ్లీ భ్రమలు సృష్టించేందుకు సిద్ధమవుతారు.

క్రికెట్‌కు కుక్ గుడ్‌బై



లండన్: ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ అన్ని స్థాయిల క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఐదేళ్ల క్రితం అతను అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. 2018లో టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక కౌంటీ క్రికెట్‌లో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగించాడు. ఈ ఐదేళ్ల పాటు ఎసెక్స్ కౌంటీ జట్టు తురుపుముక్కగా ఈ వెటరన్ బ్యాటర్ సేవలందించాడు. మొత్తం కౌంటీ క్రికెట్‌లో ఎసెక్స్‌కే అంకితమైన రికార్డు కుక్‌ది! 2003లో కౌంటీ చాంపియన్‌షిప్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచి ఎసెక్స్ జట్టుకే దాదాపు రెండు దశాబ్దాలు ఆడాడు. 'నా వరకైతే క్రికెట్ నుంచి రిటైర్ కావడం అంత సులువైన పని కాదు. నేను కలలో కూడా ఊహించుకోలేని ప్రదేశాల్ని నాకు క్రికెటే చూపించింది. మేటి జట్లలో భాగమయ్యేలా, విజయవంతమయ్యేలా చేసింది' అని తన వీడ్కోలు సందేశంలో కుక్ వివరించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో కుక్ 352 మ్యాచ్‌లాడి 26,643 పరుగులు చేశాడు. ఇందులో 74 సెంచరీలు, 125 అర్ధసెంచరీలున్నాయి.

సెమీస్‌లో సింధు



వాంటా (ఫిన్‌లాండ్): ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ సింధు గంటా 31 నిమిషాల్లో 20-22, 22-20, 21-18తో ప్రపంచ 26వ ర్యాంకర్ థయ్ లిన్ ఎన్గుయెన్ (వియత్నాం)పై కష్టపడి గెలిచింది. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ 11వ ర్యాంకర్ వాంగ్ జి యి (చైనా)తో సింధు ఆడుతుంది.

రష్మిక ముందంజ



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్లోకి ప్రవేశించింది. థాయ్‌లాండ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో రష్మిక 6-2, 6-3తో వలెరి జీనినా (రష్యా)పై గెలిచింది. 79 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక నాలుగు ఏస్‌లు సంధించింది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 204

శనివారం 14-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'


జంగ్ తెలంగాణ

రింగ్ లీడర్లు

కొలువుల కాలం యూత్‌కి ఇది ఉపాధి సీజన్

రెంటికీ చెడ్డా.. ఇంటిపోరు...! రాష్ట్రం ఇచ్చిన పార్టీగా రెండుసార్లు లభించని ప్రజల ఆశీర్వాదం

- వివరాలు 7, 8 పేజీల్లో



మా ఆదేశాలే అపహాస్యమా?

మహారాష్ట్రలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ జాప్యాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది.

వివరాలు 6లో ▸



'ఆథరైజేషన్ కార్డులు'

అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ తీపి కబురు అందించింది.

వివరాలు 6లో ▸

వాళ్లకు అభ్యర్థులే లేరు

కాంగ్రెస్ పార్టీలో డబ్బు సంచులతో వచ్చే వారికే టికెట్లు: మంత్రి కేటీఆర్ ఫైర్

- ఇప్పటికే కొడంగల్‌కు కర్ణాటక నుంచి రూ.8 కోట్లు వచ్చాయి
- రాహుల్ లీడర్ కాదు.. ఎవరో ఇచ్చింది చదివే రీడర్ మాత్రమే..
- ఈ ఎన్నికలు తెలంగాణ, గుజరాత్, ఢిల్లీనడుమ పోరు
- బీజేపీకి 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతవడం ఖాయం
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మేనిఫెస్టో సిద్ధం చేశాం
- పొన్నాల బీఆర్‌ఎస్‌లోకి వస్తానంటే.. స్వయంగా వెళ్లి ఆహ్వానిస్తా..



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి సుమారు 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థులు లేరని.. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 సీట్లలో 25చోట్ల ఈ రోజు వరకూ అభ్యర్థులు లేరని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు వ్యాఖ్యానించారు. ఇతర పార్టీల నుంచి ఎవరైనా వస్తారా అని కాంగ్రెస్ ఎదురుచూస్తోందని.. చాలాచోట్ల ఇప్పటికే ఆశలు వదులుకుని నామమాత్ర పోటీకి సిద్ధమవుతోందని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వారికే టికెట్ వచ్చే పరిస్థితి ఉందని ఆరోపించారు. మంత్రి కేటీఆర్ శుక్రవారం ప్రగతిభవన్‌లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. కేటీఆర్ చెప్పిన వివరాలు ఆయన మాటల్లోనే..

''కాంగ్రెస్‌లో టికెట్‌కు రూ.15 కోట్లు, ఖర్చులకు మరో రూ.10 కోట్లు దగ్గర పెట్టుకోవాలని ఓ నేతకు చెప్పారట. డబ్బు సంచులను నమ్ముకుని చివరి నిమిషంలో

మిగతా 9వ పేజీలో ▶

గ్రూప్–2 వాయిదాతో విద్యార్థిని ఆత్మహత్య

అశోక్‌నగర్‌లో ఉద్రిక్తత.. వేల మంది విద్యార్థుల ఆందోళన



చిక్కడపల్లి

గ్రూప్–2 పరీక్షలు వాయిదా పడటంతో ఆవేదన చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. వరంగల్‌కు చెందిన ప్రవల్లిక(23) అశోక్ నగర్‌లోని బృందావన్ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటూ గ్రూప్–2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. పరీక్షలు వాయిదా పడిన నేపథ్యంలో మానసిక ఒత్తిడికి గురైన ప్రవల్లిక తానుంటున్న హాస్టల్‌లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు పోలీసులకు సమాచారం అందించారు. చిక్కడపల్లి ఏసీపీ ఏ.యాదగిరి, ఇన్‌స్పెక్టర్ పి.నరేష్ వెంటనే

మిగతా 5వ పేజీలో ▶

హైదరాబాద్ కొత్త సీపీ సందీప్ శాండిల్య



సందీప్ శాండిల్య



సునీల్ శర్మ



వాణీ ప్రసాద్



జ్యోతి బుద్ధప్రసాద్



క్రిస్టినా చోంగ్తు

- మరో రెండు కమిషనరేట్లకు కొత్త సీపీలు.. 4 జిల్లాలకు కొత్త కలెక్టర్లు
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు కొత్త బాస్‌లు
- ఈసీ ఆదేశం మేరకు ఒక్కో పోస్టుకు ముగ్గురి పేర్లను పంపిన సీఎస్
- ఆ జాబితాలో నుంచి అధికారులను ఎంపిక చేసిన ఈసీ.. సీనియారిటీకి ప్రాధాన్యత.. నేరుగా రిక్రూటైన ఐపీఎస్‌లకు ఎస్పీలుగా పోస్టింగ్
- వారిని ఆయా పోస్టుల్లో నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ఎన్నికల సంఘం బదిలీ చేసిన అధికారులు స్థానాల్లో కొత్త అధికారులు నియామకం అయ్యారు. ఈసీ ఆదేశాల మేరకు కీలక ప్రభుత్వ శాఖలు, పోలీసు విభాగంలో ఈ మేరకు పోస్టింగ్‌లు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్‌తోపాటు నిజామాబాద్, వరంగల్ కమిషనరేట్లకు కొత్త పోలీసు కమిషనర్లను నియమించడంతోపాటు పది జిల్లాలకు ఎస్పీలను, నాలుగు జిల్లాలకు కలెక్టర్లను నియమించారు. అలాగే వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ శాఖలకు కొత్త కమిషనర్లను నియమించారు.

సీనియారిటీకి ప్రాధాన్యమిస్తూ..

పనితీరుపై ప్రతిపక్షాల ఆరోపణలు, నిబంధనల ఉల్లంఘనకు పాల్పడ్డారన్న నివేదికల ఆధారంగా 20మంది ఐపీఎస్, ఐఏఎస్, నాన్ కేడర్ ఎస్పీలను ఈసీ బదిలీ చేసిన విషయం తెలిసిందే. వెంటనే

మిగతా 4వ పేజీలో ▶

22 బాక్సుల్లో రూ.42 కోట్లు

బెంగళూరులో ఐటీ దాడులు..

కాంగ్రెస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ ఇంట్లో పట్టివేత

తెలంగాణలో ఓట్లు కొనేందుకే కాంగ్రెస్ దాచిందంటున్న బీఆర్‌ఎస్



బనశంకరి(బెంగళూరు): బెంగళూరులో ఆదాయపన్ను(ఐటీ) శాఖ అధికారులు జరిపిన దాడుల్లో భారీగా సొత్తు బయటపడింది. కాంగ్రెస్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ అశ్వత్థమ్మ, ఆమె భర్త ఆర్.అంబికాపతి, కూతురు, వారి బంధువుకు సంబంధించిన 10 ప్రాంతాల్లో సోదాలు జరిపారు. అంబికాపతి ఇంట్లో మంచం కింద దాచిన 22 పెట్టెల్లో రూ.42 కోట్ల రూ.500 నోట్ల కట్టలు బయటపడినట్లు ఐటీ శాఖ తెలిపింది. త్వరలో తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లను కొనేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేస్తోందని బీఆర్‌ఎస్ నాయకులు ఇటీవల ఆరోపణలు చేస్తున్నారు. ఇందులో భాగంగా చెన్నై నుంచి బెంగళూరు మీదుగా భారీగా డబ్బును హైదరాబాద్‌కు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలంగాణ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలోనే విశ్వసనీయ సమాచారం మేరకు బెంగళూరులోని అశ్వత్థమ్మ కుటుంబీకులకు చెందినలో ఆర్‌టీ నగర్ తదితర ప్రాంతాల్లోని ఇళ్లలో గురువారం రాత్రి వరకు జరిపిన సోదాల్లో రూ.42 కోట్ల లభ్యమైనట్లు ఐటీ వర్గాలు వెల్లడించాయి. కాగా, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే అఖండ్ శ్రీనివాసమూర్తికి అశ్వత్థమ

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

బీజేపీని గెలిపిస్తే నిజాం చక్కెర ఫ్యాక్టరీలు తెరిపిస్తాం

నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



కోరుట్ల: 'నిజాం చక్కెర ఫ్యాక్టరీలను తెరవడం బీజేపీకి చిటికెనవేలుతో సమానం. ఎందుకంటే ఉత్తరప్రదేశ్‌లో మూసివేసిన చక్కెర ఫ్యాక్టరీలను అక్కడి బీజేపీ ప్రభుత్వం తెరిపించింది. ఇప్పుడు అక్కడ చెరకు పంట కళకళలాడుతోంది. అసంభవం అన్న పసుపు బోర్డును ప్రధాని నరేంద్ర మోదీ ఏర్పాటు చేసి చూపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో బీజేపీని గెలిపిస్తే నిజాం చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించి చెరకు రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం'అని ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి పట్టణంలో శుక్రవారం పసుపు రైతులు ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో అర్వింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చక్కెర ఫ్యాక్టరీల విషయంలో మోసం చేసిన బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేస్తున్నారో ఈ ప్రాంత ప్రజలు ఆలోచన చేయాలన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకోవడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, నిజామాబాద్‌లో పసుపు రైతులు కవితను ఓడించినట్లే సిరిసిల్లలో 400 మంది ఎన్ఆర్ఐలు పోటీ చేసి కేటీఆర్‌కు సురుకు పెట్టాలన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పు డు ఎన్నికల్లో గెలుపు కోసం కర్ణాటక నుంచి లారీల్లో డబ్బులను తీసుకువస్తున్నారని విమర్శించారు.

వారిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేట సీపీ, ఏసీపీ, మంత్రి హరీశ్‌రావు ఓఎస్డీపై ఎస్ఈసీకి రఘునందన్ ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: సిద్దిపేట సీపీ శ్వేతారెడ్డి, ఏసీపీ సురేందర్‌రెడ్డి, మంత్రి హరీశ్‌రావు ఓఎస్డీ ఎన్.యాదగిరి, ఇతర అధికారులపై చర్య తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌కు బీజేపీ ఎమ్మెల్యే ఎన్. రఘు నందన్‌రావు ఫిర్యాదు చేశారు. మరికొందరు ప్రభుత్వాధికారులు దళితబంధు, గృహలక్ష్మి, బీసీ బంధు ప్రొసీడింగ్స్‌ను బీఆర్ఎస్ నేతలు, పంపిణీ చేస్తున్నందున ఈ కార్యక్రమాలను వాయిదా వేయించాలని కోరారు. సిద్దిపేట జిల్లాలో పోలీసులు, ఇతర అధికారులు అధికారపార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తాను అధికార పార్టీ నేతలపై ఫిర్యాదు చేస్తే పోలీసులు బీఆర్ఎస్‌వీ నేతల ద్వారా తనపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద అక్రమ కేసులు పెట్టారన్నారు.

ఈటలకు దమ్ముంటే గజ్వేల్‌లో మాత్రమే పోటీ చేయాలి

మంత్రి గంగుల కమలాకర్ సవాల్



కొత్తపల్లి (కరీంనగర్): ఈటల రాజేందర్‌కు దమ్ముంటే ఒకే చోటు నుంచి.. గజ్వేల్‌లో మాత్రమే పోటీ చేయాలని మంత్రి గంగుల కమలాకర్ సవాల్ విసిరారు. గెలుస్తాననే ధీమా లేకనే రెండు చోట్ల నుంచి పోటీకి సిద్ధమవుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా వచ్చే అవకాశం లేదని.. ఈటల ఎలా సీఎం అవుతారని ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా చింతకుంటలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కేసీఆర్ లేని తెలంగాణను ఊహించలేమన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అవినీతి, కబ్జాల కాంగ్రెస్‌ను.. మతతత్వ బీజేపీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని స్పష్టం చేశారు. ఆంధ్ర పార్టీల నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఆంధ్రా పార్టీలకు చెందిన వైఎస్ షర్మిల, కేఏపీ రామచందర్‌రావు, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేఏపాల్‌లకు తెలంగాణలో ఏం పని అని ప్రశ్నించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 13 అసెంబ్లీ స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు.



అభ్యర్థుల జాబితా ప్రకటించడానికి వెళ్తున్నారు!

కాంగ్రెస్ అభ్యర్థులు | 70 మంది ఖరారు!

15న తొలి జాబితా విడుదల

- రేవంత్, భట్టి, ఇతర సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నేతలకు చోటు
- అభ్యర్థుల జాబితాకు కాంగ్రెస్ సీఈసీ ఆమోదం
- 18న రెండో జాబితా!



శుక్రవారం ఢిల్లీలో జరిగిన సీఈసీ భేటీకి వెళ్తున్న రేవంత్, భట్టి, మధు యాష్కి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగే 70 మంది అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ఖరారు చేసింది. దీంతో 119 నియోజకవర్గాలున్న రాష్ట్రంలో సగానికి పైగా స్థానాలకు టికెట్లు ఫైనల్ చేసినట్టయ్యింది. పార్టీలో పనిచేసిన అనుభవం, కుల సమీకరణలు, సర్వేలు, ఆర్థిక బలాలను దృష్టిలో పెట్టుకొని స్క్రీనింగ్ కమిటీ ఇచ్చిన నివేదికల ఆధారంగా తొలి విడతగా 70 మంది అభ్యర్థులను కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఎంపిక చేసింది. ఈ మేరకు తొలి జాబితాను 15న విడుదల చేసే అవకాశం ఉంది.

సర్వేల ఆధారంగానే..

చైర్మన్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఏఐసీసీ కార్యాలయంలో సీఈసీ భేటీ జరిగింది. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, కేసీ వేణుగోపాల్, ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు ఇతర కమిటీ సభ్యులు హాజరయ్యారు. పార్టీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్‌లను సైతం సమావేశానికి ఆహ్వానించారు. రెండున్నర గంటల పాటు జరిగిన భేటీలో ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు సహా ఏఐసీసీ స్థాయిలో చేసిన సర్వేల నివేదికలు ముందుపెట్టుకొని నియోజకవర్గాల వారీగా అభ్యర్థులను పరిశీలించారు. మొదట ఒకే ఒక్క పేరున్న 70 నియోజకవర్గాలు, ఆయా స్థానాలకు సంబంధించిన నేతల పేర్లు పరిశీలించారు. ఏయే ప్రాతిపదికల ఆధారంగా ఇక్కడ ఒకే నేత ఎంపిక జరిగిందో మురళీధరన్ కమిటీకి వివరించారు. ఈ స్థానాలపై ఎవరి నుంచి ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో ఆ 70 నియోజకవర్గాల్లో ప్రతిపాదిత అభ్యర్థులకు సీఈసీ ఆమోదం తెలిపినట్లు తెలుస్తోంది. ఇక రెండో విడత జాబితాను ఫైనల్ చేసేందుకు వచ్చేవారం మరోమారు సీఈసీ భేటీ కానుంది. దసరాకు ముందే 18న రెండో విడత జాబితా విడుదల చేయాలని సీఈసీలో నిర్ణయం జరిగినట్లు చెబుతున్నారు. భేటీ అనంతరం స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ మాట్లాడుతూ.. 'నేటి భేటీలో 70 సీట్లపై చర్చించాం. మరోమారు సీఈసీ భేటీ ఉంటుంది' అని తెలిపారు.

తొలి జాబితాలో ముఖ్య నేతలు

తొలి జాబితాలో రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కతో పాటు ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సిట్టింగ్ ఎమ్మెల్యేలు సీతక్క, పొదెం వీరయ్య, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, సీనియర్ నేతలు షబ్బీర్‌అలీ, సంపత్‌కుమార్, గడ్డం ప్రసాద్‌కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఫిరోజ్‌ఖాన్, ప్రేమ్‌సాగర్‌రావు, అంజన్‌కుమార్ యాదవ్, పద్మావతి రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కొండా సురేఖ, రామ్మోహన్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, అనిరుధ్‌రెడ్డి, వీర్లపలి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, రోహిత్ రావు, గడ్డం వినోద్, ఎర్ర శేఖర్, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కేకే మహేందర్‌రెడ్డి, కాట శ్రీనివాస్‌గౌడ్, వంశీకృష్ణ తదితరుల పేర్లు ఉన్నట్టు చెబుతున్నారు.

కమ్యూనిస్టులతో పొత్తు, స్థానాలపై చర్చ

సీఈసీ భేటీకి ముందు స్క్రీనింగ్ కమిటీ భేటీ జరిగింది. చైర్మన్ మురళీధరన్‌తో పాటు మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్ తదితరులు హాజరయ్యారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన భేటీలో సింగిల్ పేర్లతో, రెండు, మూడేసి పేర్లతో ఉన్న అభ్యర్థుల జాబితాలు రూపొందించారు. వాటిని సీఈసీ ముందుంచాలని నిర్ణయించారు. ఇదే సమయంలో కమ్యూనిస్టులతో పొత్తు, వారికి ఇవ్వాల్సిన సీట్ల కేటాయింపుపైనా చర్చించారు. మిర్యాలగూడ, మునుగోడు, ఖమ్మం, కొత్తగూడెం, హుస్నాబాద్ స్థానాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. అయితే దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ భేటీ తర్వాత జరిగిన సీఈసీ సమావేశంలోనూ పొత్తు, సీట్ల కేటాయింపు అంశంపై చర్చించారు. ఒకట్రెండు రోజుల్లో పొత్తు తేల్చాలని కేసీ వేణుగోపాల్, రేవంత్‌కు హైకమాండ్ పెద్దలు సూచించినట్లు తెలిసింది. ఇక టికెట్ దక్కని నేతలతో వారికున్న ప్రాధాన్యాన్ని బట్టి నేరుగా హైకమాండ్ పెద్దలు మాట్లాడాలన్న రాష్ట్ర నేతల సూచనకు అధిష్టానం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.

ఐటీ దాడుల్లో దొరికింది కాంగ్రెస్ డబ్బే

- రూ.1,500 కోట్లు తెలంగాణలో ఖర్చు చేయాలని చూస్తున్నారు
- బెంగళూరులో దొరికిన డబ్బుకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలి
- ఆర్థిక మంత్రి హరీశ్‌రావు ధ్వజం



మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

మెదక్: కర్ణాటక నుంచి అవినీతి డబ్బును తరలించి, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. బెంగళూరు ఐటీ దాడుల్లో దొరికిన రూ.42 కోట్లు అక్కడి కాంట్రాక్టర్ అంబికాపతిదని, ఆయన భార్య కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ అని తెలిపారు. శుక్రవారం మంత్రి మెదక్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. తెలంగాణలో డబ్బులు పంపిణీ చేసి, అడ్డదారిలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ కుటిల ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. ఐటీ దాడులతో కాంగ్రెస్ పార్టీ నోట్ల కట్టలు బయటపడ్డాయని, అక్రమంగా సంపాదించిన అవినీతి సొమ్మును తెలంగాణకు బదిలీ చేసేందుకు ఆ పార్టీ ప్రయత్నం చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో కాంట్రాక్టర్ల వద్ద గత బీజేపీ ప్రభుత్వం 40% కమీషన్ తీసుకుంటే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 50% కమీషన్ తీసుకుని, ఆ డబ్బుతో ఓట్లు కొనేందుకు తెలంగాణపై దండయాత్ర చేస్తోందని మండిపడ్డారు. ఐటీ దాడుల్లో దొరికిన డబ్బు గురించి కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని హరీశ్ డిమాండ్ చేశారు. కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కాంగ్రెస్ నేత ఈశ్వరప్పలకు అంబికాపతి అత్యంత సన్నిహితుడని తెలిపారు. కర్ణాటకలో బిల్డర్లు, వ్యాపారులు, కాంట్రాక్టర్ల దగ్గర నుంచి రూ.1,500 కోట్లు వసూలు చేసి తెలంగాణ ఎన్నికల్లో ఖర్చు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. చెన్నై మీదుగా హైదరాబాద్‌కు డబ్బులు పంపాలని ఆ పార్టీ పథకం వేస్తోందని అన్నారు. వ్యాపారాలు చేసుకోకుండా రాజకీయాలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం అభ్యర్థులను ఎంపిక చేసుకోలేని స్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉందని మంత్రి హరీశ్ విమర్శించారు. సగం సీట్లలో కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులు లేరని ఎద్దేవా చేశారు. షెడ్యూల్ వచ్చినా టికెట్లు ప్రకటించలేని దుస్థితి కాంగ్రెస్ పార్టీదన్నారు.

జేడీఎస్ ద్వారా బీఆర్ఎస్‌కు డబ్బులు పంపుతున్న బీజేపీ

'ఎక్స్'లో తెలంగాణ కాంగ్రెస్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో బీజేపీ మిత్రపక్షమైన జేడీఎస్ మాజీ కార్పొరేటర్ భర్త, కాంట్రాక్టర్ల అసోసియేషన్ నేత అంబికాపతి ఇంట్లో ఐటీ సోదాల్లో దొరికిన రూ.42 కోట్లను జేడీఎస్ ద్వారా బీఆర్ఎస్‌కు పంపేందుకు బీజేపీ ప్రయత్నించిందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. బీజేపీ, బీఆర్ఎస్‌ల రహస్య ఒప్పందం మరోమారు బయటపడటంతో ఉల్టా చోర్ కొత్వాల్ కో డాంటే పద్ధతిలో ఆ రెండు పార్టీలు కాంగ్రెస్ పార్టీపై ఎదురుదాడి చేస్తున్నాయని తెలిపింది. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేసింది. 'తెలంగాణ ఎన్నికల్లో సాయం చేసేందుకు జేడీఎస్ ద్వారా బీఆర్ఎస్‌కు బీజేపీ డబ్బులు పంపుతోంది. కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూరేలా జేడీఎస్‌కు కేసీఆర్ మద్దతిచ్చారు. ఇప్పుడు తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకు బీజేపీ ద్వారా బీఆర్ఎస్‌కు డబ్బులు వస్తున్నాయి' అని ఆ ట్వీట్‌లో పేర్కొంది.

రాష్ట్ర కాంగ్రెస్‌కు కర్ణాటక 'మనీ రిజర్వాయర్'

అసెంబ్లీ ఎన్నికల్లో రూ.3 వేల కోట్లు ఖర్చు చేసేందుకు కాంగ్రెస్ యత్నం: మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కర్ణాటకలో పార్టీ అధికారంలో ఉండటమనేది కాంగ్రెస్‌కు 'మనీ రిజర్వాయర్'గా మారిందని, అక్కడి నుంచి వచ్చే డబ్బులను తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పంపిణీ చేయాలని చూస్తోందని బీజేపీ నేత, మధ్యప్రదేశ్‌లో ఆ పార్టీ ఇన్‌చార్జి పి.మురళీధర్‌రావు ఆరోపించారు. శుక్రవారం కర్ణాటకలో పట్టుబడిన రూ. 40 కోట్లు చాలా చిన్న శాంపిల్ మాత్రమేనని, ఈ ఎన్నికల్లో మొత్తం రూ. 3 వేల కోట్లు ఖర్చు పెట్టేందుకు కాంగ్రెస్ సమాయత్తం అయిందని ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో ఎన్నికలను అక్రమ డబ్బుతో కాలుష్యమయం చేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్తంగా పెద్దమొత్తంలో డబ్బును ఇప్పటికే సిద్ధం చేశాయన్నారు.

18న కొండగట్టుకు రాహుల్, ప్రియాంక ముడుపుగట్టు!



కొండగట్టు జేఎన్టీయూ పరిసరాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పూజల అనంతరం కాంగ్రెస్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: పుణ్యక్షేత్రం కొండగట్టు నుంచి కాంగ్రెస్ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టనుంది. ఈనెల 18న జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్, ప్రియాంకాగాంధీలు హాజరవనున్నారు. రాహుల్, ప్రియాంకాగాంధీలు కొండగట్టుపై తొలుత అంజన్నకు పూజలు చేసి అక్కడ పార్టీకి విజయం సాధించాలని ముడుపు కడతారని, అనంతరం అక్కడ సిద్ధంగా ఉంచిన ప్రచార రథాలకు పూజలు చేయిస్తారు. పూజల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టే బస్సు యాత్ర ప్రారంభమవుతుందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. రాహుల్, ప్రియాంకల పర్యటనను ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల పోలీసులు కూడా ధ్రువీకరించారు. అయితే తమకు ఇంకా అధికారిక షెడ్యూలు మాత్రం అందాల్సి ఉందన్నారు. కాగా, బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్న పాత కరీంనగర్‌లో కాంగ్రెస్‌కు కేవలం ఒక్క సీటే ఉంది. అలాంటి కంచుకోటను బద్దలు కొట్టేందుకు, పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి బస్సుయాత్ర మొదలుపెట్టాలని నిర్ణయించినట్లు సీనియర్ పార్టీ నేత ఒకరు చెప్పారు.

60 సీట్లపై బీజేపీ కసరత్తు కొలిక్కి!

- వేగంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ
- పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ భేటీలో జాబితాల ఖరారు
- 40–45 మందితో తొలి జాబితా
- అంబర్‌పేట నుంచి కిషన్‌రెడ్డి పోటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో అభ్యర్థుల ఖరారు కసరత్తు కొలిక్కి వస్తోంది. శుక్రవారం జరిగిన ముఖ్యనేతల సమావేశంలో 60 స్థానాల్లో అభ్యర్థులపై (19 ఎస్సీ, 12 ఎస్టీ సీట్లు మినహాయించి) ఒక అభిప్రాయానికి వచ్చినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఈ సీట్లకు సంబంధించి మరోసారి చర్చించి, పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీని జాబితాలను పంపాలని నిర్ణయించినట్టు వివరిస్తున్నాయి. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్, రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఇతర నేతలు పాల్గొన్నారు. ఆయా స్థానాల్లో ప్రాధాన్యతలు, ప్రతిపాదిత అభ్యర్థుల పేర్లను కీలక నేతలు అందజేయడంతో.. భేటీలో అన్నింటినీ సరిచూసి, కామన్‌గా ఉన్న పేర్లను ముసాయిదా జాబితా కోసం పరిగణనలోకి తీసుకున్నట్టు సమాచారం. సంఘ్‌పరివార్ క్షేత్రంలోని వారితోనూ పార్టీ నేతలు సమావేశమై, ఆయా సీట్లకు పేర్లపై స్పష్టత తీసుకున్నట్టు తెలిసింది. కసరత్తు పూర్తయ్యాక 40–45 మందితో తొలిజాబితాను ఢిల్లీలో ప్రకటించే అవకాశాలు ఉన్నట్టు పార్టీనేతలు చెప్తున్నారు.

పలు స్థానాలపై స్పష్టత

శుక్రవారం జరిగిన భేటీలో హైదరాబాద్ నగరంలోని రెండు ముఖ్యమైన స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులపై స్పష్టత వచ్చినట్టు తెలుస్తోంది. అంబర్‌పేట నుంచి పోటీకి కిషన్‌రెడ్డి సుముఖత వ్యక్తం చేయగా.. ముషీరాబాద్ నుంచి బరిలో ఉండేందుకు కె.లక్ష్మణ్ విముఖంగా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో ముషీరాబాద్ నుంచి పోటీ చేసేందుకు పలువురు ముందుకొచ్చినట్టు తెలిసింది. ఈ నియోజకవర్గంలో ఐదుగురు బీజేపీ కార్పొరేటర్లు ఉండగా.. ఒకరు బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. మిగతా నలుగురు కూడా తమకు ఎమ్మెల్యే టికెట్ కావాలని కోరుతున్నారు. దీంతో ఈసారి కార్పొరేటర్లకు టికెట్ అవకాశం కల్పించరాదని నిర్ణయించినట్టు తెలిసింది. అందరూ కలసికట్టుగా పనిచేస్తే పార్టీ విజయానికి మార్గం సుగమం అవుతుందని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేసినట్టు సమాచారం. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి ముషీరాబాద్ అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్నారు. ఆమెకు టికెట్ ఖరారయ్యే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

పొన్నాలా... బీఎస్పీలోకి రావాలా!

కాంగ్రెస్‌కు మాజీమంత్రి లక్ష్మయ్య రాజీనామా హర్షణీయం.. ట్వీట్ చేసిన ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ టికెట్ల కేటాయింపులో బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వట్లేదని మాజీమంత్రి పొన్నాల లక్ష్మయ్య కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడం ఆ పార్టీ రాజకీయ వివక్షకు నిదర్శనమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ రాజీనామా కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారమే అయినా పొన్నాల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. పొన్నాలను బీఎస్పీలోకి ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో ట్వీట్ చేశారు . తెలంగాణలో బీసీ ఓటర్ల సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వంటి ఆధిపత్యకుల పార్టీలకు వారి ఓట్లు మాత్రం కావాలి తప్ప సీట్లు కాదని, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు సీట్లు కేటాయించకుండా కులవివక్ష చూపుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి ఇంతకంటే ఎక్కువ ఊహించలేమని వ్యాఖ్యానించారు. బీఎస్పీ బీసీలకు జనాభా ప్రాతిపదికన 60 నుంచి 70 అసెంబ్లీ సీట్లు కేటాయిస్తుందన్నారు. బహుజనరాజ్యస్థాపన కోసం పొన్నాల బీఎస్పీలో చేరాలని ఆహ్వానించారు.

22 బాక్సుల్లో రూ.42 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

స్వయానా సోదరి. అశ్వత్తమ భర్త ఆర్.అంబికాపతి బృహత్ బెంగళూరు మహానగర పాలికె(బీబీఎంపీ) వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఈయనే గతంలో బీజేపీ ప్రభుత్వం ప్రతి పనికీ 40 శాతం కమీషన్ తీసుకుంటోందని ఆరోపణలు చేశారు. కర్ణాటక రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం కూడా ఇదే విధమైన ఆరోపణలు చేస్తూ దర్యాప్తు జరపాలంటూ ప్రధాని మోదీకి లేఖ రాసింది. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశించింది. ఈ ఆరోపణలే బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్‌కు ఎన్నికల అస్త్రంగా మారాయి. మేలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాజయం పాలుకాగా , కాంగ్రెస్ భారీ మెజారిటీ సాధించింది.



దాడిలో పట్టుబడిన నగదును లెక్క పెడుతున్న అధికారులు

బీఆర్ఎస్ ఆరోపణలు..

తెలంగాణ ట్యాక్స్ పేరుతో బిల్డర్లు, బంగారం వ్యాపారులు, కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన రూ.1,500 కోట్లను కాంగ్రెస్ పొరుగు రాష్ట్రం నుంచి తెలంగాణ ఎన్నికల్లో ఖర్చు చేసేందుకు పంపుతోందని తెలంగాణలోని అధికార బీఆర్ఎస్ ఇటీవల ఆరోపించింది. వచ్చే ఎన్నికల్లో ఓట్లు కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ కోట్ల రూపాయలను పంపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ఆరోపణలు చేశారు.

తెలంగాణలో మహిళలకు రక్షణ లేదు

- మహాలక్ష్మి స్కీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం
- ఏఐసీసీ అధికార ప్రతినిధి డోలీశర్మ



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాల్లో తెలంగాణనే నంబర్‌వన్‌గా నిలుస్తోందని గణాంకాలు చెబుతున్నాయని ఏఐసీసీ అధికార ప్రతినిధి డోలీశర్మ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లిక్కర్ విక్రయాలు పెంచడం మినహా మరేమీ చేయలేదని విమర్శించారు. కనీసం మహిళల సంక్షేమం కోసం ఒక బోర్డును కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. శుక్రవారం ఆమె గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ మోడల్ విఫలమయిందని చెప్పిన డోలి శర్మ, కర్ణాటకలో మహిళల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో కూడా అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తూ ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నామన్నారు. తెలంగాణలో పార్టీ మహిళలకు మహాలక్ష్మి పేరుతో ప్రతి మహిళకు నెలకు రూ.2,500 నగదు, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం లాంటి హామీలనిచ్చిందని, ఈ పథకాల పట్ల మహిళల నుంచి మంచి స్పందన కనిపిస్తోందని, ఈ పథకాలతో కాంగ్రెస్ పార్టీకి మహిళలు పట్టం కట్టడం ఖాయమని చెప్పారు. టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ జెట్టి కుసుమకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే బీఆర్ఎస్ ప్రభుత్వం అబద్ధాలు ఆడుతూ కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఇప్పుడు పార్టీ మారతారా?

- 40 ఏళ్లు పదవులు అనుభవించి.... చచ్చే ముందు పార్టీ మారడానికి సిగ్గుండాలి
- పొన్నాల లక్ష్మయ్యను ఎవరైనా గుర్తుపడుతున్నారంటే అది కాంగ్రెస్ పార్టీ దయనే
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్యపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. 40 ఏళ్లు కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించి... చచ్చే ముందు పార్టీ మారడానికి సిగ్గుండాలని విమర్శించారు. 2014లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఓసారి, 2018లో రెండోసారి టికెట్ ఇస్తే ఓడిపోయిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలో పొన్నాల లక్ష్మయ్యను ఎవరైనా గుర్తుపడుతున్నారంటే అది కాంగ్రెస్ పార్టీ ద యేనని రేవంత్ పేర్కొన్నారు. ఇంతకాలం పెంచి పోషించిన తల్లిలాంటి పార్టీని దూషించి పక్క పార్టీలోకి పోవడానికి ఏం రోగం..? అని వ్యాఖ్యానించారు.

పార్టీని పలుచన చేసేందుకే రాజీనామా

శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గతంలో డి.శ్రీనివాస్, కేశవరావు, బొత్స సత్యనారాయణ పార్టీని వదిలి వెళ్లారని.. వెళ్లే వారు వెళ్తూనే ఉంటారని అన్నారు. కానీ పొన్నాల విషయానికి వస్తే అసలు 80 ఏళ్ల వయస్సులో పార్టీ మారడమే బుద్ధిలేని పని అని ఎద్దేవా చేశారు. ఈ వయసులోనూ ఇంకా కుర్చీ పట్టుకుని వేలాడి.. టికెట్ కావాలని తిరిగారని విమర్శించారు. జనగాం నియోజకవర్గానికి సంబంధించి ప్యానెల్‌లో రెండు పేర్లు వెళ్లాయని.. ఇంకా ఎలాంటి నిర్ణయం జరగలేదని స్పష్టం చేశారు. అసలు ఏ కారణం చెప్పి పొన్నాల పార్టీకి రాజీనామా చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన పొన్నాల ఏ పార్టీలోకి వెళ్తారో తనకు తెలీదని.. కానీ పార్టీని ఈ సందర్భంలో వీడి వెళ్లడమే అతి పెద్ద నేరం అని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు క్షమాపణ చెప్పి రాజీనామా ఉపసంహరించుకుంటే గౌరవం ఉంటుందన్నారు.

కేసీఆర్ ప్రైవేట్ సైన్యం

ముఖ్యమంత్రి కేసీఆర్ రిటైర్డ్ అధికారులను ప్రైవేట్ సైన్యంగా మార్చుకుని ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర డీజీపీ, సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇంటెలిజెన్స్ అధికారి ప్రభాకర్‌రావు, వేణుగోపాల్ రావు, నర్సింగరావు, భుజంగరావు తదితరులు ప్రైవేట్ సైన్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆర్థిక శాఖ అధికారి రామకృష్ణారావు నిబంధనలకు విరుద్ధంగా కేసీఆర్ చెప్పినవారికి నిధులు విడుదల చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ భూముల వినియోగ మార్పు చేశారని... వీళ్లందరిపై కేంద్ర ఎన్నికల సంఘానికి లిఖితపూర్వక ఫిర్యాదు చేస్తామన్నారు. ఎన్నికల అధికారులు స్పందించకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పద్ధతులు కేటీఆర్‌కు ఏం తెలుసు..?

రేవంత్ పైసలు తీసుకుంటున్నాడని మంత్రి కేటీఆర్ అంటే సరిపోతుందా..? అని ప్రశ్నించారు. అమెరికాలో బాత్రూంలు కడిగేవాడికి కాంగ్రెస్ పద్ధతులు తెలియవు అని విమర్శించారు. రేవంత్ నిర్ణయంతో టికెట్లు ఖరారు కావని, ప్రక్రియ ప్రకారమే అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు.

బీసీలకు బీఆర్ఎస్ కంటే ఎక్కువ సీట్లే ఇస్తాం

75 మంది కాంగ్రెస్ పార్టీ శ్రేయోభిలాషుల జాబితాను కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌కు రాష్ట్ర బీజేపీ నాయకులు అందించారని... వారిపై నిఘా పెట్టి బెదిరించే పనులను కేంద్రంలో ఉన్న దర్యాప్తు సంస్థల ద్వారా బీజేపీ చేస్తోందని రేవంత్ ఆరోపించారు. బీసీలకు 34 సీట్లు ఇవ్వాలన్న తాపత్రయం కాంగ్రెస్ పార్టీకి ఉందని స్పష్టం చేశారు. ప్రస్తుతం లెఫ్ట్ పార్టీలతో భట్టి విక్రమార్క చర్చలు జరుపుతున్నారన్నారు. 119 సీట్లకు అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటించాలని అనుకుంటున్నామని.. చార్మినార్ అసెంబ్లీ స్థానంలో అలీ మస్కతీను పోటీ చేయాలని పార్టీ అధిష్టానం కోరిందన్నారు.

పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా తెలంగాణ

సహకార సంఘాల సమాఖ్య చైర్మన్లు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల వృత్తిదారుల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు జరుపుతూ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని సహకార సంఘాల సమాఖ్య చైర్మన్లు కొనియాడారు. రాష్ట్రంలోని బలహీన వర్గాలకు చెందిన సహకార సంఘాలను ఉన్నతంగా తీర్చిదిద్ది ఆ సంఘాల్లో సభ్యులను ఆర్థికంగా ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం హితోధికంగా కృషి చేస్తోందని తెలిపారు. శుక్రవారం ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్, కల్లు గీత కార్మికుల సమాఖ్య చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, గొర్లు, మేకల వృత్తిదారుల సహకార సంఘం సమాఖ్య చైర్మన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం బలహీన వర్గాల వృత్తిదారుల సంక్షేమానికి అమలు జరుపుతున్న పథకాలపై చర్చించారు. అనంతరం చైర్మన్లు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు చెందినట్లు చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ దేశంలో వెనుకబడిన తరగతుల ప్రజల సంక్షేమానికి ఏమాత్రం కృషి చేయలేదని విమర్శించారు. కులవృత్తుల్లో ఆధునిక టెక్నాలజీ పేరిట విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి గ్రామీణ ప్రాంతాల్లోని కుల వృత్తులకు ఆదరణ లేకుండా చేసిందని ఆరోపించారు. బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని కులవృత్తులను పునరుద్ధరించడానికి వేల కోట్ల రూపాయలు కేటాయించిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.

దూరదర్శన్, ఆలిండియా | ప్రచారానికి సమయం కేటాయించిన ఈసీ

- బీఆర్ఎస్‌కు 277 నిమిషాలు, కాంగ్రెస్ 185, బీజేపీకి 79 నిమిషాలు

సాక్షి, న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీలకు ప్రసారభారతి ఆధీనంలోని దూరదర్శన్, ఆలిండియా రేడియోల్లో ప్రచారానికి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) సమయం కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ రాజేశ్ కుమార్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం తెలంగాణలో ఉన్న మొత్తం 10 గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీలకు కలిపి బ్రాడ్‌కాస్ట్‌కు 898 నిమిషాలు, టెలికాస్ట్‌కు 898 నిమిషాలు కేటాయించారు. అందులో బ్రాడ్‌కాస్ట్‌కు, టెలికాస్ట్‌కు విడివిడిగా సమయం కేటాయించారు. అత్యధికంగా బీఆర్ఎస్ పార్టీకి 277 నిమిషాలు కేటాయించగా, ఆ సమయాన్ని 5 నిమిషాలకు ఒక స్లాట్ చొప్పున 55 స్లాట్లుగా విభజించారు. ఇక కాంగ్రెస్ పార్టీకి 185 నిమిషాలను 5 నిమిషాల చొప్పున 37 స్లాట్లు.. బీజేపీకి 79 నిమిషాలను 5 నిమిషాల చొప్పున 15 స్లాట్లు, టీడీపీకి 62 నిమిషాలను 12 స్లాట్లుగా, ఏఐఎంఐఎం పార్టీకి 58 నిమిషాలను 11 స్లాట్లుగా, బీఎస్పీకి 55 నిమిషాలను 11 స్లాట్లుగా సీపీఐ (ఎం)కు 47 నిమిషాలను 9 స్లాట్లుగా కేటాయించారు. ఈ ప్రచారాన్ని ఎన్నికలకు రెండు రోజుల ముందు నిలిపివేయాల్సి ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఉపాధి హామీలో వెనుకడుగు!

సాక్షి, హైదరాబాద్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం అమల్లో భాగంగా 2023-24 (ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు) ఆర్థిక సంవత్సరంలో పలు ఇండికేటర్లలో తెలంగాణ వెనుకపడినట్లు లిబ్‌టెక్ ఇండియా సంస్థ తన నివేదికలో తేల్చింది. రాష్ట్రంలో కూలీలకు ఉపాధి హామీ జాబ్‌కార్డుల జారీ 8% తగ్గినట్టు (వాటిలో 5.4% యాక్టివ్ జాబ్‌కార్డులు), యాక్టివ్ వర్కర్లు 9.7 % తగ్గినట్టు పేర్కొంది. 2022-23లో ఇదే కాలంతో (ఆరునెలలకు) పోల్చితే 2023- 24లో 17.9% పర్సన్‌డేస్ (పనిదినాలు) తగ్గిపోవడం గమనార్హమని స్పష్టం చేసింది. ములుగు, మేడ్చల్, కామారెడ్డి జిల్లాల్లో ప్రత్యేకంగా పర్సన్‌డేస్ తగ్గుదల అధికంగా ఉన్నట్టు తెలియజేసింది. వివిధ సామాజికవర్గాలుగా (సోషల్ గ్రూప్‌లుగా) చూస్తే కూడా ఆయా వర్గాలుగా పర్సన్‌డేస్ తగ్గుదల స్పష్టమైనట్టుగా తెలిపింది.





క్లుప్తంగా...

ప్రకృతితో ముడిపడిన బతుకమ్మ

గవర్నర్ బతుకమ్మ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ ప్రకృతితో ముడిపడిన చాలా ప్రత్యేకమైన పండుగని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. రాష్ట్ర మహిళలకు ఆమె బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మల తయారీకి ఉపయోగించే రంగురంగుల అడవి పూలు.. విస్తారమైన వర్షాలతో నిండిన నీటి వనరులను శుభ్రపరిచే ఔషధ గుణాలను కలిగి ఉంటాయని తెలిపారు. తొమ్మిది రోజుల పాటు పండుగను జరుపుకొనేందుకు బతుకమ్మ ఆడపడుచుల కలయికను సూచిస్తుందని వివరించారు. గౌరీదేవి ఆశీస్సులతో ప్రజలంతా క్షేమంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక: సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: బతుకమ్మ పండుగ (ఎంగిలిపూల బతుకమ్మ) శనివారం నుంచి ప్రారంభం కానున్న సందర్భంగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ, తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా జరుపుకొంటూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా గౌరవిస్తోందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలందరి బతుకుల్లో వెలుగులు నింపుతూ, మరింతగా సుఖసంతోషాలతో జీవించేలా దీవించాలని ప్రకృతి మాతను సీఎం ప్రార్థించారు.

తనిఖీల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దు: తలసాని

సాక్షి, హైదరాబాద్: తనిఖీల పేరుతో వ్యాపారులను ఇబ్బంది పెట్టొద్దని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయడంలో తప్పులేదని, అయితే నిబంధనల పేరుతో వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం మంచిది కాదని శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నగరంలో అనేక మంది వ్యాపారులున్నారని, అందులో బంగారం, చిరు వ్యాపారులు కూడా ఉన్నారని చెప్పారు. నిబంధనల వంకతో అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో వ్యాపారులు ఆందోళన, ఆవేదనకు గురవుతున్నారని తలసాని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 61 ఏళ్లకు పెంపు

ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీన విధివిధానాల కమిటీ ముందు ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచే కసరత్తు మొదలైంది. ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా విధివిధానాలు ఖరారు చేసేందుకు ఐదుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఓ కమిటీని కూడా ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 61 ఏళ్లుగా ఉన్నందున, విలీనంతో అయోమయం నెలకొనకుండా ఆర్టీసీ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసును అంతమేరకు పెంచాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో విలీన విధివిధానాలు ఖరారు చేసే కమిటీ ముందు ఈ అంశాన్ని ప్రతిపాదించాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఆ ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆర్టీసీ ఎండీకి సూచిస్తూ రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి లేఖ రాశారు.

ఎన్‌సీసీకి అవార్డుల పంట



అవార్డు అందుకుంటున్న ఎన్‌సీసీ ఎండీ ఏఏవీ రంగరాజు

సాక్షి,హైదరాబాద్: నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్‌సీసీ)కి మరోసారి విశిష్ట అవార్డులు దక్కాయి. గురువారంరాత్రి న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో కన్‌స్ట్రక్షన్ వరల్డ్ పర్సన్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ఎన్‌సీసీ ఎండీ ఏఏవీ రంగరాజు, టాప్ చాలెంజర్ అవార్డును డైరెక్టర్ అల్లూరి సంజిత్ రాజు, ఫాస్టెస్ట్ గ్రోయింగ్ కంపెనీ అవార్డును డైరెక్టర్ వినోద్‌కుమార్ అందుకున్నారు.

ఆ ప్రచారం అవాస్తవం

ఆసిఫాబాద్ ఎస్పీ వివరణ

సాక్షి, హైదరాబాద్: ఆసిఫాబాద్ జిల్లాలో వివిధ సందర్భాల్లో ఎన్జీవోలు, ప్రజలు, ప్రజా ప్రతినిధులను కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగానే సన్మానించామని ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్ తెలిపారు. తాను ఎమ్మెల్యేను సన్మానించినట్టు కొంతమంది సోషల్ మీడియాలో వైరల్ చేసిన ఫొటో, వీడియో 20 నెలల నాటివని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక, నియమావళిని ఎలాంటి రాగద్వేషాలు లేకుండా పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఎస్పీ సురేశ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

రూ. 2.47 కోట్లు పట్టివేత

- సరైన పత్రాలు లేకుండా, లెక్కలు చూపకుండా తరలిస్తున్న నగదు
- రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల విస్తృత తనిఖీలు



ఎల్‌బీనగర్‌లో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు



సీజ్ చేసిన డబ్బు వివరాలను వెల్లడిస్తున్న చిక్కడపల్లి పోలీసులు

సాక్షి నెట్‌ వర్క్: ఎన్నికల నేపథ్యంలో సరైన పత్రాలు లేకుండా, లెక్కలు చూపకుండా తరలిస్తున్న నగదును ఎక్కడికక్కడ పోలీసులు పట్టుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ. 2 కోట్ల 47 లక్షల రూపాయల మొత్తం పట్టుబడింది. పట్టుబడ్డ నగదును సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగిస్తామని పోలీసులు తెలిపారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంగారం జేపీ సినిమాస్ వద్ద స్థానికుడు సి.మురళీ నుంచి రూ.2.76 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో తాళ్లూరి థియేటర్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వాహనదారుడి వద్ద నుంచి రూ.7.12 లక్షలు, మరో వ్యక్తి నుంచి రూ.5 లక్షల నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కళ్యాణ్‌నగర్‌లో బైక్‌పై వెళ్తున్న ముస్తఫా అలీఖాన్ అనే వ్యక్తి నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ముషీరాబాద్ స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న షేక్ అన్సార్ ఆలీ, షేక్ అహ్మద్ ఆలీ నుంచి రూ.9.5 లక్షల రూపాయల నగదు పట్టుబడింది. ఘట్‌కేసర్ శివారెడ్డిగూడలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న గోపాల్‌రెడ్డి నుంచి రూ. 3లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అన్నోజిగూడలోని హైవేపై తనిఖీలు చేస్తున్న క్రమంలో బైక్‌పై వెళ్తున్న వెంకటాపూర్‌కు చెందిన నీరుడి లింగం నుంచి రూ.5లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మేడిపల్లి ప్రాంతానికి చెందిన వేణు నంబరు ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఉప్పల్ పోలీసులు తనిఖీ చేసి రూ. 6,22,500ను స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్‌లోని ప్రశాంత్ నగర్‌కు చెందిన సిట్టికుంట కృష్ణాకర్‌రెడ్డి నుంచి రూ. 8 లక్షల 63 వేల 200 నగదును స్వాధీనం చేసుకున్నారు. చెన్నాపురం చౌరస్తా వద్ద జవహర్‌నగర్ పోలీసుల తనిఖీల్లో భాగంగా ఓ కారులో రూ.6 లక్షలు తరలిస్తుండగా వాటిని సీజ్ చేశారు. కోదాడ పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా హుజూర్‌నగర్ మండలం మదావరాయినిగూడెంకు చెందిన వస్త్ర వ్యాపారి వినయ్ వద్ద రూ.10 లక్షల నగదు పట్టుబడింది.

ఎల్‌బీనగర్‌లో రూ. 28,99,640 పట్టివేత

ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో.. వనస్థలిపురంకు చెందిన దినేష్ సింగ్ ఠాకూర్ వద్ద రూ.3,62,000 లక్షలు, రామంతాపూర్ కు చెందిన కాటం లెనిన్ బాబు వద్ద రూ.1.80 వేలు, ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ముఖేష్‌పాండే వద్ద రూ.13,58,640, వనస్థలిపురంకు చెందిన వెదిర్ అశోక్ వద్ద రూ.3లక్షలు, కొత్తపేట నివాసి దంతూరి అరుణ్ రాజ్ వద్ద రూ.4,69,500, విజయవాడకి చెందిన కామోదుల అజయ్‌కుమార్ వద్ద రూ.2,29,500 లక్షలు దొరికినట్లు ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపారు.

నల్లగొండలో కోటిన్నర స్వాధీనం

నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి పీఎస్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పాయింట్‌లో బి.ఎన్.రెడ్డికి చెందిన కన్నెకంటి వెంకటనారాయణ, మూరుకొండ శ్రీనివాసరావు నుంచి రూ.కోటి యాభై లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎలాంటి పత్రాలూ లేకపోవడంతోనే సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాంగ్రెస్‌లో 'బీసీ' కాక!



అధిష్టానానికి రాసిన లేఖను చూపిస్తున్న పొన్నాల లక్ష్మయ్య

▶ మొదటి పేజీ తరువాయి

ప్రయత్నించడం, అధిష్టానం గట్టిగా హెచ్చరించడం, మరోవైపు ఇటీవల ఢిల్లీ వెళ్లిన సందర్భంగా బీసీ నేతలకు కాంగ్రెస్ పెద్దలు సరిగా అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం, బీసీ నేతలకు ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ల కోత తప్పదనే సంకేతాలు వస్తుండడం లాంటి పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో బీసీ నేతలు కేంద్రంగా ఓరకంగా కలకలమే రేగుతోంది. బీసీలకు ఎన్ని టికెట్లు వస్తాయో తేలక ఆ వర్గానికి చెందిన మరికొందరు పొన్నాల బాట పట్టవచ్చనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.

బీసీలకు 34 స్థానాలకు తగ్గకుండా ఇవ్వాలంటూ..

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 34కు తగ్గకుండా టికెట్లు తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఇటీవల తెలంగాణకు చెందిన 30–40 మంది బీసీ నేతలు హస్తిన బాట పట్టారు. వీరిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు ఇతరులు ఉన్నారు. అయితే వీరికి కనీసం అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. రాహుల్, సోనియాలను కలుస్తామని, అక్కడే బీసీల కోటా తేల్చుకుంటామని చెప్పిన బీసీ నేతలు ఢిల్లీ వెళ్లిన తర్వాత ఉసూరుమంటూ వెనక్కు రావాల్సి వచ్చింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కలుస్తారని చెప్పినా ఆయన కేవలం మధుయాష్కీకి మాత్రమే అపాయింట్‌మెంట్ ఇచ్చారు. మిగిలిన నేతలంతా ఏఐసీసీ కార్యాలయంలోనే వేచి ఉండాల్సి వచ్చింది. ఆ తర్వాత కొందరు నాయకులను ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి కేసీ వేణుగోపాల్ కలిశారు. పార్టీ అధికారంలోకి రావడం మీకు ఇష్టం లేదా? అంటూ ఆయన ఎదురుదాడికి దిగడంతో వారంతా కంగు తినాల్సి వచ్చిందని చెబుతున్నారు. దీనికి తోడు పార్టీ సర్వేల ఆధారంగా గెలిచే వారికి మాత్రమే టికెట్లు ఇస్తామని, మిగిలిన వారికి ఇవ్వలేమని చెప్పిన వేణుగోపాల్ కొందరిని వ్యక్తిగతంగా ప్రస్తావిస్తూ వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని వార్నింగ్ కూడా ఇచ్చినట్టు సమాచారం.

ఠాక్రే ఫోన్‌తో ధర్నా విరమణ?

వాస్తవానికి బీసీలకు 34 అసెంబ్లీ స్థానాలకు తగ్గకుండా ఈసారి సీట్లు ఇస్తామని తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం చాలాసార్లు స్పష్టం చేసింది. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ)లో తీసుకున్న ఈ నిర్ణయానికి అనుగుణంగా తమకు 34 కంటే ఎక్కువ సీట్లు ఇవ్వాలని గత రెండు నెలలుగా బీసీ నేతలు టీం బీసీ పేరుతో డిమాండ్ చేస్తున్నారు. తాజాగా 20–25 స్థానాలు మాత్రమే బీసీలకు ఇస్తున్నారని తెలియడంతో శుక్రవారం గాంధీభవన్‌లో ధర్నా చేసేందుకు సిద్ధమయ్యారు. కానీ అనూహ్యంగా వారు తమ నిరసన విరమించుకున్నారు. ఇందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే నుంచి వచ్చిన ఒకే ఒక్క ఫోన్‌కాల్ కారణమనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. టికెట్ల ప్రకటన సమయంలో ఇలాంటి ఆందోళనలు చేయవద్దని, గెలిచే వారికే సీట్లిస్తామని, తమను కాదని ధర్నాలు చేస్తే పార్టీ నుంచి బయటకు పంపిస్తామని ఆయన హెచ్చరించడంతోనే టీం బీసీ నేతలు తమ ఆందోళనను విరమించుకున్నారని తెలుస్తోంది.

పొత్తు కుదిరితే బీసీలకిచ్చే సీట్లేనా?

వామపక్ష పార్టీలతో పొత్తు కుదిరితే చెరో రెండు సీట్లు చొప్పున సీపీఐ, సీపీఎంలకు కాంగ్రెస్ కేటాయిస్తుందనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ, మునుగోడు స్థానాలను ఆ పార్టీలకు ఇస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఇవి సాధారణంగా కాంగ్రెస్ బీసీలకిచ్చే అవకాశం ఉన్న, చాలామంది బీసీ నేతలు ఆశిస్తున్న స్థానాలనే వాదన విన్పిస్తోంది. బీసీలకు ఇచ్చే అవకాశమున్న సీట్లను పొత్తుల్లో వేరే పార్టీలకు ఇచ్చి, పొత్తుల కారణంగానే కొన్ని సీట్లు బీసీలకు ఇవ్వలేకపోయామని చెప్పేందుకే ఈ ఆలోచన చేస్తున్నారని బీసీ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు సర్వేల పేరుతో బీసీ నేతలను దూరం చేసుకునేందుకు కూడా పార్టీ వెనుకాడడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల నేపథ్యంలోనే.. అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత చాలా మంది బీసీ నేతలు పొన్నాల బాటలో పయనించవచ్చనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా

- పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు అన్యాయంగా అధికారం చేజిక్కించుకున్నారు
- నిఖార్సైన నేతలు ఉనికి కోసం పాకులాడాల్సి వస్తోంది
- బీసీలకు అగౌరవం మాత్రమే మిగిలింది
- ఇలాంటి వాతావరణంలో ఇమడలేననే నిర్ధారణకు వచ్చా: పొన్నాల

సాక్షి, హైదరాబాద్/ సాక్షి ప్రతినిధి, వరంగల్: 'అమెరికాలోని ప్రతిష్టాత్మక సంస్థతో కలిసి దశాబ్దం పాటు పనిచేసిన తర్వాత, కాంగ్రెస్ పార్టీతో కలిసి నాలుగు దశాబ్దాలకు పైగా పనిచేసిన నేను బాధాతప్త హృదయంతో ఈ లేఖను రాస్తున్నాను..'అని ఖర్గేకు రాసిన లేఖలో పొన్నాల తెలిపారు. 'నేను కాంగ్రెస్ పార్టీలో పనిచేసేందుకు పీవీ నరసింహారావు స్ఫూర్తినిచ్చారు. పార్టీలో సాధారణ కార్యకర్త నుంచి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించాను. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, 12 ఏళ్ల పాటు మంత్రిగా నిబద్ధతతో సేవలందించాను. అయితే పార్టీలో తాజాగా జరుగుతున్న పరిణామాలు నాకు తీవ్ర బాధను కలిగించాయి. 2015లో పీసీసీ అధ్యక్షుడిగా నన్ను అకారణంగా తొలగించారు. 2014 ఎన్నికల్లో పార్టీ ఓటమికి నేనే బాధ్యుడినని నిందించారు. పార్టీ మూల సిద్ధాంతంతో అనుబంధమున్న నాలాంటి నాయకుడికి పార్టీలో ఎన్నో అవమానాలు కలిగాయి. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారు అన్యాయంగా అధికారం చేజిక్కించుకున్నారు. నిఖార్సైన కాంగ్రెస్ నేతలు మాత్రం పార్టీలో ప్రాధాన్యం కోల్పోయి ఉనికి కోసం పాకులాడాల్సి వస్తోంది. ఈ విషయాలను పీసీసీ అధ్యక్షుడితో మాట్లాడేందుకు రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నాను. కానీ సాధ్యపడలేదు.

సామాజిక న్యాయానికి కాలం చెల్లింది

కాంగ్రెస్ పార్టీకి ఆయువు పట్టు లాంటి సామాజిక న్యాయానికి ఇప్పుడు పార్టీలో కాలం చెల్లింది. సమాజంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీలకు అగౌరవం మాత్రమే మిగిలింది. పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అనేక అనుమానాలకు తావిస్తోంది. ఈ క్రమంలో వస్తున్న ఆరోపణలు పార్టీ అంకితభావాన్ని ప్రశ్నించే విధంగా ఉన్నాయి. ఇలాంటి అంశాలను చర్చించేందుకు నాలాంటి సీనియర్ నేత కూడా నెలల తరబడి నిరీక్షించాల్సి రావడం, ఢిల్లీలో కేసీ వేణుగోపాల్‌ను కలిసేందుకు పదిరోజులు వేచి ఉన్నా ఫలితం లేకపోవడం దురదృష్టకరం. 50 మంది బీసీ నేతలు ఢిల్లీకి వచ్చినా పెద్దలను కలిసేందుకు అనుమతి లభించలేదు. ఉదయ్‌పూర్, రాయ్‌పూర్ డిక్లరేషన్‌లు పార్టీలో అమలు కావడం లేదు. మరోవైపు బీఆర్‌ఎస్ ఎంపీ, ఎమ్మెల్సీ, ఇతర హోదాలను బీసీ నాయకులకు కల్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నేను పార్టీతో అనుబంధాన్ని కొనసాగించలేనని, ఇలాంటి వాతావరణంలో ఇమడలేననే నిర్ధారణకు వచ్చా. ఇన్నాళ్లూ నాకు అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు..'అని పొన్నాల తన లేఖలో పేర్కొన్నారు.

ప్రస్తుతానికి కాంగ్రెస్‌కు రాజీనామా చేశా..

ఏఐసీసీకి లేఖను పంపిన తర్వాత హైదరాబాద్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ పొన్నాల భావోద్వేగానికి గురయ్యారు. 1983 తర్వాత పార్టీ కేవలం మూడు సార్లు మాత్రమే అధికారంలోకి వచ్చిందని, ఉమ్మడి ఏపీలో అధికారం దక్కించుకున్నా తెలంగాణలో మాత్రం సగం సీట్లు పార్టీకి ఎప్పుడూ రాలేదని, ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు అవసరమైన విషయాలను పార్టీలో చర్చించాలన్నా వీలుపడలేదని చెప్పారు. చెప్పేది వినేవాళ్లు పార్టీలో లేరని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పొన్నాల కన్నీటి పర్యంతమయ్యారు. బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారా అని ప్రశ్నించగా, ప్రస్తుతానికి తాను కాంగ్రెస్ పార్టీకి రాజీనామా మాత్రమే చేశానని, ఇప్పుడే తన రాజకీయ భవిష్యత్తు గురించి చెప్పలేనని అన్నారు.

ఒకరిద్దరు వెళ్లినా నష్టమేమీ లేదు: మురళీధరన్

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరిద్దరు వెళ్లిపోయినంత మాత్రాన పార్టీకి వచ్చే నష్టమేమీ లేదని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీలోకి చాలామంది వచ్చి చేరుతున్నట్లు చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. పొన్నాల పార్టీని వీడటంపై విలేకరులు ప్రశ్నించగా..దీనిపై స్పందించాల్సిన అవసరం లేదంటూ వ్యాఖ్యానించారు. అదే సమయంలో అభ్యర్థుల జాబితా ప్రకటించకుండానే పొన్నాల పార్టీని ఎలా విమర్శిస్తారని ప్రశ్నించారు.

రేవంత్‌కు హైకోర్టులో ఊరట

- పరువు నష్టం కేసులో కింది కోర్టు ఉత్తర్వులు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ అనుమతిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రామేశ్వర్‌రావు దాఖలు చేసిన క్రిమినల్ పరువు నష్టం కేసులో కింది కోర్టు ఇచ్చిన కాగ్నిజెన్స్ ఆర్డర్‌ను రద్దు చేశారు. 2014లో డీఎల్ఎఫ్ భూములకు సంబంధించి టీవీ ఛానెళ్లు, వార్తా పత్రికల్లో రేవంత్ చేసిన కొన్ని ప్రకటనల వల్ల తన పరువుకు భంగం వాటిల్లిదంటూ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు దాఖలు చేశారు. దీనిని కింది కోర్టు కాగ్నిజెన్స్‌లోకి తీసుకోవడంపై రేవంత్ రెడ్డి హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. హైదరాబాద్ మేజిస్ట్రేట్ కోర్టు కాగ్నిజెన్స్ ఉత్తర్వులను జస్టిస్ లక్ష్మణ్ కొట్టేస్తూ తీర్పు చెప్పారు. విధానపరమైన లోపాలను గుర్తించి తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పరువు నష్టం కేసును తిరిగి విచారణ చేపట్టాలని కింది కోర్టును ఆదేశించారు. పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ, సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా కాగ్నిజెన్స్‌కు కింది కోర్టు అనుమతిచ్చిందని చెప్పారు. కారణం ఏమిటో స్పష్టం చేయకుండా కాగ్నిజెన్స్‌లోకి తీసుకోవడం చెల్లదన్నారు. రేవంత్‌రెడ్డి భూముల అన్యాక్రాంతంపైన మాత్రమే మాట్లాడారని, దీనివల్ల రామేశ్వర్‌రావుకు నష్టం కలగలేదన్నారు. ఏ మాత్రం పట్టించుకోకుండా అనేక చేతులు మారిన తర్వాత రామేశ్వరరావు కంపెనీకి చేరిందని మాత్రమే ఆరోపించారని చెప్పారు. వాదనల తర్వాత హైకోర్టు, మేజిస్ట్రేట్ కోర్టు జారీచేసిన కాగ్నిజెన్స్ ఆదేశాలను రద్దు చేసింది. తిరిగి తాజాగా విచారణ చేసేందుకు కింది కోర్టుకు అనుమతిచ్చింది.

విద్యా ప్రపంచంలో సంచలనం 'విస్టా'

సాక్షి, హైదరాబాద్: విద్యారంగంలో దూసుకెళ్తున్న ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య విస్టా (వర్చువల్ ఇంటెలిజెంట్ సిస్టమ్ ఫర్ టైలర్డ్ అకడమిక్స్)'ను ప్రారంభించింది. విస్టా అనేది విద్యా ప్రపంచంలో ఒక సంచలనాత్మక సాంకేతిక కార్యక్రమమని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, అధ్యాపకులు, అభ్యాసకులు ఎదుర్కొంటున్న సవాళ్లను ఇది పరిష్కరిస్తుందన్నారు. మొబైల్, వెబ్ అప్లికేషన్ల ద్వారా విద్యార్థులు దీన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. 'నేను నా విద్యా ప్రయాణాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఉత్తమ అభ్యాస అనుభవాలను మెరుగుపరచడం, అందించడం లక్ష్యంగా పెట్టుకున్న. విస్టా ద్వారా విద్యార్థులు ప్రయోజనం పొందుతారు. ఇన్ఫినిటీ లెర్న్ బై శ్రీచైతన్య రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది'అని వివరించారు.

టీఆర్టీ వాయిదా

- పాఠశాల విద్య డైరెక్టరేట్ వెల్లడి
- తదుపరి తేదీపై తర్వాత ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ)ను ప్రభుత్వం వాయిదా వేసింది. అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాఠశాల విద్య డైరెక్టర్ కార్యాలయం శుక్రవారం వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా 5,089 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను డిపార్ట్‌మెంట్ సెలక్షన్ కమిటీ (డీఎస్సీ) ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనుగుణంగా గత నెల టీఆర్టీ షెడ్యూల్‌ను కూడా విడుదల చేసింది. దీంతో ఇప్పటివరకూ 80 వేల మంది టీఆర్టీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకూ పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే ఇటీవల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో పరీక్ష నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. నవంబర్ 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ జరగనుంది. ఉపాధ్యాయులు, ప్రభుత్వ సిబ్బంది పోలింగ్ విధుల్లో పాల్గొంటారు. ఇందుకోసం వారు ముందే సమాయత్తం కావాల్సి ఉంటుంది. మరోవైపు పరీక్ష రాసే అభ్యర్థులు కూడా ఓటు వేసేందుకు సొంత గ్రామాలకు వెళ్తారు. ఈ పరిస్థితుల్లో పరీక్ష నిర్వహణ కష్టమనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ మేరకు విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. పరీక్ష వాయిదాకు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఆదేశించడంతో విద్యాశాఖ ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. తిరిగి పరీక్ష ఎప్పుడు నిర్వహించేది తర్వాత తెలియజేస్తామని పేర్కొంది.

నిరుద్యోగులను మోసగించడమే : ఏఐఎస్ఎఫ్

ఎన్నికలు వస్తున్నాయని తెలిసీ నియామక ప్రక్రియను అందుకు అనుగుణంగా చేపట్టకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శాఖ విమర్శించింది. ఎన్నికలను బూచిగా చూపించి టీఆర్టీ వాయిదా వేయడం నిరుద్యోగులను మోసగించడమేనని పేర్కొంది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. టీచర్ల నియామకంపై ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని వారు ఆరోపించారు. మొదట్నుంచీ కేసీఆర్ సర్కార్ నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని ఏబీవీపీ విమర్శించింది. ఈ ఎన్నికల్లో నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చింది.

నేడు అఖిలపక్షాల సడక్ బంద్

- టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన డిమాండ్‌తో కాంగ్రెస్ నేతృత్వంలో ఆందోళన
- నాలుగు ప్రధాన రహదారులపై 21 చోట్ల రాస్తారోకో చేస్తాం
- కమ్యూనిస్టులు, బీఎస్పీ, టీజేఎస్, ప్రజా సంఘాలు పాల్గొంటాయి: మాజీ ఎంపీ మల్లురవి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యార్థులు, నిరుద్యోగుల అసంతృప్తిని ప్రభుత్వానికి తెలియజేయడం, టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలనే డిమాండ్‌తో శనివారం అఖిలపక్షాల ఆధ్వర్యంలో 'సడక్ బంద్'ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల సమావేశంలో నిర్ణయించిన మేరకు.. శనివారం ఉదయం 10:30 గంటల నుంచి 12:30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి శుక్రవారం వెల్లడించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలోని 21 చోట్ల ఆందోళన చేపడతామన్నారు. మహబూబ్‌నగర్–హైదరాబాద్ రహదారిలో మహబూబ్‌నగర్, జడ్చర్ల, షాద్‌నగర్, శంషాబాద్ వద్ద.. వరంగల్–హైదరాబాద్ రహదారిలో వరంగల్, స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ, ఆలేరు, భువనగిరి, ఘట్‌కేసర్‌ల వద్ద.. రామగుండం–హైదరాబాద్ రహదారిపై రామగుండం, పెద్దపల్లి, కరీంనగర్, సిద్దిపేట, గజ్వేల్, శామీర్‌పేట, తూంకుంటల వద్ద.. ఖమ్మం–హైదరాబాద్ రహదారిలో ఖమ్మం, కూసుమంచి, సూర్యాపేట, నకిరేకల్, నార్కట్‌పల్లి, చిట్యాల, చౌటుప్పల్, హయత్‌నగర్‌లలో సడక్ బంద్ నిర్వహిస్తామని చెప్పారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి కొత్త సభ్యులను నియమించాలని, డీఎస్సీలో టీచర్ పోస్టులను 13,500కు పెంచాలని, పరీక్షల రద్దుకు పరిహారంగా ఒక్కో అభ్యర్థికి రూ.3 లక్షలు చెల్లించాలనే డిమాండ్‌తో ఈ నిరసన చేపడుతున్నట్టు తెలిపారు. ఆందోళనలో కాంగ్రెస్ పార్టీతోపాటు టీజేఎస్, సీపీఐ, సీపీఎం, న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ, ప్రజాసంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలు పాల్గొంటాయన్నారు.

ఎన్నికల పరీక్షలో ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు ఫెయిల్

నాలుగు రోజులు శిక్షణ ఇచ్చినా అదే పరిస్థితి... ఫెయిల్ అయిన వారికి మరోమారు పరీక్ష

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో సాధారణ ఎన్నికల నిర్వహణపై ఈసీ పక్కాగా ముందుకెళ్తోంది. నిర్వహణలోపం లేకుండా ఉండేందుకు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులకు ఇటీవల హైదరాబాద్‌లో నాలుగు రోజులు మాస్టర్ ట్రైనర్లతో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. నామినేషన్ల ప్రక్రియ, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, అఫిడవిట్ల పరిశీలన, పోస్టల్ బ్యాలెట్స్, మోడల్ కోడ్, ఈవీఎం, వీవీ ప్యాట్స్, కౌంటింగ్, ఫలితాల ప్రకటన వంటి అంశాల్లో శిక్షణ ఇచ్చారు. వీటిపై ఏ మేరకు అవగాహన కలిగిందో తెలుసుకునేందుకు పరీక్షలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో ఫెయిల్ అయ్యారు. మొత్తం 325మంది (112మంది రిటర్నింగ్, 213మంది సహాయ రిటర్నింగ్) అధికారులు ఉన్నారు. వీరిలో 165మంది ఫెయిలయ్యారు. వారిలో 9మంది రిటర్నింగ్, 174మంది సహాయ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు. ఫెయిల్ అయిన వారికి మరో అవకాశంగా శుక్రవారం జిల్లా కేంద్రాల్లో శిక్షణ ఇచ్చారు. వీరికి పరీక్ష ఎప్పుడనేది వెల్లడించలేదు.

మళ్లీ ఫెయిలైతే పరిస్థితేంటి?

రెండోసారి కూడా ఫెయిలైతే ఏంటన్న విషయంలో ఈసీ అధికారులు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఫెయిలైన వారిని ఎన్నికల విధుల్లో కొనసాగించవద్దని భావిస్తే.. వారిని మార్చాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది. అదే జరిగితే మరోమారు బదిలీల కుదుపు తప్పకపోవచ్చని తెలుస్తోంది.

హైదరాబాద్ కొత్త సీపీ సందీప్ శాండిల్య

▶ మొదటి పేజీ తరువాయి

ప్రతీ పోస్టుకు ముగ్గురు లెక్కన అధికారుల పేర్లను వారి నడవడిక, పనితీరు, విజిలెన్స్ నివేదికలతో సహా తమకు పంపాలని సీఎస్‌ను ఈసీ ఆదేశించింది. ఈ మేరకు సీఎస్ జాబితాలను పంపగా.. సీనియారిటీకి ప్రాధాన్యతనిస్తూ అధికా రులను ఈసీ ఎంపిక చేసింది. గతంలో నాన్ కేడర్ అధికారులు జిల్లాల ఎస్పీలుగా ఉంటే.. ఐపీఎస్ నుంచి నేరుగా రిక్రూటైన యువ అధికారులకు ఈసీ సూచనల మేరకు పోస్టింగ్‌లు లభించినట్టు సీఎస్ ఉత్తర్వులు స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల సంఘం అధికారుల నిజాయితీ, కమిట్‌మెంట్‌ను పరిగణనలోకి తీసుకుని, పలు అంశాలపైనా పరిశీలన జరిపాక ఆయా పోస్టులకు సూచించినట్టు తెలిసింది.

ఈసీ ఆదేశాల మేరకు నియమితులైన అధికారులు

అధికారి పేరు	పోస్టింగ్
పోలీసు విభాగంలో..	
సందీప్ శాండిల్య	పోలీస్ కమిషనర్, హైదరాబాద్
అంబర్ కిషోర్ ఝా	పోలీస్ కమిషనర్, వరంగల్
కల్మేశ్వర్ సింగనవార్	పోలీస్ కమిషనర్, నిజామాబాద్
చెన్నూరు రూపేశ్	ఎస్పీ, సంగారెడ్డి
సింధూశర్మ	ఎస్పీ, కామారెడ్డి
సన్‌ప్రీత్ సింగ్	ఎస్పీ, జగిత్యాల
హర్షవర్ధన్	ఎస్పీ, మహబూబ్‌నగర్
గైక్వాడ్ వైభవ్ రఘునాథ్	ఎస్పీ, నాగర్‌కర్నూల్
రితిరాజ్	ఎస్పీ, జోగుళాంబ గద్వాల
పాటిల్ సంగ్రామ్‌సింగ్ గణపత్‌రావు	ఎస్పీ, మహబూబాబాద్
యోగేశ్ గౌతమ్	ఎస్పీ, నారాయణపేట
ఖరే కిరణ్ ప్రభాకర్	ఎస్పీ, జయశంకర్ భూపాలపల్లి
బీకే రాహుల్ హెగ్డే	ఎస్పీ, సూర్యాపేట
కీలక ప్రభుత్వ శాఖల్లో..	
సునీల్‌శర్మ	ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ
ఎ.వాణీప్రసాద్	కార్యదర్శి, రవాణా శాఖ
జ్యోతిబుద్ధప్రకాశ్	కమిషనర్, ఎక్సైజ్
క్రిస్టినా జెడ్ చోంగ్తూ	కమిషనర్, వాణిజ్య పన్నులు
కొత్త కలెక్టర్లు వీరే..	
భారతి హోళికేరి	రంగారెడ్డి జిల్లా, కలెక్టర్
గౌతమ్ పాత్రూ	మేడ్చల్–మల్కాజిగిరి, కలెక్టర్
హనుమంత్ కొండాబి	యాదాద్రి–భువనగిరి, కలెక్టర్
ఆశీశ్ సంగ్వాన్	నిర్మల్, కలెక్టర్

ఎలక్షన్ 'క్రియా–థాన్'కు విశేష స్పందన

సాక్షి, హైదరాబాద్: ఓటర్లకు చైతన్యం కల్పించడంలో భాగంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ), హైసియా, కోడ్ తంత్రల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎలక్షన్ క్రియా–థాన్ 2023' పోటీలకు మంచి స్పందన లభించింది. 1,100 మంది ఐటీ ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొని సృజనాత్మక పోస్టర్లు, వీడియోలకు రూపకల్పన చేశారు. విజేతలుగా నిలిచిన పి.వరుణ్‌సాయి, వెంకటేశ్ మంతెన, రాహుల్ నాయక్, పెర్సియా హరీశ్, ఎం.ఎ. జావీద్‌లకు రూ.20వేలు, రన్నరప్‌లుగా నిలిచిన కప్పుసుగుణ ఐశ్వర్య, అంకం శ్రీకాంత్, వీవీ కుసుమ్ ప్రియా, మహమ్మద్ సాబీర్, దారం మంజులకు రూ.10వేలు చొప్పున నగదు బహుమతిని సీఈఓ వికాస్‌రాజ్ శుక్రవారం ఇక్కడ అందజేశారు.


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

గ్రూప్-2 వాయిదాతో విద్యార్థిని ఆత్మహత్య

▶ మొదటి పేజీ తరువాయి

అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని తరలించే సమయంలో విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె సూసైడ్ లెటర్ బయటపెట్టాలని కోరారు. సీఎం కేసీఆర్ డౌన్ డౌన్, కేటీఆర్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోటీ పరీక్షలు నిర్వహించడంలో విఫలమైన కేసీఆర్ సర్కార్ దిగిపోవాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీని రద్దుచేసి యూపీఎస్సీకి ఇవ్వాలని, కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అర్ధరాత్రి దాటే వరకు నిరసన కొనసాగింది. విద్యార్థుల నిరసనకు కాంగ్రెస్, బీజేపీలతో పాటు వామపక్ష విద్యార్థి సంఘాలు మద్దతు పలికాయి. విద్యార్థుల ఆందోళనకు కాంగ్రెస్, బీజేపీ మద్దతు తెలిపాయి. కాంగ్రెస్ నేత అనిల్‌యాదవ్, బీజేపీ ఎంపీ డాక్టర్ కే.లక్ష్మణ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి తదితరులు విద్యార్థులు ఆందోళన చేస్తున్న చోటుకు వచ్చారు. విద్యార్థులతో మాట్లాడి సంఘీభావం తెలిపారు. మరోపక్క విషయం తెలుసుకున్న ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, ఆయా కోచింగ్ సెంటర్లలో శిక్షణపొందుతున్న అభ్యర్థులు అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయం వద్దకు వేల సంఖ్యలో చేరుకున్నారు. దీంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్ నుంచి అశోక్‌నగర్ ఎన్టీఆర్ స్టేడియం వరకు రోడ్డు మొత్తం విద్యార్థులతో నిండిపోయింది. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని వారంతా నినాదాలు చేశారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ తొలగింపుపై స్టే

సాక్షి, హైదరాబాద్: బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాగేరి హారికను తొలగిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైకోర్టు నిలిపివేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఆమె వాదనలు వినకుండా పదవినుంచి తొలగిస్తూ ప్రభుత్వం అక్టోబర్ 8న జీవో జారీ చేయడాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. 2023, ఫిబ్రవరి 4న హారికను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. హారికకు నోటీసు కూడా ఇవ్వకుండా ఏకపక్షంగా పదవి నుంచి తొలగిస్తూ జీవో జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ.. ఆమె తరఫు న్యాయవాది తేరా రజనీకాంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తొలగింపు జీవోను నిలిపి వేశారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్!



హెచ్‌సీయూ స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న యూజీసీ చైర్మన్ ఎం. జగదీశ్‌కుమార్, గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

- యూజీసీ చైర్మన్, విద్యావేత్త ప్రొఫెసర్ ఎం.జగదీశ్‌కుమార్ వెల్లడి
- నోబెల్ సాధనే లక్ష్యంగా యువత కష్టపడాలి
- హెచ్‌సీయూ 23వ స్నాతకోత్సవంలో గవర్నర్ తమిళిసై

రాయదుర్గం (హైదరాబాద్): 2047 నాటికి ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా భారత్ గుర్తింపు పొందడం ఖాయమని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషనర్ (యూజీసీ) చైర్మన్, విద్యావేత్త ప్రొఫెసర్ ఎం.జగదీశ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పట్టాలతోపాటు గోల్డ్‌మెడల్స్, ఫ్యాకల్టీకి చాన్స్‌లర్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగానే కాకుండా ఆర్థికంగా ఎదుగుతున్న దేశంగా భారత్ ప్రపంచంలోనే మూడోస్థానంలో నిలిచిందన్నారు. సోలార్ పవర్ ఉత్పత్తిలో 2030 నాటికి 100 మెగావాట్స్ సోలార్ పవర్ ఉత్పత్తి చేసి ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద దేశంగా గుర్తింపు పొందడం ఖాయమన్నారు. దేశంలోని అన్ని స్టేట్ యూనివర్సిటీలలో 70 నుంచి 80% ఫ్యాకల్టీ ఖాళీలు కొనసాగుతున్నాయని తెలుస్తోందని, వాటిని వెంటనే భర్తీ చేయాలని జగదీశ్‌కుమార్ సూచించారు. సెంట్రల్ వర్సిటీలలో భర్తీల ప్రక్రియ ఆరంభమైందని, త్వరలో పూర్తి స్థాయిలో భర్తీ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

యువత నోబెల్ బహుమతి సాధించాలి: గవర్నర్ తమిళిసై

నేటి తరం యువత నోబెల్ బహుమతి సాధించాలనే లక్ష్యంతో కష్టపడాలని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యావిధానం-2020లో ఎన్నో సంస్కరణలకు దారి తీసిందని, దీన్ని అందరూ స్వాగతించాలన్నారు. మాతృభాషలో విద్యాబోధన చేస్తే విద్యార్థులు మరింతగా రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం హెచ్‌సీయూ చాన్స్‌లర్ జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు కూడా మాట్లాడారు. రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులు, అధికారులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ముగ్గురు కార్మికుల ఆత్మహత్యాయత్నం

- వరంగల్ ఎంజీఎంలో ఘటన

ఎంజీఎం: వేతనాలు చెల్లించాలని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం ముగ్గురు ఔట్‌సోర్సింగ్ కార్మికులు పురుగు మందు తాగారు. ఎంజీఎం ఆస్పత్రికి 20 నెలల కిందట 300 ఓసీఎస్ పద్దు కింద 35 పోస్టులు మంజూరయ్యాయి. వీరిని ఔట్‌సోర్సింగ్ కింద తీసుకున్నారు. అయితే 3 నెలలుగా వేతనాలు రాకపోవడంతో 16 మంది కార్మికులు ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయం చుట్టూ రెండు, మూడు రోజులుగా ప్రదక్షిణలు చేస్తున్నారు. శుక్రవారం సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌తో కార్మికులు చర్చలు జరిపి వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ క్రమంలో 300 ఓసీఎస్ పద్దులో కాకుండా ఎంజీఎం ఆస్పత్రిలో కృష్ణ కన్‌స్ట్రక్షన్ ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లిస్తామని చెప్పడంతో ఆవేదనకు గురైన కార్మికుల్లో ముగ్గురు ఆయన చాంబర్ ఎదుట పురుగు మందు తాగారు. వెంటనే సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రి అత్యవసర విభాగానికి తరలించారు. కాగా, ఈ ఘటనపై సూపరింటెండెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ వీరి వేతనాల సమస్య సచివాలయంలో పెండింగ్ ఉందని తెలిపారు. బెదిరించే ధోరణిలో వారు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు.


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కార్మికుడు





శుక్రవారం వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ బలగాలతో తలపడుతున్న పాలస్తీనియన్లు



శుక్రవారం పాలస్తీనాకు మద్దతుగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో భారీ ర్యాలీ

ఉత్తర గాజాను ఖాళీ చేయండి

పాలస్తీనియన్లకు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశాలు

- ఉత్తర గాజాలోని హమాస్ స్థావరాలపై భూతల దాడులకు సన్నాహాలు
- అడుగడుగూ జల్లెడ పడుతూ మిలిటెంట్ల ఏరివేతకు ఏర్పాట్లు
- జనాన్ని తరలించడం మానవ విపత్తు అవుతుందని ఐరాస ఆందోళన
- ఇజ్రాయెల్ 'మానసిక యుద్ధాన్ని' పట్టించుకోవద్దని హమాస్ పిలుపు
- ఇజ్రాయెల్–హమాస్ రణంలో 2,800కు చేరిన మృతుల సంఖ్య
- బందీల్లో 13 మంది ఇజ్రాయెల్ దాడుల్లో చనిపోయారని హమాస్ వెల్లడి

జెరూసలేం: హమాస్ మిలిటెంట్లకు కంచుకోట అయిన గాజాపై పూర్తిస్థాయి యుద్ధానికి ఇజ్రాయెల్ సైన్యం సన్నాహాలు చేస్తోంది. ఉత్తర గాజాను తక్షణమే ఖాళీ చేయాలని, దక్షిణ ప్రాంతానికి తరలివెళ్లాలని శుక్రవారం అసాధారణ ఆదేశాలు జారీ చేసింది. ప్రజల రక్షణ కోసమే ఈ ఆదేశాలిచ్చామని తెలియజేసింది. ఉత్తర గాజాలో 10 లక్షల మంది నివాసం ఉంటున్నారు. ఇజ్రాయెల్ ఆదేశాల మేరకు జనం దక్షిణ గాజాకు పయనమవుతున్నారు. గాజా మొత్తం జనాభా 20 లక్షలు. అంటే దాదాపు సగం మంది ఇళ్లు విడిచివెళ్లిపోవాల్సి ఉంటుంది. ఇప్పటికే జనంతో కిక్కిరిసిపోయిన దక్షిణ గాజాపై మరింత ఒత్తిడి పెరగనుంది. గత ఏడు రోజులుగా గాజాలోని హమాస్ స్థావరాలపై వైమానిక దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ సేనలు భూభాగ దాడులకు సన్నద్ధమవుతున్నాయి. పదాతి దళాలు ఆయుధాలు చేబూని అడుగు ముందుకు వేయబోతున్నాయి. హమాస్‌పై భూతల దాడుల కోసం 3 లక్షలకు పైగా రిజర్వ్ సైనికులు సిద్ధంగా ఉన్నారని ఇజ్రాయెల్ అధికారులు వెల్లడించారు. గాజా వీధుల్లో మిలిటెంట్ల వేటకు ఏర్పాట్లు పూర్తయ్యాయని అనధికారికంగా చెబుతున్నారు. అడుగడుగూ జల్లెడ పడుతూ మిలిటెంట్లను సజీవంగా బంధించడమో లేక అంతం చేయడమో జరుగుతుందని అంటున్నారు. ఉత్తర గాజా ఇప్పుడు 'యుద్ధభూమి' కాబట్టి, అక్కడ ప్రజలెవరూ ఉండొద్దని సూచించారు.

యుద్ధం ముగిశాక తిరిగి రావొచ్చు

ఉత్తర గాజాపై హమాస్‌కు గట్టి పట్టుంది. అగ్ర నాయకులంతా అక్కడే మకాం వేశారు. అందుకే తొలి టార్గెట్‌గా అదే ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు తెలుస్తోంది. సాధారణ ప్రజలను దక్షిణ గాజాకు పంపించి, ఉత్తర గాజాలో మిలిటెంట్ల ఏరివేత ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టనున్నారు. హమాస్ స్థావరాలను, సైనిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేయడమే లక్ష్యమని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సామాన్య ప్రజలకు నష్టం కలిగించే ఉద్దేశం లేదని, యుద్ధం ముగిసిన తర్వాత వారంతా తిరిగి రావొచ్చని సూచించింది. హమాస్ మిలిటెంట్లు జనావాస ప్రాంతాల్లో మకాం వేసి, కార్యకలాపాలు సాగిస్తున్నారు. సాధారణ ప్రజలను కవచంగా వాడుకుంటూ ఇజ్రాయెల్‌పై రాకెట్లు ప్రయోగిస్తున్నారు. ప్రజలను అక్కడి తరలిస్తే మిలిటెంట్ల ముసుగు తొలగిపోతుందని ఇజ్రాయెల్ చెబుతోంది. ఉత్తర గాజాలో లక్షల మంది పాలస్తీనియన్లను నివాసం ఉంటున్నారు. కీలకమైన గాజా సిటీ ఇక్కడే ఉంది. వెంటనే వెళ్లిపోవాలంటూ ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించడంతో పాలస్తీనియన్లు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆహారం, నీరు, విద్యుత్ వంటి సదుపాయాల గురించి మర్చిపోయామని, ప్రాణాలు కాపాడుకుంటే చాలని భావిస్తున్నామని పాలస్తీనా రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధి నెబాల్ ఫర్సాఖ్ వ్యాఖ్యానించారు.

ఖాళీ చేయించే ఆలోచన మానుకోండి: ఐరాస

ఉత్తర గాజాను ఖాళీ చేయాలంటూ ఇజ్రాయెల్ సైన్యం జారీ చేసిన ఉత్తర్వులపై ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేసింది. లక్షలాది మందిని బలవంతంగా తరలించడం మానవ విపత్తు అవుతుందని పేర్కొంది. సామూహికంగా జనమంతా ఒకేసారి తరలివెళ్లడం సంక్షోభానికి దారితీస్తుందని స్పష్టం చేసింది. జనాన్ని ఖాళీ చేయించే ఆలోచన మానుకోవాలని ఐక్యరాజ్యసమితి ప్రతినిధి స్టెఫానీ డుజారిక్ ఇజ్రాయెల్‌కు సూచించారు. మరోవైపు హమాస్ సైతం స్పందించింది. ఉత్తర గాజా నుంచి జనాన్ని తరలించడం వెనుక కుట్రదాగి ఉందని ఆరోపించింది. ప్రజలెవరూ ఎక్కడికీ వెళ్లొద్దని, ఇళ్లల్లోనే ఉండాలని విజ్ఞప్తి చేసింది. ఇజ్రాయెల్ సాగిస్తున్న 'మానసిక యుద్ధాన్ని' పట్టించుకోవద్దని సూచించింది. వేలాది మంది క్షతగాత్రులు ఇప్పటికే ఆసుపత్రుల్లో ఉన్నారని, వారిని తరలించడం సాధ్యం కాదని గాజా ఆరోగ్య శాఖ తేల్చిచెప్పింది. ఉత్తర గాజాలో పాఠశాల్లో ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి శిబిరాల్లో లక్ష మందికిపైగా ఆశ్రయం పొందుతున్నారు. వారిని దక్షిణ గాజాకు తరలించలేమని ఐక్యరాజ్యసమితి స్పష్టం చేసింది.



గాజా స్ట్రిప్ సరిహద్దుల దిశగా వెళ్తున్న ఇజ్రాయెల్ ట్యాంకులు

మధ్యప్రాచ్యంలో నిరసనలు

గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను ఖండిస్తూ మధ్యప్రాచ్యంలో ముస్లింలు శుక్రవారం ప్రార్థనల అనంతరం నిరసన ప్రదర్శనలు చేపట్టారు. జోర్డాన్, యెమెన్‌లో ప్రదర్శనలు జరిగాయి. జెరూసలేం ఓల్డ్ సిటీలోనూ నిరసనలు వెల్లువెత్తాయి. జెరూసలేంలోని అల్–అక్సా మసీదులో ప్రార్థనలు చేసుకునేందుకు 50 ఏళ్ల వయసు దాటినవారిని మాత్రమే ఇజ్రాయెల్ పోలీసులు అనుమతించారు. మసీదు బయట పెద్ద సంఖ్యలో గుమికూడిన పాలస్తీనియన్లపైకి భద్రతా బలగాలు టియర్ గ్యాస్ ప్రయోగించాయి. లాఠీచార్జి జరిపాయి. ఈ ఘటనలో కనీసం ఆరుగురు గాయపడ్డారు. లెబనాన్ రాజధాని బీరూట్‌లో హెజ్బొల్లా మద్దతుదారులు ర్యాలీ చేపట్టారు. ఇజ్రాయెల్ నశించాలంటూ నినాదాలు చేశారు. ఇరాన్ మద్దతున్న హెజ్బొల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై హమాస్‌తోపాటు దాడులు జరిపారు. మధ్యధరా సముద్ర జలాల్లోని అమెరికా, బ్రిటిష్ యుద్ధ నౌకలపై కన్నేసి ఉంచుతామని హెజ్బొల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ నయీమ్ కాశీం హెచ్చరించారు. తాము పూర్తి సన్నద్ధతతో ఉన్నామని, సరైన సమయంలో రంగంలోకి దిగుతామని తెలిపారు. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇరాన్, పాకిస్తాన్‌లో హమాస్‌కు మద్దతుగా జనం ర్యాలీలు నిర్వహించారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 13 మంది బందీలు మృతి!

ఇజ్రాయెల్–హమాస్ మధ్య శుక్రవారం కూడా పరస్పరం దాడులు జరిగాయి. ఏడు రోజులుగా కొనసాగుతున్న ఈ యుద్ధంలో మృతుల సంఖ్య చేరుకుంది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,300 మందికిపైగా చనిపోయారు. వీరిలో 247 మంది సైనికులు ఉన్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో 1,530 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్ చేతిలో బందీలుగా ఉన్న 150 మంది పరిస్థితి ఏమిటన్నది తెలియరావడం లేదు. గత 24 గంటల్లో ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో బందీల్లో 13 మంది మృతిచెందారని హమాస్ శుక్రవారం ప్రకటించింది. మృతుల్లో విదేశీయులు కూడా ఉన్నారని స్పష్టంచేసింది. అయితే, వారు ఏ దేశానికి చెందినవారన్న సంగతి బయటపెట్టలేదు. వైమానిక దాడుల్లో 13 మంది బందీలు చనిపోయారంటూ హమాస్ చేసిన ప్రకటనను ఇజ్రాయెల్ సైనిక ప్రతినిధి డేనియల్ హగారీ ఖండించారు. తమకు స్పష్టమైన సమాచారం ఉందని, ఎవరూ మృతి చెందలేదని అన్నారు.

ఇజ్రాయెల్‌కు అమెరికా రక్షణ మంత్రి


అమెరికా రక్షణ శాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ శుక్రవారం ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్‌కు అండగా నిలుస్తామని అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇజ్రాయెల్‌లో అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ పర్యటించిన మరుసటి రోజే లాయిన్ ఆస్టిన్ సైతం రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆస్టిన్ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గల్లాంట్‌తోనూ భేటీ అయ్యారు. హమాస్‌పై యుద్ధానికి అమెరికా అందించనున్న సైనిక సాయంపై ఆయన చర్చించినట్లు సమాచారం.

అమేయ సైనిక శక్తి

అతి శక్తిమంతమైన సైన్యం ఇజ్రాయెల్ సొంతం | **అమెరికా నుంచి ఏటా 3 బిలియన్ డాలర్ల సైనిక సాయం**

అతి శక్తిమంతమైన ఆయుధాలు. అంతకు మించిన నిఘా సంపత్తి. అవడానికి చిన్న దేశమే అయినా సైనిక సంపత్తిలో మాత్రం ఇజ్రాయెల్ అక్షరాలా అమేయ శక్తే. హమాస్ పని పట్టేందుకు గాజా స్ట్రిప్ వద్దే ప్రస్తుతం ఏకంగా 3 లక్షల మంది సైనికులను మోహరించింది! గాజాపై భూతల దాడికి ఇజ్రాయెల్ సన్నద్ధమవుతోందనేందుకు ఇది కచ్చితమైన సంకేతమేనని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రధానంగా అమెరికా నుంచి అన్నివిధాలా అందుతున్న సాయంతో ఇజ్రాయెల్ సైనికంగా తేరిపార చూడలేనంతగా బలోపేతమైంది. మధ్య ప్రాచ్యంలో తన వ్యూహాత్మక ప్రయోజనాలను కాపాడుకునేందుకు ఆ దేశం పూర్తిగా సహకరిస్తుందని అమెరికా భావించడమే ఇందుకు కారణం...

సైనిక శక్తియుక్తులను ఎప్పటికప్పుడు పెంచుకునేందుకు, నిరంతరం అప్రమత్తంగా ఉండేందుకు ఇజ్రాయెల్ అత్యంత ప్రాధాన్యమిస్తుంది. ఆ దేశంలో 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ విధిగా సైన్యంలో చేరాల్సిందే. పురుషులు కనీసం 32 నెలల పాటు, మహిళలు రెండేళ్ల పాటు సైన్యంలో పని చేయాలి. ఇవిగాక అణు సామర్థ్యం కూడా ఇజ్రాయెల్ సొంతమని చెబుతారు. అణు వార్ హెడ్లను మోసుకెళ్లగల జెరిషో మిసైళ్లు, విమానాలు ఆ దేశం వద్ద ఉన్నాయి.



అతి పెద్ద ఆయుధ ఎగుమతిదారు

తొలినాళ్లలో సైనిక అవసరాలకు ప్రధానంగా దిగుమతుల మీదే ఆధారపడ్డ ఇజ్రాయెల్, చూస్తుండగానే సంపన్న దేశాలకు కూడా అత్యాధునిక ఆయుధాలు, ఆయుధ, నిఘా వ్యవస్థలు తదితరాలను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగింది!

- 2018–22 మధ్య కనీసం 35 దేశాలు ఇజ్రాయెల్ నుంచి 320 కోట్ల డాలర్ల పై చిలుకు విలువైన ఆయుధాలను దిగుమతి చేసుకున్నాయి.
- వీటిలో ఏకంగా మూడో వంతు, అంటే 120 కోట్ల డాలర్ల మేరకు ఆయుధాలను భారతే దిగుమతి చేసుకుంది.
- ఆ ఐదేళ్ల కాలంలో ఇజ్రాయెల్ ఆయుధ దిగుమతులు 270 కోట్ల డాలర్లకు చేరాయి. ఇవన్నీ కేవలం అమెరికా, జర్మనీ నుంచే కావడం విశేషం! అందులోనూ 210 కోట్ల డాలర్ల దిగుమతులు ఒక్క అమెరికా నుంచే జరిగాయి!

ఇంజనీరింగ్ అద్భుతం.. ఐరన్‌డోమ్

ఐరన్ డోమ్. ఇజ్రాయెల్ ఏళ్ల తరబడి శ్రమించి రూపొందించిన మొబైల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ. స్వల్పశ్రేణి రాకెట్లను రాడార్ టెక్నాలజీ సాయంతో అడ్డగించి తుత్తునియలు చేయగల సామర్థ్యం దీని సొంతం...

- హెజ్బొల్లా తొలిసారి ఇజ్రాయెల్‌పై ఏకకాలంలో వేలకొద్దీ రాకెట్లతో దాడి చేసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని 2006లో ఐరన్ డోమ్ నిర్మాణానికి ఆ దేశం తెర తీసింది.
- ఇది 2011లో వాడకంలోకి వచ్చింది.
- 2021 మొత్తంలో హమాస్, ఇతర పాలస్తీనా మిలిటెంట్ గ్రూపులు ప్రయోగించిన రాకెట్లలో 90 శాతానికి పైగా ఐరన్‌డోమ్ నిర్వీర్యం చేసి సత్తా చాటింది.
- డోమ్ నిర్మాణానికి అమెరికా ఎంతగానో సాయం చేసింది.
- 1946–2023 మధ్య ఏకంగా 12,400 కోట్ల డాలర్ల విలువైన సైనిక, రక్షణపరమైన సాయాన్ని అమెరికా నుంచి ఇజ్రాయెల్ అందుకుంది!!
- అమెరికా తన 2022 బడ్జెట్‌లో కేవలం ఇజ్రాయెల్‌కు మిసైల్ డిఫెన్స్ వ్యవస్థ నిమిత్తమే ఏకంగా 150 కోట్ల డాలర్లు కేటాయించింది! – పదేళ్లలో ఇజ్రాయెల్‌కు ఏకంగా 3,800 కోట్ల డాలర్ల మేరకు సైనికపరంగా నిధులు అందించేందుకు 2016లో అమెరికా ఒప్పందం కుదుర్చుకుంది!
- పదేళ్లలో ఇజ్రాయెల్‌కు ఏకంగా 3,800 కోట్ల డాలర్ల మేరకు సైనికపరంగా నిధులు అందించేందుకు 2016లో అమెరికా ఒప్పందం కుదుర్చుకుంది!

రక్షణపై భారీ వ్యయం

చుట్టూ శత్రు సమూహమే ఉన్న నేపథ్యంలో రక్షణపై ఇజ్రాయెల్ భారీగా ఖర్చు చేస్తుంది. 2022లో సైనిక అవసరాలకు ఏకంగా 2,340 కోట్ల డాలర్లు వెచ్చించింది.

- దేశ జనాభాపరంగా చూసుకుంటే ఇజ్రాయెల్ తలసరి సైనిక వ్యయం ఏకంగా 2,535 డాలర్లు. ఖతర్ తర్వాత ప్రపంచంలో రెండో స్థానంలో ఉంది!

– సాక్షి, నేషనల్ డెస్క్

212 మంది భారతీయుల తరలింపు

ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీ చేరుకున్న మొదటి విమానం

న్యూఢిల్లీ: హమాస్ మిలిటెంట్ల దాడులతో రణరంగంగా మారిన ఇజ్రాయెల్ నుంచి భారతీయుల తరలింపు కొనసాగుతోంది. దాదాపు 212 మందితో టెల్ అవివ్ నుంచి బయలుదేరిన మొదటి విమానం శుక్రవారం ఢిల్లీకి చేరుకుంది. వీరిలో చాలామంది విద్యార్థులు, ఉద్యోగులు ఉన్నారు. విమానంలో వచ్చిన భారతీయులకు ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వారికి స్వాగతం పలికారు. కరచాలనం చేశారు. ఇజ్రాయెల్‌లో తమకు ఎదురైన భయానక అనుభవాలను భారతీయులు పంచుకున్నారు. సైరన్ల మోతతో నిద్రలేచేవాళ్లమని, ఎప్పుడేం జరుగుతుందో తెలియక ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటూ గడిపామని, షెల్టర్లలో తలదాచుకున్నామని శశ్వంత్ సింగ్ అనే వ్యక్తి చెప్పాడు. ఆయన తన భార్యతో కలిసి ఢిల్లీకి చేరుకున్నాడు. తమను క్షేమంగా స్వదేశానికి చేర్చిన భారత ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేశాడు. ఇజ్రాయెల్ నుంచి భారతీయులను వెనక్కి తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ అజయ్' ప్రారంభించింది.



ఆపరేషన్ అజయ్‌లో భాగంగా ఇజ్రాయెల్ నుంచి ఢిల్లీకి చేరుకున్న భారతీయులు

ఇజ్రాయెల్‌లో ప్రస్తుతం 18,000 మంది భారతీయులు ఉన్నట్లు అంచనా. వెస్ట్‌బ్యాంకు, గాజాలోనూ కొందరు భారతీయులు నివసిస్తున్నారు. 'ఆపరేషన్ అజయ్'లో భాగంగా రెండో విమానం శుక్రవారం సాయంత్రం టెల్ అవివ్ నుంచి బయలుదేరింది. శనివారం భారత్‌కు చేరుకోనుంది.

కల్లోలాలు మంచివి కావు

- ఉగ్రవాదమూ అంతే: మోదీ
- ఎవరికీ మేలు చేయవని వ్యాఖ్య
- జీ 20 పార్లమెంటరీ స్పీకర్ల సదస్సులో ప్రసంగం



న్యూఢిల్లీ: ఘర్షణలు, కల్లోలాలు ఏ పక్షానికీ మంచి చేయబోవని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యలకు విచ్ఛిన్న ప్రపంచం పరిష్కారాలు చూపజాలదన్నారు. ఇది శాంతి, సౌభ్రాతృత్వాలు నెలకొనాల్సిన సమయమని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరు నానాటికీ తీవ్రతరమవుతున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. శుక్రవారం ఇక్కడ మొదలైన జీ20 పార్లమెంటరీ స్పీకర్ల 9వ సదస్సు ప్రారంభ సెషన్‌ను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. ''ప్రపంచంలో పలు చోట్ల ప్రస్తుతం ఏం జరుగుతోందో మనందరికీ తెలుసు. కలసికట్టుగా ముందుకు సాగాల్సిన సమయమిది'' అని పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ పోరుకు తక్షణం తెరపడాల్సిన అవసరం చాలా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పరస్పర విశ్వాసంతో మానవ విలువలకు పెద్ద పీట వేయడమే ఇందుకు మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఉగ్రవాదంపై ఉక్కుపాదమే మార్గం

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఉగ్రవాద భూతంపై అంతర్జాతీయ సమాజం ఉక్కుపాదం మోపడమే ఏకైక మార్గమని మోదీ అభిప్రాయపడ్డారు. ''భారత్ దశాబ్దాలుగా సీమాంతర ఉగ్రవాదాన్ని ఎదుర్కొంటోంది. మా దేశంలో వేలాదిగా అమాయకులను బలి తీసుకుంది. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సరే మానవత్వానికి మాయని మచ్చ' అని పునరుద్ఘాటించారు. ఇంత జరిగినా ఉగ్రవాదాన్ని నిర్వచించే అంశం మీద కూడా ఇప్పటికీ అంతర్జాతీయ సమాజం ఏకాభిప్రాయానికి రాలేకపోవడం శోచనీయమన్నారు.

మహిళా భాగస్వామ్యానికి ప్రోత్సాహం

భారత్‌లో ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు మోదీ తెలిపారు. స్థానిక స్వపరిపాలన సంస్థల్లో సగం మేరకు వాళ్లే ఉన్నట్టు పార్లమెంటుల స్పీకర్లకు వివరించారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవలే పార్లమెంటులో చట్టం కూడా చేసినట్టు చెప్పారు. 'నేడు భారత్ ప్రతి రంగంలోనూ మహిళల భాగస్వామ్యంతో కళకళలాడుతోంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో మహిళల చురుకైన పాత్ర దేశ ప్రగతికి చాలా కీలకం' అని అన్నారు. భారత్‌లో 28 భాషల్లో ఏకంగా 900కు పైగా టీవీ చానళ్లు, దాదాపు 200 భాషల్లో 33 వేలకు పైగా వార్తా పత్రికలు ఉన్నాయని వారికి వివరించారు. ప్రపంచమంతటా దేశాల నాయకత్వ స్థానంలో మహిళలు ఎక్కువగా ఉంటే బహుశా ఇన్ని యుద్ధాలు జరిగేవి కాదని ఇంటర్ పార్లమెంటరీ యూనియన్ ప్రెసిడెంట్ దుతర్తే పచెకో అభిప్రాయపడ్డారు.

మా ఆదేశాలే అపహాస్యమా?

- మహారాష్ట్ర స్పీకర్‌పై సుప్రీం ఆగ్రహం
- ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై నిర్ణయం ఇంకెప్పుడు?
- అసెంబ్లీ ఎన్నికల దాకా కాలయాపన చేయదలచారా?
- తీవ్రస్థాయిలో మండిపడ్డ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్, వారి వర్గం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోవడంలో అసెంబ్లీ స్పీకర్ చేస్తున్న జాప్యంపై సుప్రీంకోర్టు మండిపడింది. దీనిపై నిర్ణయాన్ని ఆయన నిరవధికంగా వాయిదా వేస్తూ పోజాలరని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ స్పష్టం చేశారు. ''స్పీకర్ కాస్త విచక్షణతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారని మేం భావించాం. నిర్దిష్ట కాలావధిలోగా ఈ అంశాన్ని పరిష్కరించాల్సిందిగా గత విచారణ సమయంలోనే ఆయనకు మేం స్పష్టంగా నిర్దేశించాం. ఇందుకు కాలావధి కూడా పెట్టుకోవాల్సిందిగా సూచించాం. ఆయన దీన్ని సీరియస్‌గా తీసుకుంటున్నట్టు కన్పించాలి. కానీ ఈ అంశంపై అసలు విచారణే జరపడం లేదు'' అంటూ స్పీకర్ రాహుల్ నర్వేకర్‌కు తలంటిపోశారు. ''గత జూన్ నుంచీ ఈ విషయం అంగుళం కూడా ముందుకు కదలడం లేదు. మేమంతా గమనిస్తూనే ఉన్నాం. అసలు స్పీకర్ ఏమనుకుంటున్నారు? మా ఆదేశాలనే అపహాస్యం చేస్తారా? ఇదేమైనా ఆషామాషీ విషయమని అనుకుంటున్నారా?'' అంటూ ఆగ్రహించారు. ''ఈ విషయంలో స్పీకర్‌కు కచ్చితంగా 'సలహా' అవసరం. వెంటనే ఎవరైనా ఆ పని చేయడం మేలు'' అని స్పీకర్ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సీజేఐ సూచించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోపు అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోకపోతే ఈ మొత్తం ప్రక్రియకు అర్థమే లేకుండా పోతుందన్నారు. ఈ అంశాన్ని ఎప్పట్లోగా తేలుస్తారో స్పష్టంగా పేర్కొంటూ మంగళవారం నాటికి తమకు టైమ్‌లైన్‌ను సమర్పించాలని ఆదేశించారు. లేదంటే ఈ విషయమై తామే నేరుగా ఆదేశాలిస్తామని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీకి మరో ఏడాదిలో ఎన్నికలు జరగనున్నాయి.

స్పీకర్‌ను బాధ్యున్ని చేయాల్సి వస్తుంది!

మహారాష్ట్రలో పలువురు ఎమ్మెల్యేల శాసనసభ్యత్వాలు రద్దు చేయాలంటూ శివసేన (ఉద్ధవ్ వర్గం) నేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ దాఖలు చేసిన పిటిషన్లపై ధర్మాసనం ముందు శుక్రవారం విచారణ కొనసాగింది. ఠాక్రే వర్గం తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు కొనసాగించారు. దీనిపై జూలై 14న స్పీకర్‌కు ధర్మాసనం నోటీసులు జారీ చేసినా ఇప్పటికీ ఏమీ జరగలేదని సీజేఐ దృష్టికి తెచ్చారు. దాంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎదుటి పక్షం వారి వాదనలను పరిగణనలోకి తీసుకోవడం, ఇందులో పలు అంశాలను స్పీకర్ ముందుగా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందన్న సొలిసిటర్ జనరల్ మెహతా వివరణతో సంతృప్తి చెందలేదు. ''ఈ విషయమై మేం జూలై 14న స్పష్టమైన సూచనలు జారీ చేశాం. సెప్టెంబర్ 18న ఆదేశాలు కూడా వెలువరించాం. అయినా స్పీకర్ చేసిందేమీ లేదు. కనుక రెండు నెలల్లోగా దీనిపై ఆయన నిర్ణయం తీసుకోవాలని మేం ఆదేశించక తప్పడం లేదు'' అన్నారు. ''స్పీకర్ పదవికున్న హుందాతనం దృష్ట్యా తొలుత మేం టైంలైన్ విధించలేదు. కానీ ఆయన తన బాధ్యతలను నెరవేర్చకపోతే అందుకు బాధ్యున్ని చేయక తప్పదు'' అని అన్నారు.

ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డులు

నాన్–ఇమిగ్రేషన్ కేటగిరీల్లో పంపిణీ: అమెరికా

వాషింగ్టన్: అమెరికాలో నివసిస్తున్న విదేశీయులకు యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) తీపి కబురు అందించింది. గ్రీన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నవారితోపాటు కొన్ని నాన్–ఇమిగ్రేషన్ కేటగిరీల్లో ఉన్నవారికి ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ కార్డులు(ఈఏడీ) అందజేయనున్నట్లు ప్రకటించింది. ఈ కార్డులు ఐదేళ్లపాటు చెల్లుబాటు అవుతాయని వెల్లడించింది. ఈఏడీలతో అమెరికాలో వేలాది మంది భారతీయులకు లబ్ధి చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ కార్డులతో వారికి అక్కడ ఉద్యోగాలు చేసుకోవడానికి సులభంగా అనుమతి లభిస్తుందని పేర్కొంటున్నారు. అమెరికాలో 10.5 లక్షల మందికిపైగా భారతీయులు ఎంప్లాయ్‌మెంట్ ఆధారిత గ్రీన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. నిబంధనల ప్రకారం వీరందరికీ గ్రీన్‌కార్డులు రావాలంటే 50 ఏళ్లు పడుతుందని సమాచారం.

పిండం ఎదుగుదల ఎలా ఉంది?

వైద్య పరీక్షలు చేసి నివేదించాలని ఎయిమ్స్ మెడికల్ బోర్డుకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: వివాహిత 26 వారాల గర్భవిచ్ఛిత్తి కేసులో ఆమె గర్భంలో ఉన్న పిండం ఎదుగుదల ఎలా ఉందో నివేదిక ఇవ్వాలని సుప్రీం కోర్టు ఎయిమ్స్ వైద్యులను ఆదేశించింది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఆ మహిళ ప్రసవానంతర మానసిక సమస్యలకు చికిత్స తీసుకుంటోందని గర్భాన్ని మోయడానికి ఆమె సిద్ధంగా లేదంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనల్ని పరిగణనలోకి తీసుకుంది. మానసిక సమస్యలకు ఆ మహిళ తీసుకుంటున్న మందులు ఆమె గర్భంలో పెరుగుతున్న శిశువు ఆరోగ్యానికి ఏమైనా హాని చేస్తాయో పూర్తిగా పరీక్షలు చేసి వివరంగా కోర్టుకు నివేదించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్, జస్టిస్ జె.బి. పర్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఆ మహిళ శారీరక, మానసిక స్థితి ఎలా ఉందో పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. ''ఇప్పటికే ఇద్దరు పిల్లల తల్లయిన ఆ మహిళ ప్రసవానంతరం వచ్చే మానసిక సమస్యలతో బాధపడుతోందని పరీక్షల్లో తేలితే ప్రత్యామ్నాయంగా మరేవైనా మందులు ఇవ్వొచ్చా పరిశీలించాలి'' అని సుప్రీం బెంచ్ స్పష్టం చేసింది. ఎయిమ్స్ వైద్యులకి పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 16కి వాయిదా వేసింది.

కొలువుల కాలం

యూత్‌కిది ఉపాధి సీజన్

- సర్వేలు, ఎనాలసిస్ కోసం ఎంగేజ్
- కొత్త సాఫ్ట్‌వేర్‌ల జోడీతో స్వారీ
- ఎన్నికల వరకైనా.. మంచి ఆఫర్స్

వనం దుర్గాప్రసాద్

లింక్డ్ ఇన్... నౌకరీ డాట్ కామ్.. వంటి జాబ్ పోర్టల్స్‌లో మల్టీ నేషనల్ కంపెనీల ఆఫర్ల కోసం ఎదురుచూస్తున్న యూత్‌కు ఎన్నికల సీజన్ వరంలా మారింది. రాష్ట్రంలో మోగిన అసెంబ్లీ ఎన్నికల నగారా, మరొకొద్ది నెలల్లోనే పార్లమెంట్ ఎన్నికలు.. వరుసగా ఉండటంతో బంపర్ ఆఫర్లు వస్తున్నాయి. ఉద్యోగం తాత్కాలికమే అయినా మంచి వేతనం అంతకు మించిన అనుభవం లభించే వీలుంది. ఎలక్షన్ సర్వేల కోసం ఆయా సంస్థలు యువతీ యువకులను ఏరి కోరి ఎంపిక చేసుకుంటున్నాయి. ఆరు నెలల నుంచి ఈ తరహా ఉపాధి అవకాశాలు జోరందుకున్నాయి. చిన్నా చితకా కలిపి రాష్ట్రంలో వందకు పైగా సర్వే సంస్థలు ప్రస్తుతం ఎన్నికల సర్వేల్లో నిమగ్నమయ్యాయి. ఎలక్షన్ షెడ్యూల్ రావడంతో ఈ స్పీడ్ మరికొంచెం పెరిగింది. జనం నాడి తెలుసుకునేందుకు, ప్రజల మూడ్‌ను పట్టుకునేందుకు సర్వేక్షణం తోడ్పడుతుందని అన్ని పార్టీలూ, నేతలు నమ్ముతున్నారు. బహుళ జాతి కంపెనీలు ఆర్థిక అనిశ్చితితో కొట్టు మిట్టాడుతున్న తరుణంలో జాబ్ మార్కెట్‌కు ఎలక్షన్ సీజన్ కొంత ఆక్సిజన్ ఇచ్చిందని యువత అభిప్రాయపడుతున్నారు.

భారీ వేతనాలు...

సర్వే సంస్థలకు అభ్యర్థులు, పార్టీలు ఇచ్చే మొత్తాన్ని బట్టి ఉద్యోగుల వేతనాలుంటాయి. పలు సర్వే సంస్థల నుంచి అందిన సమాచారం ప్రకారం ఒక్కో ఉద్యోగికి రోజుకు రూ. 3 నుంచి 5 వేల వరకూ చెల్లిస్తున్నారు. కొన్ని సర్వే సంస్థలు స్మార్ట్ సర్వేలూ చేస్తున్నాయి. అభ్యర్థి నియోజకవర్గంలో ఉండే ఓటర్ల సోషల్ మీడియా ఫాలో అప్‌ను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇతర సామాజిక మాధ్యమాల్లో అతను చేసే పోస్టింగులను విశ్లేషించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లను సర్వే సంస్థలు దిగుమతి చేసుకున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్‌లో అనుభవం ఉన్న యువతను ఈ విభాగాల్లో నియమిస్తున్నారు. వీరికి ఎన్నికల సీజన్ వరకూ ఏకమొత్తంగా వేతనాలుంటాయని సర్వే సంస్థల నిర్వాహకులు చెబుతున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను డేటా ఎనాలసిస్‌లో అతి తక్కువ సమయంలో పూర్తి చేయగల నైపుణ్యం ఉన్న యువతకూ మంచి గుర్తింపు ఇస్తున్నారు. భారీగానే డబ్బు ఇస్తుండడంతో సర్వేలు చేయడానికి వచ్చే వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. అన్ని రకాల సర్వేలు చేయడానికి కూడా యువత ఆసక్తి చూపుతున్నారు.

పుష్కలంగా అనుభవం...

రాష్ట్రంలో 119 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఒక్కో నియోజకవర్గంలో సర్వే చేయడానికి కనీసం వెయ్యి మంది అవసరం అని సర్వే సంస్థలు చెబుతున్నాయి. పొలిటికల్ సైన్స్ నేపథ్యం ఉన్న పోస్టు–గ్రాడ్యుయేట్ అభ్యర్థులను నేరుగా ప్రజా క్షేత్రంలోకి పంపుతారు. ప్రజల రాజకీయ అభిప్రాయం, అభ్యర్థి నుంచి ప్రజలు ఏం కోరుతున్నారో ఈ బృందం సేకరిస్తుంది. ఆపై డేటా ఎనలిస్టులు కీలక పాత్ర పోషిస్తారు. టెక్నాలజీ నేపథ్యం ఉన్న యువతను ఈ కేటగిరీలో నియమిస్తున్నారు. వివిధ కేటగిరీల నుంచి వచ్చే పలు రకాల డేటాను అప్‌లోడ్ చేయడం, అవసరమైన ఫార్మాట్‌లోకి దీన్ని తేవడం వారి బాధ్యత. ఆ తర్వాత కేటగిరీలో ఎనలిస్టులుంటారు. ఆన్‌లైన్ నుంచి అందే డేటాను క్రోడీకరించి, ఇందులో అంశాల ద్వారా విశ్లేషణ చేయడం, కచ్చితమైన ప్రజాభిప్రాయ సేకరణ చేయడం వారి విధి. అభ్యర్థి వ్యక్తిగతంగానే కాదు... పార్టీలూ ఈ సర్వే సంస్థలకు ఆహ్వానం పలుకుతున్నాయి. దీంతో ఎన్నికల సీజన్‌లో కనీసం ఆరు నెలలు సర్వే సంస్థలకు పెద్ద ఎత్తున మానవ వనరులు అవసరం ఉంటుంది. ఇవి తమ వృత్తికి పదును పెట్టే అనుభవంగా కూడా యువత భావిస్తున్నారు.



విశ్లేషణలో మానవ వనరులే కీలకం

ప్రజల నాడి తెలుసుకునేందుకు రాజకీయ నేతలు ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నారు. ఎన్నికల రణరంగంలో ఈ సర్వేలే కీలకమని భావిస్తున్నారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేయాలంటే వేల సంఖ్యలో వివిధ రకాల విద్యావంతులు అవసరం. తాత్కాలిక ఉపాధే అయినా, వారికి మెరుగైన అనుభవం వస్తోంది. ఈ ఎన్నికల సీజన్‌లో దాదాపు లక్షకు పైగానే యువత ఎన్నికల సర్వేలో నిమగ్నమైనట్టు అంచనా.
–దేశినేని రాజ్‌కుమార్ (హెచ్ఎంఆర్ రీసెర్చ్)



మంచి ఉపాధి

సర్వే సంస్థలో పనిచేసేందుకు ఉత్సాహం చూపే యువతను గుర్తించి నెల రోజులు సాంకేతికంగా, ఫీల్డ్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. స్కిల్ వెలుగులోకి రావడానికి ఇది తోడ్పడుతుంది. ఈ తక్కువ సమయంలో లభించే వేతనం పోటీ పరీక్షలు, కొన్ని రోజులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉపయోగపడుతోంది.
– శైలజ (సర్వే సంస్థలో ఉద్యోగి)



మంచి అనుభవం

ప్రజాక్షేత్రంలో ఎన్నికల సర్వే చేపట్టడం ఓ మంచి అనుభవం. ఈ సమయంలో వేతనంతో పాటు ఫీల్డ్‌కు వెళ్లినప్పుడు ప్రత్యేకంగా టీఏ, డీఏ ఉంటాయి. ఉపాధి పరంగానూ మంచి అవకాశమే. యువత సర్వే చేయడానికి ముందుకొస్తున్నారు. ప్రజలు కోరుకునేదేంటో నేతల దృష్టికి తీసుకెళ్తున్న తృప్తి ఉంటోంది.
– లక్ష్మాగౌడ్ (ఎన్నికల సర్వేలో ఫీల్డ్ సిబ్బంది)

రింగ్ మాస్టర్



శివారు సీట్లపై కమలం నేతల కన్ను

- అసెంబ్లీ బరిలోకి ఆర్థికంగా బలంగా ఉన్న నేతలు
- హైదరాబాద్, రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న నియోజకవర్గాల టికెట్ల కోసం పోటీ
- ఒక్కొక్కరు రెండు, మూడుచోట్ల నుంచి దరఖాస్తుల సమర్పణ
- జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో మంచి ఫలితాలు రావడం, ఆయా జిల్లాల్లో పార్టీ బలపడిందనే భావనతో మొగ్గు

కె.రాహుల్

హైదరాబాద్‌తోపాటు నగరం చుట్టుపక్కల రింగ్‌రోడ్డు చుట్టూ ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల టికెట్ల కోసం బీజేపీలో తీవ్రమైన పోటీ నెలకొన్నట్టు పార్టీ వర్గాల సమాచారం. హైదరాబాద్ , ఉమ్మడి రంగారెడ్డి, మెదక్, నల్లగొండ మరికొన్ని ఇతర జిల్లాల్లోని నియోజకవర్గాల్లో పోటీపై పలువురు ముఖ్యనేతలు, మాజీ ఎంపీలు దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది. రాష్ట్ర రాజధానికి చుట్టుపక్కల రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు జోరుగా సాగడంతో పాటు ఆయా ప్రాంతాల్లో తమకున్న వ్యవసాయ భూములకు భారీ డిమాండ్ రావడంతో.. ఆర్థికంగా బలంగా ఉన్నవారంతా టికెట్ సాధనకు తమ వంతు ప్రయత్నాల్లో నిమగ్నమైనట్టు పార్టీ నేతలు చెబుతున్నారు. వీరంతా ఎన్నికల్లో పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేసేందుకు వెనుకాడే పరిస్థితి లేకపోవడంతో పార్టీ నాయకత్వంలో కూడా వీరిపట్ల కొంత సానుకూలత వ్యక్తమవుతున్నట్టు సమాచారం.

గత జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ బీజేపీ ఏకంగా 48 సీట్లు గెలుపొందింది. ఆ తర్వాత కూడా పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలం పెరిగిందని, మరీ ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల విజయావకాశాలు పుష్కలంగా ఉన్నాయనే అంచనాలతో పలువురు ముఖ్య నేతలు హైదరాబాద్, రంగారెడ్డి చుట్టుపక్కల నుంచి పోటీకి ఆసక్తి చూపుతున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల నుంచి పార్టీ నాయకత్వం

విజయావకాశాలు ఉన్నాయనే..

దరఖాస్తులను ఆహ్వానించడంతో...పలువురు నేతలు హైదరాబాద్ పరిసరాల్లో (హెచ్‌ఎండీఏ పరిధిలో) రెండు, మూడు స్థానాలపై ఆసక్తి చూపిస్తూ దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రాజీనామా చేసి మునుగోడు నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేసి బీఆర్‌ఎస్ చేతిలో ఓటమి చవిచూసిన కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి.. ప్రస్తుతం మునుగోడుకు బదులు ఎల్‌బీనగర్ నుంచి పోటీకి జాతీయ నాయకత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ సాధించినట్టు చెబుతున్నారు. బీజేపీలో చేరిన భువనగిరి మాజీ ఎంపీ డా. బూరనర్సయ్యగౌడ్ ఇబ్రహీంపట్నం నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలనే పట్టుదలతో ఉన్నారు. ఈ సీటు దక్కకపోతే ఇక లోక్‌సభ ఎన్నికలపైనే దృష్టి పెట్టాలనే ఆలోచనతో ఆయన ఉన్నట్టు తెలుస్తోంది. గోషామహల్ నుంచి పోటీకి (సస్పెన్షన్ ఎత్తేస్తే) ప్రస్తుత ఎమ్మెల్యే టి.రాజాసింగ్, మాజీ మంత్రి ఎం.ముఖేష్‌గౌడ్ కుమారుడు ఎం.విక్రమ్‌గౌడ్, షాద్‌నగర్ నుంచి జాతీయ కార్యవర్గసభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి /అందె బాబయ్య (ముదిరాజ్), భువనగిరి నుంచి బీజేపీ నేత గూడూరు నారాయణ్‌రెడ్డి/ శ్యాంసుందర్ రావు (వెలమ), మహేశ్వరం నుంచి అందెల శ్రీరాములు యాదవ్/ టి.వీరేందర్‌గౌడ్, కుత్బుల్లాపూర్ నుంచి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, శేరిలింగంపల్లి నుంచి యోగానంద్ (వైశ్య)/ రవికుమార్ యాదవ్, ఉప్పల్ నుంచి ఎన్‌వీఎస్‌ఎస్ ప్రభాకర్ /టి. వీరేందర్‌గౌడ్, మేడ్చల్ నుంచి విక్రమ్‌రెడ్డి /మోహన్‌రెడ్డి గట్టిగా పోటీపడుతున్నట్టు సమాచారం. ఇవి కాకుండా హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లోని మిగిలిన నియోజకవర్గాల్లో టికెట్ల కోసం ఒక్కోదానికి ఇద్దరు, ముగ్గురు నేతల మధ్య తీవ్ర పోటీ నెలకొందని, ఎవరికి వారు తమ ప్రయత్నాల్లో నిమగ్నమైనట్టు పార్టీలో చర్చ సాగుతోంది.


మీకు తెలుసా ?

→ 1952 ఎన్నికల సమయంలో తెలంగాణతో పాటు, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన కొన్ని జిల్లాలతో కలసి హైదరాబాద్ రాష్ట్రం ఉండేది. అప్పుడు ఈ రాష్ట్రానికి జరిగిన ఎన్నికలలో తెలంగాణ వరకు చూస్తే కాంగ్రెస్‌కు 38 సీట్లు, పీడీఎఫ్ 36, సోషలిస్ట్ పార్టీకి 11, షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్‌కు మూడు సీట్లు రాగా ఇండిపెండెంట్లు ఏడుగురు గెలిచారు. అప్పట్లో తెలంగాణలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉండేది. కాని ఆ పార్టీ వారంతా పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్ పేరుతో ఎన్నికలలో పోటీచేశారు. అప్పట్లో సోషలిస్టు పార్టీ కూడా కాస్త బలంగానే ఉండేది.



→ 1956లో ఆంధ్ర, తెలంగాణ విలీనం అయి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడినా, 1957లో మాత్రం తెలంగాణ భాగానికే ఎన్నికలు జరిగాయి. దానికి కారణం 1955లో ఆంధ్ర రాష్ట్రానికి మధ్యంతర ఎన్నికలు జరగడమే. ఆంధ్రలో ఎన్నికైన ఎమ్మెల్యేలకు 1962 వరకు పదవిలో ఉండే అవకాశాన్ని పార్లమెంటు కల్పించింది. తెలంగాణలో 1957లో రెగ్యులర్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలలో కాంగ్రెస్ 68, పీడీఎఫ్ 22, సోషలిస్టు 2, ప్రజాపార్టీ ఒకటి, ఎస్.సి.ఎఫ్ ఒకటి గెలుచుకోగా, ఇండిపెండెంట్లు పది మంది గెలిచారు.

తొలి ఎన్నికల్లోనే రెండు సభలకు ఎన్నిక



రావినారాయణ రెడ్డి

సాక్షి, యాదాద్రి: తెలంగాణ సాయుధ పోరాట సేనాని రావి నారాయణరెడ్డి 1952లో జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో పీడీఎఫ్ పార్టీ తరపున పోటీచేసి భువనగిరి ఎమ్మెల్యేగా, నల్లగొండ ఎంపీగా విజయం సాధించారు. పార్లమెంట్ సభ్యునిగా రావినారాయణరెడ్డి అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిచారు. భువనగిరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి ఎంపీగా కొనసాగారు. రావి నారాయణరెడ్డి స్వగ్రామం బొల్లేపల్లి.. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలో ఉంది.

గాసిప్ టైమ్

రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల తీరే వేరు. వారి రూటే సెపరేటు. అధికారంలోకి వస్తామన్న ధీమానో...కేంద్రంలో అధికారంలోకి వచ్చేది లేదనే బెంగనో కానీ, కాంగ్రెస్ ఎంపీలు, మాజీ ఎంపీలంతా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి తెగ ఉబలాటపడిపోతున్నారు. ఆఖరుకు కుమారుడి కంటే తనకే టికెట్ ముఖ్యమని, అన్ని కలిసి వస్తే మంత్రి పదవి దక్కుతుందని నగరానికి చెందిన ఓ మాజీ ఎంపీ భావిస్తూ, ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు ఎంపీలేమో

ధీమా.. బెంగా?

ఏకంగా సీఎం సీటునే ఆశిస్తున్నారు. బీజేపీకి పూర్తి భిన్నంగా కాంగ్రెస్ వైఖరి ఉందనే మాట వినిపిస్తోంది. కాంగ్రెస్‌లో అందరూ పెద్దనాయకులే.. అందరూ సీఎం పదవికి పోటీదారులే. అందుకే వారంతా ఎప్పుడో మరో ఐదారు నెలలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల కంటే కూడా గడప ముందున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకే సిద్ధమైపోతున్నారు. అన్ని బాగుండి అధికారంలోకి వస్తే... సరేసరి. ఒకవేళ ఓడిపోయినా.. తిరిగి ఎంపీగా పోటీ చేసే అవకాశం ఎలాగూ ఉంటుందన్న ధీమా కాంగ్రెస్ నాయకుల్లో ఎక్కువ అన్న ప్రచారమూ ఉంది. ఇప్పుడున్న ముగ్గురు ఎంపీల్లో ఇద్దరు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినా.. తిరిగి పార్లమెంట్‌కు ఎన్నికై కాంగ్రెస్ వాణిని, రాష్ట్ర సమస్యలను గట్టిగానే వినిపించారన్న పేరు ఉంది.

డిజిటల్ లావాదేవీలపై నిఘా

- డిజిటల్ నగదు బదిలీలపై పర్యవేక్షణకు ప్రత్యేక విభాగం ఏర్పాటుకు నిర్ణయం

ఆర్‌బీఐ, బ్యాంకర్లతో పోలీసు శాఖ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఎన్నికల సమయంలో నగదు సరఫరా, పంపిణీపై రాష్ట్ర పోలీసు శాఖ అప్రమత్తమైంది. ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో అక్రమ నగదు రవాణా, పంపిణీపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ వేదికగా జరిపే డిజిటల్ నగదు బదిలీలపై కూడా పటిష్ట నిఘా ఉంచాలని నిర్ణయించారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ), బ్యాంకర్లతో కలిసి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన గంటల వ్యవధిలోనే రూ.కోట్లలో నగదు, కిలోల కొద్దీ బంగారం, వెండిని పోలీసులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆన్‌లైన్, యూపీఐ, ఇతర డిజిటల్ లావాదేవీలను ట్రాక్ చేయడానికి బ్యాంకర్లు ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేయాలని బ్యాంకర్ల సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు సూచించారు. అనుమానాస్పద బల్క్ లావాదేవీలపై పర్యవేక్షించేందుకు బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలని, ఒక బ్యాంకు ఖాతా నుంచి వివిధ అకౌంట్లకు లావాదేవీలు జరిపితే, వాటిని గుర్తించి వెంటనే పోలీసు శాఖను అప్రమత్తం చేయాలని బ్యాంకర్లకు సూచించారు. రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లినా, యూపీఐ ద్వారా ఎక్కువ మందికి డబ్బు పంపితే సంబంధిత పత్రాలు చూపించాల్సి ఉంటుందని పోలీసులు సూచించారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ ఆన్‌లైన్ లావాదేవీల వివరాలు బ్యాంకుల నుంచి సేకరిస్తారు. ఆస్పత్రులు, భూక్రయవిక్రయాలు, వివాహాలకు సంబంధించి నగదు, బంగారం తీసుకెళితే సంబంధిత ఆధారాలు కచ్చితంగా చూపించాల్సి ఉంటుంది.



రెంటికీ చెడ్డా... ఇంటి పోరు..!

- రాష్ట్రం ఇచ్చిన పార్టీగా రెండుసార్లు లభించని ప్రజల ఆశీర్వాదం
- 2014లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత, 2018లో చంద్రబాబు ఫ్యాక్టర్‌తో ఓటమి
- పదేళ్లుగా అధికారంలో లేక రాష్ట్ర వ్యాప్తంగా నాయకత్వ లేమి
- రేవంత్‌కు బాధ్యతలతో మారిన సమీకరణలు...
- గతం కంటే ముదిరిన వర్గపోరు
- పటిష్ట కేడరే శ్రీరామరక్ష... ప్రభుత్వ వ్యతిరేకత కలిసొచ్చే అవకాశం

మేకల కళ్యాణ్ చక్రవర్తి

2014, 2018 ఎన్నికల్లో పరాభవం తర్వాత మూడోసారైనా ప్రజలు తమకు పట్టం కట్టబోతారా అనే కోటి ఆశలతో కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎన్నికలకు సిద్ధమవుతోంది. రాష్ట్రం ఇచ్చిన పార్టీగా రెండు ఎన్నికల్లోనూ ఓటమి పాలైనా త్వరలో జరిగే ఎన్నికల కురుక్షేత్రంలో విజయ తీరాలకు చేరడం ద్వారా రాష్ట్రం ఏర్పాటు చేసిన సోనియాగాంధీకి బహుమానంగా అధికారాన్ని అప్పగించాలని కలలు కంటోంది. పదేళ్లుగా అధికారానికి దూరం కావడం ద్వారా ఏర్పడిన నైరాశ్యానికి తోడు పార్టీలో ముదిరిన అంతర్గత విభేదాలు వెరసి మళ్లీ పాత ఫలితాలే పునరావృతమవుతాయేమో అనే సందేహాలు లేకపోలేదు. కానీ నేతలు వెళ్లినా పార్టీని విడిచి వెళ్లని కేడర్ భుజాలపై ఎక్కి ప్రభుత్వ వ్యతిరేకత అనే తూటాలను పేల్చుకుంటూ పవర్ 'అస్త్రాన్ని' దక్కించుకునేందుకు పాట్లు పడుతోంది కాంగ్రెస్ పార్టీ.

ముంచిన 'మహా కూటమి'...

రాష్ట్రం ఇచ్చిన పార్టీగా ఎదుర్కొన్న తొలి ఎన్నికల్లో ఓటమిపాలైన కాంగ్రెస్ రెండోసారి కూడా వ్యూహం లేక చతికిలబడిపోయింది. కాంగ్రెస్ అంచనాలకు అందకుండా ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్లడం ద్వారా కేసీఆర్ ఆ పార్టీని చావుదెబ్బ కొట్టారు. ఇతర పార్టీలతో పొత్తులు 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కొంప ముంచాయి. టీడీపీ పొత్తుతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కుదేలైంది. చంద్రబాబు ఎంట్రీ వరకు ఓటర్లలో ఎంతోకొంత సానుకూలత వ్యక్తమైనా, 'బాబుగోరు' ప్రచారం ప్రారంభించిన నాటి నుంచే కాంగ్రెస్ గెలుపు అవకాశాలు పతనమయ్యాయి. సీపీఐ, టీజేఎస్ లాంటి పార్టీల తోడ్పాటు ఏ మాత్రం లభించకపోవడంతో కేవలం 19 స్థానాల్లో గెలుపొంది మరోమారు విజయానికి ఆమడ దూరంలో నిలిచింది.

'చేతి'లో సత్తువ లేకుండానే...

వరుసగా రెండు ఎన్నికల్లో ఓటమితో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. పదేళ్ల అధికారంలో లేకపోవడంతో పార్టీ కేడర్ తీవ్ర నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయింది. చెప్పుకోదగిన పార్టీ నేతలు బీఆర్‌ఎస్‌లో చేరిపోయారు. దీంతో హస్తం పార్టీ చేతిలో సత్తువ లేదనే స్థాయికి వెళ్లిపోయింది. అయితే, నాయకులు, ఎమ్మెల్యేలు పార్టీలు వీడి వెళ్లినా కేడర్ మాత్రం మిగిలే ఉందని ఆ పార్టీ అంచనా వేస్తోంది. పార్టీ కేడరే శ్రీరామరక్షగా బీఆర్‌ఎస్ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకత గెలిపిస్తుందన్న ధీమాతో ఈసారి 2023లో ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ ఎదుర్కోబోతోంది.

పార్టీ లైన్

2014లో అలా...!

రాష్ట్ర ఏర్పాటు ముందు కాంగ్రెస్ పార్టీ చాలా హడావుడి చేసింది. పార్లమెంటులో బిల్లు ఆమోదం నుంచి రాష్ట్ర ఏర్పాటు తేదీ వరకు నానా హంగామా చేసినా ఆనాడు టీఆర్‌ఎస్ దూకుడు ముందు నిలవలేకపోయింది. కేసీఆర్ ఆర్భాటానికి తోడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పై వెల్లువెత్తిన వ్యతిరేకతతో 2014లో ఊహించని పరాభవాన్ని మూటగట్టుకుంది. రాష్ట్రంలో 21 సెంబ్లీ స్థానాల్లోనే గెలుపుతో సరిపెట్టుకుంది. కచ్చితంగా గెలుస్తామనే ధీమాతోనే ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఆ ఎన్నికల ఫలితాలు షాక్ ఇచ్చాయి. చాలా మంది కాంగ్రెస్ ప్రముఖులు కూడా ఓటమి పాలయ్యారు. అదే సమయంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మరింత కంగుతింది. రెండు ఎంపీ స్థానాలను మాత్రమే గెలుచుకోగలిగింది. ఇక, తెలంగాణ ఏర్పాటయిన తర్వాత మళ్లీ అసెంబ్లీ ఎన్నికలు జరిగేంతవరకు నిర్వహించిన దాదాపు అన్ని స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి చేదు ఫలితాలే వచ్చాయి.

గతంలో ఎన్నడూ లేని విధంగా...

ఇక ఇప్పుడు.. పార్టీ కేడర్ చెక్కు చెదరలేదని, కర్ణాటక రాష్ట్రంలో గెలుపుతో వచ్చిన కొత్త ఉత్సాహంతో బీజేపీని వెనక్కునెట్టి అధికారం దక్కించుకునే రేసులోకి కాంగ్రెస్ పార్టీ వచ్చిందనే చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. అయితే, ఆ పార్టీకి ఎప్పటిలాగే వర్గపోరు శాపంగా మారే అవకాశాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం పేరుతో కలహాలు, కీచులాటలకు కేరాఫ్ అడ్రస్‌గా గుర్తింపు పొందిన కాంగ్రెస్ పార్టీలో గతంలో ఎన్నడూ లేని విధంగా గొడవలు ముదిరి పాకాన పడ్డాయి. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డికి బాధ్యతలు అప్పగించిన తర్వాత సమీకరణలు ఒక్కసారిగా మారిపోయాయి. సీనియర్లు, జూనియర్లనే విభేదాలకు తోడు నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి, నేతల మధ్య తీవ్ర విభేదాలు వెరసి ఇప్పటివరకు టికెట్లను కూడా ప్రకటించలేని పరిస్థితి కాంగ్రె నెలకొంది. ఎట్టిపరిస్థితుల్లోనూ చెక్కు చెదరని కేడర్‌ను ముందు నడిపిస్తూ బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను సొమ్ము చేసుకుంటూ, ఆరు గ్యారంటీ పథకాలతో విజయానికి బాటలు వేసుకుని ఈసారైనా అధికార పీఠం ఎక్కాలనేది కాంగ్రెస్ లక్ష్యం.

ఓట్ దిస్ పాయింట్


ఆన్‌లైన్‌లోనూ నామినేషన్

ఈసారి కొత్తగా ఎన్నికల సంఘం అవకాశం

కరీంనగర్ అర్బన్: నామినేషన్‌కు సాంకేతికతను జోడించింది ఎన్నికల సంఘం. శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థులు ఇంట్లో నుంచే నామినేషన్ వేసేలా ఆన్‌లైన్‌లో వెసులుబాటు కల్పించింది. దీంతో అభ్యర్థులు స్వదేశం, విదేశం ఎక్కడి నుంచైనా నామినేషన్ దాఖలు



చేయొచ్చన్న మాట. suvidha.eci.gov.in యాప్ ద్వారా నామినేషన్ దాఖలు చేసే అవకాశం కల్పించారు. నిర్దిష్ట విధానంలో సాధారణ నామినేషన్ తరహాలోనే ఎన్నికల కమిషన్ సూచించిన పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంది. దరఖాస్తు ఫారంలో దశలవారీగా అభ్యర్థుల వివరాలు పొందుపరచాలి. వివరాలన్నింటినీ సమర్పించిన తరువాత నామినేషన్ దాఖలు చేసేందుకు ఉన్న నిర్ణీత సమయంలో స్లాట్‌లో సమయాలను బుక్ చేసుకోవాలి. రిటర్నింగ్ అధికారిని నేరుగా కలిసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వివరాలతో కూడిన పత్రాలు మూడుసెట్లు అందించాల్సి ఉంటుంది. నామినేషన్ చివరి రోజు లోపుగా ఆన్‌లైన్ సెట్లను తప్పనిసరిగా అందించాలి. రిటర్నింగ్ అధికారికి నేరుగా అందిస్తేనే నామినేషన్ దాఖలు చేసినట్లుగా భావిస్తారు. ఆ తరువాత నామినేషన్ల పరిశీలన, గుర్తుల కేటాయింపు వంటి విషయంలో నేరుగా అభ్యర్థులు లేక వారి తరపు ప్రతినిధులు హాజరు కావాల్సి ఉంటుంది.



విపక్షాల ప్రచారాస్త్రాలు

- తమ పార్టీ ప్రకటించిన ఆరు పథకాలు తమను గెలిపిస్తాయని కాంగ్రెస్ నేతలు ధీమాగా ఉన్నారు.
- ప్రజావ్యతిరేకత, పాలనపై ఉద్యోగుల్లో అసంతృప్తి, యువ ఓటర్లలో సానుకూలత తమకు కలిసి వస్తాయని బీజేపీ భావిస్తోంది.
- మైనార్టీ రుణాలు, బీసీబంధు కేటాయింపులో కొన్నిచోట్ల అర్హులకు చోటు దక్కకపోవడాన్ని విపక్షాలు ప్రచారాస్త్రాలుగా చేసుకునే అవకాశం ఉంది.

అధికార పార్టీ ఆయుధాలు..!

- సంక్షేమ పథకాలు, దళితబంధు, పైలట్ ప్రాజెక్టులు..
- ఉమ్మడి జిల్లాలో మెడికల్ కాలేజీల నిర్మాణం, సిరిసిల్లలో ఆక్వా హబ్, కరీంనగర్‌లో మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణం, కేబుల్ బ్రిడ్జి, కాళేశ్వరం ప్రాజెక్టు.
- కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్, స్మార్ట్‌సిటీ నిర్మాణం, కొండగట్టు, వేములవాడ మాస్టర్ ప్లాన్లు.

అసంతృప్తిపై వారు.. అభివృద్ధిపై వీరు..

ఉమ్మడి కరీంనగర్‌లో అధికార, విపక్షాల జోరు

13 అసెంబ్లీ స్థానాల్లో 11 మంది కారు పార్టీ అభ్యర్థులే

ఈసారీ సంక్షేమ పథకాలు తమను గెలిపిస్తాయని ధీమా

ప్రజా వ్యతిరేకతపై విపక్షాల గంపెడాశలు

భాషబోయిన అనిల్ కుమార్

గోదావరి నది ఒడ్డున సింగరేణి కార్మికక్షేత్రం, వేములవాడ, ధర్మపురి, కొండగట్టు వంటి ధార్మిక క్షేత్రాలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నిలయం. ఉద్యమాలకు, పోరాటాలకు పురిటిగడ్డగా ఉంటూనే సెంటిమెంటుకు ఆలవాలంగా, విలక్షణ తీర్పులకు వేదికగా ప్రసిద్ధికెక్కింది. ఉద్యమాల ఖిల్లా, మలిదశ తెలంగాణ ఉద్యమానికి కేంద్రమైన కరీంనగర్‌లో 2014 నుంచి నేటి వరకు ఇక్కడ బీఆర్‌ఎస్ హవా సాగుతోంది. అభ్యర్థుల ప్రకటనతో దాదాపుగా నెలరోజులు ముందుగానే అధికార బీఆర్‌ఎస్ పార్టీ నేతలంతా ప్రచారం ప్రారంభించారు. ఈసారి కూడా సంక్షేమ పథకాలు తమను గట్టెక్కిస్తాయని బీఆర్‌ఎస్ ధీమాగా ఉంటే, ప్రభుత్వ వ్యతిరేకత తమను విజయ తీరాలకు చేరుస్తుందని నమ్ముతున్న కాంగ్రెస్, బీజేపీలు ఈ మేరకు గెలుపు వ్యూహాలు రచిస్తుండటంతో ఉమ్మడి జిల్లాలో రాజకీయం ఆసక్తికరంగా మారింది.

తెలంగాణకు ముందు- తరువాత పరిస్థితులను చూపిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచార ప్రణాళికలను రచిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మునుపెన్నడూలేని భారీ నీటి ప్రాజెక్టు కాళేశ్వరం, అనుబంధ ప్రాజెక్టుల ద్వారా సాగులోకి వచ్చిన వేల ఎకరాలు, కరీంనగర్‌లో కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, జాతీయ రహదారులు, కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్, మెడికల్ కాలేజీల నిర్మాణం, దళితబంధు, రైతబంధు, రైతుబీమా, పింఛన్లు తదితర సంక్షేమ పథకాలు తమను ఉమ్మడి జిల్లాలో మరోసారి గట్టెక్కిస్తాయని ఆ పార్టీ నేతలు బలంగా విశ్వసిస్తున్నారు. 2014, 2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో 13 అసెంబ్లీ స్థానాలున్న కరీంనగర్ జిల్లా పాత్ర కీలకం. ప్రతిసారీ 12 స్థానాలు గెలుస్తుండగా..పార్టీని వీడిన ఈటల రాజేందర్ బీజేపీలో చేరి గెలవడంతో ఇక్కడ బలం 11 స్థానాలకు చేరింది. అయితే ఈసారి మొత్తం 13 సీట్లూ తన ఖాతాలో వేసుకోవాలని బీఆర్‌ఎస్ పథక రచన చేస్తోంది.

బీఆర్‌ఎస్.. అభివృద్ధి జపం!

కాంగ్రెస్, బీజేపీలు ఇంతవరకూ అభ్యర్థులను ప్రకటించలేదు. అయితే కాంగ్రెస్ ఇటీవల ప్రకటించిన ఆరు గ్యారంటీలను కొందరు నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. జగిత్యాల, మంథని, చొప్పదండి, వేములవాడ, ధర్మపురి, మానకొండూరు, పెద్దపల్లి స్థానాలు తమ ఖాతాలోకి వస్తాయని కాంగ్రెస్ పార్టీ ధీమాతో ఉంది. అయితే పార్టీలో అంతర్గత కలహాలు, ప్రతి స్థానానికీ పదుల సంఖ్యలో ఆశావహులు (అధికారికంగా 85 మంది) పోటీపడటం పార్టీని కలవరపాటుకు గురిచేస్తోంది. ఆయా స్థానాల్లో నేతలు ప్రజా ఆశీర్వాద యాత్రలతో ఇప్పటికే ప్రచారం ప్రారంభించారు. ఇక బీజేపీ విషయంలో సంజయ్, ఈటల రాజేందర్ మినహా మిగిలిన వారి విషయంలో స్పష్టత రాలేదు. వేములవాడ, జగిత్యాల, కోరుట్ల, మానకొండూరులకు అభ్యర్థులు దొరికినా ఇంకా ఖరారు కాలేదు.

కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులపై తకరారు..!

కారుకు స్పీడ్‌బ్రేకర్లు ఇవే..!

ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్‌కు బలమైన పునాదులు ఉన్నా.. కొన్ని విషయాలు పార్టీని కలవరపెడుతున్నాయి. పెద్దపల్లిలో పార్టీ రెబెల్ నల్ల మనోహర్‌రెడ్డి బరిలోకి దిగితే కారు ఓట్లు చీలే అవకాశముంది. రామగుండంలో రెబెల్ కందుల సంధ్యారాణి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ వ్యతిరేక వర్గం పార్టీకి ప్రతికూలంగా తయారయ్యారు. వేములవాడలో సిట్టింగ్ ఎమ్మెల్యే రమేశ్‌బాబు స్థానంలో చెలిమెడ లక్ష్మీ నరసింహారావుకు పార్టీ టికెట్ ఇచ్చింది. దీంతో రమేశ్ ఎంతమేరకు సహకరిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. కోరుట్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కుమారుడు సంజయ్‌కు పోటీగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ బరిలో దిగితే పోటీ నువ్వా నేనా అన్నట్లుగా ఉంటుంది. ఇక హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ ఓటమికి బీఆర్‌ఎస్ చెమటోడ్చాల్సి ఉంటుంది. మంథనిలో శ్రీధర్‌బాబును ఓడించడానికి కారు పార్టీ ప్రత్యేక వ్యూహం రూపొందించింది. ఎంపీ బండి సంజయ్ బలమైన నాయకుడు అయినప్పటికీ.. కరీంనగర్‌లో పోటీపై అనాసక్తిగా ఉన్నారని సమాచారం. ధర్మపురిలో అడ్లూరి లక్ష్మణ్‌కు సెంటిమెంట్ కలిసి వచ్చే అవకాశాలున్నాయి. చొప్పదండిలో సొంత పార్టీ నేతల అసంతృప్తి కలవరపెడుతోంది.

వేమన పద్యాలూ.. రాజకీయాలు!



షుగర్ & పెప్పర్
..:: యాసీన్

కొన్నిసార్లు ఈ ఎలక్షన్ల కోసమూ, రాజకీయ నాయకుల యవ్వారాలను లోకవిదితం చేయడం కోసమే వేమన కొన్ని పద్యాలు రాశాడా అనిపిస్తుంటుంది. ఉదాహరణకు 'ఉప్పుకప్పురంబు' పద్యం. దీనికీ రాజకీయాలకూ పోలికేమిటని అనిపించవచ్చు. తప్పలేదు. కానీ 'ఒక్క పోలిక నుండు' అంటూ చెప్పిన పద్యంతో రాజకీయాలతో ఆ పోలికేమిటో చూద్దాం. కొన్నాళ్ల కిందట కారు పార్టీవారు శ్రీమాన్ ఎలక్షన్ కమిషన్ గారికి ఓ లేఖ రాశారు. 'అయ్యా... మా కారు గుర్తుకు దగ్గరగా ఉండే గుర్తుల్ని ఎవరికీ కేటాయించకండి సార్' అంటూ ఆర్తిగా అర్థిస్తూ ఓ అర్జీ పెట్టుకున్నారు. కారణం... గతంలో జరిగిన ఎలక్షన్లలో రోడ్డురోలర్లూ, రోటీ రోలర్లూ, పీట మీద రాడ్ రూలర్లూ... ఈ గుర్తులన్నీ కారుకు బహు దగ్గరగా ఉండి... ఓట్లను తమ ట్రాపుల్లోకి దారిమళ్లించాయట. తమకెన్నో ఓట్లు తగ్గాయనీ వారు వాపోయారు. దరిమిలా ఈ లేఖ. అందుకే ఉప్పుకప్పురంబు పద్యం స్టైల్లో వాళ్లు రాసిన లైన్లు...

రోడ్డు రోలరు, రోటీ రోలర్లు
కారుకు దగ్గరగ నుండు
పరికించి చూసినప్పుడే తెలియు తేడా...
అన్నది ఉప్పు కప్పురంబు
బీఆర్‌ఎస్ వారి వ్యాఖ్యానం.

పొలిటికల్ పార్టీలవారంతా దావత్ పార్టీల్లో తరచూ కలుస్తుంటారు. హాయిగా మాట్లాడుకుంటుంటారు. కొండొకచో చమత్కారాలతో జోకులు రువ్వుకుంటారు. కానీ వారివారి కార్యకర్తలు మాత్రం రోడ్డున పడి తన్నుకుంటుంటారు. తాము నమ్మిన పార్టీల కొమ్ముగాసి కొట్టుకునే కార్యకర్తల కోసమూ వేమన చెప్పిందేమిటయా అంటే...

ఎంత సేవ జేసి ఏపాటు బడిననూ
రాచమూక నమ్మరాదురన్న.
పాము తోడి పొందు పదివేలకైననూ
ముప్పు తెచ్చి పెట్టు వినుర వేమా
అంటూ హెచ్చరించాడు.

మరి ఇంత చెప్పినవాడు ఓటర్లకేమీ చెప్పలేదా... అంటే మామూలు జనాలకు తేలిక భాషలో ఉపదేశం చేయడమే వేమన వేదం. అలాంటిది ఓటర్లకు చెప్పడా?

మేనిఫెస్టోల ఆశల పల్లకీల్లో ఉయ్యాలలూగొద్దనీ... వాళ్లు అరచేతుల్లో చూపే హైరైజ్‌డ్ మల్టీస్టోరీడ్ మల్టీప్లెక్సుల్లో పెద్ద పెద్ద దురాశల సినిమాల్ని సెవెంటీ ఎమ్మెమ్ముల్లో చూడొద్దంటూ సుద్దులు చెప్పడానికి చెప్పిన ఓ బుద్ధి పద్యమిది... దాన్ని జాగ్రత్తగా చదువుకుని మరీ ఓటేయమన్నాడు.

నీళ్లలోన చేప నెరిమాంసపు ఆశకు
గాలమందు చిక్కి కూలినట్లు
ఆశ బుట్టి 'ఓటరు'దు ఆ రీతి చెడిపోవురా
విశ్వదాభిరామ వినుర వేమ

శారీ.. కోడ్ ఉల్లంఘించారు

చిట్యాల: ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలోని విగ్రహాలకు బతుకమ్మ చీరలను చుట్టడం వివాదాస్పదమైంది. బతుకమ్మ పండగకు మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పంచాల్సిన చీరలను వైఎస్సార్, ఇందిరాగాంధీ, ఎలిమినేటి మాధవరెడ్డి విగ్రహాలకు చుట్టారు. అధికారుల తీరుపై సోషల్ మీడియాలో నిరసనలు వెల్లువెత్తాయి. బతుకమ్మ చీరలను గ్రామస్తులకు పంచకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామ నాయకులు డిమాండ్ చేశారు.


చిట్యాల మండలం వెలిమినేడులో విగ్రహానికి చుట్టిన బతుకమ్మ చీరలు

పంచతంత్రం

ఛత్తీస్‌గఢ్‌లో 11 మంది అభ్యర్థులతో ఆప్ మూడో జాబితా

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి వచ్చే నెలలో జరిగే ఎన్నికల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ శుక్రవారం 11 మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితా విడుదల చేసింది. దీంతో, ఇప్పటి వరకు ఆప్ 33 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించినట్లయింది. మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ పోటీ చేస్తుందని ఆప్ చీఫ్ కేజ్రీవాల్ ఇప్పటికే ప్రకటించారు. అసెంబ్లీలోని 90 సీట్లకుగాను 2108 ఎన్నికల్లో ఆప్ 85 చోట్ల అభ్యర్థులను బరిలోకి దించినప్పటికీ ఖాతా తెరవలేకపోయింది.

ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్ అసెంబ్లీకి నవంబర్ 17వ తేదీన జరగనున్న ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థుల ఎంపికపై చర్చించేందుకు శుక్రవారం కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ అయ్యింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఏఐసీసీ జనరల్ సెక్రటరీలు, రణదీప్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్, పీసీసీ అధ్యక్షుడు, మాజీ సీఎం కమల్‌నాథ్ హాజరయ్యారు. ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను అనంతరం ఖర్గే 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పూర్తిస్థాయి మెజారిటీ సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకున్న బీజేపీకి రాష్ట్ర ప్రజలు ఈసారి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వరన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలిస్తాం

మధ్యప్రదేశ్ సీఎం చౌహాన్ హామీ

భోపాల్: రాష్ట్రంలోని నీడలేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలిస్తామని మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రకటించారు. 'రాష్ట్రంలో చాలా ఏళ్లుగా నివాసం ఉంటూ అస్సలే భూమి లేని వారికి ఇళ్లప్లాట్లు పంపిణీ చేస్తాం. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ముఖ్యమంత్రి ఆవాస్ యోజనల కింద వారికి ఇళ్లు కట్టిస్తాం. ఇల్లు లేని వారంటూ లేకుండా చేస్తాం'అని శుక్రవారం భోపాల్‌లోని గోవింద్‌పూర్‌లో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన ప్రకటించారు. తమ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'లాడ్లీ బెహనా' పథకంతో మహిళల పట్ల ఆయా కుటుంబాల్లో గౌరవం పెరిగిందన్నారు.

కులగణన చుట్టూ...


హిందీ బెల్ట్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఎన్నికల అస్త్రం

బీజేపీ హిందూత్వ ఎజెండాను తిప్పికొట్టే ప్రయత్నం

కులగణన.. మూడు హిందీ హార్ట్‌ల్యాండ్ రాష్ట్రాల్లో ఇప్పుడిదే హాట్ టాపిక్. బీజేపీ హిందూత్వ ఎజెండాని తిప్పికొట్టడానికి కాంగ్రెస్ పార్టీ కులగణన అనే బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీసింది. వచ్చే నెలలో రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కులగణన చుట్టూ తిరుగుతున్నట్టే కనిపిస్తోంది. ఇప్పటికే తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కులగణన చేపడతామని ప్రకటించిన కాంగ్రెస్ దేశవ్యాప్తంగా కులగణన కోసం పట్టుబడుతోంది. బీజేపీ కులగణన చేపడతామని అధికారికంగా ప్రకటించకపోయినప్పటికీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ ఓట్లపై గురి పెట్టింది. మన దేశంలో 2011లో కులగణన చేపట్టినప్పటికీ అందులో వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. బిహార్‌లో కులగణన నిర్వహించి రాష్ట్ర జనాభాలో 63% మంది వెనుకబడిన వర్గాలు ఉన్నారని తేల్చి చెప్పడంతో అదే తరహాలో దేశవ్యాప్తంగా కులాల జనాభా వివరాలను సేకరించాలన్న డిమాండ్ ఊపందుకుంది. కాంగ్రెస్ కులగణన డిమాండ్‌ను తిప్పికొడుతున్న బీజేపీ సమాజాన్ని విభజించడానికే కాంగ్రెస్ ఇదంతా చేస్తోందని ఎదురు దాడికి దిగుతోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

> గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నికల్లో కులం కార్డు అత్యంత కీలకంగా మారింది. కుల సంఘాలు నానాటికీ శక్తిమంతంగా మారుతున్నాయి. ఎన్నికల్ని శాసిస్తున్నాయి. టిక్కెట్ల కేటాయింపు దగ్గర్నుంచి ఎన్నికల తర్వాత పదవుల పందేరం వరకు కులాల లెక్కల పైనే జరుగుతున్నాయి. గెలిచిన వారికి సన్మానాలు, సత్కారాలు చేస్తున్నాయి. ఈ సారి ఎన్నికలు కులగణన చుట్టూనే తిరుగుతాయి **- నారాయణ్ బరేథ్, రాజకీయ విశ్లేషకుడు**



మధ్యప్రదేశ్

మధ్యప్రదేశ్‌లో ఓబీసీ జనాభా 50% వరకు ఉంటుంది. కానీ ఆ జనాభాకు తగ్గట్టుగా పథకాలేవీ వారికి అందడం లేదు. రాష్ట్రంలో పార్టీల గెలుపోటములను శాసించే సత్తా వారికి ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఓబీసీలో కిరార్ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు. అయినప్పటికీ ఈ సారి బీజేపీ ఆయనను సీఎం అభ్యర్థిగా ప్రకటించలేదు. బీజేపీ ఎంపీలు, ప్రముఖ నేతలు ఎన్నికల బరిలో ఉండడంతో ఎన్నికల్లో పార్టీ గెలిచినా చౌహాన్‌ను మరోసారి సీఎంను చేస్తారన్న నమ్మకం కూడా కేడర్‌లో లేదు. బీజేపీ ఆయనను సీఎం ఫేస్‌గా ప్రకటించకపోవడం వల్ల పార్టీకే ఎదురు దెబ్బ తగులుతుందన్న ఆందోళన రాష్ట్ర బీజేపీలో ఉంది. కాంగ్రెస్ కులగణన చేపడతామని హామీ ఇవ్వడంతో కనీసం ఓబీసీ నాయకుడ్ని సీఎం అభ్యర్థిగా ముందుంచి ఎన్నికలకు వెళ్లాలని రాష్ట్ర నేతలు డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జనాభాలో ఆదివాసీలు 21%, ఎస్సీలు 15.6% ఉన్నారు. మరోవైపు కులగణన వల్ల కాంగ్రెస్‌కు ఎన్నికల్లో లబ్ధి చేకూరుతుందని చెప్పలేమని రాజకీయ విశ్లేషకుడు దినేష్ గుప్తా వ్యాఖ్యానించారు. బీజేపీ కులగణన హామీకి బదులుగా ఎక్కువ మంది ఓబీసీలకు టికెట్లు ఇస్తూ దానిని బ్యాలెన్స్ చేసే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు సీఎం చౌహాన్ ఓబీసీలకు తొమ్మిది సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు.

రాజస్తాన్

రాజస్తాన్‌లో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని కుల సంఘాలు మహా సమ్మేళనాలు నిర్వహించి తమ బలాన్ని ప్రదర్శించాయి. కులగణన చేపట్టాలని, తమకు రిజర్వేషన్ల శాతం పెంచాలన్నది వారి ప్రధాన డిమాండ్‌గా ఉంది. సీఎం అశోక్ గెహ్లోత్ అన్ని కులాలకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డుల్ని ఏర్పాటు చేయడమే కాకుండా కులగణన కూడా చేపడతామని ప్రకటించారు. కులాల జనాభాకనుగుణంగా రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీనికి వివిధ కులాల దగ్గర్నుంచి మంచి స్పందన వచ్చింది. రాజస్తాన్‌లో అత్యంత కీలకమైన రాజ్‌పుత్‌లు ఓబీసీలకు ఉన్నారు. ఓబీసీల సంఖ్య ఎంతో ఎవరికీ తెలీకపోవడంతో రిజర్వేషన్లలో వారికి అన్యాయం జరుగుతోందనే వాదన వినిపిస్తోంది. రాజస్తాన్ జనాభాలో 50శాతానికి పైగా ఓబీసీలు ఉన్నారని అంచనాలుంటే ప్రస్తుతం వారికున్న రిజర్వేషన్లు 21% ఉన్నాయి. రాజస్తాన్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా వ్యవస్థలో 64% రిజర్వేషన్లు ఉన్నాయి. ఇందులో ఎస్సీలకు 16%, ఎస్టీలకు 12%, ఓబీసీలకు 21%, మోస్ట్ బాక్‌వార్డ్ క్లాసెస్ (ఎంబీసీ)లకు 5%, ఆర్థికంగా బలహీన వర్గాల వారికి 10% రిజర్వేషన్లు ఉన్నాయి. జాట్లు, గుజ్జర్లు, రాజ్‌పుత్‌లు సహా 92 కులాలు ఓబీసీ కేటగిరీలో ఉన్నాయి. దీంతో తమకు అన్యాయం జరుగుతోందన్న ఆవేదన వారిలో తీవ్రంగా ఉంది.

ఛత్తీస్‌గఢ్

ఛత్తీస్‌గఢ్ గిరిజన రాష్ట్రంగా ఉన్నప్పటికీ ఓబీసీ జనాభా అధికం. అధికారిక గణాంకాల ప్రకారం 43.5% మంది ఓబీసీలే ఉన్నారు. 2018లో సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన భూపేష్ బఘేల్ రాష్ట్ర మొట్టమొదటి ఓబీసీ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. ఓబీసీలకుండే రిజర్వేషన్లను 14 నుంచి 27శాతానికి పెంచుతూ బిల్లు తీసుకువచ్చారు. కానీ గవర్నర్ దానిని ఇంకా ఆమోదించలేదు. దీంతో బీజేపీ ఓబీసీలకు వ్యతిరేకమన్న ప్రచారాన్ని కాంగ్రెస్ విస్తృతంగా చేస్తోంది. మళ్లీ అధికారంలోకొస్తే కులగణన చేపడతామన్న హామీ ఇచ్చి ఓబీసీల్లో పట్టు పెంచుకున్నారు. కాంగ్రెస్ ప్రచారానికి కౌంటర్‌గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఓబీసీ నేత అరుణ్ సావోను నియమించింది. ఇప్పటివరకు 90 స్థానాలకు అభ్యర్థుల్ని ప్రకటిస్తే అందులో 29 మంది ఓబీసీ నాయకులే. కాంగ్రెస్ కులగణన అస్త్రం మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతవరకు పని చేస్తుందో వేచి చూడాలి.

రాజస్తాన్‌లో అప్పుల భారం పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం


కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

జైపూర్: రాజస్తాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంపై అప్పుల భారం పెంచిందని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత అర్జున్‌రామ్ మేఘ్వాల్ ఆరోపించారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ద్రవ్యోల్బణ రిలీఫ్ క్యాంపుల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని విమర్శించారు. 2018లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని ఆక్షేపించారు. రైతు రుణాల మాఫీ, నిరుద్యోగ భృతి వంటివి ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంపై అప్పుల భారం పెరగడం తప్ప ప్రజలకు ఒరిగిందేమీలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జీడీపీ దారుణంగా పడిపోయిందని మంత్రి మేఘ్వాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సుపరిపాలన కాదు, దుష్పరిపాలన సాగుతోందని మండిపడ్డారు. ఆర్థిక వ్యవస్థ పతనం కావడంతో నిరుద్యోగం పెరిగిపోయిందని, నేరాలు పెచ్చరిల్లుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు, పెట్టుబడులు రావడం లేదని విమర్శించారు.

బుల్లెట్‌పై బ్యాలెట్ విజయం..!

రాయపూర్: ఉన్న ఊరు కదలకుండా ఓటు వేసుకొనే హక్కు వారికి వచ్చింది. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 75 ఏళ్లకి ఆ గ్రామాల ప్రజలకి ఈ అపూర్వ అవకాశం దక్కింది. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లా మారుమూల విసిరేసినట్టున్న 120 గ్రామాల ప్రజలు ఈ సారి తమ స్వగ్రామాల్లోనే ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా ఆ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఒకప్పుడు మావోయిస్టు ప్రాబల్యం కలిగిన ఈ గ్రామాల్లో ఇప్పుడు శాంతి భద్రతలు నెలకొనడంతో పోలింగ్‌కు ఏర్పాట్లు చేసినట్టుగా ఎన్నికల అధికారులు చెప్పారు. బుల్లెట్‌పై బ్యాలెట్ విజయం సాధించిందని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. గతంలో ఆ 120 గ్రామాల ప్రజలకి ఓటు వేయాలన్న ఉత్సాహం ఉన్నప్పటికీ 8 నుంచి 10 కిలోమీటర్లు ట్రెక్కింగ్ చేయాల్సి వచ్చేది. ఓటు వేయడానికి వెళ్లే ప్రతీసారి మావోయిస్టుల నుంచి ఎలాంటి ముప్పు వస్తుందోనన్న ఆందోళన కూడా ఉండేది. కానీ ఇప్పుడు బస్తర్ జిల్లాలో భద్రత పెరిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా బలోపేతం కావడంతో 120 గ్రామాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు కళకళలాడిపోతున్నాయి.

రాజస్తాన్‌లో హెలికాప్టర్ అద్దెలకు రెక్కలు



జైపూర్: రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకున్న వేళ హెలికాప్టర్ల అద్దెలకి రెక్కలు వచ్చాయి. సుడిగాలి ప్రచారానికి పార్టీల నాయకులు హెలికాప్టర్ల మీద ఆధారపడడంతో వాటి అద్దెలు అమాంతం పెరిగిపోయాయి. ఆరు నెలల క్రితం సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ అద్దె గంటకి లక్ష రూపాయలైతే , ఇప్పుడా అద్దెలు రెట్టింపు అయ్యాయి. సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్ గంటకి అద్దె రూ.2 లక్షలు అంతకంటే ఎక్కువగా ఉంటే డబుల్ ఇంజిన్ హెలికాప్టర్లు గంటకి అద్దె రూ.3–4 లక్షలుగా ఉంది. ఇంక అభ్యర్థుల జాబితా పూర్తిగా రాకముందే ఈ స్థాయిలో ధరలు ఉంటే వచ్చాక మరింతగా పెరిగిపోయే అవకాశం ఉంది. ముందు ముందు హెలికాప్టర్లకి ఇంకా డిమాండ్ పెరిగిపోతుందని జైపూర్‌కు చెందిన ప్రైవేటు హెలికాప్టర్ సంస్థ సీఈఓ సోహన్ సింగ్ చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ, ఆర్‌ఎల్‌పీ పార్టీల నాయకులు ముందస్తుగానే హెలికాప్టర్లను బుక్ చేసుకున్నారని డిమాండ్‌కు తగినన్ని హెలికాప్టర్లు తమ వద్ద లేవని ఆయన తెలిపారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి సీఎం పరామర్శ

బాల్కొండ: నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండల కేంద్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఆమె హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మరణించారు. సీఎం కేసీఆర్ శుక్రవారం ఉదయం 11.25 గంటలకు హెలికాప్టర్ ద్వారా వేల్పూర్ చేరుకున్నారు. మంత్రి ఇంటికి వెళ్లి మంజులమ్మ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డిని ఓదార్చారు. 11.39 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. మంజులమ్మ అంత్యక్రియలలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ కవిత, ఎంపీ సంతోష్‌రావు, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, షకీల్, విద్యాసాగర్‌రావు పాల్గొన్నారు.



మంజులమ్మ భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న సీఎం కేసీఆర్. పక్కన విషణ్ణ వదనంతో ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో గణేశ్ గుప్తా, శ్రీనివాస్‌గౌడ్, జీవన్‌రెడ్డి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి

బరువు తక్కువ డ్రామా!

- చంద్రబాబుకు అనారోగ్యమంటూ టీడీపీ హడావుడి
- ఆసుపత్రిలో చేర్చేందుకే 'అనారోగ్యం' పథకం
- బాబు బరువు తగ్గలేదు.. జైలుకొచ్చాక మరో కిలో పెరిగారు
- ఇంటి భోజనం.. మూడు పూట్లా ఆరోగ్య పరీక్షలు
- పూర్తి ఆధారాలతో దుష్ప్రచారాన్ని తిప్పికొట్టిన జైళ్ల శాఖ
- బాబు జైల్లో... చినబాబు ఢిల్లీలో... నైరాశ్యంలో తమ్ముళ్లు
- ఇప్పట్లో బెయిల్ రాదనే సానుభూతి ఎత్తుగడ
- బెడిసికొట్టిన రాజకీయ కుతంత్రం



సాక్షి, అమరావతి: అవినీతికి పాల్పడి సాక్ష్యాధారాలతో సీఐడీకి దొరికిపోయిన మాజీ సీఎం చంద్రబాబు బయటపడే మార్గం కానరాకపోవడంతో అనారోగ్యమంటూ సానుభూతి నాటకానికి తెర తీశారు! స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో విచారణకు సహకరించకుండా అసలు కేసునే కొట్టివేయాలని ఒకవైపు వాదిస్తూ మరోవైపు రాజకీయ ప్రయోజనాల కోసం సరికొత్త ఎత్తుగడ వేశారు. అడ్డగోలుగా ప్రజాధనాన్ని కాజేసింది కాకుండా తప్పులను కప్పి పుచ్చుకునేందుకు ఆయన చేస్తున్న యత్నాలపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. డీ హైడ్రేషన్.. స్కిన్ అలర్జీ.. బరువు తగ్గిపోయారంటూ రకరకాల అంశాలను ఆయన కుటుంబ సభ్యులతో పాటు పార్టీ నేతలు తెరపైకి తెచ్చి హడావుడి చేశారు. దీనిపై జైళ్ల శాఖ అధికారులు సత్వరమే స్పందించి వాస్తవాలను బహిర్గతం చేయడం ద్వారా దుష్ప్రచారానికి తెర దించారు. వాస్తవానికి జైలుకు వచ్చినప్పటి కంటే ప్రస్తుతం చంద్రబాబు బరువు మరో కిలో పెరగడం గమనార్హం. చంద్రబాబు తీసుకునే ఆహారం ఇంటి నుంచే వస్తోంది. ఆయనకు ప్రతి రోజూ వైద్య పరీక్షలు నిర్వహిస్తు న్నారు. బయట తిరగడం లాంటి శారీరక శ్రమ ఏమాత్రం లేదు. అలాంటప్పుడు బరువు ఎందుకు తగ్గుతారనే స్పృహ లేకుండా నిస్సిగ్గుగా ఆరోపణలు చేయడంపై అంతా విస్తుపోతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబు యథేచ్ఛగా పాల్పడ్డ కుంభకోణాలు వరుసగా బయటపడుతుండటంతో టీడీపీ బెంబేలెత్తుతోంది. చంద్రబాబు 34 రోజులుగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉండటంతోనే టీడీపీ నేతలు, కార్యకర్తలు కాడి వదిలేశారు. మరోవైపు లోకేశ్ రాజకీయ కార్యక్షేత్రం కాడి వదిలేసి ఢిల్లీలో తలదాచుకోవడంతో భవిష్యత్‌పై టీడీపీ ఆశలు వదిలేసుకుంది. చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో ఏమాత్రం సానుభూతి కలసి రావడం లేదని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు. గత్యంతరం లేక ఏదో ఒక ఆందోళన నిర్వహిస్తున్నా ఒకే సామాజిక వర్గానికి చెందిన వారే కనిపిస్తున్నారని, సామాన్యులు ఎవరూ ఇందులో పాలు పంచుకోవడం లేదని వాపోతు న్నారు. ఈ నేపథ్యంలో దింపుడు కళ్లెం ఆశతో టీడీపీ చివరి అస్త్రంగా చంద్రబాబు ఆరోగ్యం బాగా లేదనే అవాస్తవ ప్రచారాన్ని తెరపైకి తెచ్చింది. వైద్యుల నివేదికలు, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు అధికారుల ప్రకటనతో ఆ యత్నం కూడా బెడిసికొట్టింది.

మొన్ననే బాగున్నారన్న పయ్యావుల..

మూడు రోజులుగా చంద్రబాబుకు ఆరోగ్యం బాగా లేదంటూ వ్యూహాత్మకంగా ప్రచారాన్ని టీడీపీ తెరపైకి తెచ్చింది. గతవారం రెండో ములాకత్‌తో చంద్రబాబును కలిసిన లోకేశ్, పయ్యావుల కేశవ్ మీడియాతో మాట్లాడుతూ తమ అధినేత పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు. ఆరోగ్యంపై ఎలాంటి ఆందోళన వద్దని, చంద్రబాబు పార్టీ కోసం, రాష్ట్రం కోసం ఆలోచిస్తున్నారని కూడా వ్యాఖ్యానించారు. అయితే రాజకీయ ప్రయోజనాల కోసం హఠాత్తుగా చంద్రబాబు ఆరోగ్యం సరిగా లేదంటూ ప్రచారానికి దిగారు. ఎంత పకడ్బందీగా దీన్ని వ్యాప్తిలోకి తెచ్చారంటే.. చంద్రబాబు ఆరోగ్యం బాగా లేదంటూ నారా భువనేశ్వరి, లోకేశ్, బ్రహ్మణి వరుసగా ట్వీట్లు పెట్టారు. ఆ వెంటనే యనమల రామకృష్ణుడు అందుకున్నారు. అచ్చెన్నాయుడుతోపాటు పార్టీ సీనియర్ నేతలు సమావేశమై చంద్రబాబు ఆరోగ్యం బాగా లేదంటూ ప్రకటనలు చేశారు. చంద్రబాబు ఏకంగా ఐదు కిలోల బరువు తగ్గారని, కిడ్నీలు దెబ్బ తింటాయంటూ తామే వైద్యులమనే తరహాలో హడావుడి చేశారు. బాబు శరీరంపై దద్దుర్లు వచ్చాయని, ఏసీ లేకపోవడంతో ఈ సమస్య వచ్చిందని నిర్ధారించేయడం విస్మయ పరుస్తోంది. చంద్రబాబుకు స్టెరాయిడ్లు ఇస్తున్నారనే దుష్ప్రచారాన్ని తెరపైకి తేవడం టీడీపీ దిగజారుడుతనానికి నిదర్శనం. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుపై గుర్తు తెలియని డ్రోన్లు తిరిగాయని ఆరోపిస్తూ చంద్రబాబు భద్రతపై ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు యత్నించారు. వెంటనే ఎయిమ్స్ ఆసుపత్రికిగానీ ఏదైనా ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రికిగానీ తరలించాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆసుపత్రి నుంచి రాజకీయం నెరపవచ్చన్నది టీడీపీ ఉద్దేశం. అందుకోసమే అనారోగ్యం, భద్రతకు ప్రమాదం అంటూ అసత్య ఆరోపణలు ప్రచారంలోకి తెచ్చారు.

మాన్యువల్ ప్రకారం సదుపాయాలు

చంద్రబాబు ఆరోగ్యంపై టీడీపీ కుట్రపూరితంగా చేసిన అసత్య ఆరోపణలను జైళ్ల శాఖ సమర్థంగా తిప్పికొట్టింది. జైలు మాన్యువల్‌లోని నిబంధనలను కచ్చితంగా పాటిస్తున్నామని వివరించింది. జైళ్ల శాఖ మాన్యువల్‌లోని 1037, 385, 386 నిబంధనల్లో పేర్కొన్న ప్రకారం వీఐపీ ఖైదీలకు నిర్దేశించిన అన్ని సదుపాయాలను ఆయనకు కల్పిస్తున్నట్లు తెలిపింది. జైలు గదిలో ఫర్నిచర్, ఇతర వసతులను కూడా ఆమేరకు సమకూర్చినట్లు పేర్కొంది. జైళ్ల శాఖ మాన్యువల్ ప్రకారం జైలులో ఏసీగానీ ఎయిర్ కూలర్‌గానీ కల్పించే వెసులుబాటు లేదని వెల్లడించింది. మాన్యువల్‌కు విరుద్ధంగా వ్యవహరించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. చంద్రబాబు ఉన్న జైలు గదిలో 8 ఫ్యాన్లు ఏర్పాటు చేశామని, న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇంటి నుంచి భోజనాన్ని అనుమతిస్తున్నామని తెలిపింది. రోజూ జైలు వైద్య అధికారులు, సిబ్బంది చంద్రబాబును పరీక్షిస్తున్నారని, ఆయనకు ఎలాంటి అనారోగ్యం లేదని వెల్లడించింది. సెకండ్ ఒపీనియన్ కోసం జీజీహెచ్ వైద్యులను కూడా పిలిపించి పరీక్షలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేసింది. చంద్రబాబు సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నారని వైద్యుల నివేదిక కూడా వెల్లడించింది. ఇక జైలుకు వచ్చినప్పటి కంటే ప్రస్తుతం చంద్రబాబు ఒక కేజీ బరువు పెరిగి ప్రస్తుతం 67 కిలోల బరువు ఉండటం గమనార్హం. ఈమేరకు పూర్తి ఆధారాలు, వైద్య పరీక్షల నివేదికలను న్యాయస్థానానికి సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించడం జైళ్ల శాఖ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది.

బాలయ్య దూకుడుతో..

పూర్తి ఆధారాలతో చంద్రబాబు అవినీతిని వెలికి తీసిన సీఐడీ పకడ్బందీగా కేసులు నమోదు చేసింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో చంద్రబాబు రిమాండ్ ఖైదీగా జైలులో ఉండగా ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అంగళ్ల అల్లర్ల కేసులు వెయిటింగ్ లిస్టులో ఉన్నాయి. మరోవైపు అమరావతిలో అసైన్డ్ భూముల కుంభకోణం కేసు కూడా ఉంది. సీఆర్‌పీసీ, అవినీతి నిరోధక చట్టాల్లోని సెక్షన్లకు వక్రభాష్యం చెబుతూ ఢిల్లీ నుంచి రప్పించిన న్యాయవాదులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. చంద్రబాబుకు ఇప్పట్లో బెయిల్ రావడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు తేల్చిచెబుతున్నారు. పోనీ చినబాబును పట్టుకుని రాజకీయ గోదారి ఈదుదామనుకుంటే ఆయనేమో కేసుల భయంతో దేశ రాజధానిలో దాక్కున్నారు. ఇదే అవకాశంగా టీడీపీలో ఆధిపత్యం కోసం బాలకృష్ణ దూకుడుగా వ్యవహరించడం నారా కుటుంబాన్ని బెంబేలెత్తించింది. దాంతో తెలంగాణ ఎన్నికల సాకుతో బాలయ్యను ఆ రాష్ట్రానికే పరిమితం చేశారు.

అవాస్తవాలను విశ్వసించ వద్దు: జైళ్లశాఖ డీఐజీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మాజీ సీఎం చంద్రబాబు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ తెలిపారు. జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ రాజ మహేంద్రవరం సెంట్రల్ జైలులో శుక్రవారం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు హై ప్రొఫైల్ ఖైదీ అయినందున తొలి రోజే ఆయనకు స్నేహ బ్యారక్‌ను కేటాయించామని గుర్తు చేశారు. ఆయన వద్ద 24 గంటలూ ఒక హెడ్ వార్డర్, ఆరుగురు వార్డర్లుంటారని, ఒక జైలర్ స్థాయి అధికారి విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. ఆయనకు వచ్చే ఆహారం, ఇతరత్రా అన్నీ ఆయనే తనిఖీ చేసి చంద్రబాబుకు అందిస్తారని తెలిపా రు. ములాఖత్‌కు చంద్రబాబు బయటకు వచ్చే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర ఖైదీలు, ఇతరులు ఆ ప్రాంతంలోకి రాకుండా కట్టుదిట్ట మైన భద్రత చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా ఎస్పీతో వారానికోసారి భద్రతపై చర్చిస్తు న్నామన్నారు. చంద్రబాబు భద్రతకు ఎలాంటి ఢోకా లేదని, సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంటున్నారని స్పష్టం చేశారు. ఖైదీలతో చంద్రబాబుకు ఇబ్బందులు వస్తున్నాయన్న వార్తలు అవాస్తవమని చెప్పారు.

రోజుకు మూడుసార్లు పరీక్షలు..

చంద్రబాబు జైలుకు వచ్చినప్పుడు ఆయన ఆరోగ్యం, మందుల వివరాలను సేకరించామని డీఐజీ తెలిపారు. జైలులో వైద్యాధికారులు చంద్రబాబుతో మాట్లాడమే కాకుండా ఆయనకు చికిత్స అందించిన వ్యక్తిగత వైద్యుడితోనూ సంప్రదించినట్లు చెప్పారు. ఆయన మందులు వేసుకుంటున్నారా లేదా? అనేది జైలు వైద్య సిబ్బంది పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. రోజుకు మూడు సార్లు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారని వెల్లడించారు. జైలుకు వచ్చినప్పుడు చంద్రబాబు 66 కేజీల బరువు ఉండగా ప్రస్తుతం 67 కిలోలు ఉన్నట్లు వెల్లడించారు. బరువు తగ్గిపోయారంటూ వస్తున్న తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని సూచించారు. రెండు రోజుల క్రితం డీహైడ్రేషన్ అని తెలియజేయగానే వైద్యాధికారులతో మాట్లాడి తగిన లిక్విడ్‌లు ఇచ్చినట్లు చెప్పారు. చర్మంపై దద్దుర్లకు సంబంధించి అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వైద్య పరీక్షలు చేశారని, అవేమీ ప్రమాదకరకర స్థాయిలో లేవన్నారు. చంద్రబాబు గదిలో 8 ఫ్యానులతో పాటు దోమ తెర కూడా ఏర్పాటు చేశామన్నారు. జైల్లోకి వచ్చినప్పుడు వెంట తెచ్చుకున్న మందులను ఆయన కొనసాగిస్తున్నారని వివరించారు.

తప్పుడు వార్తలపై చర్యలు

చంద్రబాబుకు ఫైబర్ నెట్ కేసులో పీటీ వారెంట్‌కు సంబంధించి కోర్టు సీలు, న్యాయమూర్తి సంతకం లేనందున వివరణ కోరినట్లు డీఐజీ తెలిపారు. సెంట్రల్ జైల్లో 2,039 మంది ఖైదీలున్నారని, వారిలో చంద్రబాబు ఒకరని, రిమాండ్ ఖైదీ పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అలానే తీసుకుంటున్నట్లు తెలిపారు. చంద్రబాబు కోరిక మేరకు ఆయనను ప్రత్యేకంగా ఆస్పత్రికి పంపలేమన్నారు. తమపై ఒత్తిళ్లు ఉన్నాయని వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. సోషల్ మీడియా, పత్రికల్లో వస్తున్న తప్పుడు వార్తలపై చర్యలు తీసుకుంటామని రవికిరణ్ హెచ్చరించారు.

వాళ్లకు అభ్యర్థులే లేరు

▶ మొదటి పేజీ తరువాయి

పార్టీలోకి వచ్చేవారు గొప్పవారనే భావ దారిద్ర్యం కాంగ్రెస్‌లో కనిపిస్తోంది. బెంగళూరులోని ఓ కార్పొరేటర్ భర్త ఇంట్లో రూ.42 కోట్ల నగదు దొరికింది. ఇప్పటికే మరో రూ.8 కోట్లు కొడంగల్‌లో రేవంత్‌రెడ్డికి చేరినట్టు మాకు అనధికార సమాచారం ఉంది. కష్టపడి సాధించుకున్న తెలంగాణను ఎవరి చేతిలో పెట్టాలో ప్రజలు ఆలోచించుకోవాలి.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సిగ్గులేకుండా తెలంగాణలో రైతుల ఆత్మహత్యలపై అబద్ధాలు చెప్తున్నారు. ఆయన రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ప్రధాని మోదీ ఏదో పవిత్రాత్మ అయినట్టుగా ఏ రాష్ట్రానికి వెళ్లినా అవినీతి ప్రభుత్వాలే అంటూ మాట్లాడుతున్నారు. బీజేపీ తొమ్మిదిన్నరేళ్లలో చేసినది ఏమీ లేకనే రజాకార్లు, హిందూ ముస్లిం అంటూ రెచ్చగొడుతున్నారు. బీజేపీకి రాష్ట్రంలోని 110 స్థానాల్లో డిపాజిట్లు గల్లంతవడం ఖాయం. ఒక గుజరాతీ (వల్లభ్‌భాయ్ పటేల్) తెలంగాణకు విముక్తి ప్రసాదించారని, మరో గుజరాతీ స్వేచ్ఛ ప్రసాదిస్తారని మోదీ అహంకారంతో మాట్లాడుతున్నారు. తెలంగాణ దాస్య శృంఖలాలు తెంచిన ఘనత కేసీఆర్‌దే. రాహుల్ లీడర్ కాదు ఎవరో ఇచ్చింది చదివే రీడర్ మాత్రమే. తెలంగాణలో మిషనరీలు, మసీదుల మీద దాడులు జరగలేదు. హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. జాతీయ పార్టీగా ఎదగాలని అనుకుంటున్న మేం ఎవరికీ తొత్తుగా పనిచేయాల్సిన అవసరం లేదు. ఇది తెలంగాణ గల్లీకి, ఢిల్లీ అహంకారానికి, గుజరాతీ బలుపునకు జరుగుతున్న పోరాటం.

అందరికీ మేలు కలిగేలా మేనిఫెస్టో..

బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో రైతులు, మహిళలు, దళితులు, బీసీలు, మైనారిటీలతో పాటు యువతపై ఎక్కువ ఫోకస్ చేస్తున్నాం. సామాజిక భద్రతకు పెద్దపీట వేసేలా.. మధ్య, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు మేలు కలిగేలా మేనిఫెస్టో విశిష్టంగా ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని దీనిని రూపొందించాం. సీఎం కేసీఆర్ వంద వరకు సభల్లో పాల్గొంటారు. నేను, హరీశ్ రావు, సీనియర్ మంత్రులు స్టార్ క్యాంపెయినర్లుగా పనిచేస్తాం.

ఓవర్‌లోడ్‌తో వలసలు సహజమే..

చేరికలతో మా పార్టీ ఓవర్‌లోడ్ అయిన మాట వాస్తవం. బహుళ నాయకత్వం ఉన్నచోట వేరే పార్టీల్లోకి వలసలు సహజం. కాంగ్రెస్‌లో టికెట్లు ప్రకటించగానే తన్నుకుచస్తారు. కాంగ్రెస్‌లో ఇప్పటికే ఒకతను ఎల్బీ స్టేడియంలో సీఎంగా ప్రమాణం చేసేందుకు ముహూర్తాలు పెట్టుకున్నడు. ఒక మీడియా అధిపతి సమక్షంలో కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు నేతలు తలో ఏడాదిన్నర చొప్పున సీఎం పదవి అనుభవించేలా ఒప్పందం చేసుకున్నారు. చివరి ఆరు నెలలు లాటరీ పద్ధతిలో పనిచేస్తారట.

కక్ష సాధింపు మా విధానం కాదు

కాంగ్రెస్ నేతల ఇళ్ల మీద ఐటీ, సీబీఐ దాడులు ఎందుకు జరగడం లేదు? రేవంత్ ఇంటి చుట్టూ కబ్జాలు, సొసైటీల్లో కుంభకోణాలు తెలియవా? మేం కక్ష సాధింపు రాజకీయాలు చేయడం లేదు. మా అతి మంచితనం ప్రస్తుత రాజకీయా ల్లో ఓల్డ్ ఫ్యాషన్‌గా కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారుల బదిలీలపై ఎన్నికల సంఘం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. గజ్వే ల్‌లో ఈటల రాజేందర్‌తోపాటు రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ, ప్రజాశాంతి పార్టీతోపాటు మోదీ, రాహుల్ ఎవరు పోటీ చేసినా స్వాగతిస్తాం.

ముదిరాజ్‌లకు పదవులు ఇస్తాం

సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్లు ఇవ్వడంతో ముదిరాజ్‌లకు అవకాశం కల్పించలేకపోయాం. 2014, 18లలో మా పార్టీ నుంచి ఈటల రాజేందర్ ఒక్కరే ముదిరాజ్ కమ్యూనిటీకి చెందిన వారు. ఆయన పార్టీ నుంచి వెళ్లిన తర్వాత రాజ్యసభ సభ్యుడిగా ఉన్న బండా ప్రకాశ్‌కు మండలి డిప్యూటీ చైర్మన్ హోదాతో కేబినెట్ ర్యాంకు ఇచ్చాం. భవిష్యత్తులో ముదిరాజ్‌లకు రాజ్యసభ, శాసనమండలిలో గౌరవ ప్రదమైన పదవులు ఇస్తాం. ఈ విషయాన్ని బూతద్దంలో పెట్టి చూడటం సరికాదు. పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య మాతో కలసి పనిచేసేందుకు ఆసక్తి చూపితే.. నేను వ్యక్తిగతంగా వెళ్లి ఆహ్వానిస్తా..'' అని కేటీఆర్ చెప్పారు. కామారెడ్డిలో కేసీఆర్ పోటీచేయడం వెనుక ఒక వ్యూహం ఉంటుందని.. ఆయన ఒక మ్యాన్ ఆఫ్ మిస్టరీ అని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రకటించిన సీట్లలో మార్పు చేర్పులు ఉంటాయా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. దీనిపై ఇప్పటికే సీఎం స్పష్టత ఇచ్చారని.. ఉంటే ఒకట్రెండు మార్పులు ఉండొచ్చన్నట్టుగా కేటీఆర్ సమాధానమిచ్చారు.

ఆ రాజకీయాల్లోకి తెలంగాణను లాగవద్దనే..

అవినీతి కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టై జైల్లో ఉండటంపై ఆయన కుమారుడు లోకేశ్ చేసిన ట్వీట్‌ను ఓ మీడియా ప్రతినిధి ప్రస్తావించగా.. కేటీఆర్ స్పందించారు. ''చంద్రబాబు భద్రత విషయంలో లోకేశ్ వ్యక్తం చేసిన ఆందోళనను ఒక కొడుకుగా అర్థం చేసుకోగలను. అయితే నాకు అక్కడి పరిస్థితుల నిజానిజాలు తెలియవు. రాజకీయాలు వేరైనా ఆయన కుటుంబం బాధను అర్థం చేసుకోగలను. వారికి నా సానుభూతి. కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష సమయంలో నిమ్స్ ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఆయన ఆరోగ్యంపై మేం చాలా ఆందోళన చెందాం. అలాంటి సందర్భాల్లో ఎలాంటి మానసిక స్థితి ఉంటుందో తెలుసు. ఏపీలో రెండు పార్టీల మధ్య ఉన్న రాజకీయాల్లోకి తెలంగాణను లాగవద్దనే.. హైదరాబాద్ శాంతిభద్రతలకు విఘాతం కలగవద్దన్న ఉద్దేశంతోనే ఆందోళనలు చేయడం వద్దన్నాను..'' అని పేర్కొన్నారు.

'స్కిల్' విచారణ సీబీఐకి!

- ఉండవల్లి అరుణ్‌కుమార్ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు
- చంద్రబాబు, అచ్చెన్న, రాష్ట్ర ప్రభుత్వం, సీబీఐ సహా 44 మందికి నోటీసులు
- కౌంటర్లు దాఖలు చేయాలంటూ... విచారణ నవంబరు 10కి వాయిదా
- సీబీఐకి ఇవ్వాలని నాలుగేళ్ల క్రితమే మా వైఖరిని చెప్పాం
- ఇప్పుడు కొత్తగా చెప్పాల్సింది ఏమీ లేదు: రాష్ట్ర అడ్వొకేట్ జనరల్
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా దర్యాప్తును సీబీఐకి అప్పగించాలి
- ఇందులో అప్పటి ప్రభుత్వ పెద్దలు నిందితులుగా ఉన్నారు
- హైకోర్టును కోరిన ఉండవల్లి తరఫు సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభ కోణం తీవ్రత దృష్ట్యా ఈ కేసు దర్యాప్తు బాధ్య త లను సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై (పిల్) హైకోర్టు స్పందించింది. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీఐడీలతో పాటు స్కిల్ కుంభకోణంలో కీలక నిందితులైన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అచ్చెన్నాయుడు, అప్పటి అధికారులు గంటా సుబ్బారావు, డాక్టర్ కె.లక్ష్మీ నారాయణ, నిమ్మగడ్డ వెంకట కృష్ణ ప్రసాద్, డిజైన్ టెక్ ఎండీ వికాస్ వినయ్ కన్విల్కర్, సీమెన్స్ మాజీ ఎండీ సుమన్ బోస్, సంజయ్ డాగా, ఐఏఎస్ అధికారిణి అపర్ణ ఉపాధ్యాయ సహా 44 మందికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదే శిస్తూ తదుపరి విచారణను నవంబర్ 10కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మా క దుర్గాప్రసాద రావు, జస్టిస్ ఏవీ రవీంద్రబాబు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సీబీఐకి...

ఉండవల్లి తరఫున సీనియర్ న్యాయవాది కేజీ కృష్ణమూర్తి వాదనలు వినిపిస్తూ, ఈ కేసులో రూ.371 కోట్ల ప్రజాధనం ముడిపడి ఉందన్నారు. గత ప్రభుత్వంలోని కీలక వ్యక్తులందరూ ఇందులో నిందితులుగా ఉన్నారని, ప్రజా ప్రయోజనాల కోసం, సమర్థమైన దర్యాప్తు కోసం కేసును సీఐడీ నుంచి సీబీఐకి బదిలీ చేయాలని కోరారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ ఈ కేసుతో మీకు సంబంధమేంటని ప్రశ్నించింది. మాజీ ఎంపీ అయిన పిటిషనర్‌కు ఇపుడు ఏ పార్టీతోనూ సంబంధం లేదని, రాష్ట్ర విభజనపైన, పోలవరం విషయంలో కేంద్రం ఇవ్వాల్సిన నిధులపైన ప్రజాహిత వ్యాజ్యాలు వేసి న్యాయ పోరాటం చేస్తున్నారనికృష్ణమూర్తి తెలిపారు.

అప్పుడే కోరాం...

తరువాత రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ... ''ఈ కుంభకోణంలో వేరువేరు రాష్ట్రాల్లో డబ్బులు భారీగా చేతులు మారాయి. రాజకీయ పార్టీలకూ సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడయింది. వాస్తవానికి కేబినెట్ సబ్‌కమిటీ సిఫారసుల ఆధారంగా 2020లోనే ఈ వ్యవహారంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేత విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ సిట్‌ను వ్యతిరేకిస్తూ హైకోర్టులో సవాల్ చేశారు. ఆ సందర్భంగా... కేంద్రాన్ని దీన్లో చేర్చాలని రాష్ట్రం కోరింది. దర్యాప్తును సీబీఐకి అప్పగించడానికి స్వచ్ఛందంగా అంగీకరించింది. కానీ సిట్‌కు సంబంధించి తదుపరి ప్రొసీడింగ్స్ అన్నిటిపైనా స్టే ఇస్తూ... ఇంప్లీడ్ అప్లికేషన్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు పక్కన బెట్టింది. కేంద్రాన్ని సుమోటోగా ఇంప్లీడ్ చేసి... కేసును మళ్లీ హైకోర్టుకు పంపింది. మళ్లీ విచారించాలని, రాష్ట్ర అభ్యర్థన మేరకు కేంద్రం కౌంటర్ గనక అఫిడవిట్ వేస్తే... దాన్ని కూడా విచారించాలని పేర్కొంది'' అని వివరించారు. తద్వారా సిట్ చూస్తున్న వ్యవహారాలను సీబీఐకి బదలాయించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదనేది తేటతెల్లమవుతోందని, అందుకే ఆ రెండు పిటిషన్లలో ఇంప్లీడ్ అప్లికేషన్లు వేసిందని వివరించారు.

దాడుల హెచ్చరికలు సరికాదు...

ఈ సందర్భంగా...నిందితుడు చంద్రబాబు తరఫు లాయర్లు వ్యవహరిస్తున్న తీరును ఏజీ హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు.''నిందితుడి తరఫున వివిధ కోర్టుల్లో హాజరవుతున్న లాయర్లు ప్రభుత్వ న్యాయాధికారుల్ని బెదిరిస్తున్నారు. భౌతికంగా దాడులు చేస్తామని హెచ్చరిస్తున్నారు. వాస్తవానికి న్యాయాధికారులు తమ బాధ్యతల్ని చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారు. అది వారి విధి. రాష్ట్ర ప్రభుత్వా నికి సంబంధించినంత వరకూ ఈ రిట్ పిటిషన్లో, దర్యాప్తులో ఎలాంటి రాజకీయ కోణమూ లేదు'' అని వివరించారు. దీంతో కోర్టు వివిధ పక్షాలకు నోటీసులు జారీ చేస్తూ విచారణను వాయిదా వేసింది.

ఏమీ తెలియదంటూ..
17ఏ రక్షణ కావాలంటే ఎలా?

- ఇవి రెండూ పరస్పర విరుద్ధ వాదనలు కాదా?
- చంద్రబాబు క్వాష్ పిటిషన్లో ఏపీ న్యాయవాది ముకుల్ రోహత్గీ ప్రశ్నలు
- నిజాయితీ పరుల రక్షణకే 17ఏ... గత ఘటనలకూ పాత చట్టాలు వర్తిస్తాయి
- ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు కూడా దర్యాప్తు చేశాయి... కోర్టుకు నివేదన
- చంద్రబాబుకు డబ్బు చేరినట్లు ఎలా గుర్తించారని ప్రశ్నించిన ధర్మాసనం
- షెల్ కంపెనీల ద్వారా బాబు, ఆయన పార్టీ ఖాతాల్లోకి చేరిందన్న రోహత్గీ
- ఒప్పందం ముఖ్యమంత్రి స్థాయిలోనే జరిగిందని కూడా వెల్లడి
- తదుపరి మంగళవారానికి విచారణ వాయిదా
- ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిలు కోరిన చంద్రబాబు
- ఈ కేసులోనూ సెక్షన్ 17ఏ నేనా? అని ప్రశ్నించిన ధర్మాసనం
- ఇందులో కూడా విచారణ అదే రోజుకు వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్ కుంభకోణం గురించి తనకేమీ తెలియదన్నపుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ ద్వారా రక్షణ కావాలని చంద్రబాబు ఎలా అడుగుతారని ఏపీ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ప్రశ్నించారు. అలా కోరడంలో అర్థం లేదన్నారు. ''అధికార విధులు నిర్వర్తించడమంటే అవినీతికి పాల్పడం కాదు కదా? చట్టాల్లో నిజాయితీపరులకే రక్షణ కల్పించారు. సెక్షన్ 17ఏ కూడా అలాంటివారి కోసమే'' అంటూ దీనిపై సుప్రీంకోర్టు ఇచ్చిన పలు రూలింగ్‌లను ప్రస్తావించారు.'స్కిల్ డెవలప్‌మెంట్' స్కామ్‌లో గవర్నరు అనుమతి లేకుండా తనను అరెస్టు చేశారు కనక... మొత్తం కేసును కొట్టేయా లంటూ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ శుక్రవారం సుప్రీం కోర్టులో విచార ణకు వచ్చింది. నేరం జరిగిందా? లేదా? అన్న అంశంపై కాకుండా టెక్నికల్‌గా చంద్రబాబు అరెస్టు చెల్లదు కాబట్టి కేసును కొట్టేయాలంటూ ఆయన లాయర్లు కోరటంతో శుక్రవారమూ ఈ విషయంపైనే వాదనలు కొనసాగాయి. జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాస నం ఎదుట... చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు హరీశ్‌సాల్వే, సిద్ధార్థ లూథ్రా, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. మరోవైపు ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్ కూడా ఇదే ధర్మాసనం ముందుకు వచ్చింది. రెండు కేసులనూ తదుపరి మంగళవారానికి కోర్టు వాయిదా వేసింది.

సవరణకు ముందు జరిగిన ఘటనకు పాత చట్టమే...

''రద్దు చేసిన సెక్షన్ల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చా అని ఈ ధర్మాసనం ఇదివరకు అడిగింది. సరిగ్గా ఇదే పాయింట్‌పై ఓ తీర్పు ఉంది'' అంటూ ఎంసీ గుప్తా కేసును ముకుల్ రోహత్గి ప్రస్తావించారు. 1947లో చట్టం రద్దు చేశాక దాంట్లోని నిబంధనల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయజాలరని ఎంసీ గుప్తా కేసులో పిటిషనర్ వాదించారన్నారు. కానీ కొత్త చట్టం అమల్లోకి రాకముందే నేరం జరిగిన విషయాన్ని కోర్టు గుర్తించిందని... చట్టాన్ని రద్దు చేసినా, వెనక్కి తీసుకున్నా నేరం జరిగే నాటికి ఉన్న చట్టమే వర్తిస్తుందని తీర్పునిచ్చిందని చెప్పారు. సరిగ్గా చంద్రబాబు కేసులోనూ అంతే జరిగిందన్నారు. చంద్రబాబుపై సెక్షన్ 13 (సీ),(డీ) కింద అభియోగాలు మోపారని, వాటిని తర్వాత రద్దు చేసినప్పటికీ, రద్దుకు ముందు నేరం జరిగిందని రోహత్గి వివరించారు. ''చట్ట సవరణలు సాధారణం. పాత చట్టాల్లో కొంత భాగం పోతుంది. కానీ సవరణకు ముందు జరిగిన ఘటనలకు మాత్రం ఆ పాత చట్టమే వరిస్తుంది'' అని వ్యాఖ్యానించారు. ఈ కేసుకు ఎట్టి పరిస్థితుల్లోనూ సెక్షన్ 17ఏ వర్తించదని రోహత్గి తేల్చి చెప్పారు. 'సెక్షన్ 17ఏ జులై 2018లో అమలులోకి వచ్చింది. నేరం 2015–2016 మధ్య జరిగింది. ఆ సమయంలో చట్టంలో సెక్షన్ 17ఏ లేదు'' అని రోహత్గి తెలిపారు. చట్ట సవరణకు ముందు కేసు కాబట్టి 17ఏ వర్తించదన్నారు.

చంద్రబాబుకు డబ్బు అందినట్లు ఎలా గుర్తించారు..?

చంద్రబాబు అనుకున్నది జరిగితే దర్యాప్తు ప్రాథమిక దశలోనే నిలిచిపోతుందని, ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే కాకుండా ఎన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలు దర్యాప్తు చేశాయో చూడాలని రోహత్గి కోరారు. 'ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రెండు సంస్థలతో ఒప్పందం చేసుకోవడం కోసం ప్రారంభమైంది. ఎలాంటి టెండర్ లేదు. సంస్థలు 90 శాతం పెట్టుబడి పెడతాయన్నది ఆలోచన'' అని రోహత్గి చెబుతుండగా.. ఈ నిర్ణయం ఏ స్థాయిలో తీసుకున్నారని జస్టిస్ త్రివేది ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయిలో తీసుకున్నారని రోహత్గి తెలిపారు. చంద్రబాబుకు సొమ్ములు అందాయని ఎలా గుర్తించారని న్యాయమూర్తి ప్రశ్నించగా.. సొమ్ములు షెల్ కంపెనీల ద్వారా చంద్రబాబుకు, ఆయన పార్టీ ఖాతాలకు చేరాయని, అది ప్రజాధనమని, దీనిపై దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని రోహత్గి తెలిపారు. దీంతో మరోరోజు విచారణ చేపడతామని జస్టిస్ బోస్ పేర్కొంటూ మంగళవారానికి వాయిదా వేశారు.

సుప్రీంకోర్టులో గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు...

➤ దర్యాప్తు ప్రారంభించిన 5,10 రోజుల్లోనే విచారణను అడ్డుకోవడానికి కోర్టు అంగీకరించే అవకాశం లేదని ముకుల్ రోహత్గి చెప్పారు. హైకోర్టులో కస్టడీని వ్యతిరేకిస్తూ వాదించి, అదే రోజున సుప్రీంలో క్వాష్ పిటిషన్ దాఖలు చేయ డం తాను ఎన్నడూ చూడలేదన్నారు. విచారణ ప్రారంభమైందనడానికి 2018 మే, జూన్ నెలల డాక్యుమెంట్లున్నాయని, వీటిని హైకోర్టుకు కూడా ఇచ్చామని, తమ వాదన లతో హైకోర్టు ఏకీభవించిందని రోహత్గీ చెప్పారు.

అరెస్ట్ భయం ఉంది...

➤ అనంతరం ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు ముందస్తు బెయిలు పిటిషన్‌పై లూథ్రా వాదనలు ప్రారంభించారు. ఒక కేసులో అరెస్టు చేశాక... పలు కేసులు తెరపైకి తెచ్చారన్నారు. 2021లో ఎఫ్ఐఆర్ నమోదైందని, తర్వాత ఏమీ జరగకున్నా.. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టయ్యాక సెప్టెంబరు 19న ఫైబర్‌నెట్ కేసులో నిందితుడిగా చేర్చి కోర్టు ముందు హాజరు కావాలని అధికారులు పీటీ వారెంట్ దాఖలు చేశారన్నారు. పీటీ వారెంట్‌ను ఏసీబీ కోర్టు అనుమతించిందని, ఇప్పుడు అరెస్టు చేస్తారేమో అని లూథ్రా ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ పూర్తి చేశామంటున్నారని, ఇక్కడ కూడా సెక్షన్ 17ఏ వర్తిస్తుందని, అయినప్పటికీ అధికారులు పరిగణనలోకి తీసుకోవడం లేదని లూథ్రా చెప్పారు. ఈ కేసులో ముగ్గురు ఇప్పటికే ముందస్తు బెయిలుపై బయట ఉన్నారని, మరో ముగ్గురు రెగ్యులర్ బెయిలుపై ఉన్నారని చెప్పారు. ఈ కేసులో చంద్రబాబును అరెస్టు చేయాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయన్నారు. ఈ కేసులోనూ సెక్షన్ 17ఏ వర్తిస్తుందా అని జస్టిస్ బోస్ ప్రశ్నిస్తూ.. షార్ట్ నోటీసు ఇచ్చి మంగళవారం విచారణ చేపడతామన్నారు.

కోవిడ్ తర్వాత ‘ఫీజుల’ బాదుడు!

ప్రైవేటు స్కూళ్లలో భారీగా పెంపు

- కార్పొరేట్ స్కూళ్లలో ఇష్టారాజ్యం
- సబ్జెక్టు టీచర్లు లేని పాఠశాలల్లోనూ ఇదే తీరు
- కోవిడ్ నష్టాలు పూడ్చుకోవడమే లక్ష్యం
- నియంత్రణ లేకుంటే భవిష్యత్తులో కష్టాలు
- కేంద్ర విద్యా శాఖ అధ్యయనంలో వెల్లడి
- కట్టడి దిశగా రాష్ట్రాలకు మార్గదర్శకాలు



సాక్షి, హైదరాబాద్: కోవిడ్ మహమ్మారితో అష్టకష్టాల పాలైన ప్రజల పరిస్థితి పెనంమీంచి పొయ్యిలో పడినట్లయింది. ఒకపక్క రేట్లన్నీ కొండెక్కి బెంబేలెత్తిస్తుంటే.. మరోపక్క స్కూల్ ఫీజుల బాదుడుతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ విషయం స్వయంగా కేంద్రం నిర్వహించిన అధ్యయనంలో వెల్లడి కావడం విశేషం!

కోవిడ్ పరిణామాల తర్వాత దేశ వ్యాప్తంగా ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల నియంత్రణ గాడి తప్పిందని కేంద్ర విద్యా శాఖ గుర్తించింది. దీన్ని అదుపు చేసేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రాష్ట్రాలకు సూచించింది. కోవిడ్ అనంతర పరిణామాలపై కేంద్ర విద్యా శాఖ ఇటీవల ఓ అధ్యయనం చేపట్టింది. అన్ని రాష్ట్రాల నుంచి సేకరించిన డేటాను నిశితంగా పరిశీలించి, రాష్ట్ర విద్యా శాఖలకు ఫీజుల నియంత్రణపై కొన్ని మార్గదర్శకాలను సూచించింది. కోవిడ్ నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన టీచర్లు ఇతర రంగాల్లో స్థిరపడ్డారని, ఈ కారణంగా ప్రైవేటు స్కూళ్లలో అనుభవజ్ఞులైన టీచర్ల కొరత ఉందని అభిప్రాయపడింది. సరైన టీచర్లు లేని స్కూళ్లు కూడా భారీగా ఫీజులు పెంచుతున్నాయని, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులపై అన్ని రాష్ట్రాల ప్రజల నుంచి వ్యతిరేకత కనిపిస్తోందని పేర్కొంది. కేంద్ర విద్యా శాఖ అధ్యయనం ప్రకారం... ఫీజులతో పాటు యూనిఫామ్, పుస్తకాలు, వర్క్‌బుక్స్, షూ, టై అంటూ అదనపు వసూళ్లు ఎక్కువయ్యాయి. డీజిల్ చార్జీలు పెరిగాయని చెబుతూ రవాణా చార్జీలూ 30 శాతం వరకూ పెంచారు. దీంతో పేదవాడికి ప్రైవేటు విద్య తడిసి మోపెడవుతోంది. రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక అధ్యయనం చేపట్టి, ఫీజుల వసూళ్లలో పారదర్శకతతో పాటు, సరైన నియంత్రణ చేపట్టాలని సూచించింది. నాణ్యత, నిర్వహణ ఆధారంగా ఫీజులు నిర్ణయిస్తే బాగుంటుందని సూచించింది.

అమలు కాని నియంత్రణ..

తెలంగాణలో ఫీజుల నియంత్రణపై చేసిన ప్రయత్నాలేవీ ఇంత వరకూ కార్యరూపం దాల్చలేదు. గతేడాది దీనిపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినా, ప్రైవేటు ఫీజుల నుంచి తల్లిదండ్రులకు ఉపశమనం లభించలేదు. 2016లో ఫీజుల నియంత్రణపై అధ్యయనానికి ఆచార్య తిరుపతిరావు కమిటీని వేసింది. ఈ కమిటీ 2017లో ప్రభుత్వానికి కొన్ని సిఫార్సులు కూడా చేసింది. 35 లక్షలకు పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్నారు. ఈ స్కూళ్లలో ఫీజులు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. స్కూలును బట్టి రూ. 12 వేల నుంచి రూ. 4 లక్షల వరకూ వార్షిక ఫీజు వసూలు చేస్తున్నారు. కోవిడ్ తర్వాత ఇవి రెట్టింపు అయ్యాయి. ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దందాను నియంత్రించేందుకు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్తాన్, గుజరాత్, పశ్చిమబెంగాల్, పంజాబ్, ఉత్తరప్రదేశ్ సహా 15 రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తెచ్చాయి. ఇవి కూడా పెద్దగా అమలైన దాఖలాలు కన్పించడం లేదు.

అనవసర దోపిడీ...

మరోపక్క, స్కూల్ డెవలప్‌మెంట్ చార్జీలు, ఇతర ఖర్చులు కలిపి 15 శాతం ఏటా పెంచుకునేందుకు ఉమ్మడి ఏపీలో జీవోలిచ్చారు. ఇక్కడే సమస్య వస్తోంది. పెద్ద స్కూళ్లు అవసరం లేని ఖర్చును అభివృద్ధిగా చూపిస్తున్నాయి. ఒక స్కూల్లో ప్రతీ గదిలో అత్యాధునిక సౌండ్ సిస్టమ్, టెక్నాలజీ అభివృద్ధి చేశారు. దీన్ని విద్యార్థుల కోసం ఖర్చు పెట్టినట్టు లెక్కల్లో చూపారు. దీనివల్ల ఫీజులు 25 శాతం పెంచారు. 2018లో ఫీజుల నియంత్రణకు తిరుపతిరావు కమిటీ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసింది. దాదాపు 4,500 స్కూళ్లు తమ ఖర్చులను ఆన్‌లైన్ ద్వారా చూపాయి. ఇవన్నీ 10 శాతం లోపు ఫీజులు పెంచేందుకు అర్హత పొందాయి. అయితే, ఈ విధానం ఆ తర్వాత కనుమరుగైంది. పటిష్టమైన వ్యవస్థ ఏర్పాటు చేస్తే తప్ప ఫీజుల నియంత్రణ సాధ్యం కాదని కేంద్ర విద్యాశాఖ తన సూచనల్లో అభిప్రాయపడింది.

లిక్కర్ కేసులో అభిషేక్ పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అభిషేక్ బోయినపల్లి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఈ పిటిషన్ శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. అభిషేక్ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ పిటిషనర్ 15 నెలలుగా జైలులో ఉన్నారని, ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. అయితే నవంబర్‌లో పిటిషన్ విచారిస్తామని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సోమవారం విచారణకు వచ్చే ఇదే కేసులోని మరో నిందితుడు మనీష్ సిసోడియా పిటిషన్‌తో జత చేయాలని రోహత్గీ కోరగా, ధర్మాసనం నిరాకరించింది. నవంబర్ 20తో ప్రారంభమయ్యే వారంలో విచారిస్తామని వాయిదా వేసింది.

నేర్చుకున్న విషయాలు క్షేత్రస్థాయిలో అమలు చేయాలి

అటవీ అకాడమీ స్నాతకోత్సవంలో పీసీసీఎఫ్ ఆర్ఎం దోబ్రియాల్



సాక్షి, హైదరాబాద్: శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని పాసింగ్ అవుట్ అధికారులకు పీసీసీఎఫ్ ఆర్ఎం డోబ్రియాల్ పిలుపునిచ్చారు. దూలపల్లిలోని తెలంగాణ రాష్ట్ర అటవీ అకాడమీలో శుక్రవారం స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 21వ బ్యాచ్ అటవీ సెక్షన్ అధికారులు, 33వ బ్యాచ్ అటవీ బీట్ అధికారుల పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన డోబ్రియాల్ మాట్లాడుతూ...పరిస్థితుల నుంచి ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ వృత్తిని సమర్థవంతంగా నిర్వహించాలని ఆయన సూచించారు. పీసీసీఎఫ్ (హరితహారం) సి.సువర్ణ మాట్లాడుతూ..అటవీ శాఖలో గతంతో పోల్చితే మహిళా ఉద్యోగుల సంఖ్య పెరిగిందని, మానవ వనరుల వినియోగంలోనూ లింగ సమానత్వం దిశగా ఈ పరిణామం అత్యవసరమని తెలిపారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన అధికారులకు బంగారు పతకాలను, ప్రతిభాపత్రాలను పీసీసీఎఫ్ ప్రదానం చేశారు.


‘గులాబీల జెండలే రామక్క’ పాటని విడుదల చేసిన మంత్రులు

సింగర్స్‌ను అభినందించిన కేటీఆర్, హరీశ్‌రావు


పాట పాడిన మహిళలతో మంత్రులు హరీశ్, కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ చేసిన పోరాటం, రాష్ట్రఅభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ రూపొందించిన ‘గులాబీల జెండలే రామక్క’పాటని శుక్రవారం ప్రగతిభవన్‌లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు విడుదల చేశారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో పదేళ్లలో జరిగిన అభివృద్ధిని, తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను పాట రూపంలో కళ్లకు కట్టినట్టు చూపించే విధంగా ఉందని మంత్రులు ప్రశంసించారు. ఈమేరకు పాట పాడిన నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి నియోజకవర్గం, తాండ్ర గ్రామానికి చెందిన కొమ్ము లక్ష్మమ్మ, బొల్లె సుశీల, శాంతమ్మ, కలమ్మ, అనసూయలను అభినందించారు. కేసీఆర్ పాలనలో జరిగిన మంచి పనులు అందరికీ పాట రూపంలో అందజేయాలనే ఉద్దేశంతో ఈ పాటను పాడామని సింగర్స్ అన్నారు. కొమ్ము లక్ష్మమ్మ బృందానికి కేటీఆర్ పోచంపల్లి చీరలను బహూకరించారు. అలాగే ఈ పాటకు సంగీతాన్ని అందించిన మ్యూజిక్ డైరెక్టర్ కల్యాణ్ కీస్‌ను మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు. పాట విడుదలైన కొద్దిసేపట్లోనే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వందల కొద్ది లైక్లు, షేర్లతో సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అయింది. కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 204

శనివారం 14-10-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



నార్మల్ డెలివరీలు
'నార్మల్' కావాలి -6లో




ఎగుమతులు
3 శాతం డౌన్.. -7లో



విలువలతో కూడిన విద్య అవసరం

విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఓయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.రవీందర్ అన్నారు.

వివరాలు 2లో ▸



'బెల్ట్' తీస్తున్నారు!

గ్రేటర్‌లోని బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది.

వివరాలు 3లో ▸



కన్నీటి ధార

నగరంలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులకు విషమిచ్చి తాను ఉరివేసుకోగా.. ఓ తండ్రి ఇద్దరు కూతుళ్లను చంపి తానూ ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు 3లో ▸

ఖరీదైన కారు చోరీ

జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసిన ఖరీదైన కారును ఓ యువకుడు స్కూటీపై వచ్చి దొంగిలించి పరారయ్యాడు.

వివరాలు 3లో ▸



సందీప్.. సంథింగ్

నగర కొత్వాల్‌గా శాండిల్య



బాధ్యతలు స్వీకరిస్తున్న సందీప్ శాండిల్య

- గతంలో నగరంలో పని చేసిన అనుభవం
- ముక్కుసూటి అధికారిగా పేరున్న ఐపీఎస్
- ప్రస్తుతం పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా విధులు
- నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతల స్వీకరణ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ పోలీసు కమిషనర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా ఉన్న శాండిల్య శుక్రవారం నగర కొత్వాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల విధులు నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, పక్షపాత వైఖరితో వ్యవహరించడం తదితర ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం 13 మంది ఐపీఎస్ అధికారులపై వేటు వేసింది. వీరిలో హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ కూడా ఉన్న విషయం విదితమే. దీంతో ఈయన అదనపు సీపీ విక్రమ్ సింగ్ మాన్‌కు బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. నగర కమిషనరేట్ ఏర్పడిన తర్వాత కొత్వాల్‌గా పని చేసిన వారిలో శాండిల్య 59వ అధికారి. గతంలో ఆనంద్, మహేందర్‌రెడ్డి, అనురాగ్‌శర్మ సహా 57 మందికి పోలీసు కమిషనర్లుగా, వీవీ శ్రీనివాసరావు తాత్కాలిక కమిషనర్‌గా పని చేశారు. ఢిల్లీకి చెందిన సందీప్ శాండిల్య ఎంటెక్ పూర్తి చేశారు. 1993లో ఐపీఎస్ అధికారిగా పోలీసు విభాగంలోకి అడుగుపెట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా జిల్లా ఎస్పీగా పని చేశారు. నగరంలో మత ఘర్షణలు తీవ్రంగా ఉన్న రోజుల్లో పాతబస్తీలో విస్తరించి ఉన్న దక్షిణ మండల డీసీపీగా పని చేసిన అనుభవం ఆయనకు ఉంది. శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థుడైన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. నగరంలో క్రైమ్స్, సిట్ విభాగం అదనపు సీపీగా, సైబరాబాద్ పోలీసు కమిషనర్‌గా, జైళ్ళ శాఖ డీజీగా, రోడ్ సేఫ్టీ అండ్ రైల్వేస్ అదనపు డీజీగా పని చేసి ప్రస్తుతం పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.

ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యం

ప్రజలకు న్యాయం, శాంతిని అందించడమే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తానని సిటీ నూతన సీపీగా బాధ్యతలు చేపట్టిన సందీప్ శాండిల్య అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలను అందిస్తానని చెప్పారు. సాధారణంగా తనను మ్యాన్ ఆఫ్ కన్వెన్షనల్ పోలీస్‌గా పిలుస్తారని, అయితే పోలీసింగ్ వ్యవస్థలో సాంకేతికత వినియోగం కూడా ఆవశ్యకమేనన్నారు. క్షేత్ర స్థాయిలో నిత్యం పర్యవేక్షణ చేయడంతో పాటు కేసులు సరిగా నమోదు చేస్తున్నారా? లేదా? వంటి అంశాలపై నిఘా పెడతామన్నారు. ఎన్నికల కమిషన్ తనకు అప్పగించిన బాధ్యతను సజావుగా పూర్తి చేస్తానని ఆయన చెప్పారు.

కేసు దర్యాప్తులో తనదైన మార్కు..

ముక్కుసూటి మనిషిగా పేరున్న సందీప్ శాండిల్య.. శాంతిభద్రతల పరిరక్షణలో ఏనాడూ రాజీ పడలేదు. పాతబస్తీలో పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి రాజకీయ కురువృద్ధులతోనూ ఢీకొన్నారు. సంచలనం సృష్టించిన కేసుల దర్యాప్తు అంటే ఆయనకు ఎనలేని మక్కువ. కేవలం పర్యవేక్షించినా సరిపోయే అవకాశం ఉన్నప్పటికీ తన హోదాను మరిచి దర్యాప్తులో పాలు పంచుకోవడం శాండిల్య నైజం. బొటానికల్ గార్డెన్ వద్ద గోనె సంచిలో లభించిన గర్భిణి పింకి హత్య కేసు దర్యాప్తు ఆయన సైబరాబాద్ కమిషనర్‌గా ఉండగా జరిగిందే. హైదరాబాద్ కమిషనరేట్‌లో అదనపు సీపీగా (క్రైమ్స్ అండ్ సిట్) పని చేస్తున్నప్పుడే పాతబస్తీలోని మహంకాళి ఆలయంలో అమ్మవారి గుడిలో చోరీ జరిగింది. సీసీఎస్ పోలీసులు చేసిన ఈ కేసు దర్యాప్తులోనూ ఆయన నేరుగా పాలుపంచుకున్నారు. అన్ని వస్తువులూ దొరికినా అమ్మవారి బొట్టు ఆచూకీ చాలా రోజులు లభించలేదు. అప్పటి వరకు శాండిల్య కేసు ఫాలోఅప్ చేయడమూ మానలేదు. అలాగే అగ్నివీర్ పథకం ప్రకటన తర్వాత దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అలజడులు జరిగాయి. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై దాడి చేసిన ఆందోళనకారులు విధ్వంసం సృష్టించారు. ఆ సమయంలో రైల్వే విభాగం అదనపు డీజీ ఉన్న శాండిల్య నేరుగా రంగంలోకి దిగి పరిస్థితులు చక్కదిద్దారు. ఇలాంటి కేసులు ఆయన వృత్తిజీవితంలో అనేకం ఉన్నాయి.

మూర్తీభవించిన మానవత్వం...

సందీప్ శాండిల్య ఓ మూర్తీభవించిన మానవత్వం అనే పేరుంది. ఎస్పీగా పని చేస్తున్న కాలం నుంచి వచ్చే జీతంలో 90 శాతం తన వద్ద పని చేసే గన్‌మెన్లు, ఇతర సిబ్బందితో పాటు కొందరు బాధితులకు ఖర్చు చేస్తుంటారు. కాగా.. సందీప్ శాండిల్యకు ఇప్పటి వరకు మూడు కేంద్ర ప్రభుత్వ పతకాలు లభించాయి. విధి నిర్వహణలో ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు 2002లో ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ గ్యాలెంటరీ (పీఎంజీ), 2010లో ఉత్తమ సేవలకు ప్రెసిడెంట్స్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్, 2010లో ప్రెసిడెంట్స్ పోలీసు మెడల్ లభించాయి.



భారతి



గౌతమ్ పాట్రు

కొలువుదీరిన కొత్త కలెక్టర్లు

కేంద్ర ఎన్నికల సంఘం కన్నెర్రతో బదిలీ వేటుకు గురైన రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా భారతి హోళికేరి, మేడ్చల్ కలెక్టర్‌గా గౌతమ్ పాట్రు నియమితులయ్యారు.

- రంగారెడ్డి జిల్లా కొత్త కలెక్టర్ కొలువుదీరారు. హరీష్ స్థానంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న భారతి హోళికేరిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో మంచిర్యాల, మెదక్ కలెక్టర్‌గా ఆమె సేవలందించారు. ప్రభుత్వ ఉత్తర్వులు అందుకున్న ఆమె హుటాహుటిన కలెక్టరేట్‌కు చేరుకొని శుక్రవారం బాధ్యతలు స్వీకరించా రు. అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డి, డీఆర్‌ఓ సంగీత, ఏఓ ప్రమీల ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. చార్జీ తీసుకున్న వెంటనే నోడల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లు, అధికారులు వ్యవహరించాల్సిన తీరును వివరించారు. ముక్కుసూటితనం, విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించడం, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకపోవడం ప్రత్యేకతగా ఆమెకు పేరుంది.
- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌గా గౌతమ్ పాట్రు కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాయలంలోని చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ గౌతమ్ పాట్రు సెర్ప్ సీఈవోగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం గౌతమ్ జిల్లా ఎన్నికల అధికారిగా కూడా విధులు నిర్వహించనున్నారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన గౌతమ్‌ను జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు.

అక్రమ ద్రవ్య మార్పిడిపై

డేగకన్ను

నగరంలో జోరుగా హుండీ వ్యాపారం

- సూత్రధారులంతా ఇతర రాష్ట్రాల్లోనే
- ఎన్నికలతో నిఘా పెంచిన టాస్క్‌ఫోర్స్



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ... అక్రమ మార్గంలో నగదు మార్పిడి లావాదేవీలు నిర్వహిస్తున్న హుండీ ముఠాలపై నగర పోలీసులు డేగకన్ను వేశారు. ఎన్నికల సీజన్ నేపథ్యంలో వీరు తమ కార్యకలాపాలను మరింతగా విస్తరించవచ్చనే అనుమానంతో నిఘా పెంచారు. ఈ వ్యాపారానికి ఆస్కారం ఉన్న నగరంలోని అనేక ప్రాంతాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిశితంగా గమనిస్తున్నారు. ఫలితంగా గడిచిన మూడు రోజులుగా వరుసగా ముఠాలు పట్టుబడుతున్నాయి. వివిధ దేశాల మధ్య అక్రమ మార్గంలో ద్రవ్య మార్పిడి చే యడాన్ని హవాలా అని, దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య జరిగే ఈ మార్పిడిని హుండీ అని అంటారు.

పన్ను పోటును తప్పించుకునేందుకు..

- పన్ను పోటును తప్పించుకోవడానికి అనేక మంది వ్యాపారులు ఈ మార్గాన్ని ఎంచుకోవడం నిర్వాహకులకు కలిసి వస్తోంది. ఎన్నికల 'ఖర్చుల' కోసమూ అభ్యర్థులు హుండీని ఆశ్రయించే అవకాశం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో చిన్నా పెద్దా కలిపి మొత్తం 50కి పైగా హుండీ ముఠాలు ఉన్నట్లు ప్రాథమిక ఆధారాలు సేకరించారు. వీరి ద్వారా రోజుకు

- మిగతా 2లో ▸

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా జగన్‌మోహన్ రావు నామినేషన్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసేందుకు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు, ఆయన ప్యానెల్ సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం ఉదయం ఉప్పల్ స్టేడియంలో నామినేషన్లు సమర్పించిన అనంతరం జగన్‌మోహన్ రావు తమ ప్యానెల్ పేరును ప్రకటించారు. యునైటెడ్ మెంబర్స్ ఆఫ్ హెచ్‌సీఏ ప్యానెల్ నుంచి అధ్యక్షుడిగా జగన్‌మోహన్ రావు, ఉపాధ్యక్షుడిగా పి.శ్రీధర్, కార్యదర్శిగా ఆర్. హరినారాయణ, సంయుక్త కార్యదర్శిగా నోయల్ డేవిడ్, కోశాధికారిగా సి.జె శ్రీనివాస్, కౌన్సిలర్‌గా అన్వార్ అహ్మద్ ఖాన్ పోటీ చేస్తున్నారు.

అహింస ద్వారానే ప్రశాంత జీవనం సాధ్యం



చిత్ర ప్రదర్శనను తిలకిస్తున్న జర్మన్ ఎంబసీ డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్ జార్జ్ ఎంజ్‌వెల్లర్

బంజారాహిల్స్: అహింస ద్వారానే మనిషికి ప్రశాంత జీవనం సాధ్యమవుతుందని, గాంధీ మహాత్ముడు అహింస సిద్ధాంతంతోనే భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించి చరిత్రలో నిలిచిపోయారని భారత్‌లో జర్మనీ రాయబార కార్యాలయం డిప్యూటీ హెడ్ ఆఫ్ మిషన్ జార్జ్ ఎంజ్‌వెల్లర్ అన్నారు. శుక్రవారం రోడ్ నెం 3లోని గోతేజంత్రంలో ప్రముఖ చిత్రకారుడు కుల్వంతరాయ్ స్వాత్రంత్య ఉద్యమ సమయంలో గాంధీ ప్రయాణంపై తీసిన ఛాయా చిత్రాలతో కూడిన 'రిమెంబర్ ఇన్ ద గాంధీ-క్వశ్చనింగ్ ఇండియా' పేరుతో ఏర్పాటుచేసిన చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్రెయిన్, ఇజ్రాయిల్‌లో యుద్ధం దురదృష్టకరమని, ఈ తరుణంలో గాంధీజీ మార్గాన్ని అందరూ గుర్తుచేసుకోవాలన్నారు. తనకు భారత్‌తో ఎనలేని అనుబంధం ఉందని గుర్తుచేశారు. ఈ నెల 13 నుండి 15 వరూ కొనసాగే ప్రదర్శనలో భాగంగా చర్చాగోష్టిలు, 15న సినిమా ప్రదర్శనలు ఉంటాయని గోతేజంత్రం డైరెక్టర్ అమితా దేశాయ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ ఆదిత్య ఆర్య, క్యురేటర్ అభిన్ మాథ్యూస్ పాల్గొన్నారు.

డాక్టర్ దినకర్‌కు గ్లోబల్ హెల్త్‌కేర్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ దినకర్‌రెడ్డికి గ్లోబల్ హెల్త్ కేర్ అవార్డు లభించింది. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ ఈ అవార్డును అందజేశారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో దినకర్‌ను ఈ అవార్డు వరించింది.

విలువలతో కూడిన విద్య అవసరం

- ఉస్మానియా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ రవీందర్
- ఘనంగా ఎంవీఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో విద్యార్థికి పట్టా అందచేస్తున్న దృశ్యం.. వేదికపై ఓయూ వీసీ రవీందర్, లింబాద్రి, శ్రీధర్‌రావు, ఎస్‌జీఎస్ మూర్తి తదితరులు

బడంగ్‌పేట్: విద్యార్థులు ఒక లక్ష్యంతో ముందుకు సాగుతూ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొ. డి.రవీందర్ అన్నారు. ఇందుకు విద్యార్థులతోపాటు అధ్యాపకులు, ఆయా విద్యా సంస్థల నిర్వాహకులు సైతం కృషి చేయాలని పేర్కొన్నారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ ఎంవీఎస్ఆర్ (మాటూరి వెంకట సుబ్బారావు) ఇంజనీరింగ్ కాలేజీలో శుక్రవారం 2019–23 బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన రవీందర్ మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ నినాదం 'నిర్వహించు-సంస్కరించు-రూపాంతరించు' అనే సిద్ధాంతాలతో జీవితంలో ముందుకు పోవాలన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి మాట్లాడుతూ ఎంవీఎస్సార్ కళాశాలలో గత 42 ఏళ్లుగా నాణ్యమైన సాంకేతిక విద్యనందిస్తూ ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరాలన్నారు. కళాశాల చైర్మన్ డా.కె.పి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ కళాశాల నుంచి 25 వేల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పూర్తి చేయడం గర్వంగా ఉందన్నారు. ఏడాదికేడాది ఉత్తమ విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. కాలేజ్ ప్లేస్‌మెంట్స్ ద్వారా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందచేశారు. ఓయూ రిజిస్ట్రార్ పి.లక్ష్మీనారాయణ, టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, ఓయూ ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ డీన్ ఎం.కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీరామ్ వెంకటేష్, ఎంవీఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌జీఎస్ మూర్తి, సొసైటీ సెక్రటరీ ఎం.కృష్ణకుమార్, వైస్ చైర్మన్ పీవీ కష్యప్, జాయింట్ సెక్రటరీలు వాసుదేవరావు, ఉమాదేవి, కోశాధికారి జూపూడి సుధాకర్, మెంబర్లు పార్థసారథి, ఎంవీఎస్ పవన్ కుమార్, హిరణ్మయి, సాగరిక, వెంకటేశ్వర గుప్త , ప్రభాకర్, కళాశాల ప్రొఫెసర్లు ప్రసన్నకుమార్, వేణుగోపాల్ రావు ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మూర్తి ఈ కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహరించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో క్యాంపస్ సందడిగా మారింది.



నకిలీ విదేశీ మద్యం పట్టివేత

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాల విదేశీ బ్రాండ్‌ల పేరుతో విక్రయిస్తున్న నకిలీ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో డీటీఎఫ్ బృందం మాదాపూర్‌లోని పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది. మాదాపూర్‌లోని రత్నదీప్ సూపర్ మార్కెట్ సమీపంలో 21 నకిలీ విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అక్కడ నిందితుని నుంచి లభించిన సమాచారం మేరకు వెంకటగిరి, యూసుఫ్‌గూడలో ఉన్న నిందితుల ఇళ్లల్లో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ రెండో చోట్ల 31 నకిలీ విదేశీ మద్యం బాటిళ్లు, మరో 55 ఖాళీ బాటిళ్లు, వివిధ బ్రాండ్‌లకు చెందిన లేబుళ్లు, క్యాప్‌లు లభించాయి. గ్లెన్‌లివెట్, రాయల్ సెల్యూట్, గూస్ వోడ్కా, గ్లెన్‌ఫిడిక్ తదితర బ్రాండ్‌లకు చెందిన బాటిళ్లు లభించినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడులలో సంజయ్ సాంతల, మలయ పాత్రో, సంగ్రామ్ భారత్‌లను ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేసి కేసులు నమోదు చేశారు. బార్ టెండర్‌లుగా పనిచేస్తున్న నిందితులు వివిధ బ్రాండ్‌లకు చెందిన ఖాళీ బాటిళ్లను, లేబుళ్లను సేకరించి వాటిలో నకిలీమద్యం నింపి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ ప్రవీణ్‌కుమార్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, ఎన్.శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

వాల్యూ గోల్డ్ యూనిట్ ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: బంగారం, వెండి బులియన్ మర్చంట్స్‌లో సుమారు 120 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న క్యాప్స్‌గోల్డ్ సంస్థ.. కొత్తగా వాల్యూ గోల్డ్ యూనిట్‌ను ప్రారంభించింది. ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్, వాల్యూ గోల్డ్ డైరెక్టర్ అభిషేక్ చందా శుక్రవారం ఈ యూనిట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ బంగారం మార్పిడిలో పారదర్శకత, తక్షణ నగదు బదిలీలతో వాల్యూ గోల్డ్..గోల్డ్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో తుఫాను సృష్టిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి, సికింద్రాబాద్‌లలో కూడా మరో రెండు బ్రాంచీలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కస్టమర్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తాకట్టు బంగారం, డాక్యుమెంట్లను భౌతికంగా ధృవీకరించిన వెంటనే కొంత మొత్తాన్ని అడ్వాన్స్‌గా అందిస్తామని, ఆ తర్వాత బంగారాన్ని మూల్యాంకనం చేసి, మార్కెట్ విలువ ప్రకారం మొత్తం నగదును బదిలీ చేస్తామని చెప్పారు.

అక్రమ ద్రవ్య మార్పిడిపై

డేగకన్ను

- మొదటి పేజీ తరువాయి ▶

రూ.100 కోట్లకు పైనే చేతులు మారుతోందనే అనుమానాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. వ్యాపార కేంద్రాలుగా ఉన్న గోషామహల్, అబిడ్స్, బేగంబజార్, అమీర్‌పేట్, కోఠి, సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్, ట్రూప్‌బజార్, కాచిగూడ తదితర ప్రాంతాలను అడ్డాలుగా చేసుకుని ఈ ముఠాలు తమ వ్యవహారాలు కొనసాగిస్తున్నాయి. సూత్రధారులంతా గుజరాత్, ముంబైల్లోనే ఉంటున్నారు. వీరు ఫోన్లు, సోషల్‌మీడియా ద్వారా ఆదేశాలు జారీ చేస్తూ రూ.లక్షకు రూ.800 నుంచి రూ.1200 వరకు కమిషన్ తీసుకుంటూ దేశంలోని అనేక ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న అనుచరుల ద్వారా తమ వ్యవహారాలు సాగిస్తున్నారు.

ఎన్నికల వేళ కావడంతో..

సాధారణ సమయంలో ఈ కమీషన్ గరిష్టంగా రూ.300 నుంచి రూ.500 వరకే ఉంటుంది. ప్రస్తుతం ఎన్నికల సీజన్ కావడంతో నిర్వాహకులు అమాంతం పెంచేశారు. ఈ ముఠాలపై పోలీసులు దాడి చేసిన ప్రతి సందర్భంలోనూ కేవలం పాత్రధారులే పట్టుబడుతున్నారు. ఎన్నికలను ఆసరాగా చేసుకునే హుండీ ముఠాలు తమ కార్యకలాపాలను విస్తరించే ప్రమాదం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. అభ్యర్థులు సైతం ఈసీకి సమర్పించే లెక్కల్ని తప్పించుకోవడానికి ఈ మార్గాన్నే అనుమానిస్తారని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నగరంలోని కీలక ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేశారు. హవాలా, హుండీ వ్యాపారాలు జరిగే ప్రాంతాలపై టాస్క్‌ఫోర్స్ అధికారులు డేగకన్ను వేశారు. ఫలితంగా వరుసగా ముఠాలు చిక్కుతున్నాయి. నగరలలో ఇలాంటి వ్యవహారాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే స్థానిక పోలీసులకు లేదా ప్రధాన కంట్రోల్ రూమ్: 100, వాట్సాప్: 9490616555, సిటీ పోలీసు ఫేస్‌బుక్‌ల ద్వారా సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

సాక్షి హైదరాబాద్

శనివారం । 14 । అక్టోబర్ । 2023

ఎల్బీనగర్‌లో..



ఎర్రగడ్డలో..



సన్‌సిటీలో..



ఎన్నికల నేపథ్యంలో భాగంగా శుక్రవారం నగరంలో పోలీసులు పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. పెద్ద మొత్తంలో నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఆర్ట్స్ కాలేజీ వద్ద..



గన్‌ఫౌండ్రీ వద్ద..



బహుజన బతుకమ్మ

అరుణోదయ అధ్యక్షురాలు విమలక్క ఆధ్వర్యంలో శుక్రవారం బహుజన బతుకమ్మ ఉత్సవాలను ప్రారంభించారు. ఈమేరకు ఓయూ క్యాంపస్, అసెంబ్లీ సమీపంలోని గన్‌పార్కు వద్ద కళాకారులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడారు. మన పండుగలపై ప్రజా చైతన్యం కోసమే బహుజన బతుకమ్మ వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

- ఉస్మానియా యూనివర్సిటీ/గన్‌ఫౌండ్రీ

ఖరీదైన కారు చోరీ

దసపల్లా హోటల్ పార్కింగ్ నుంచి కారు తీసుకువెళ్లిన యువకుడు

- నిర్మాత దిల్‌రాజు అల్లుడిదిగా గుర్తింపు
- గంట వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు



చోరీకి గురైన పోర్షే కారు



నిందితుడు మల్లెల సాయి కిరణ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్ పార్కింగ్ స్థలంలో పార్కింగ్ చేసిన ఖరీదైన కారును ఓ యువకుడు స్కూటీపై వచ్చి దొంగిలించి పరారయ్యాడు. దీనిపై సమాచారం అందుకున్న క్రైం పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా గంట వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సినీ నిర్మాత దిల్‌రాజు అల్లుడు అర్చిత్ రెడ్డి శుక్రవారం ఉదయం తన పోర్షే కారులో (టీఎస్ 10 ఎఫ్‌డీ 0036) దసపల్లా హోటల్‌కు వెళ్లాడు. అదే సమయంలో ఎల్బీనగర్ మన్సూరాబాద్‌కు చెందిన మల్లెల సాయికిరణ్(30) అనే యువకుడు టీఎస్ 07 హెచ్‌వీ 7534 స్కూటీపై వచ్చి హోటల్ పార్కింగ్ ఆవరణలో ఓ పక్కన స్కూటర్‌ను పార్క్ చేసి ఖరీదైన కార్లను దొంగిలించేందుకు పథకం వేశాడు. అప్పటికే గంట నుంచి తనకు నచ్చిన కారును దొంగిలించే ఉద్దేశంతో పార్కింగ్ స్థలంలో వేచి ఉండగా అర్చిత్ రెడ్డి తళతళ మెరుస్తున్న తన పోర్షే కారులోనుంచి దిగి హోటల్‌లోకి వెళ్లాడు. నచ్చిన కారు కళ్ల ముందు కనిపించడంతో సాయి కిరణ్ తన చేతికి పనిచెప్పాడు. క్షణాల్లోనే ఆ కారును తీసుకొని అక్కడి నుంచి ఉడాయించాడు. పావుగంటలో కిందికి వచ్చిన అర్చిత్ రెడ్డి అక్కడ తన కారు కనిపించకపోయేసరికి ఆందోళన చెంది సిబ్బందిని ప్రశ్నించగా సమాధానం లేదు. వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. జూబ్లీహిల్స్ డీఐ వీరశేఖర్, ఎస్‌ఐ రాజశేఖర్ రంగంలోకి దిగారు. అక్కడి నుంచి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కారు నెంబర్ ఆధారంగా నీరూస్ చౌరస్తా నుంచి ఈ కారు పెద్దమ్మ గుడి వైపు వెళ్లినట్లుగా గుర్తించారు. అక్కడి నుంచి వరుసగా సీసీ కెమెరాలు చూస్తుండగా అంతకు కొద్దిసేపటి ముందే జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు నుంచి బంజారాహిల్స్ వైపు వెళ్తున్నట్లు నిర్ధారించారు. వెంటనే కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్ పోలీసులకు కారు నెంబర్, కలర్ చెప్పి అప్రమత్తం చేశారు. అప్పటికే రంగంలోకి దిగిన ట్రాఫిక్ పోలీసులు అటు వైపు నుంచి దూసుకొస్తున్న కారును ఆపి పోలీసులకు అప్పగించారు. నిందితుడిని ప్రశ్నించగా మానసిక స్థితి సరిగ్గా లేనట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. తనకు ఈ కారును తీసుకురావాలని కేటీఆర్ చెప్పారని ఒకసారి, తాను ఆకాశ్ అంబానీ మేనేజర్‌ను అని మరోసారి, తనకు హృతిక్ రోషన్ మేనేజర్ అంటూ మరోసారి రకరకాల పొంతలేని జవాబులు చెప్పడంతో ఆయన మానసిక స్థితిపై పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. గతంలో కూడా వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఓ క్రిమినల్ కేసు నమోదై ఉన్నట్లు నిర్ధారించారు. నిందితుడిని అరెస్ట్ చేశారు. కారును స్వాధీనం చేసుకొని బాధితుడికి అప్పగించారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కన్నీటి ధార

పిల్లల అంగ వైకల్యం తట్టుకోలేని మాతృమూర్తి

- ఇద్దరు కుమారులకు విషమిచ్చిన తల్లి
- తానూ ఉరివేసుకుని బలవన్మరణం
- బోరబండ రాజ్‌నగర్‌లో పెను విషాదం
- ఓల్డ్ బోయిన్‌పల్లిలో మరో దారుణం
- ఇద్దరు కూతుళ్లకు నిద్రమాత్రలిచ్చిన తండ్రి
- ఆ తర్వాత తానూ విషం తాగి ఆత్మహత్య
- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణాలు

నగరంలో రెండు ఉదంతాల్లో ఆరుగురి మృతి

సంతానాన్ని అల్లారుముద్దుగా పెంచుకుంటూ.. వారే తమ లోకంగా బతుకుతున్న కన్నవారు కడుపుకోతకు ఒడిగట్టారు. చంటిపాపల కంటిరెప్పలను శాశ్వతంగా మూసేశారు. పేగు బంధాన్ని తుంచేసుకున్నారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఆరుగురి ప్రాణాలను బలిగొన్నాయి. నగరంలో శుక్రవారం చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఉదంతాల్లో నలుగురు చిన్నారులు సహా ఓ తల్లి, ఓ తండ్రి అసువులు బాయడం తీవ్ర విషాదాన్ని నింపింది. రహమత్ నగర్ పరిధి బోరబండలో ఓ తల్లి తన ఇద్దరు కుమారులకు విషమిచ్చి.. ఆ తర్వాత తాను ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇద్దరు పిల్లలు, భార్య చనిపోవడంతో ఇంటి పెద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కంటోన్మెంట్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఓ తండ్రి తన ఇద్దరు కూతుళ్లకు నిద్రమాత్రలు ఇచ్చి.. తాను విషం తాగి బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఒకేరోజు ఆరుగురు వ్యక్తులు మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.

- రహమత్‌నగర్/కంటోన్మెంట్

ఆమె ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. కష్ట పడి చదివి ఉద్యోగం సాధించారు. పెద్దలు కుదిర్చిన మేనరికం పెళ్లి చేసుకుంది. సొంత మేనబావనే మనువాడింది. వారికి ఇద్దరు మగ పిల్లలు. మేనరికం కారణంగా ఒక బాబుకు బుద్ధిమాంద్యం, మరోబాబుకు అంగవైకల్యం ఏర్పడింది. తమ పిల్లల దీనస్థితి చూసి చలించిపోయేవారు. మేనరికం మూలంగా జరిగిన అనర్థం తలుచుకుంటూ దిగులు చెందేవారు. ఈ క్రమంలోనే ఇటీవల ఇంట్లో గొడవ జరగడం ఆమెను మరింత కలచి వేసింది. తాను మరణిస్తే.. తమ పిల్లలు దిక్కులేని వారవుతారని భావించి.. పిల్లలను ముందు చంపి.. ఆ తర్వాత తానూ తనువు చాలించిన విషాద ఘటన రహమత్ నగర్ పరిధిలోని బోరబండ డివిజన్ రాజ్‌నగర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దూరుకు చెందిన జ్యోతికి ఆరున్నరేళ్ల క్రితం నగరంలోని బోరబండ డివిజన్ రాజ్‌నగర్‌కు చెందిన ఆమె మేనబావ విజయ్ (కాంట్రాక్టర్)తో వివాహమైంది. కాగా.. జ్యోతి (34) బంజారాహిల్స్ ఎంబీటీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు అర్జున్ (4), ఆదిత్య (2) ఉన్నారు.



జ్యోతి



అర్జున్



ఆదిత్య (ఫైల్)

మేనరికపు వివాహం.. పిల్లలకు బుద్ధిమాంద్యం..

మేనరికపు పెళ్లి కారణంగా పెద్దబ్బాయికి బుద్ధిమాంద్యం, చిన్న అబ్బాయికి అంగవైకల్యం ఏర్పడింది. వీరికి చికిత్స సైతం అందిస్తున్నారు. మేనరికం మూలంగా తమ పిల్లలు ఇలా అనారోగ్యం బారిన పడటం జ్యోతిని మానసిక క్షోభకు గురిచేసేది. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం జ్యోతితో ఆమె మామ గొడవకు దిగాడు. ఈ ఘటన ఆమెను మరింత కలచి వేసింది. ఈ క్రమంలోనే శుక్రవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో అప్పటికే ఇంట్లో ఉంచిన విషాన్ని పిల్లలకు పాలల్లో తాగించి.. తాను కిటికీకి ఉరి వేసుకుంది. అప్పటికే జ్యోతి మృతి చెందగా, ఇరుపొరుగు వారు పిల్లలను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే వారు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. భార్య, ఇద్దరు కుమారులు చనిపోవడంతో జ్యోతి భర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు చెప్పారు. ఒకే కుటుంబంలో ముగ్గురు బలవర్మణం చెందడంతో బస్తీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ కామల్ల రవి కుమార్ పేర్కొన్నారు.



జ్యోతి, బాలుడి మృతదేహాలు

స్రవంతి, శ్రావ్య మృతదేహాలు







శ్రీకాంతాచారి

కంటోన్మెంట్ పరిధి ఓల్డ్ బోయిన్‌పల్లి భవాని నగర్‌లో ఇద్దరు కూతుళ్లకు నిద్రమాత్రలు ఇచ్చి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీకాంతాచారి అనే వ్యక్తికి భార్య అక్షయ, ఇద్దరు కుమార్తెలు స్రవంతి (8), శ్రావ్య (7) ఉన్నారు. సికింద్రాబాద్‌లో సిల్వర్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి భోజనాలు చేసిన తర్వాత శ్రీకాంతా చారి, భార్య కూతుళ్లతో మేడపై ఉన్న గదిలో నిద్రపోయారు. వేకువ జామున 4 గంటల సమయంలో శ్రీకాంతా చారి తన భార్య అక్షయకు సైతం నిద్రమాత్రలు కలిపిన నీళ్లు తాగించేందుకు యత్నించాడు. విషపు నీళ్లను తాగేందుకు ఆమె నిరాకరించింది. కానీ.. అప్పటికే ఆమె నోట్లోకి ఆ నీళ్లు చేరిన కారణంగా స్పృహ కోల్పోయింది. ఉదయం 5 గంటల సమయానికి ఆమెకు మెలకువ వచ్చి చూడగా భర్త, చిన్న కూతురు బెడ్‌పై, చిన్న కూతురు బాత్రూమ్‌లో విగత జీవులుగా పడి ఉన్నారు. వెంటనే కింది పోర్షన్‌లో ఉండే అత్త, ఆడపడుచులను నిద్ర లేపి విషయం తెలిపింది. వారంతా పైకి వెళ్లి చూసే సరికే ముగ్గురూ పడిపోయి ఉన్నారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలికి వెళ్లి పంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులే కారణమా?

సిల్వర్ వర్క్ చేస్తూ జీవనం సాగించే శ్రీకాంతాచారికి ఇటీవల బిజినెస్ సరిగా నడవడం లేదని తెలుస్తోంది. ఇదే విషయమై తరచూ బాధపడుతూ ఉండేవాడని మృతుడి భార్య, తల్లి జయమ్మ తెలిపారు. భార్యాభర్తల మధ్య కూడా ఎలాంటి వివాదాలు లేవని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆయన మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఇద్దరు కూతుళ్లు, తండ్రి మృతదేహాలను చూసిన స్థానికులు సైతం కన్నీటిపర్యంతమయ్యారు.

నవంబర్ 26న 'మిసెస్ మామ్' కాంటెస్ట్ గ్రాండ్ ఫినాలే

గచ్చిబౌలి: మిసెస్ మామ్‌ను గర్భిణీల సంక్షేమం కోసమే నిర్వహిస్తున్నట్లు కిమ్స్ కడల్స్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ శిల్పిరెడ్డి తెలిపారు. శుక్రవారం కొండాపూర్ కిమ్స్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మిసెస్ మామ్ ఏడో సీజన్ వివరాలను ఆమె వెల్లడించారు. ఈసారి హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, విశాఖపట్టణం నగరాల్లో మిసెస్ మామ్ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కాబోయే తల్లులు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని సమర్థంగా ఎదుర్కోవడం, తద్వారా మాతృత్వాన్ని ఆస్వాదించడం ఎలాగో తెలుసుకునేందుకు మిసెస్ మామ్ కాంటెస్ట్ ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. అక్టోబర్15న బెంగళూర్, 29న చెన్నైలో, నవంబర్ 5న విశాఖపట్టణంలో, నవంబర్ 19,24,25 తేదీల్లో అడ్మిషన్లు జరుగుతాయన్నారు. నవంబర్ 26న గచ్చిబౌలిలోని శాంతి సరోవర్‌లో మిసెస్ మామ్ గ్రాండ్ ఫినాలే నిర్వహిస్తామని ఆమె ప్రకటించారు. వివరాలకు 9503606049 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

జీహెచ్ఎంసీ ఆఫీసులో 'సువిధ' సెంటర్ ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికలకు సంబంధించిన అనుమతుల దరఖాస్తుల కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో 'సువిధ' సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో సువిధ యాప్ ద్వారా సింగిల్ విండో ద్వారానే ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, ర్యాలీలు, వాహనాలు, తాత్కాలిక ఎన్నికల కార్యాలయాలు, లౌడ్ స్పీకర్లు, హెలికాప్టర్లు, హెలిప్యాడ్, డోర్ టు డోర్ ప్రచారం తదితరమైన వాటికి దరఖాస్తు చేసుకోవచ్చు. నామినేషన్లు ప్రారంభమయ్యాక పోటీ చేసే అభ్యర్థుల సౌలభ్యం కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌తో పాటు భౌతికంగా కూడా అభ్యర్థులు సువిధ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నాక 48 గంటల్లోగానే అనుమతులు జారీ అవుతాయన్నారు. ఇందుకుగాను షిఫ్టు సిస్టమ్‌లో 24 గంటల పాటు సిబ్బంది పనిచేస్తారు.

15 నుంచి పెద్దమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ శ్రీ పెద్దమ్మ దేవాలయంలో ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుకుగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 15వ తేదీన ఉదయం 3 గంటలకు శ్రీ పెద్దమ్మ వారికి అభిషేకం అనంతరం ఉత్సవ పూజలు ప్రారంభం అవుతాయి. ఈ నెల 22న చండీహోమం, 23న పూర్ణాహుతి జరుగుతాయి. ఇదిలా ఉండగా అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 15న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా, 16న శ్రీ గాయత్రీ దేవి, 17న శ్రీ అన్నపూర్ణాదేవి, 18న శ్రీ గజలక్ష్మీ దేవి, 19న శ్రీ లలితాదేవి, 20న శ్రీ సరస్వతీ దేవి, 21న శ్రీ రాజరాజేశ్వరి దేవి, 22న శ్రీ దుర్గా దేవి, 23న శ్రీ మహిషాసుర మర్దినీదేవి, శ్రీ పెద్దమ్మతల్లి అలంకారంలో దర్శనమిస్తారు. అలాగే ఈ నెల 23న సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు శ్రీలలితా సహస్రనామ పారాయణం, ఈ నెల 16 నుంచి 21వ తేదీ వరకు ప్రతీరోజూ ఉదయం 11 గంటలకు శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చనలు వైభవోపేతంగా నిర్వహించనున్నారు.



భారీ బందోబస్తు

పాలస్తీనా- ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం నగరంలోని మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

- చార్మినార్



'బెల్ట్' తీస్తున్నారు!

గ్రేటర్‌లో బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం

- పెద్ద ఎత్తున మద్యం స్వాధీనం
- ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తమైన ఆబ్కారీశాఖ
- గల్లీలు, బస్తీలు, పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో విస్తృత తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లోని బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ఎన్నికల నేపథ్యంలో మద్యం అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. ఎన్నికల ప్రకటన వెలువడడానికి కొద్ది రోజుల ముందు వరకు కూడా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న బెల్ట్‌షాపుల్లో రాత్రింబవళ్లు మద్యం విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. ఎన్నికల దృష్ట్యా బెల్ట్‌షాపులపైన, మద్యం నిల్వలపైన ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఎక్సైజ్ అధికారులపైన ఆరోపణలు వ్యక్తమయ్యాయి. దీంతో అధికారులు రంగంలోకి దిగారు. బెల్ట్‌షాపులపైన సీరియస్‌గా దృష్టి సారించారు. సాధారణ జనావాసాలకు చేరువలో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న కిరాణా దుకాణాలు, హోటళ్లు, తదితర కేంద్రాలపైన సోదాలు నిర్వహించి పెద్దసంఖ్యలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ అధికారి ఒకరు వివరించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు బెల్ట్‌షాపుల్లో పెద్ద ఎత్తున మద్యం నిల్వ చేసే అవకాశం ఉన్నందువల్ల దాడులను ఉధృతం చేసినట్లు పేర్కొన్నారు. నగరంలో చాలాకాలంగా బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు కొనసాగుతున్నప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సాధారణంగా వైన్‌షాపుల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలు జరుగుతాయి. బెల్ట్ షాపుల్లో మాత్రం 24 గంటల పాటు మద్యం అందుబాటులో ఉంటుంది. నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరలకు మద్యం విక్రయిస్తారు. తాజాగా ఎన్నికల దృష్ట్యా విమర్శలు రావడంతో 'బెల్ట్' తీసేందుకు చర్యలు చేపట్టారు. గ్రేటర్ పరిధిలో సుమారు 600 మద్యం దుకాణాలు ఉన్నాయి. బెల్ట్‌షాపులు మాత్రం కనీసం 2000 వరకు ఉన్నట్లు అంచనా.

అడుగడుగునా అడ్డాలే...

కొంతమంది వ్యాపారులు ఇళ్లల్లోనే మద్యం నిల్వ చేసి ఇంటికి సమీపంలో స్థావరాలను ఏర్పాటు చేసుకొని విక్రయిస్తుండగా, కొన్ని చోట్ల పాన్‌షాపులు, చిన్న చిన్న హోటళ్లు, కిరాణా దుకాణాలు సైతం బెల్ట్‌షాపులకు ప్రధాన అడ్డాలుగా మారాయి. అలాగే నగరంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లు, పలు చోట్ల లోకల్ రైల్వేస్టేషన్‌లు కూడా మద్యంవిక్రయాలకు నిలయాలుగా మారాయి. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రయాణికుల తరహాలోనే బ్యాగుల్లో మద్యం బాటిళ్లతో వచ్చి విక్రయిస్తారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి, జూబ్లీబస్‌స్టేషన్ నుంచి పికెట్‌కు వెళ్లే దారిలో, లాలాగూడ బ్రిడ్జి కింద, మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌కు సమీపంలో బెల్ట్‌షాపుల ద్వారా కొంతకాలంగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. అలాగే ఉప్పల్ నుంచి చిలుకానగర్‌కు వెళ్లే దారికి ఇరువైపులా బెల్ట్ షాపులు ఉండేవని, కొద్ది రోజులుగా అమ్మకాలు ఆగాయని స్థానికులు తెలిపారు. ప్రయాణికుల రాకపోకలు తగ్గుముఖం పట్టిన తరువాత ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్లు సైతం మద్యం విక్రయాలకు అడ్డాలుగా మారుతున్నట్లు గతంలో ఫిర్యాదులు వచ్చాయి. కొన్ని చోట్ల వైన్‌షాపులకు అనుబంధంగానే బెల్ట్‌షాపులు నడుస్తున్నాయి.

ఎన్నికల వరకేనా...

బెల్ట్ షాపులపైన చర్యలు తీసుకోవడం పట్ల వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో మహిళలు, పిల్లలు బయట తిరిగేందుకు అవకాశం కూడా లేకుండా మందుబాబుల ఆగడాలు సాగేవి. ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుతం బెల్ట్ షాపులపైన చర్యలు తీసుకున్నప్పటికీ ఎన్నికల అనంతరం తిరిగి ఏర్పాటు చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బెల్ట్‌షాపులను మూసివేయాలని స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

> కుంతీకుమారా! ఇంద్రియాల ద్వారా కలిగే విషయ స్పర్శలే శీతోష్ణ, సుఖదుఃఖాలను కలిగిస్తాయి. అవి వస్తూ పోతుంటాయి. నిలకడలేనివి. వాటిని సహించాలి.
> – భగవద్గీత

సాక్షి

శనివారం, 14 అక్టోబర్ 2023

ఆకలి సూచీలో అధోగతి!

ఎన్నో విజయాలు సాధిస్తున్నాం... అయిదు లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ ఎంతో దూరంలో లేదని చెప్పుకొంటూనే ఉన్నాం. కానీ ఆకలి భూతాన్ని అంతం చేయటంలో వెనకబడే ఉన్నామని ఏటా వెలువడుతున్న అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. గత నెలలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ప్రపంచ ఆహార కార్యక్రమం చీఫ్ సిండీ మెకెయిన్ మాటలు విన్నా, తాజాగా ప్రపంచ ఆకలి సూచీ (జీహెచ్ఐ)ని గమనించినా మన పరిస్థితి ఏమంత మెరుగ్గా లేదని అర్థమవుతుంది. జీహెచ్ఐ జాబితాలో మొత్తం 125 దేశాలు వుంటే, అందులో మన స్థానం 111. నిరుటికన్నా నాలుగు స్థానాలు కిందకు దిగజారామని ఆ నివేదిక చెబుతోంది. 2015 వరకూ ఎంతో పురోగతి సాధించిన భారత్ ఆ తర్వాత వరసగా నేల చూపులు చూస్తుందన్నది దాని సారాంశం. భారత్‌కు సంబంధించినంతవరకూ ఇది వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించటం లేదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే చెబుతోంది. అసలు జీహెచ్ఐ కోసం నిర్దేశించిన ప్రమాణాలు, తీసుకుంటున్న నమూనాలు, మొత్తంగా ఆ ప్రక్రియ సక్రమంగా లేదని కేంద్రం ఆరోపణ. ప్రపంచంలో 2030 నాటికి ఆకలన్నదే ఉండరాదన్నది ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో ఒకటి. కేవలం ఆహారం లభించటం ఒక్కటే ఆకలి లేదనటానికి గీటురాయి అనుకోవటానికి లేదనీ, ఆ లభిస్తున్న ఆహారంలో మనిషికి అవసరమైన కేలరీలు వుండాలనీ సమితి వివరించింది. మరో ఏడేళ్లకల్లా ప్రపంచ దేశాలన్నీ ఈ లక్ష్యాన్ని అందుకోవలసి వుండగా అనేక దేశాలు ఇంకా వెనకబడే ఉన్నాయని జీహెచ్ఐ అంటున్నది. జాబితా గమనిస్తే పాకిస్తాన్ 102తో మనకన్నా మెరుగ్గా వుండగా, బంగ్లాదేశ్ (81), నేపాల్ (69), శ్రీలంక (60) దాన్ని మించిన మెరుగుదలను చూపించాయి. 28.7 స్కోర్‌తో ఆకలి తీవ్రత భారత్‌లో చాలా ఎక్కువగా ఉందన్నది జీహెచ్ఐ అభియోగం. పౌష్టికాహార లోపంలోనూ 16.6 స్కోర్‌తో మనం చాలా కింది స్థాయిలో వున్నాం. అయిదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు 3.1గా ఉందని నివేదిక వివరిస్తోంది.

మొన్న ఫిబ్రవరి 1న వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ కరోనా మహమ్మారి విరుచుకుపడిన సమయంలో 80 కోట్లమందికి పైగా ప్రజానీకానికి ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై) ఆహారధాన్యాలు అందించామనీ, కానీ 2022–23లో ఆహార సబ్సిడీల బిల్లు రూ. 2.87 లక్షల కోట్లకు చేరుకున్నందున అదనంగా ఇచ్చే ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ నిలిపేశామనీ కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పౌష్టికాహారలోపం కేవలం ఆహారధాన్యాలు ఉచితంగా అందించటం వల్ల మాత్రమే తీరేది కాదు. అవసరమైన పోషకాహారాన్ని అందించటంతో పాటు మహిళా విద్య, శిశు సంరక్షణ, మెరుగైన పారిశుద్ధ్యం, సురక్షితమైన మంచినీరు లభించేలా చూడటం వంటివి ప్రధాన పాత్ర పోషిస్తాయి. కానీ ఈ రంగాలన్నిటా నిరుటితో పోలిస్తే ఈ ఏడాది బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు ఏపాటి? సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) పేరు మారి సక్షమ్ అంగన్‌వాడీ, పోషణ్ 2.0 అయింది. కానీ గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి ఒక శాతం తగ్గి 20,554 కోట్లకు పరిమితమైంది. ప్రధానమంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (మధ్యాహ్న భోజన పథకం)కు నిరుడు రూ. 12,800 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో అది రూ. 11,600 కోట్లకు తగ్గింది. బాలికల విద్యకు నిరుటితో పోలిస్తే కేవలం 0.2 శాతం పెంచి రూ. 37,453 కోట్లకు సరిపెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో బేటీ బచావో, బేటీ పఢావో, వన్ స్టాప్ సెంటర్ (ఓఎస్‌సీ) తదితర పథకాలతో కూడిన సంబాల్ స్కీమ్‌కైతే కేటాయించిన నిధులు మిగిలిపోయాయి. మహిళలకు అందించే ఇలాంటి పథకాలైనా, శిశువులకు ఉద్దేశించిన పథకాలైనా పరిస్థితిని మెరుగుపరచగలవు.

జీహెచ్ఐ సూచీ ప్రాతిపదికలు, మొత్తంగా అది రూపొందించే ప్రక్రియ లోపరహితమైనదని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను పూర్తిగా కొట్టిపారేయనవసరం లేదు. ఎందుకంటే ఇంత జనాభా గల దేశంలో పౌష్టికాహార లోపాన్ని గణించటానికి కేవలం 3,000 మంది వివరాలు మాత్రమే తీసుకుంటే అది సంపూర్ణ చిత్రాన్ని ఆవిష్కరించగలుగుతుందా? తీవ్రమైన పోషకాహారంతో పిల్లలు అతి బలహీనంగా వుండటం జీహెచ్ఐ సూచీ ప్రకారం 18.7 శాతం వుండగా, మన పోషణ్ ట్రాకర్ యాప్ ద్వారా ప్రతి నెలా సాగిస్తున్న పర్యవేక్షణలో అది కేవలం 7.2 శాతానికి పరిమితమైందని ప్రభుత్వం చెబుతోంది. అలాగే 80 కోట్లమందికి పైగా ప్రజానీకానికి గరీబ్ కల్యాణ్ అన్న యోజన కింద 11 లక్షల 80 వేల టన్నుల ఆహారధాన్యాలను 28 నెలలపాటు అందించామని కూడా వివరించింది. అలాగే పోషకాహార లోప సవాల్‌ను ఎదుర్కొనడానికి వివిధ పథకాల కింద ఎంతో చేస్తున్నామంటున్నది. జీహెచ్ఐ సూచీకి తీసుకున్న నమూనాలు సక్రమంగా లేవనడం వరకూ ఏకీభవించొచ్చు. అయితే నివేదికే పక్షపాతంతో వున్నదనీ, భారత్ ప్రతిష్టను దెబ్బతీయడమే దీని లక్ష్యమనీ అనడం సరికాదు. ఎందుకంటే ఇదే ప్రక్రియ సూచీలోని 125 దేశాల్లోనూ అమలు పరిచివుంటారు. దేశ జనాభాలో నిర్దిష్టంగా ఫలానా శాతం అని పెట్టుకుని దాని ప్రకారం నమూనాలు తీసుకుంటే ఈ సూచీ వెల్లడిస్తున్న అంశాలు వాస్తవానికి మరింత చేరువగా ఉండేవనటంలో సందేహం లేదు. ఒకపక్క బడ్జెట్ కేటాయింపుల్లో, కేటాయించిన నిధులు వ్యయం చేయటంలో మనం సక్రమంగా లేమని అర్థమవుతున్నప్పుడు ఆకలి సూచీ వంటివాటిపై ఆరోపణలు చేయటంవల్ల ఉపయోగం లేదు. పోషకాహారం విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య వ్యత్యాసం వుంది. రాష్ట్రాల్లో ప్రాంతాలవారీగా కూడా తేడాలున్నాయి. ఇవన్నీ సరిచేసుకుంటే నిస్సందేహంగా మెరుగుపడతాం. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు చేరవవుతాం. ఆ దిశగా ప్రభుత్వాలన్నీ దృష్టి పెట్టాలి.

పశ్చిమాసియా ప్రభావం పడనుందా?

విశ్లేషణ


సుష్మా రామచంద్రన్

ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య మొదలైన యుద్ధ ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ఉండనుంది. ఆర్థిక వ్యవస్థ ఇప్పటికే మందగమనంలో ఉండగా, ఈ పరిస్థితులను ఈ సంక్షోభం మరింత దిగజార్చనుంది. రానున్న రోజుల్లో ఈ అంశాలపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ముడిచమురు ధరలు పైకి ఎగబాకడం మొదలైంది. సంక్షోభం తొందరగా ముగియకపోతే సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రభావం తప్పదు. భారత్ విషయానికి వస్తే, భారతీయ మార్కెట్లు బాహ్య ఘటనల ఒత్తిడిని తట్టుకుని నిలిచాయని ప్రపంచబ్యాంకు లాంటివి ప్రశంసించాయి. కానీ, ఈ ధోరణి ఎంత కాలం కొనసాగుతుందనేది వేచి చూడాల్సిన అంశం.

ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయినా అమెరికాలో ద్రవ్యోల్బణ పరిస్థితి కొంచెం సర్దుకున్న నేపథ్యంలో ఫెడరల్ రిజర్వ్ ఈ మధ్యే వరుస వడ్డీ రేట్ల పెంపునకు బ్రేక్ వేసింది. ఈ పరిణామాల ప్రభావానికి భారత్ అతీతంగా ఉండే అవకాశం లేదు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత్ దాస్ గత వారమే ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు నెమ్మదించడాన్ని ప్రస్తావిస్తూ భౌగోళిక, రాజకీయ పరమైన ఉద్రిక్తతలు దేశీయ అంచనాలను తల్లకిందులు చేసే అవకాశం లేకపోలేదని హెచ్చరించారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న దహనకాండ ఈ ఏడాది అంచనాలను, వృద్ధిపై ఉన్న సానుకూల దృక్పథాన్ని కచ్చితంగా దెబ్బ తీయనుంది. అంతేకాదు... రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం పెద్దగా సోకని దేశంగా భారత్‌కు ఉన్న మంచిపేరు కూడా దెబ్బతినే అవకాశాలు లేకపోలేదు.

రెండవ అంతర్జాతీయ స్థాయి ఘర్షణ...

2023–24 సంవత్సరానికిగాను రిజర్వ్ బ్యాంక్ గవర్నర్... భారత్‌పై ఎక్కువ అంచనాలే పెట్టుకున్నట్లు కనిపిస్తుంది. ప్రపంచానికి గ్రోత్ ఇంజిన్‌గా భారత్‌ను అభివర్ణించారు ఆయన. అంతర్జాతీయ అంశాలను పరిగణనలోకి తీసుకున్నా, ఈ ఏడాది జీడీపీ వృద్ధి 6.5 శాతం ఉంటుందని పునరుద్ఘాటించారు. కానీ, అతితక్కువ కాలంలో ప్రపంచం రెండో యుద్ధాన్ని చూస్తోంది. ఈ ఘటన పర్యవసానాలు కచ్చితంగా ఎదుర్కోక తప్పదు. రష్యా, ఉక్రెయిన్ల మధ్య యుద్ధం మొదలై రెండేళ్లు కావస్తోంది. ఎప్పుడు ముగుస్తుందో చెప్పలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థలో ఇప్పటికే ఉన్న పలు లోపాలు పరిస్థితిని అధ్వాన్నం చేయనున్నాయి. ఈ క్రమంలో మొదటగా మర్చండైజ్ (వస్తువులు) ఎగుమతులు తగ్గిపోనున్నాయి. తొమ్మిది నెలలుగా ఇవి దిగజారిపోతున్న విషయం ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం.

ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో (ఏప్రిల్–ఆగస్టు) మర్చండైజ్ ఎగుమతుల విలువ 172.95 బిలియన్ డాలర్లు. గత ఏడాది ఇదే కాలానికి ఎగుమతుల విలువ 196.33 బిలియన్ డాలర్లు కావడం గమనార్హం. యూరప్, యూఎస్‌లలో మాంద్యపు ధోరణలు కనిపిస్తున్నాయనేందుకు మర్చండైజ్ ఎగుమతులు తగ్గిపోవడం ఒక నిదర్శనం. ద్రవ్యోల్బణం పెరిగిపోవడం, వడ్డీ రేట్లు వేగంగా పెరగడం కూడా ఎగుమతుల మందగమనానికి కారణాలుగా చెబుతున్నారు.

మర్చండైజ్ ఎగుమతుల్లో జరిగిన నష్టాన్ని సేవల రంగం ఎగుమతులు కొంత వరకూ భర్తీ చేసినప్పటికీ ఇప్పుడు ఇవి కూడా తగ్గిపోతున్నాయి. గత ఏడాది 26.5 బిలియన్ డాలర్లుగా ఉన్న సర్వీసెస్ ఎగుమతులు ఈ ఏడాది ఆగస్టులో 26.3 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అమెరికా తదితర దేశాల్లోని అధిక వడ్డీల కారణంగా కంపెనీలు ఖర్చులు తగ్గించుకోవడం దీనికి కారణమని ఒక అంచనా.


కానీ, తాజాగా ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య మొదలైన ఘర్షణ పరిస్థితిని మరింత దిగజార్చడం ఖాయం.

భారత ఆర్థిక వ్యవస్థ మరో బలహీనత...

భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మరో బలహీనత ముడిచమురు. దేశీయ అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతుల ద్వారానే పూరించుకుంటున్నాం. గత ఏడాది ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి అంతర్జాతీయ ముడిచమురు మార్కెట్లు అతలాకుతలమయ్యాయి. ముందుగా బాగా పైకి ఎగబాకిన ధరలు కొన్ని నెలల తరువాత స్థిమితపడ్డాయి. ఈ ఏడాది మొదట్లో తగ్గుముఖం పట్టే ధోరణి మొదలై జూన్ నెలలో బ్యారెల్‌కు 75 – 80 డాలర్ల స్థాయికి చేరింది. మన ఖజానా తట్టుకోగల స్థాయి ఇది. అయితే సౌదీ అరేబియా, రష్యా దేశాలు జూలైలో ముడిచమురు కార్టెల్ 'ఒపెక్+' (పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ)ను ఉత్పత్తిని మరింత తగ్గించాలని ఒత్తిడి చేశాయి. సెప్టెంబరు వరకూ ఈ కోత కొనసాగడంతో చమురు ధరలు పెరగడం మొదలైంది. గత వారం కొంచెం తగ్గినా పశ్చిమాసియా సంక్షోభం పుణ్యమా అని మళ్లీ ఇప్పుడు ఎక్కువ కావడం మొదలైంది.

జాగరూకత అవసరం...

ఒకవైపు ముడి చమురు ఎగుమతుల బిల్లులు పెరిగి పోతూండటం, ఇంకోవైపు ఎగుమతులు మందగిస్తున్న నేపథ్యంలో కరెంట్ అకౌంట్ లోటు మరింత పెరిగే అవకాశం ఉంది. కాబట్టి కొంచెం ఆచితూచి వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కరెంట్ అకౌంట్ లోటు 2022–23లో జీడీపీలో 2.1 శాతం వరకూ ఎగబాకినా... ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్ –జూన్) 1.1 శాతానికి పరిమితం కావడం కొంత ఊరటనిచ్చే అంశం. కానీ ముడిచమురు ధరలు నియంత్రణలో లేకపోయినా, ఎగుమతులు పుంజుకోకపోయినా లోటు మళ్లీ పెరగడం ఖాయం.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు ఎక్కువయ్యేందుకు ఉన్న మరో అవరోధం ద్రవ్యోల్బణం. ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం తొందరగా ముగియకపోతే సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ అంశాలపై ప్రభావం తప్పదు. ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో గత ఏడాది ఈ అంశాలు పారిశ్రామిక ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపిన సంగతి తెలిసిందే.

ఎల్పీజీ గ్యాస్ ధరలు తగ్గడం, కాయగూరల ధరలు కూడా సర్దుకుంటున్న నేపథ్యంలో సమీప కాలంలో ద్రవ్యోల్బణం కొంచెం నియంత్రణలోకి వస్తుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చాలా ధీమాగా ఉంది. కానీ భవిష్యత్తు అంచనాల విషయానికి వస్తే మాత్రం పప్పుదినుసులు, కాయగూరలు, మసాలాలపై ఆర్‌బీఐ తన దృష్టిని కేంద్రీకరించింది. ఇదే సమయంలో ఎల్‌నినో పరిస్థితులపై ఆర్‌బీఐ కొంత ఆతురతను వ్యక్తం చేస్తోంది. అయితే, భౌగోళిక రాజకీయ సంక్షోభాలు ద్రవ్యోల్బణం విషయంలో ఊహించినదాని కన్నా ఎక్కువ ఒత్తిడి చూపే అవకాశం ఉంది.

ఎల్లప్పుడూ అంతర్జాతీయ సంక్షోభాలకు సున్నితంగా ఉండే దేశీయ స్టాక్ మార్కెట్ల మీద పశ్చిమాసియా ఘర్షణ తక్షణ ప్రభావం చూపింది. కాకపోతే వర్షాకాలం నిలకడగా లేకపోయినా, అంతర్గత డిమాండ్లు పెరిగితే ఈ మార్కెట్లు కోలుకోగలవు. ప్రస్తుతం భారతీయ పరిశ్రమ పండగ సీజన్ పైనే ఆశలన్నీ పెట్టుకుంది. కార్లు, ఎఫ్ఎంసీజీ(వేగంగా అమ్ముడుపోయే వినియోగ వస్తువులు) రంగాల్లో అమ్మకాలు ఇప్పటికే వారికి శుభ సూచనలు అందిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇటీవలి కాలంలో ప్రపంచ మార్కెట్లు డీలా పడిపోతూంటే... దేశీ మార్కెట్లు మాత్రం హడావుడిగా ఉండటం ఒక ధోరణిగా మారింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ చాలా ఏళ్లుగా ఒడిదుడుకులకు లోనవుతూండగా కోవిడ్, ఉక్రెయిన్ యుద్ధాలు వాటిని తీవ్రతరం చేశాయి. అంతర్జాతీయ ద్రవ్య సంస్థ(ఐఎంఎఫ్) ఇప్పటికే ప్రపంచ వృద్ధి రేటును తగ్గించేసింది. 2022లో ఇది 3.5 శాతంగా ఉంటే, ఈ ఏడాది 3 శాతానికి పరిమితం కావచ్చునని అంటోంది. 2024లో ఇది మరి కొంచెం తగ్గి 2.9 శాతానికి చేరుతుందని చెబుతోంది.

భారత్ విషయానికి వస్తే ప్రపంచబ్యాంకు లాంటివి భారతీయ మార్కెట్లు బాహ్య ఘటనల ఒత్తిడిని తట్టుకుని నిలిచాయని ప్రశంసించాయి. కానీ, ఈ ధోరణి ఎంత కాలం కొనసాగుతుందనేది వేచి చూడాల్సిన అంశం. ఇజ్రాయెల్, హమాస్ మధ్య యుద్ధం తొందరగా ముగుస్తుందా? లేక మరింత వ్యాపిస్తుందా? అన్న ప్రశ్నలకు సమాధానాల్లో భారతీయ మార్కెట్ల నిలకడతనం పరీక్ష కూడా ఉందని చెప్పాలి.

వ్యాసకర్త సీనియర్ ఫైనాన్షియల్ జర్నలిస్ట్
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఏమైనా 'బ్యాగు'ందా?


గత వారం ఒక క్లినిక్‌లో మరిచి పోయిన బ్యాగును తీసుకోవడానికి ఈ ఉదయం వెళ్లాను. తీసుకున్నాక, దగ్గరి కాఫీ షాపులో కాఫీ తాగుదామనిపించింది. తాగి, అక్కడి నుంచి బయటి కొచ్చాను, చేతిలో బ్యాగు లేకుండా. ఇప్పుడు బ్యాగు కోసం మళ్లీ వెళ్లాలి.

– రుచి కుమార్, పాత్రికేయురాలు

రెండు దేశాలే


ఇజ్రాయెల్–పాలస్తీనా ఘర్షణకు పరిష్కారం 'రెండు దేశాల' విధానమేనన్నది దీర్ఘకాలంగా భారత వైఖరి. (అమెరికా విదేశాంగ మంత్రి) బ్లింకెన్ కూడా, 'ఉత్తమ మార్గం... రెండు దేశాల పరిష్కారం' అన్నారు. ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలు పాలస్తీనా దేశపు కలలను అణచకూడదు

– బ్రహ్మ చెల్లానీ, విశ్లేషకుడు

ఖండించాల్సిన విషయం


ఒక చైనా మీడియా మనిషిగా, చైనా నేల మీద ఇజ్రాయెల్ దౌత్యవేత్త మీద జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. దాడికి పాల్పడ్డ మనిషిని చైనా చట్టం కఠినంగా శిక్షిస్తుందని నమ్ముతున్నాను. (శుక్రవారాన్ని 'క్రోధపు దినం'గా జరపాలని హమాస్ పిలుపునిచ్చింది.)

– హు షిజిన్, సంపాదకుడు

పట్టించుకోవాలి!


తుర్కియేలో భూకంపం వచ్చినప్పుడు, మొరాకోలో భూకంపం వచ్చినప్పుడు మొత్తం ప్రపంచం సాయం చేసింది. కానీ అఫ్గానిస్తాన్ భూకంపంలో అఫ్గాన్లను ఒంటరిగా వదిలేశారు. భూకంప బాధితులను ఆదుకోవాలి.

– ఖాలిద్ అమీరీ, జర్నలిస్ట్

అందరి కోసం


ప్రతి మనిషి జీవితమూ సమానంగా మాన్యత కలిగినదే. ఇదే సూత్రాన్ని విశ్వవ్యాప్తంగా గుర్తించాలి. కేవలం తమ సమాజం కోసం మాట్లాడుతూ, ఇంకో సమాజం విషయంలో మౌనంగా ఉండటం ద్వంద్వ ప్రమాణాల కిందికి వస్తుంది. ఇదే మన పట్ల ఇతరుల కోపానికి కారణమైంది.

– తాహీర్ అన్వర్, ముస్లిం హేతువాది

బహుముఖ ప్రజ్ఞాశాలి

తొలి తెలుగు ముస్లిం కథకుడు షేక్ హుసేన్ సత్యాగ్ని. 1989లో 'పాచికలు' అనే ముస్లిం కథల సంకలనం వేయకముందే నికార్సయిన పీడిత, తాడిత ప్రజల గొంతును తన కథల్లో వినిపించారు. ఆయన మొదటి కథ 'నూరు రూపాయలు'. 'అగ్ని సరస్సు' ఆయన తొలి కథా సంకలనం. దీనిలో మొత్తం ఆరు కథలు ఉన్నాయి. వీటిల్లో 'వినిపించని ఏడుపులు' కథలో పరోక్షంగా ముస్లిం జీవితం ఉంటుంది. బహుశా దాన్ని చూసేనేమో వల్లంపాటి వెంకట సుబ్బయ్య 'సత్యాగ్నీ.. నువ్వు ముస్లిం జీవితాలను కూడా కథలుగా రాయగలవు, రాయాలి' అని అన్నారంట. ఆ మాట పట్టుకుని సత్యాగ్ని ఏడాది తిరగకుండానే ఏడు ముస్లిం జీవిత కథలతో 'పాచికలు' పుస్తకం వేశారు.

సత్యాగ్ని స్వతహాగా స్త్రీ పక్షపాతి. స్త్రీ అణచివేత కేంద్రంగా కథలు రాశారు. కడప బుగ్గవంక ఒడ్డున ఏపుగా పెరిగిన చీకి కంప చెట్లే స్థావరంగా చేసుకుని చవగ్గా శరీరాన్ని అమ్ముకుంటున్న ఓ అభాగ్యురాలి దీన గాథను ఆయన తొలికథ 'నూరు రూపాయలు'లో వివరిస్తే, తలాఖ్ సంప్రదాయాన్ని విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్న ముస్లిం పురుషుల వల్ల స్త్రీలు ఎదుర్కొంటున్న బాధల్ని తొలి ముస్లిం కథ 'పాచికలు'లో వివరించారు. సత్యాగ్ని అసలు పేరు కేవలం షేక్ హుసేన్ మాత్రమే. 'సత్యాగ్ని' అనేది ఆయన కలం పేరు. సరస్వతీ పుత్ర పుట్టపర్తి నారాయణ చార్యుల వారి శిష్యుల్లో షేక్ హుసేన్ ఒకరు. సంప్రదాయ సాహిత్యాన్ని ఎంతో ఇష్టపడే హుసేన్ మొదటగా ముత్యాల సరాలు ఛందస్సులో 'భగ్న వీణ' గేయ కావ్యం రాశారు. అయితే ముస్లిం పేరైనందువల్ల సాహిత్యరంగంలో ఆదరణ తక్కువ ఉంటుందేమో అని పుట్టపర్తి వారే స్వయంగా 'సత్యాగ్ని' అని కలం పేరు సూచించినట్టు హుసేన్ చెబుతారు.


షేక్ హుసేన్ సత్యాగ్ని

షేక్ హుసేన్ చాలాకాలం పాటు విద్యార్థి నాయకుడిగా, కార్మిక నాయకుడిగా, రాజకీయనాయకుడిగా ఉండటం వల్ల వ్యవస్థలోని అనేక లోపాలను బాగా పట్టుకోగలిగారు. ఏం రాసినా తన జీవితంలో లేనిదీ, తాను చూడనిదీ రాయలేదు. రాయలసీమ కథల మాష్టారు కేతు విశ్వనాథరెడ్డి ఈయన గురించి చెబుతూ 'అల వోకగా కథానికా తత్వం అలవర్చుకున్నవాడు' అన్నారు.

దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా మెలిగారు. రెండు మార్లు ఎమ్మెల్సీగా పనిచేసి రిటైర్ అయ్యారు. కడప దగ్గర్లోని రాయలపంతులపల్లెలో 1943లో పుట్టిన షేక్ హుసేన్ సత్యాగ్నికి ఇప్పుడు 81 సంవత్సరాలు. ఈ వయసులోనూ ఆయన అలుపెరుగక అక్షర సేద్యం చేస్తున్నారు. అందుకు మలి దశలో ఆయన వెలువర్చిన 'సత్యాగ్ని కథలు (2015)', 'దీవార్ (2022)' కథా సంకలనాలే సాక్ష్యం. ఆయనను 'డా॥ కవిత విద్యా సాంస్కృతిక సేవా సంస్థ' జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించనుండటం ముదావహం.

– డా॥ వేంపల్లె షరీఫ్, కథా రచయిత

(షేక్ హుసేన్ సత్యాగ్నికి రేపు కడపలో జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం)

ఈ స్ఫూర్తి నిలిచి వెలగాలి!

సందర్భం


బి.టి. గోవిందరెడ్డి

'అబ్ కీ బార్... సౌ పార్' – చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన ఆసియా క్రీడల సందర్భంగా మన దేశంలో హోరెత్తిన నినాదమిది. ఈసారి కొడితే వంద కొట్టాలన్నది దీని సారాంశం. భారతీయ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ), కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ రూపొందించిన ఈ నినాదాన్ని చాలామంది తేలిగ్గా తీసుకున్నారు. జకార్తాలో 2018లో కేవలం 70 మెడల్స్ కొట్టుకొచ్చిన జట్టు ఈసారి అంతకుమించి ఏదో సాధిస్తాయని ఎవ్వరూ అనుకోలేదు. కానీ అందరి అంచనాలనూ మన ఆటగాళ్లు తలకిందులు చేశారు. 107 మెడల్స్ సాధించి ఔరా అనిపించుకున్నారు. ఈ మెరుపులు ఏవో యాదృచ్ఛికమైనవి కాదు. మన క్రీడాకారులు ఎదురొడ్డి నిలిచిన ఆటగాళ్లు సామాన్యులు కాదు.

ఉదాహరణకు సుతీర్థ ముఖర్జీ, ఐహిక ముఖర్జీ జంట టేబుల్ టెన్నిస్‌లో మెరికల్లాంటి చైనా జంటను సునాయాసంగా మట్టికరిపించి క్రీడా ప్రపంచాన్ని అబ్బురపరిచింది. షూటింగ్‌లో ఈషా సింగ్, ఈశ్వరితో మార్‌లు అయితేనేమి (ఒక్కొక్కరు నాలుగు పతకాలు), ఆర్చరీలో సురేఖ, ఓజస్‌లు అయితేనేమి (చెరో మూడు పతకాలు) తమ క్రీడా విన్యాసాలతో చూపరులను ఆకట్టుకున్నారు. మొత్తానికి అందరూ కలిసి 28 స్వర్ణాలు, 38 రజతాలు, 41 కాంస్య పతకాలు చేజిక్కించుకుని వచ్చే ఏడాది పారిస్‌లో జరగబోయే ఒలింపిక్స్‌కూ, జపాన్‌లో 2026లో జరగబోయే ఏసియాడ్‌కూ ఆశాకిరణాల్లా నిలిచారు.

దశాబ్దాలుగా అనేక సమస్యలతో కునారిల్లుతున్న భారత క్రీడా రంగం గత నాలుగైదేళ్లుగా మెరుగుపడుతోంది. సత్తా చూపించే ఆటగాళ్లు కోరిన మరుక్షణమే అడిగింది ఏదైనా అందించే వ్యవస్థ అందుబాటులో కొచ్చింది. గెలిచిన ఒకరిద్దరికి నజరానాలు కాదు.. క్రీడలకు కేటాయించే నిధులు పెంచాలన్న స్పృహ పెరుగుతోంది. ఆటగాళ్లకు ఏ శిక్షణ కావాలో, తాము ఎవరితో శిక్షణ తీసుకోదలచుకున్నారో ఆడ, మగ క్రీడాకారులే నిర్ణయించుకునే స్వేచ్ఛనిచ్చారు. అది ఇక్కడనా, వేరే దేశంలోనా అనేది కూడా ఆటగాళ్ల విచక్షణకే వదిలారు. అదే సమయంలో వారు పొందుతున్న శిక్షణ, అందులో సాధిస్తున్న పురోగతి ఎప్పటికప్పుడు తెలుసుకుని అంచనా వేసే వారూ రంగంలో వున్నారు. 'ఖేలో ఇండియా', 'టార్గెట్ ఒలింపిక్ పోడియమ్ స్కీమ్' (టాప్స్) వంటి పథకాల కింద ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే వ్యవస్థ ఆవిర్భావమే దీనంతకూ కారణం. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు కూడా రంగంలోకి దిగి మెరికల్లాంటి క్రీడాకారుల్ని ఎంపిక చేసుకుని వారి శిక్షణ కయ్యే వ్యయాన్ని భరించడానికి ముందుకొచ్చాయి. ఈసారి రిలయన్స్ ఫౌండేషన్ స్కాలర్‌షిప్‌లతో శిక్షణ పొందిన క్రీడాకారులు 12 పతకాలు సాధించారు. ఇంకా అదానీ గ్రూప్, జేఎస్‌డబ్ల్యూ, టాటా వంటి సంస్థలు సైతం క్రీడాకారులను తీర్చిదిద్దటంలో కీలకపాత్ర పోషించాయి.



ఈసారి చెప్పుకోదగ్గ మరో అంశం ఉంది. క్రీడాకారుల్లో ఆడ, మగ కూడా సమంగా తమ సత్తా చాటారు. పురుషులు 52 పతకాలు గెల్చుకోగా, మహిళా క్రీడాకారులు 46 సాధించారు. మరో తొమ్మిది మిక్స్‌డ్ డబుల్స్, ఓపెన్ ఈవెంట్లలో వచ్చాయి. మొత్తంగా షూటింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీలో మనవాళ్లు 60 పతకాలు సొంతం చేసుకున్నారు. ఇందులో 18 స్వర్ణాలు. ఈ మూడు ఈవెంట్లపైనా మరింతగా కేంద్రీకరిస్తే 25 రజతాల్లో కనీసం సగమైనా స్వర్ణాలు కావటం కష్టం కాదు. చైనాది ఎప్పుడూ అగ్రశ్రేణే. మనం ఎప్పుడూ అట్టడుగునే. కానీ ఈసారి అదంతా మారింది. చైనా, జపాన్, దక్షిణ కొరియాల తర్వాత స్థానం మనదే. ఈ ఉత్సాహం కొడిగట్టకూడదు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండంకెల సంఖ్యలో పతకాలు గెలిచి తీరాలన్న ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష సంకల్పం నెరవేరాలి.

మన దేశంలో తల్లిదండ్రులు ఎంతసేపూ తమ పిల్లలు చదువు పైనే శ్రద్ధ పెట్టాలని కోరుకుంటారు. ఆటలాడితే ఆగ్రహిస్తారు. దీనికి తోడు ప్రభుత్వాలు సైతం విద్యాసంస్థల్లో క్రీడాంశాలను పట్టించుకోవటం లేదు. ఈ ధోరణి మారాలి. హైస్కూల్లో చేరే ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఏదో ఒక క్రీడను ఎంచుకొనేలా, అందులో వారి ప్రతిభాపాటవాలను కొలిచేలా ఒక విధానం రూపొందించాలి.

దేశంలో అక్కడక్కడా అంతర్జాతీయ ప్రమాణాలతో అకాడమీలు ఉన్నాయి. అవి అందరికీ అందుబాటులో ఉండవు. కనుక ఆటలు కూడా చదువులో భాగం కావాలి. క్రీడల్లో ఎప్పుడూ అగ్రశ్రేణిలో ఉండే చైనా, రష్యా... ఆఖరికి క్యూబా, బెలారస్, ఇథియోపియా వంటి చిన్న దేశాలు సైతం హైస్కూల్ స్థాయిలోనే పిల్లల్లో క్రీడానైపుణ్యాలను పసిగడతాయి. వారిని ఒక క్రమపద్ధతిలో తీర్చి దిద్దుతాయి. మనం కూడా ఆ దారిని ఎంచుకోవాలి. ఈవెంట్ ఏదైనా విజయం మనదే కావాలి. ఎప్పుడూ అగ్రభాగాన నిలవాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

మహాలయ అమావాస్య

భాద్రపద మాసం కృష్ణపక్షాన్ని భారతీయ సంప్రదాయం 'పితృ పక్షం'గా పరిగణిస్తుంది. ఈ పక్షమంతా గతించిపోయిన పితృ దేవతలకూ, పూర్వీకులకూ సమర్పితమైన పక్షం. శిష్టాచార పరులు ఈ పక్షాన్ని ముఖ్యంగా శ్రాద్ధ విధులకూ, పితృ తర్పణ విధులకూ, పిండ ప్రదానాలకూ కేటాయిస్తారు. ఈ పక్షంలో జరిపిన పితృకార్యాల వల్ల ఫలం అధికమని విశ్వసిస్తారు. ఈ పక్షాన్ని 'మహాలయ' పక్షం అంటారు.

'మహా ఆలయం' అంటే బ్రహ్మ లోకం. సర్వ వ్యాపి అయిన పరమాత్మ స్థావరం. 'ఎవ్వనిచే జనించు జగము..' అన్నారో ఆ పరమేశ్వరుడే విశ్వమంతటినీ తన లోపల ఇముడ్చుకోగల 'మహా ఆలయుడు'. సృష్టి సమయంలో తన నుంచే సర్వాన్నీ సృష్టించి, మళ్ళీ సృష్టి అంతంలో ఆ సర్వాన్నీ ఉపసంహరించి, తనలోనే లయం చేసుకొంటాడు కనక ఆయన మహా 'లయుడు' కూడా. ఆ పరమాత్మ గురించిన ధ్యానం వైపు మనసు మళ్లించేది మహాలయ పక్షం. ఇది 'మహాలయ అమావాస్య'తో ముగుస్తుంది.


జ్యోతిర్మయం

జగత్ సృష్టి, స్థితి, లయం అనే ప్రక్రియలు చక్ర భ్రమణంలాగా సాగేవి. ఒక రకంగా, మహాలయ అమావాస్యను లయానికీ, పునః సృష్టికీ మధ్య సంధి సమయానికి ప్రతీకగా భావించవచ్చు. ఈ అమావాస్యకు ఒక వైపు, గతించి ఈశ్వరుడిలో లయమైన పితృదేవతల పక్షం... పితృపక్షం. మరొక వైపు దేవీ నవరాత్రుల శుభ సమయమైన 'దేవీ పక్షం'. దేవి అంటే పరమ పురుషుడి సృజన శక్తి. మహా మాయా శక్తి. సృష్టి ఆరంభ సమయంలో ఈ మాయా ప్రకృతి, సకల చరాచరాల పుట్టుకకూ కారణమవుతుంది. సర్వ భూతాల లోనూ విష్ణు మాయగానూ, చైతన్య రూపంగానూ, బుద్ధి రూపంగానూ, నిద్రా– క్షుత్– పిపాసల రూపం గానూ, శక్తి– క్షాంతి– కాంతి– శ్రద్ధా– లక్ష్మి– స్మృతి– దయ– తుష్టి ఇత్యాది రూపాలలోనూ నిలిచి ఉంటుంది (యా దేవీ సర్వ భూతేషు... సంస్థితా). సృష్టి ఉపసంహరణ కార్యమూ ఆ శక్తిదే.

సృష్టి చక్రంలో గతించి లయమైపోయిన పూర్వీకులను సభక్తికంగా స్మరించుకోవడం పితృపక్షంలో కర్తవ్యమైతే, భవిష్యత్తులో సాధించగోరే ధర్మ, అర్థ, కామ, మోక్ష పురుషార్థాల సిద్ధి కోసం దేవీ అనుగ్రహం సమకూర్చుకొనే శుభ సమయం దేవీ నవరాత్రుల దేవీ పక్షం. ఈ ఘట్టానికీ ఆ ఘట్టానికీ మధ్య వారధి మహాలయ అమావాస్య. గతానికి భరత వాక్యం. నూతనారంభాలకు నాంది. అందుకే ఈ అమావాస్య పితృపక్షంలో భాగం అయినా, వంగ దేశంలో ఆబాల గోపాలం అందరూ, పరస్పరం 'షుభో మహాలయో' అని శుభాకాంక్షలు తెలుపుకొంటారు.

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, భాద్రపద మాసం, **తిథి:** అమావాస్య రా.10.29 వరకు, తదుపరి ఆశ్వయుజ శుక్ల పాడ్యమి, **నక్షత్రం:** హస్త సా.4.42 వరకు, తదుపరి చిత్త, **వర్జ్యం:** రా.1.15 నుండి 2.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.57 నుండి 7.30 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.09 నుండి 11.54 వరకు, మహాలయ అమావాస్య ; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.55, **సూర్యాస్తమయం:** 5.38.







కూకట్‌పల్లిలో జరుగుతున్న బతుకమ్మ సంబురాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. రెండోరోజు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆడిపాడారు. దీంతో హనుమాన్ చౌక్ పరిసరాలు బతుకమ్మ పాటలతో మార్మోగింది. మహిళలందరూ బతుకమ్మ ఆడిపాడారు. నగరంలోనే ప్రత్యేకతను సంతరించుకున్న కూకట్‌పల్లి బతుకమ్మ అమావాస్య రాకముందే రెండు రోజుల పాటు బతుకమ్మ వేడుకలు నిర్వహించటం విశేషం. – కూకట్‌పల్లి

బతుకమ్మ శోభ

చిత్తూ చిత్తుల బొమ్మ.. శివుని ముద్దుల గుమ్మ

- వైభవంగా రెండో రోజు బతుకమ్మ సంబురాలు
- భారీగా వేడుకల్లో పాల్గొన్న మహిళలు


బతుకమ్మతో ఎమ్మెల్యే సతీమణి లక్ష్మీబాయి


కూకట్‌పల్లిలోని హనుమాన్‌చౌక్ వద్ద..

బంగారు బతుకమ్మ


కూకట్‌పల్లిలో బంగారు బతుకమ్మతో శ్రీనయన

తెలంగాణ వచ్చిన సందర్భంలో కూకట్‌పల్లికి చెందిన నాయినేని వైష్ణవి శ్రీనయనల తాత తన మనుమరాళ్ల కోసం లక్షల రూపాయలు ఖర్చు పెట్టి బంగారు బతుకమ్మను తయారు చేయించారు. గత సంవత్సరం తన మనుమరాళ్లకు బహుమానంగా అందించారు. ఈ సంవత్సరం కూడా ఆ బతుకమ్మను శ్రీనయన వేడుకలకు తీసుకురావటంతో రెండవ రోజు బతుకమ్మ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బంగారు బతుకమ్మ అనే పేరుకు సార్థకతను చేస్తూ శ్రీనయన బతుకమ్మ వేడుకల్లో సందడి చేసి కూకట్‌పల్లిలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

శంకర మఠంలో 24వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు



మోతీనగర్: శ్రీ శృంగేరి శారద శంకరమఠం ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు శ్రీ శారదా దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. నవరాత్రులను పురస్కరించుకొని ప్రతి రోజు ఉదయం 8 గంటలకు విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు, చండీశప్తశతి పారాయణం, మధ్యాహ్నం 12 గంటలకు మహా మంగళ హారతి, సాయంత్రం 6 గంటలకు శ్రీ శారదాంబ రథసేవ, 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 9 గంటలకు స్వస్తి కార్యక్రమాలు, మహా మంగళ హారతి వంటి కార్యక్రమాలతో పాటు ప్రతి రోజు అమ్మవారికి రోజుకొక అలంకరణ, వాహన అలంకరణ నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

శారదాంబకు రోజుకొక జడతో అలంకరణ

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కోఆపరేటివ్ లిమిటెడ్ మాజీ అధ్యక్షులు నలమాల్పు అంజిరెడ్డి, లతా దంపతులు శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్వయంగా 12 రకాల అమ్మవారి జడలను నెల రోజుల పాటు శ్రమించి తయారు చేసి శుక్రవారం శృంగేరిలోని శ్రీశృంగేరి జగద్గురు మహా సంస్థానంలో శ్రీ భారతి తీర్థ మహాస్వామి జగద్గురు శంకరాచార్య శ్రీవిధుశేఖర భారతి స్వామీలకు అందజేశారు. దేవి నవ రాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజు ఒక రకమైన జడను శారదాంబ మాతకు, ఇతర మాతలకు అలంకరించాలని కోరారు.

11వేల గాజులతో దండలు...

◆ అదేవిధంగా ఇటీవల 11వేల గాజులతో దండలు తయారు చేసి అందజేశామని తెలిపారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ స్వయంగా తయారు చేసిన వివిధ రకాల జడలను అమ్మవారికి అలంకరింప చేసే అదృష్టం తమకు దక్కడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిరందని అన్నారు. ముఖ్యంగా స్వామివారికి అందజేయటం మహా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా అమ్మవారికి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించటంతో పాటు పలు రకాల ఆభరణాలు తయారు చేసి అందజేస్తామని తెలిపారు.

రేపటి నుంచి రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో..

మూసాపేట: మహాత్మాగాంధీ విగ్రహం వద్ద శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ సోమవారం వరకు శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, కైంకర్యములు జరపనున్నట్లు తెలిపారు. 15న వనబాలదేవి, 16న అన్నపూర్ణ దేవి, 17న గజలక్ష్మీదేవి, 18న వైష్ణవి దేవి, 19న గౌరీ దేవి, 20న సరస్వతి దేవి, 21న రాజరాజేశ్వరి దేవి, 22న దుర్గాదేవి, 23న శాంతాదేవి అలంకరణలతో అమ్మవారు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీన ఆదివారం వడ్డేపల్లి రాజేశ్వరరావు, యామిని దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం మధ్యాహ్నం 12గంటలకు ఉంటుందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

బీజేపీని మేధావులు, విద్యావంతులు ఆదరించాలి

- ఆరోగ్యశాఖ మాజీ మంత్రి డా. సుధాకర్
- అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దే..


బీజేపీ నాయకుల సమావేశంలో పాల్గొన్న మాజీ ఆరోగ్యశాఖ మంత్రి డా. సుధాకర్, మాధవరం కాంతారావు, తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని పీఎస్ఎం స్కూల్ ఆడిటోరియంలో అసెంబ్లీ ఇన్‌చార్జి శ్రీకర్‌రావు అధ్యక్షతన శుక్రవారం సీనియర్ బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్, గౌరవ అతిథిగా కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు హాజరై మాట్లాడారు. డబుల్ ఇంజన్ సర్కార్ నినాదంతో ముందుకు వస్తున్న బీజేపీని తెలంగాణలోని మేధావులు, విద్యావంతులు ఆదరించాలని కోరారు. దేశంలో మోదీ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అడిగిన దానికంటే ఎక్కువ నిధులు మంజూరు చేసిన వాటిని రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్థికంగా వెనుకబడేలా చేసి అప్పుల కుప్పగా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆరోపించారు. కబ్జాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన కేసీఆర్ కుటుంబానికి బుద్ధి చెప్పేందుకు ఈ ఎన్నికలు మంచి అవకాశమన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టనున్న మరిన్ని ప్రతిష్టాత్మకంగా బిల్లులు రెండు సభల్లో ఆమోదం పొందాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్ రెడ్డి, సూర్యప్రకాష్‌రావు, సూర్యారావు, రాజేశ్వరరావు, మహేందర్, శ్రీధర్, పద్మారావు, శ్రీనివాస్, పాండు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని పోలింగ్ స్టేషన్ భవనాలను జోనల్ కమిషనర్, రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డితో కలిసి సర్కిల్ పరిధిలోని నల్లగండ్ల, లక్ష్మీవిహార్ ఫేజ్–1 కాలనీ, గోపన్‌పల్లి, గౌలిదొడ్డి, నానక్‌రాంగూడల్లో ఏర్పాటు చేసిన పోలింగ్‌స్టేషన్‌ల భవనాల్లో వసతులను పరిశీలించారు.

'మేరా మాటి మేరా దేశ్'



బాలానగర్: జేఎన్‌టీయూహెచ్ కళాశాలలో 'మేరా మాటి మేరా దేశ్'కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. కె. విజయకుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా. జీవి నరసింహారెడ్డి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. పి. ప్రసన్న, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు డా. కె. శ్రీనివాస్‌రెడ్డి, డా. పి. రంజిత్ రెడ్డి, డా. దేవేందర్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో విద్యార్థులు పాఠశాల, కళాశాల స్థాయి నుంచి దేశం పట్ల, మన సంస్కృతి పట్ల వారిలో అవగాహన అభిమానం ఏర్పడేలా ఉపాధ్యాయులు ప్రేరణ ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కె. విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి వారి పనులను చేసుకుంటూ దేశంలో జరుగుతున్న మార్పులు గమనించి వారు పని చేస్తున్న సంస్థను స్వంత ఇంటిలా భావించి పనిచేయాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డా. జీ.వి. నర్సింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు దేశం, ప్రాంతం పట్ల, మనం చదువుతున్న కళాశాల పట్ల మనదే అన్న భావన అందరిలో కలిగించితేనే కళాశాలలో మంచి పరిస్థితిలో ఉంటుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌డా. పి. ప్రసన్న విద్యార్థులు విద్యార్థి దశలో దేశం పట్ల అభిమానం పెంచుకోవాలన్నారు.

బట్టల దుకాణంలో చోరీ

బాలానగర్: బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బట్టల దుకాణంలో గురువారం రాత్రి దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఐడీపీఎల్ సౌభాగ్యనగర్‌లో ఓ బట్టల దుకాణంలో గురువారం దొంగతనం జరిగింది. అద్దం పగలగొట్టి రూ.45వేల నగదు చోరీ చేశారు. సీసీ కెమెరాలను పక్కకు తిప్పి చోరీ చేశారు. యజమాని శుభం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

'అభివృద్ధి పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారు'

- బీజేపీ భరోసా యాత్రలో మాధవరం కాంతారావు



కూకట్‌పల్లి: మరోసారి మోదీ సర్కార్... ఈసారి తెలంగాణలో బీజేపీ సర్కార్ అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను కేసీఆర్ పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కేపీహెచ్‌బీ 9వ ఫేజులో బీజేపీ భరోసా పాదయాత్రలో శుక్రవారం కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతరావు, మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని ముఖ్యంగా వర్షాకాలంలో ప్రధాన రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో రాకపోకలకుఆటంకం కలుగుతోందన్నారు. డ్రైనేజీ, శానిటరీ శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. ప్రజలు కనీస మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతుంటే ఎమ్మెల్యే కబ్జాలు, సెటిల్‌మెంట్‌పనుల్లో తన పనితనం చూపిస్తున్నారని ఆరోపించారు.

– తెలంగాణ అభివృద్ధికి కేంద్రం ఎన్ని నిధులు విడుదల చేసినా వాటిని పక్కదారి పట్టిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బీఆర్ఎస్ పార్టీకి ఓటేసినట్లే అన్నారు. వారంటీ, గ్యారంటీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. హంగు ఆర్భాటాలు అసత్య ప్రచారాలతో పాలనను గాలికి వదిలేసి కాలయాపన చేస్తున్న ఈ బీఆర్ఎస్ పార్టీ నాయకుల పనితీరుకు రానున్న ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనేఅన్ని రంగాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ముమ్మారెడ్డి ప్రేమకుమార్, ప్రీతం రెడ్డి, సుగుణ చౌదరి, గంధం రాజు, తదితరులు పాల్గొన్నారు.

మాధవరం సుదర్శన్‌రావుకు నివాళి



ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లికి చెందిన ఉద్యమ నేత దివంగత మాధవరం సుదర్శన్‌రావు 3వ వర్ధంతి కార్యక్రమంలో కూకట్‌పల్లి ప్రాంతంలో శుక్రవారం నిర్వహించారు. కూకట్‌పల్లిలోని ఆయన విగ్రహానికి పార్టీలకు అతీతంగా ఉద్యమనేతలు, అభిమానులు హాజరై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాచర్ల భద్రయ్య, రఘునందన్ నేత, సురేష్ రెడ్డి, విద్యాసాగర్, నజీర్, మాదవరం రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిని మరింత అభివృద్ధి చేస్తా

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ మహిళా నాయకురాలతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ నివాసంలో శుక్రవారం జరిగిన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ... తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరింత బాధ్యతతో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి ముచ్చటగా మూడోసారి భారీ మెజార్టీతో గెలుస్తానన్నారు. ఆ తర్వాత శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. తన వెన్నంటి నిలిచిన శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజానికానికి, మిత్రులకు అభిమానులకు శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

◆ ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో 9 వేల కోట్ల నిధులతో శేరిలిగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మీ అందరి ఆశీస్సులతో, సహకారంతో రాబోయే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిచి శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానన్నారు.

బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధం

- నేడు ఫతేనగర్, బాలానగర్ డివిజన్లలో వేడుకలు


బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలను పరిశీలించిన కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు


బాలానగర్‌లో బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంగణ ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి బతుకమ్మ పండుగ ప్రతీక అని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఫతేనగర్ డివిజన్‌లోని బతుకమ్మ కుంట ప్రాంగణాన్ని స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులకు పెద్దన్నగా ముఖ్యమంత్రి కేసీఆర్ నిలిచారని పేర్కొన్నారు. డివిజన్‌లో ప్రతి ఏటా బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించుకుంటున్నామని అదే విధంగా ఈ నెల 14న డివిజన్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫతేనగర్ డివిజన్ ఆడపడుచులు, బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాళ్లు,స్థానిక మహిళలు బతుకమ్మలతో శనివారం సాయంత్రం 6 గంటలకు బతుకమ్మ కుంట వద్దకు వేలాదిగా చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కంచి భిక్షపతి, శిల్పాగౌడ్, ఉషావతి గౌడ్, కృష్ణ కుమారి, బాలమణి, సుగుణ, రహీమా, కమలమ్మ, ఉమా, మీనా, లక్ష్మీ, జయమ్మ, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో డివిజన్‌లో...

బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి శుక్రవారం బతుకమ్మ ప్రాంగణాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని మతాల వారు పండుగలను సంతోషంగా నిర్వహించుకునేందుకదు బీఆర్ఎస్ ప్రభుత్వం చేయూతనిస్తోందని తెలిపారు. బతుకమ్మ వేడుకలు డివిజన్‌లోని ఆడపడుచులు, బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లు, స్థానిక మహిళలు వేలాది సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది నాగేశ్వర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు కృష్ణమూర్తి, కందుల రమేష్, ప్రేమ్‌కుమార్, మురళీధర్ ముదిరాజ్, నాగరాజు గౌడ్, మహమ్మద్ సోఫీ తదితరులు పాల్గొన్నారు.

గర్భవతుల విషయంలో సాధారణ ప్రసవం అనే మాట ఈ రోజుల్లో ఆశ్చర్యంగా మారింది. దేశమంతటా సిజేరియన్ ప్రసవాలు పెరిగాయని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే కూడా తన నివేదికల్లో చూపింది. అయితే, ప్రభుత్వ- ప్రైవేట్ ఆసుపత్రులలో నార్మల్, సిజేరియన్ ప్రసవాల సంఖ్యలో తేడా మాత్రం ఉంది. ఈ విషయాన్ని తన సొంత అనుభవంతో గమనించిన ఫిలాంత్రపిస్ట్ డాక్టర్ జాహ్నవి నిలేకని మెటర్నల్ హెల్త్‌కేర్ వైపు దృష్టి సారించింది. బెంగళూరులో మురికివాడల్లోని నగర గర్భిణుల్లో సాధారణ ప్రసవాల గురించి అవగాహన కల్పించడంతో పాటు అస్తికా మిడ్‌వైఫరీ పేరుతో ప్రసవాల సెంటర్‌నూ ప్రారంభించింది. సాధారణ ప్రసవం ఆవశ్యకతవైపు వేసిన ఆమె అడుగుల గురించి ఆమె మాటల్లోనే..



డాక్టర్ జాహ్నవి నిలేకని

నార్మల్ డెలివరీలు 'నార్మల్' కావాలి

డాక్టర్ జాహ్నవి నిలేకని

"చదువుకుంటున్నప్పుడే స్వదేశం కోసం ఏదైనా చేయాలనే ఆలోచనలు ఉండేవి. అమ్మ మరాఠీ, నాన్న కొంకణి. పుణేలో పుట్టి, బెంగుళూరులో పెరిగాను. గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లాను. నా భర్త యేల్ జార్ఖండ్‌కు చెందినవాడు. ఆ విధంగా నేను ఒకే ఒక ప్రాంతానికి చెందినదానిని అని చెప్పలేను. 2012లో పెళ్లయ్యింది. ప్రెగ్నెంట్‌గా ఉన్నప్పుడు కర్ణాటక లో రీసెర్చ్ చేస్తున్నాను. ఆ సమయంలో నార్మల్ డెలివరీ కోసం నగరాల్లోని చాలా ఆసుపత్రుల వారిని కలిశాను. కానీ, నార్మల్ డెలివరీకి వారెలాంటి హామీ ఇవ్వకపోవడం ఆశ్చర్యమేసింది. మన దేశంలో చాలా రాష్ట్రాల్లో గర్భిణులకు సరైన సమయంలో మందులు, డాక్టర్లు, నర్సుల సేవ అందడం లేదనీ, దీనివల్ల తల్లీ బిడ్డలిద్దరి ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆ సమయంలోనే తెలుసుకున్నాను. ప్రయివేటు ఆసుపత్రులు సిజేరియన్ ప్రసవాన్ని వ్యాపారంలా మార్చేశాయి. జాతీయ ఆరోగ్య కుటుంబ సర్వే ప్రకారం జమ్మూ, కాశ్మీర్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లోని 80 శాతం ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ ప్రసవాలు జరుగుతున్నాయి. సి-సెక్షన్ ఆ మహిళకు, బిడ్డకు మంచిది కాదు. నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నప్పటికీ సర్జరీ చేయడం తప్పు. కానీ, వైద్యులు సాధారణ ప్రసవానికి చాలా సమస్యలు చెప్పారు. ఆ విషయంలో నాకు ఎన్నో సందేహాలు తలెత్తాయి. చివరకు హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో నాకు నార్మల్ డెలివరీ అయ్యింది.

దేశమంతటా..

మొదట వాయుకాలుష్యంపై పరిశోధనలు చేస్తూ వచ్చాను. కానీ, బిడ్డ పుట్టాక మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కోసం పనిచేయాలనుకున్నాను. 2019లో అస్తికా ఫౌండేషన్‌ను ప్రారంభించాను. దీని ద్వారా భారతదేశం అంతటా ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎమ్‌లు, జీఎన్ఎమ్‌లకు శిక్షణ ఇచ్చాను. దీంతో వారు సురక్షితమైన ప్రసవం గురించి మహిళలకు అవగాహన కల్పించారు. అనవసరమైన సిజేరియన్ ప్రసవాల నుంచి వారిని రక్షించగలుగుతున్నారు.

> మా సెంటర్‌లో మేం ప్రసవానికి మూడు నెలల ముందు నుంచి గర్భిణులకు శిక్షణ, కౌన్సెలింగ్ ఇస్తాం. గర్భిణి ఏం తినాలి, ఎలాంటి వ్యాయామం చేయాలో చెబుతాం. దీనివల్ల నార్మల్ డెలివరీకి భయపడకుండా ఉంటారు.
> – డాక్టర్ జాహ్నవి నిలేకని



ప్రసవ సమయంలో అగౌరవం

ప్రతి గర్భిణి గౌరవప్రదమైన ప్రసూతి సంరక్షణ పొందాలి. కానీ, ఒక గర్భిణికి నొప్పులు వచ్చినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులలోని లేబర్‌రూమ్‌లో సిబ్బంది ఆమె మీద చెడు మాటలతో విపరీతంగా అరుస్తారు. చెప్పుతో కొట్టడం కూడా చూశాను. ఇది నాకు చాలా పాపం అనిపించింది. ఇలా జరగకూడదు, దీన్ని ఆపాలి అనుకున్నాను. 2021 వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తూ వచ్చాను. అది కూడా సరిపోదని ప్రైవేట్ సెక్టార్ ఆసుపత్రుల్లో అడుగుపెట్టాను. ధనికులైనా, పేదవారైనా ప్రతి స్త్రీకీ మంచి చికిత్స పొందే హక్కు ఉంది. ఇది గుర్తించే, బెంగళూరులోనే ఒక పేరున్న ఆసుపత్రిలో నా ఏడు పడకల కేంద్రాన్ని ప్రారంభించాను. గర్భిణిని కూతురిలా చూసుకునే మంత్రసాని ఉండాలని నమ్ముతాను. విదేశాల నుంచి సర్టిఫైడ్ మంత్రసానులను, వైద్యులను ఈ సెంటర్‌లో నియమించాను. ఎందుకంటే, ఇక్కడ చేరడానికి డాక్టర్లు ఎవరూ రెడీగా లేరు. దీంతో బయటి వారిని సంప్రదించాల్సి వచ్చింది. ఆరోగ్య సంరక్షణ బృందాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే చాలా ఇబ్బంది అయ్యింది. ఆరోగ్య కార్యకర్తలు కూడా ఎవరూ ముందుకు రాలేదు. ఈ పనిచేయడానికి నాకు చాలా టైమ్ పట్టింది. అంతేకాదు, హాస్పిటల్‌లో ప్లేస్ కోసం కూడా చాలా కష్టపడాల్సి వచ్చింది. నిజానికి ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకంటే సి-సెక్షన్‌లకే ప్రాధాన్యమిస్తుంటారు. ఇక నార్మల్ డెలివరీ అంటేనే మహిళలు, వారి కుటుంబసభ్యులు కూడా భయపడుతున్నారు. వారి దృష్టిలో సిజేరియన్ డెలివరీ సురక్షితమైంది.

కౌన్సెలింగ్‌తో నార్మల్...

నా సంస్థ కర్ణాటక వాణివిలాస్‌లోని అతిపెద్ద ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తోంది. ఓ రోజు హాస్పిటల్ బోర్డ్ మెంబర్ డ్రైవర్ భార్య మా సెంటర్‌కి వచ్చింది. ఆమె నార్మల్ డెలివరీకి భయపడింది. మా మంత్రసాని ఆమె మనసులోని భయాన్ని కౌన్సెలింగ్ ద్వారా తొలగించింది. ఫలితంగా ఆమెకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన సాధారణ ప్రసవం జరిగింది.

మా సెంటర్‌లో మేం ప్రసవానికి మూడు నెలల ముందు నుంచి గర్భిణులకు శిక్షణ, కౌన్సెలింగ్ ఇస్తాం. గర్భిణి ఏం తినాలి, ఎలాంటి వ్యాయామం చేయాలో చెబుతాం. దీనివల్ల డెలివరీ సమయంలో నార్మల్ డెలివరీకి భయపడకుండా ఉంటారు. అంటే, వారికి మానసిక, శారీరక బలాన్ని అందిస్తాం. వారికి సహాయం చేయడానికి మా బృందం ఇరవై నాలుగు గంటలు అందుబాటులో ఉంటుంది. ఈ రెండేళ్లలో 200 మంది గర్భవతులలో కేవలం ఇద్దరికి మాత్రమే సిజేరియన్ అవసరం పడింది. అది కూడా వారికి ప్రసవంలో సమస్య ఉండటం వల్ల. మిగతా అందరికీ సాధారణ ప్రసవాలు జరిగాయి.

అస్తికా మిడ్‌వైఫరీ సెంటర్లో ముప్పైమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. రెండేళ్ల క్రితం ప్రపంచంలో ఉన్న నర్సులు, మంత్రసానుల కోసం అస్తికా స్పియర్ పేరుతో డిజిటల్ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా సిబ్బంది అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవచ్చు.

దేశవ్యాప్తంగా దాదాపు రెండువేల మంది సర్టిఫికెట్లు పొందారు. యూరప్ నుంచి కూడా అధ్యాపకులు ఉన్నారు. మా మెటర్నిటీ ఫౌండేషన్ శిక్షణ తీసుకోవాలనుకునేవారికి కోర్సులను కూడా అందిస్తుంది. ప్రసూతి మరణాలకు ప్రధాన కారణాన్ని లక్ష్యంగా చేసుకొని పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది" అని వివరిస్తారు జాహ్నవి.

ఆత్మరక్షణ

ఆత్మవిశ్వాసమే అసలైన గురుదక్షిణ

రాజస్థాన్‌లోని ఒక గ్రామంలో దివ్యాంగురాలైన ఒక స్టూడెంట్ అత్యాచారానికి గురైన సంఘటన ఆశా సుమన్‌ను షాక్‌కు గురిచేసింది. స్కూలు, కాలేజీల్లో చదివే అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పాలని ఆ సమయంలో సంకల్పించుకుంది ఆశ. దివ్యాంగులు, సాధారణ యువతులు 30 వేల మందికి పైగా ఆత్మరక్షణ విద్యలు నేర్పించిన ఉపాధ్యాయురాలు ఆశా సుమన్ గురించి...



తొమ్మిది సంవత్సరాల క్రితం రాజస్థాన్ అల్వార్ జిల్లాలోని ఖార్కర గ్రామంలో...

ఆరోజు స్కూల్‌కు వెళ్లింది ఆశా సుమన్. బడిలో మగపిల్లలు తప్ప ఆడపిల్లలు ఎవరూ కనిపించలేదు. ఆమెకు ఏమీ అర్థం కాలేదు. ఈ లోపే ఎవరో ఊళ్లో జరిగిన దుర్ఘటన గురించి చెప్పారు. దివ్యాంగురాలైన ఒక అమ్మాయి సామూహిక అత్యాచారానికి గురైంది. ఈ సంఘటనతో గ్రామం ఉలిక్కిపడింది.

విషయం తెలిసిన ఆశ హుటాహుటిన బాధితురాలి ఇంటికి వెళ్లింది. ఆ సంఘటనకు సంబంధించిన విషయాలు చెవిన పడుతున్నప్పుడు ఆమె మనసు దుఃఖసముద్రం అయింది.

ఈ సంఘటన ప్రభావంతో కొద్దిమంది తల్లిదండ్రులు అమ్మాయిలను స్కూల్‌కు పంపడం మాన్పించారు. నిజానికి ఆ ప్రాంతంలో ఆడపిల్లల చదువుకు అంతగా ప్రాధాన్యత ఇవ్వరు. ఇచ్చే వాళ్లు కూడా తమ ఇంటి ఆడపిల్లలను బడికి పంపడానికి భయపడుతున్నారు.

స్కూల్‌కు వెళ్లినా, స్కూల్ నుంచి ఇంటికి వచ్చినా ఆ పాశవిక సంఘటన, తల్లిదండ్రులపై దాని ప్రభావం పడి ఆడపిల్లలు స్కూల్‌కు దూరం కావడం... ఇవి పదే పదే గుర్తుకు వచ్చి ఆశను విపరీతంగా బాధపెట్టాయి.

'ఆ అమ్మాయికి తనను తాను రక్షించుకోవడం తెలిస్తే ఇలా జరిగేది కాదేమో. ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్య నేర్పాలి' అనుకుంది. మొదటి అడుగుగా... పిల్లల తల్లిదండ్రుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడింది. పిల్లలను తిరిగి స్కూల్‌కు పంపించడానికి వారు మొదట్లో ససేమిరా అన్నారు. చదువు అనేది ఎంత అవసరమో వివరించి, అమ్మాయిలు తమను తాము కాపాడుకునే ఆత్మరక్షణ విద్యల గురించి చెప్పి వారిలో మార్పు తీసుకువచ్చింది.

కొన్ని రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి అమ్మాయిలను తన స్కూటర్‌పై స్కూల్‌కు తీసుకువచ్చేది.

రెండు నెలల తరువాత పరిస్థితి మామూలుగా మారింది.

స్కూల్‌లోని అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించడంతో పాటు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పేది. ఆశ గురించి విన్న చుట్టుపక్కల ఊళ్లలోని స్కూల్, కాలేజీ వాళ్లు 'మా స్టూడెంట్స్‌కు కూడా నేర్పించండి' అంటూ ఆహ్వానించారు. కాదనకుండా వారి ఆహ్వానాన్ని మన్నించి ఎన్నో స్కూళ్లు, కాలేజీలలో ఎంతోమంది అమ్మాయిలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పించింది.

వైకల్యం ఉన్న బాలికలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పే విధానం వేరుగా ఉంటుంది, వారు సులభంగా అర్థం చేసుకునేలా, అర్థం చేసుకున్నది ఆచరణలో చేసేలా రోజువారి సంఘటనలను ఉదాహరిస్తూ, డమ్మీని ఉపయోగిస్తూ నేర్పిస్తుంటుంది. దృష్టిలోపం ఉన్న మౌనిక అనే స్టూడెంట్ ఆశ టీచర్ దగ్గర సెల్ఫ్-డిఫెన్స్ టెక్నిక్స్ నేర్చుకుంది.

'నేను బయటికి ఎక్కడికి వెళ్లినా తోడుగా అన్నయ్య వచ్చేవాడు. అన్నయ్య లేకుంటే బయటకు వెళ్లడానికి సాహసించేదాన్ని కాదు. అయితే ఇప్పుడు నా గురించే నేనే కాదు, తల్లిదండ్రులు కూడా భయపడడం లేదు. ఎవరైనా నాకు చెడు చేయడానికి ముందుకు వస్తే నిమిషాల్లో మట్టి కరిపించగలననే నమ్మకం వచ్చింది' అంటుంది మౌనిక.

స్టూడెంట్స్‌లోనే కాదు వారి తల్లిదండ్రులలోనూ ఇప్పుడు ఎంతో ధైర్యం వచ్చింది. 'చాలామందిలాగే నేను కూడా మా అమ్మాయిని స్కూల్‌కు పంపడానికి భయపడ్డాను. ఇప్పుడు అలాంటి భయాలేవీ లేవు. స్కూల్ అయిపోగానే అమ్మాయిల కోసం ఆశా టీచర్ నిర్వహిస్తున్న సెల్ఫ్-డిఫెన్స్ క్లాసులను దగ్గర నుంచి చూశాను. అమ్మాయిల్లో ఎంతో ఆత్మవిశ్వాసం కనిపించింది. ప్రతి స్కూల్లో ఆశలాంటి టీచర్ ఒకరు ఉండాలి' అంటున్నాడు ఆ ఊరికి చెందిన జస్వంత్.


అమ్మాయిలలో ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి ఆశ టీచర్ చేస్తున్న కృషికి ఎన్నో పురస్కారాలు లభించాయి. ఆత్మరక్షణ విద్యల వల్ల అమ్మాయిల్లో కనిపించే ఆత్మవిశ్వాసమే తనకు అసలు సిసలు గురుదక్షిణ అంటుంది ఆశా సుమన్.



యువతులకు ఆత్మరక్షణలో శిక్షణ ఇస్తున్న ఆశా సుమన్

లైఫ్@360

ఊపిరితిత్తులకు కొత్త ఊపిరి!



చుట్టూ ఉండే పరిసరాలు, వాతావరణంలోని కాలుష్యం, ధూమపానం వంటి వాటి ద్వారా ఊపిరితిత్తులు బలహీనపడి రకరకాల శ్వాసకోశ వ్యాధులు వస్తుంటాయి. ధూమపానం, కలుషితమైన వాతావరణం, పొగ పీల్చడం, రంగులు, రసాయన పరిశ్రమలలో పని చేయడం వంటి వాటివల్ల ప్రత్యక్షంగానే కాకుండా పరోక్షంగా కూడా ఊపిరితిత్తులకు హాని కలుగుతుంది. అయితే వివిధ ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడకుండా మనల్ని మనం రక్షించుకోవడానికి ఊపిరి తిత్తులను శుభ్రపరచడం అనేది అత్యవసరం. ఎందుకంటే, గాలి నుండి వచ్చే దుమ్ము కూడా ఊపిరితిత్తులకు హానికరం కాబట్టి. ఊపిరితిత్తులను శుభ్రపరచుకుంటే ఊపిరితిత్తులకు కొత్త ఊపిరి పోసినట్లే. అదెలాగో తెలుసుకుందాం.

ఊపిరితిత్తుల నిర్విషీకరణ లేదా శుద్ధీకరణ ఊపిరితిత్తుల పనితీరును ప్రోత్సహిస్తుంది, ఊపిరితిత్తులని చైతన్యవంతం చేస్తుంది, వాపు, మంటను తగ్గించడం, శ్వాసనాళాల నుండి శ్లేష్మాన్ని తొలగించడం, ఊపిరితిత్తులలో శ్వాసను, రక్తప్రసరణను మెరుగుపరచడం వంటివి చేస్తుంది.

అంతేకాకుండా దగ్గు, ఆస్తమా, గొంతు అంటువ్యాధులు, నోటి దుర్వాసన, ధనుర్వాతం వంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణలో కూడా ఇది సహాయపడుతుంది.

మీ ఊపిరితిత్తులను శుభ్రపరచడానికి ఇంటి చిట్కాలను చూద్దాం...

నిమ్మరసం



ఊపిరితిత్తుల నిర్విషీకరణలో నిమ్మరసం ఉపయోగకరంగా ఉంటుంది. ఆస్తమాతో సహా ఏవైనా ఇతర ఊపిరి తిత్తుల వ్యాధులతో బాధపడుతుంటే నిమ్మరసం కలిపిన నీటిని తాగటం ద్వారా ఈ సమస్యల నుంచి బయట పడవచ్చు. నిమ్మలోని విటమిన్-సి రోగనిరోధక వ్యవస్థను బలంగా ఉంచడానికి సహాయపడుతుంది. అల్పాహారానికి ముందు నిమ్మరసం తీసుకోండి. లేదంటే క్రాన్బెర్రీ రసం లేదా పైనాపిల్ రసం తీసుకోవచ్చు.

అల్లం



ఊపిరితిత్తులు ప్రభావవంతంగా పని చేయటానికి సహాయపడే అనేక రసాయన మిశ్రమాలు అల్లంలో ఉన్నాయి. ఊపిరితిత్తులను అసౌకర్యానికి గురిచేసే వాయు కాలుష్యకారకాలను తొలగించడానికి, ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్సకు కూడా అల్లం బాగా పని చేస్తుంది.

పాల ఉత్పత్తులను తగ్గించాలి



ఊపిరి తిత్తులకు హానికరమైన కారకాలను కలిగి ఉండటం వల్ల పాలు, పాల ఉత్పత్తులను పరిమితం చేయడం మంచిది. జున్ను,పెరుగు కూడా తక్కువే తీసుకోవాలి.

యోగా

రోజులో కనీసం అరగంట యోగా చేయడం మూలంగా మీ శరీరంలోని అనేక విషతుల్య మలినాలను తొలగించవచ్చు. ముఖ్యంగా ప్రాణాయామం, సూర్య నమస్కారాల వంటి శ్వాస సంబంధిత ప్రక్రియలు ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచగలవు. యోగా ఊపిరితిత్తులను బలపరచడమే కాకుండా, వాటిని శుభ్రపరుస్తుంది కూడా. యోగా వలన ఒత్తిడి ప్రభావాలకు కూడా దూరంగా ఉండవచ్చు.
- వెల్లకిలా పడుకొని, పొట్టమీద చేతులను ఉంచండి
- కళ్లు మూసుకుని గట్టిగా ఊపిరి తీసుకుని 5 వరకు అంకెలు లెక్కబెట్టండి
- రెండు సెకన్ల పాటు శ్వాసను నిలిపి, 5 లెక్కిస్తూ నెమ్మదిగా ఊపిరి వదలాలి
- దీనిని 9 నుంచి 10 సార్లు పునరావృతం చేయండి.

ఊపిరితిత్తుల శుద్ధి ఆహారాలు

మీ ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని సైతం ప్రభావితం చేసే కొన్ని ఆహారాలు ఉన్నాయి. ఈ ఆహారాలు శరీర సహజ ప్రక్షాళన యంత్రాంగాలను ప్రోత్సహిస్తాయి. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. కాయేన్ పెప్పర్ మరియు పిస్తాపప్పు మీ ఊపిరితిత్తులను శుద్ధి చేయడానికి దోహదపడే అద్భుతమైన ఆహారాలు. పిస్తాపప్పులు ఊపిరితిత్తుల క్యాన్సర్ అవకాశాలను తగ్గిస్తాయి ఆహారంలో ఉల్లిపాయ, వెల్లుల్లి, కాయెన్ పెప్పర్, అల్లం, పసుపు, ఆపిల్, గ్రీన్ టీ మరియు ఒరేగానో వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను చేర్చండి. బీన్స్, కాయధాన్యాలు వంటి ఫోలేట్ అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోండి.

యూకలిప్టస్ ఆయిల్



యూకలిప్టస్ ఆయిల్ ఊపిరితిత్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటే దాని శక్తిమంతమైన, దుర్బలమైన, క్రిమినాశక లక్షణాలున్నాయి కాబట్టి. యూకలిప్టస్ ఆయిల్, శ్వాస నాళపు రద్దీని తగ్గించడంతోపాటు, సైనస్ సమస్యలతో కూడా పోరాడగలదు. దగ్గును కూడా తగ్గించగలదు. వేడినీళ్లలో యూకలిప్టస్ ఆయిల్‌ను కలిపి ఒక టవల్ తో మీ తల కవర్ చేస్కుని ఆవిరిని పీల్చండి.

పుదీనా



ఊపిరి తిత్తులను శుభ్రపరచడానికి పుదీనా బెస్ట్. పుదీనాలో ఉండే మెంథాల్, శ్వాసనాళానికి, కండరాలకు చక్కటి ఉపశమనం. ఇది శ్వాసను పెంచడమే కాకుండా వ్యాధుల ముందస్తు లక్షణాలను తగ్గించేందుకూ సాయపడుతుంది. రోజూ 3 నుంచి 5 పుదీనా ఆకులను తీసుకోవడం, రోజువారీ దినచర్యలో భాగంగా రెండు కప్పుల పుదీనా-టీ తీసుకోవడం మేలు చేస్తుంది.

ఆముదం



శరీరం నుండి విషాన్ని తొలగించడం ద్వారా ఊపిరితిత్తులను శుభ్రపరచడానికి ఆముదం సహాయం చేస్తుంది. ఇది శ్వాసనాళ రద్దీని తగ్గిస్తుంది. గర్భాశయం, కాలేయం, జీర్ణ వ్యవస్థలలోని విష వ్యర్థాలను తొలగిస్తుంది. శోషరస ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఛాతీమీద కొద్దిగా ఆముదం వేసి నెమ్మదిగా మర్దన చేయడం మంచిది.

రక్తహీనతా? నివారణ ఇలా సులువుగా...



శరీరంలో ఐరన్ లోపించడంతోపాటు పలు ఇతర కారణాల వల్ల కూడా చాలా మందికి రక్తహీనత సమస్య వస్తుంటుంది. అయితే అన్ని జబ్బులకూ మన శరీరంలో ముందస్తుగా లక్షణాలు కనిపించినట్లే.. రక్తహీనత ఉన్నవారిలోనూ పలు లక్షణాలు కనిపిస్తాయి. వాటిని ముందుగానే గుర్తించి తగిన విధంగా చర్యలు తీసుకుంటే రక్తహీనత సమస్య నుంచి బయట పడవచ్చు. మరి ఎవరిలో అయినా సరే రక్తహీనత ఉందని తెలిపేందుకు వారిలో ఎలాంటి లక్షణాలు కనిపిస్తాయో... రక్తహీనతను నివారించేందుకు ఏం చేయాలో తెలుసుకుందాం.

రక్తహీనత ఉన్నవారికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కొద్ది నిమిషాలు నడిచినా లేదా తేలికపాటి శారీరక శ్రమ చేసినా శ్వాస తీసుకోలేకపోతుంటారు. ఈ సమస్య ఉంటే రక్తహీనత ఉందో, లేదో పరీక్షలు చేయించుకుని, ఆ మేరకు మందులు వాడాలి. ● రక్తం తక్కువగా ఉంటే రక్తకణాల సంఖ్య కూడా తగ్గుతుంది కాబట్టి చర్మం రంగు మారుతుంది. ఇలా గనక ఉంటే రక్తహీనతే అని అనుమానించాలి. ● తగినంత రక్తం లేకపోతే అవయవాలకు ఆక్సిజన్‌ను సరఫరా చేసేందుకు గుండె ఎక్కువగా శ్రమించాల్సి వస్తుంది. ఈ క్రమంలో ఛాతి భాగంలో కొందరికి నొప్పిగా అనిపిస్తుంది. అయితే గ్యాస్ లేదా గుండె జబ్బులు ఉన్నవారికి కూడా ఛాతి నొప్పి వస్తుంది కనుక.. వైద్యున్ని సంప్రదిస్తే ఆ సమస్యకు తగిన కారణాన్ని కనుక్కోవచ్చు.

కొన్ని చిత్రమైన లక్షణాలు

రక్తహీనత ఉన్నవారికి మంచు ముక్కలు, పెన్సిళ్లు, పెయింట్, గోడకు రాసిన సున్నం తదితర పదార్థాలను తినాలపిస్తుంటుంది. ఈ రకమైన వింత లక్షణాలు ఉంటే దాన్ని రక్తహీనగా అనుమానించాల్సి ఉంటుంది.

● తరచూ తలనొప్పి వస్తున్నా రక్తహీనత అందుకు కారణం అయి ఉండవచ్చు. ఈ క్రమంలో రక్తహీనత సమస్యను పరిష్కరిస్తే తలనొప్పి కూడా తగ్గేందుకు అవకాశం ఉంటుంది. కనుక తలనొప్పి వస్తున్న వారు రక్తహీనత ఉందని అనుమానించి, పరీక్షలు చేయించుకుని, ఆ విషయాన్ని నిర్ధారించుకుని మందులను వాడితే సమస్య నుంచి బయట పడవచ్చు.

రక్తహీనత కు సరైన మందు మంచి ఆహారం తీసుకోవడమే. ఐరన్ ఎక్కువగా ఉండే ఆకుకూరలు, పొట్టుతో కూడిన ధాన్యాలు, మాంసాహారం తీసుకోవాలి. యుక్తవయసులో అమ్మాయిల నుంచి బిడ్డకు జన్మనిచ్చే మహిళల వరకూ అందరికీ ఐరన్, పోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలి. బాదం, జీడిపప్పు, ఎండు ఖర్జూరాలను నిత్యం తీసుకోవాలి. మొలకెత్తిన పప్పుధాన్యాలు, విటమిన్-సి ఎక్కువగా ఉండే నిమ్మ, ఉసిరి, జామ తీసుకుంటే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చు. రక్తహీనతతో బాధపడే వారు సోయాబీన్ తీసుకోవడం చాలా మంచిది. ఎందుకంటే ఇది దేహానికి పోషకాలను గ్రహించే శక్తినిస్తుంది. బీట్‌రూట్ లో ఐరన్, ప్రొటీన్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇది తీసుకోవడం వల్ల రక్తం శుభ్రపడుతుంది. ● రక్తహీనత తగ్గడానికి ఉపయోగపడే ఆహార పదార్థాలలో నువ్వులది ప్రథమ స్థానం అని చెప్పవచ్చు. నువ్వులను విడిగా కానీ బెల్లంతో కలిపి కాని తీసుకుంటే రక్తహీనత తగ్గుతుంది. ● బెల్లం, వేరుసెనగ పప్పు కలిపి తిన్నా మంచిది. ● తేనెలో ఐరన్, కాపర్, మాంగనీస్ లు పుష్కలంగా ఉంటాయి. గ్లాసు గోరువెచ్చటి నీటిలో రెండు టీ స్పూన్ల తేనె కలిపి తాగితే చాలా బలం. అయితే మధుమేహ వ్యాధిగ్రస్తులు దీన్ని తీసుకోరాదు. ● అరటిపళ్లు, ద్రాక్ష, స్ట్రాబెర్రీ రక్తహీనత నివారణకు ఉపకరిస్తాయి. ఇక కిస్‌మిస్, ఉల్లి, క్యారట్, ముల్లంగి, టమాటాలు క్రమం తప్పకుండా తీసుకుంటే రక్తహీనతకు దూరంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



మారుతున్న జీవనశైలి కారణంగా ప్రస్తుతం చాలామంది అధిక బీపీతో బాధపడుతున్నారు. ముఖ్యంగా యువతలో ఈ సమస్య ఎక్కువగా వస్తుండటం విచారకరం. 'అధిక రక్తపోటు' శరీరంలో గుండె సమస్యలను పెంచుతుంది. అయితే జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్యని నియంత్రించవచ్చు. అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లయితే ఎక్కువ ఉప్పు, తీపి, కొవ్వు పదార్థాలను తినకూడదు. ఇలాంటివి తినడం వల్ల రక్తపోటు పెరుగుతుంది. ఆహారంలో కొన్ని పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు చేర్చినట్లయితే రక్తపోటును నియంత్రించవచ్చు. అవేంటో తెలుసుకుందాం.

గుమ్మడి గింజల్లో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. పొటాషియం, మెగ్నీషియం ఇందులో ఎక్కువగా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచుతాయి. ఫ్యాటీ ఫిష్ తినడం వల్ల అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. చేపలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి మన హృదయాన్ని ఫిట్‌గా ఉంచుతాయి. రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి.

- ఆధునిక కాలంలో మారిన జీవన పరిస్థితుల వల్ల చాలామందిలో కిడ్నీలలో రాళ్లు ఏర్పడుతున్నాయి. దీనికి కారణాలు అనేకం. కిడ్నీలో రాళ్లు ఏర్పడినప్పుడు చాలా ఇబ్బందులు పడతారు. ఇందుకోసం కొన్ని చిట్కాలు
- తులసి ఆకుల రసాన్ని తీసి దానికి ఒక చెంచా తేనె కలిపి ఈ మిశ్రమాన్ని ఉదయం, సాయంత్రం తీసుకోవాలి. ఇలా చేయడం వల్ల కిడ్నీ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.
- కిడ్నీలో రాళ్లను తొలగించడంలో టొమాటో రసం బాగా ఉపయోగపడుతుంది. ఈ పరిస్థితిలో రెండు టమోటాలు బాగా కడిగి వాటిని మెత్తగా రుబ్బుకోవాలి. ఈ జ్యూస్‌లో ఉప్పు, మిరియాల పొడి కలుపుకుని తాగాలి.

కావాలంటే ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని ఫ్రిజ్‌లో ఉంచి జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు.

నిమ్మకాయలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కిడ్నీలోని స్టోన్స్‌ను తొలగించడంలో చక్కగా పనిచేస్తుంది.

- పెరుగును ఒక గిన్నెలో తీసుకుని అందులో చెంచా నిమ్మరసం వేసి రుచికి తగినట్లుగా ఉప్పు వేసి ఆ మిశ్రమాన్ని బాగా కలుపుకుని తాగాలి.

ఇలా చేయడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

సాక్షి బిజినెస్
శనివారం
14-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
125	43
66,282	19,751

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)		
నాస్‌డాక్	13,468	▽ 106
డోజోన్స్	33,766	△ 134
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,600	▽ 45
డాక్స్	15,187	▽ 238
షాంఘై	3,088	▽ 20
నికాయ్	32,316	▽ 179

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	
58,396	△ 252
బంగారం (99.5 స్వచ్ఛత)	
58,163	△ 252
వెండి (కిలో)	
69,731	△ 32

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.49	84.16
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	100.01	103.37
€	యూరో	ఒకటి	86.36	89.40
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.79	56.50
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.63	53.92
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.92	61.85
SAR	సౌదీ రియాల్	ఛాయస్‌కట్	21.25	22.87
UAE D	యూఏఈ దిర్హామ్	ఛాయస్‌కట్	21.77	23.57
¥	చైనా యువాన్	ఛాయస్‌కట్	10.27	12.36

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభం అప్

క్యూ2లో రూ. 377 కోట్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ పటిష్ట ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 15 శాతం ఎగసి రూ. 377 కోట్లను తాకింది. ఇందుకు అధిక పాలసీల విక్రయం తోడ్పడింది. మొత్తం ప్రీమియం ఆదాయం సైతం 12 శాతం వృద్ధితో రూ. 26,613 కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ ప్రీమియం 11 శాతం పుంజుకుని రూ. 12,970 కోట్లుగా నమోదైంది. వ్యక్తిగత ప్రీమియం 11 శాతం బలపడి రూ. 4,478 కోట్లను తాకింది. ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ గ్రూప్ సంస్థ మొత్తం వార్షిక సమాన ప్రీమియం (ఏపీఈ) 7 శాతం మెరుగై రూ. 3,045 కోట్లకు చేరింది. దీంతో కంపెనీ మార్కెట్ వాటా 10.3 శాతం వద్ద నిలకడ చూపింది. వెరసి ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ లైఫ్ తదుపరి మూడో పెద్ద కంపెనీగా నిలిచింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేరు బీఎస్‌ఈలో నామమాత్ర నష్టంతో రూ. 625 వద్ద ముగిసింది.

ఫోర్బ్స్ ఇండియా సంపన్నుల జాబితాలో జాయ్ అలుక్కాస్



కొచ్చి: ఫోర్బ్స్ 100 మంది సంపన్న భారతీయుల జాబితాలో జోయాలుక్కాస్ కంపెనీ చైర్మన్ జాయ్ అలుక్కాస్ 50వ స్థానం దక్కించుకున్నారు. తద్వారా భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక జ్యువెలర్‌గా ఖ్యాతి గడించారు. జ్యువెలరీ రంగంలో పెను మార్పులు తీసుకురావడంలో జాయ్ అలుక్కాస్ కీలక పాత్ర పోషించారు. ఆర్థిక సంక్షోభం(2008), కరోనా మహమ్మారి(2020) వంటి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులను విజయవంతంగా అధిగమించి వ్యాపారాన్ని నిర్వహించారు. ప్రపంచంలోనే అతిపెద్ద అవుట్‌లెట్‌ను చెన్నైలో ప్రారంభించడం, ప్రోత్సాహంగా రోల్స్ రాయిస్ కార్లను బహుమతిగా ఇవ్వడం, రష్యా తూర్పు భాగం ప్రాంతాల కొత్త మార్కెట్లలో ప్రవేశించడం వంటి వినూత్న ఆలోచనలతో జోయాలుక్కాస్‌ను 'వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్' గా జోయాలుక్కాస్ సంస్థగా తీర్చిదిద్దారు.

ఎగుమతులు 3 శాతం డౌన్..

- సెప్టెంబర్‌లో 34.47 బిలియన్ డాలర్లకు పరిమితం
- దిగుమతులు 15 శాతం తగ్గుదల; 53.84 బిలియన్ డాలర్లు
- 19.37 బిలియన్ డాలర్లకు తగ్గిన వాణిజ్య లోటు



న్యూఢిల్లీ: ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఎగుమతులు 2.6 శాతం క్షీణించి 34.47 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే వ్యవధిలో ఎగుమతులు 35.39 బిలియన్ డాలర్లు. కమోడిటీల ధరలు తగ్గుముఖం పట్టడంతో వరుసగా 10వ నెల దిగుమతుల భారం కాస్త తగ్గింది. శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాల ప్రకారం .. దిగుమతులు 15% క్షీణించి 53.84 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. గత సెప్టెంబర్‌లో ఇవి 63.37 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో దేశ వాణిజ్య లోటు 19.37 బిలియన్ డాలర్లకు దిగి వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్ మధ్య కాలంలో ఎగుమతులు 8.77% క్షీణించాయి. 211.4 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే వ్యవధిలో దిగుమతులు 12.23% తగ్గి 326.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఫలితంగా వాణిజ్య లోటు 115.58 బిలియన్ డాలర్లుగా ఉంది.

ఎగుమతులపై ఆశాభావం..

అంతర్జాతీయంగా సవాళ్లు నెలకొన్నప్పటికీ సెప్టెంబర్ గణాంకాలు ఎగుమతులపరంగా ఆశావహ అవకాశాలను సూచిస్తున్నాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ బరత్‌వాల్ తెలిపారు. మిగతా ఆరు నెలల్లో ఎగుమతులు సానుకూల వృద్ధి నమోదు చేయగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏప్రిల్, మే, జూన్, జూలైలో క్షీణత రెండంకెల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం సింగిల్ డిజిట్ స్థాయికి దిగి వచ్చిందని సునీల్ పేర్కొన్నారు. 2023లో అంతర్జాతీయంగా వాణిజ్యం 0.8 శాతమే పెరగవచ్చని వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ అంచనా వేసినప్పటికీ ఎగుమతులపరంగా భారత్ మెరుగ్గా రాణిస్తోందని సునీల్ చెప్పారు.

ఆగస్టు గణాంకాల సవరణ..

కేంద్రం ఆగస్టు ఎగుమతుల గణాంకాలను 34.48 బిలియన్ డాలర్ల నుంచి 38.45 బిలియన్ డాలర్లకు సవరించింది. అలాగే దిగుమతులను 58.64 బిలియన్ డాలర్ల నుంచి 60.1 బిలియన్ డాలర్లకు మార్చింది. సెప్టెంబర్ 15న విడుదల చేసిన గణాంకాల ప్రకారం ఆగస్టులో ఎగుమతులు అంతక్రితం ఏడాది అదే వ్యవధితో పోలిస్తే 6.86 శాతం క్షీణించినట్లు నమోదు కాగా.. తాజా సవరణతో 3.88 శాతం పెరిగినట్లయ్యింది.

మరిన్ని విశేషాలు..

- గత నెల ఎగుమతులకు సంబంధించి 30 కీలక రంగాల్లో 12 రంగాలు సానుకూల వృద్ధిని నమోదు చేశాయి. ముడిఇనుము, కాటన్ యార్న్, మాంసం, డెయిరీ, పౌల్ట్రీ, ఫార్మా, ఇంజినీరింగ్ ఉత్పత్తులు వీటిలో ఉన్నాయి.
- దిగుమతులపరంగా చూస్తే 30లో 20 రంగాలు ప్రతికూల వృద్ధి కనపర్చాయి. వెండి, ఎరువులు, రవాణా పరికరాలు, బొగ్గు, విలువైన రాళ్లు, క్రూడ్, రసాయనాలు, మెషిన్ టూల్స్ వీటిలో ఉన్నాయి.
- చమురు దిగుమతులు 20.32 శాతం క్షీణించి 14 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో దిగుమతులు 22.81 శాతం తగ్గి 82.3 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అటు పసిడి దిగుమతులు 7% పెరిగి 4.11 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రథమార్ధంలో 9.8% పెరిగి 22.2 బిలియన్ డాలర్లకు చేరాయి.

5 బిలియన్ డాలర్లకు క్లినికల్ ట్రయల్స్ పరిశ్రమ

- అయిదేళ్లలో అంచనా
- పారెక్సెల్ ఇండియా ఎండీ సంజయ్ వ్యాస్ వెల్లడి



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా క్లినికల్ ట్రయల్స్ పరిశ్రమ ఏటా 7–8 శాతం మేర వృద్ధి చెందనుంది. 2.3 బిలియన్ డాలర్లుగా ఉన్న పరిశ్రమ వచ్చే అయిదేళ్లలో దాదాపు 5 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. అంతర్జాతీయంగా క్లినికల్ రీసెర్చ్ దిగ్గజాల్లో ఒకటైన పారెక్సెల్ భారత విభాగం ఎండీ సంజయ్ వ్యాస్ శుక్రవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఈ విషయాలు తెలిపారు. దేశీయంగా దాదాపు 40 పైగా అధ్యయనాలు జరుగుతుండగా.. వాటిలో తమ సంస్థ సుమారు 12–15 స్టడీస్ నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. భారత్‌లో తమకు మొత్తం 5 కేంద్రాల్లో 6,000 మంది పైచిలుకు సిబ్బంది ఉండగా.. హైదరాబాద్, చండీగఢ్ సెంటర్లు అతి పెద్దవని వ్యాస్ వివరించారు. వచ్చే అయిదేళ్లలో ఉద్యోగుల సంఖ్యను 8,000కు పెంచుకోనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో తమకు 2,500 మంది పైగా సిబ్బంది ఉన్నట్లు వివరించారు. తెలంగాణ సహా దేశీయంగా క్లినికల్ ట్రయల్స్ నిర్వహణకు పరిస్థితులు, నిపుణుల లభ్యత బాగుంటున్నాయని ఆయన చెప్పారు. అయితే, పేషెంట్లలో అవగాహన, తృతీయ శ్రేణి పట్టణాలు మొదలైన చోట్ల మౌలిక సదుపాయాలు, అధ్యయనాల మధ్యలోనే పేషెంట్లు తప్పుకోవడం తదితర అంశాలపరంగా కొన్ని సవాళ్లను అధిగమించాల్సి ఉందని వ్యాస్ పేర్కొన్నారు. విద్యార్థుల్లో పరిశ్రమకు అవసరమయ్యే నైపుణ్యాలను పెంపొందించేందుకు విద్యా సంస్థలతో కూడా కలిసి పనిచేస్తున్నామని, తెలంగాణ ప్రభుత్వంతోనూ ఈ విషయంలో సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన వివరించారు.

ఇర్కాన్‌కు నవరత్న హోదా

జాబితాలో చేరిన 15వ సీపీఎస్‌ఈ

న్యూఢిల్లీ: పీఎస్‌యూ.. ఐఆర్‌సీవోఎన్ (ఇర్కాన్) ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు నవరత్న హోదా లభించింది. ప్రభుత్వం తాజాగా నవరత్న గుర్తింపును ప్రకటించినట్లు ఇర్కాన్ ఇంటర్నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియజేసింది. ప్రభుత్వ సంస్థల విభాగం నుంచి ఈ మేరకు సమాచారం అందినట్లు వెల్లడించింది. పీఎస్‌యూలలో అత్యుత్తమ పనితీరు ప్రదర్శించే కంపెనీలకు నవరత్న గుర్తింపు లభిస్తుంది. తద్వారా కంపెనీకి పాలనాపరమైన స్వేచ్ఛతోపాటు ఆర్థిక అధికారాలు లభిస్తాయి. వెరసి నవరత్న హోదా పొందిన 15వ కేంద్ర ప్రభుత్వ రంగ కంపెనీ(సీపీఎస్‌ఈ)గా ఇర్కాన్ నిలిచింది.

ఎన్‌ఎస్‌ఈలో శుక్రవారం ఇర్కాన్ షేరు 9.5% జంప్‌చేసి రూ. 149 వద్ద ముగిసింది.

ఆర్‌బీఐ కార్యాలయాల ముందు క్యూ

19 కేంద్రాల్లో రూ. 2 వేల నోట్ల మార్పిడి



న్యూఢిల్లీ: రూ.2,000 నోట్ల మార్పిడి, డిపాజిట్ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కార్యాలయాల ముందు జనం బారులు దీరారు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలను దేశవ్యాప్తంగా 19 ఆర్‌బీఐ కార్యాలయాలు కొనసాగిస్తున్నాయి. రూ.2 వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు 2023 మే 19న ఆర్‌బీఐ ప్రకటించిన సంగతి తెలిసిందే. మార్పిడి, డిపాజిట్‌కు సెప్టెంబర్ 30 వరకు అనుమతించారు. ఆ తర్వాత ఆఖరు తేదీని అక్టోబర్ 7 వరకు పొడిగించారు. ఆర్‌బీఐ కార్యాలయాల వద్ద వ్యక్తులు, కంపెనీలు తమ వద్ద ఉన్న రూ.2 వేల నోట్లను ఒకసారి రూ.20,000 వరకు మార్చుకోవచ్చు. బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్‌కు మాత్రం ఎటువంటి పరిమితి లేదు. వ్యవస్థ నుంచి రూ.3.43 లక్షల కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు వెనక్కి వచ్చాయని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ గత శుక్రవారం వెల్లడించారు. రూ.12,000 కోట్ల విలువైన నోట్లు ఇప్పటికీ చలామణిలో ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. 2016 నవంబరులో రూ.500, రూ.1,000 నోట్ల రద్దు తర్వాత ఆర్‌బీఐ రూ.2,000 నోట్లతోపాటు కొత్త రూ.500 నోట్లను పరిచయం చేసింది.

బిగ్ 'సి'.. దసరా ధమాకా ఆఫర్స్



హైదరాబాద్: మొబైల్ రిటైల్ విక్రయ సంస్థ బిగ్ 'సి' దసరా ధమాకా ఆఫర్లు ప్రకటించింది. ప్రతి స్మార్ట్ ఫోన్ కొనుగోలుపై రూ.10వేల వరకు క్యాష్ బ్యాక్‌తో పాటు రూ.4వేల వరకు కచ్చితమైన బహుమతి ఇస్తుంది. ప్రతి మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌ట్యాప్ కొనుగోలుపై స్మార్ట్ వాచ్ ఆఫర్, 5% తక్షణ డిస్కౌంట్, లాయల్టీ పాయింట్లు వంటి మరెన్నో ఆఫర్లు అందిస్తుంది. ఐఫోన్ మొబైల్స్ కొనుగోలుపై రూ.4వేల వరకు క్యాష్ బ్యాక్ ఇస్తుంది. బ్రాండెడ్ యాక్సెసరీలపై 51% వరకు డిస్కౌంట్ అందిస్తుంది. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలు కొనుగోలు చేయవచ్చు. ప్రజలంతా ఈ ఆఫర్లు వినియోగించుకోవాలని సంస్థ ఫౌండర్, సీఎండీ బాలు చౌదరీ కోరారు.

బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు

సూచీలు రెండో రోజూ డీలా



ముంబై: బ్యాంకింగ్, ఐటీ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు రెండో రోజూ నష్టాలు చవిచూశాయి. అమెరికాలో అంచనాలకు మించి ద్రవ్యోల్బణ డేటా నమోదు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచింది. ఫలితంగా శుక్రవారం సెన్సెక్స్ 125 పాయింట్లు నష్టపోయి 66,282 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 43 పాయింట్లు పతనమై 19,751 వద్ద నిలిచింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలతో ఉదయం సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. ప్రథమార్ధంలో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఒక దశలో సెన్సెక్స్ 513 పాయింట్లు క్షీణించి 65,895 వద్ద, నిఫ్టీ 116 పాయింట్లు పతనమై 19,635 వద్ద ఇంట్రాడే కనిష్టాలకు దిగివచ్చాయి. అయితే ద్వితీయార్థంలో ఆటో, ఎఫ్‌ఎంసీజీ, రియల్టీ, ఫార్మా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు కొంత మేర నష్టాలు భర్తీ చేసుకోగలిగాయి. విదేశీ ఇన్వెస్టర్లు 17 ట్రేడింగ్ సెషన్ల వరుస విక్రయాల తర్వాత తొలిసారి రూ.317 కోట్ల ఈక్విటీ షేర్లు కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.103 కోట్ల షేర్లు అమ్మేశారు. ఇజ్రాయెల్ – హమాస్ యుద్ధం, యూఎస్‌లో ద్రవ్యోల్బణం పెరగడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- క్యూ2 ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో ఇన్ఫోసిస్ షేరు 2.24% నష్టపోయి రూ.1432 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 4.26% క్షీణించి రూ.1402 వద్ద నిలిచింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 11.35 లక్షల షేర్లు చేతులు మారాయి.
- స్పైస్‌జెట్‌లో వాటా కొనుగోలుకు ఇండిగో సహ వ్యవస్థాపకుడు రాకేష్ గంగ్వాల్ చర్చలు జరుపుతున్నట్లు వార్తలు రావడంతో స్పైస్ జెట్ 19% ర్యాలీ చేసి రూ.43.60 వద్ద స్థిరపడింది.
- ప్రభుత్వ రంగానికి చెందిన ఇర్కాన్ ఇంటర్నేషన్ సంస్థకు నవరత్న హోదా కల్పించేందుకు కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో ఈ కంపెనీ షేరు 10% పెరిగి రూ.150 వద్ద స్థిరపడింది.
- క్యూ2 నికర లాభం 10% వృద్ధి చెందడంతో హెచ్‌సీఎల్ టెక్ షేరుకు డిమాండ్ లభించింది. 2.55% లాభపడి రూ.1255 వద్ద స్థిరపడింది.

సినిమా

మిలన్‌కు బై బై


• గోపీచంద్

మిలన్‌కు బై బై చెప్పారు గోపీచంద్. శ్రీను వైట్ల దర్శకత్వంలో గోపీచంద్ హీరోగా ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ సినిమా తొలి షెడ్యూల్ ఇటలీలో మొదలైన విషయం గుర్తుండే ఉంటుంది. అక్కడి మిలన్ నగరంలో ప్లాన్ చేసిన షెడ్యూల్ ముగిసింది. గోపీచంద్‌తో పాటు ఇతర ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. అలాగే శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఓ పాటతో ఈ విదేశీ షెడ్యూల్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్.

ప్రస్తుతానికి అందుబాటులో లేను!


• పూజా హెగ్డే

పుట్టినరోజు (అక్టోబర్ 13) సందర్భంగా పూజా హెగ్డే తన తాజా చిత్రం గురించి థ్రిల్లింగ్ న్యూస్ ఒకటి చెప్పారు. షాహిద్ కపూర్ సరసన తొలిసారి ఆమె కథానాయికగా నటించనున్నారు. యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు రోషన్ ఆండ్రూస్ తెరకెక్కించనున్నారు. ఇలా బర్త్ డేకి ఓ థ్రిల్లర్ మూవీకి సైన్ చేయడం పట్ల పూజా హెగ్డే ఆనందంగా ఉన్నారు. ''ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. ఎందుకంటే కథాంశం కొత్తగా ఉంది. అలాగే నాది చాలా విభిన్నమైన పాత్ర. షాహిద్ కపూర్‌తో స్క్రీన్ షేర్ చేసుకోనుండటం హ్యాపీగా ఉంది. తను మంచి నటుడు. అందుకే ఈ సినిమా ప్రయాణాన్ని ఆరంభించడానికి ఆసక్తిగా ఉన్నాను'' అని పేర్కొన్నారు పూజా హెగ్డే. ఇక పుట్టినరోజుని ఎలా జరుపుకున్నారంటే.. ప్రస్తుతం ఈ బ్యూటీ మాల్దీవుల్లో ఉన్నారు. 'కరెంట్లీ అన్ అవైలబుల్' (ప్రస్తుతం అందుబాటులో లేను) అంటూ మాల్దీవుల్లో సేద తీరుతున్న ఫొటోను సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారు పూజా హెగ్డే.

వ్యక్తుల సంఘర్షణే వ్యూహం

- రామ్‌గోపాల్ వర్మ


• దాసరి కిరణ్ కుమార్, రామ్‌గోపాల్ వర్మ

''నాకు టీడీపీ గురించి తెలియదు. వైసీపీ గురించి తెలియదు. నేను రాజకీయాలు ఫాలో కాను. ఈ 'వ్యూహం' చిత్రానికి పార్టీలకు, ప్రభుత్వాలకు సంబంధం లేదు. ఇది కేవలం వ్యక్తుల మధ్య ఉండే కాన్ఫ్లిక్ట్ (సంఘర్షణ)'' అని దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ అన్నారు. అజ్మల్, మానస ప్రధాన పాత్రధారులుగా రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన తాజా పొలిటికల్ చిత్రం 'వ్యూహం'. ఈ సినిమా రెండో భాగం 'శపథం'. రామదూత క్రియేషన్స్ పతాకంపై దాసరి కిరణ్ కుమార్ నిర్మించిన 'వ్యూహం' సినిమా నవంబరు 10న, 'శపథం' చిత్రం జనవరి 25న విడుదల కానున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'వ్యూహం' సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ – ''వాస్తవ సంఘటనలు, వాటి తాలూకు పాత్రల పట్ల నాకు ఎప్పుడూ ఆసక్తి ఉంటూనే ఉంటుంది. నా దర్శకత్వంలో వచ్చిన సినిమాల్లో దాదాపు 80 శాతం వరకు ఏదో ఒక సంఘటన నుంచి స్ఫూర్తి పొందినవే ఉంటాయి'' అన్నారు. దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ –''ప్రజలకు తెలియని ఎన్నో విషయాలు ఉంటాయి. ఆ అంశాలను పొందుపరిచి ఓ సందేశంగా.. సినిమాగా చెప్పాలనిపించి, సమయానుకూలంగా 'వ్యూహం'ని ఇప్పుడు నిర్మించి, విడుదల చేస్తున్నాం. ఇది బయోపిక్ కాదు. ఈ సినిమాని చాలా పెద్ద స్థాయిలో రిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. ఐదు లక్షల మందితో నవంబరు 5న ప్రీ రిలీజ్ వేడుకను భారీ ఎత్తున జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

ఆమిర్‌కు జోడీగా?


• జెనీలియా

'సై', 'బొమ్మరిల్లు', 'ఆరెంజ్' వంటి చిత్రాలతో హీరోయిన్‌గా జెనీలియా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితురాలే. రితేష్ దేశ్‌ముఖ్‌ని పెళ్లి చేసుకుని, ఇద్దరు బిడ్డలకు తల్లయిన జెనీలియా చాలా గ్యాప్ తర్వాత మళ్లీ సినిమాలు ఒప్పుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమిర్ ఖాన్‌కు జోడీగా ఆమె ఓ సినిమాలో ఎంపికయ్యారని బాలీవుడ్ టాక్. ఆమిర్ ఖాన్ తాజా చిత్రం 'సితారే జమీన్ పర్' చిత్రంలో హీరోయిన్ పాత్రకు జెనీలియాను తీసుకున్నారని, ఆర్‌ఎస్ ప్రసన్న ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని సమాచారం. మరి.. ఆమిర్‌కు జోడీగా జెనీలియా కనిపిస్తారా? చూడాలి. మరోవైపు దశాబ్దం తర్వాత 'జూనియర్' అనే తెలుగు సినిమాలో జెనీలియా కీలక పాత్ర చేస్తున్నారు. ఇక 2012లో రానా హీరోగా వచ్చిన 'నా ఇష్టం' తెలుగులో హీరోయిన్‌గా జెనీలియా నటించిన చివరి చిత్రం.

వయసుకి తగ్గ పాత్రలే చేస్తాను

- రేణూ దేశాయ్

''నటనకు కావాలని విరామం ఇవ్వలేదు. నాకు నటించాలనే ఉంది. అయితే ఓ సినిమా ఒప్పుకునే ముందు కథ, అందులోని నా పాత్ర, ఆ చిత్ర దర్శక-నిర్మాతలు... ఈ మూడు అంశాలను పరిగణనలోకి తీసుకుంటాను. ఇలా ఈ మూడు అంశాలతో నేను ఏకీభవించి నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'' అన్నారు నటి, దర్శక-నిర్మాత రేణూ దేశాయ్. రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో మయాంక్ సింఘానియా సహనిర్మాతగా అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో రేణూ దేశాయ్ చెప్పిన విశేషాలు.


• 'టైగర్...'లో హేమలతగా రేణు

- 'టైగర్ నాగేశ్వర రావు'లో హేమలత లవణంగారి పాత్ర చేశాను. లవణంగారి మేనకోడలు కీర్తిగారిని కలిసి ఆవిడ గురించి చాలా విషయాలు తెలుసుకున్నాను. 1970 కాలంలోనే జోగిని వ్యవస్థ, అంటరానితనంపై పోరాటాలు చేశారామె. దొంగలు, బందిపోట్లలో మంచి మార్పు కోసం కృషి చేశారు. ఇలాంటి సామాజిక కార్యక్రమాలతో స్ఫూర్తిగా నిలిచిన హేమలతగారి పాత్ర చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఆమె బాడీ లాంగ్వేజ్‌ను వెండితెరపై ప్రతిబింబించడం సవాల్‌గా అనిపించింది. నా కెరీర్‌లో ఇప్పటివరకూ నాకు ఏ పశ్చాత్తాపం లేదు. అయితే హేమలత లవణంగారి గురించి తెలుసుకుని, ఆమె పాత్రలో నటించిన తర్వాత ఆమెను కలవలేకపోయానని పశ్చాత్తాపపడుతున్నాను. హేమలతగారి స్ఫూర్తితో చిన్నారుల ఆకలి తీరేలా నా వంతుగా ఓ స్వచ్ఛంద సేవా సంస్థను మొదలు పెట్టాలనుకుంటున్నాను. 'టైగర్ నాగేశ్వర రావు' సినిమా ట్రైలర్ చూసి, నా వయసుకి తగ్గ పాత్రలో నటించినందుకు మా అమ్మాయి ఆద్య తనకు గర్వంగా ఉన్నట్లు చెప్పింది. నాకు బెస్ట్ కాంప్లిమెంట్ అది. నా గురించి నా పిల్లలు ఏమనుకుంటున్నారన్నదే నాకు ముఖ్యం. భవిష్యత్‌లో నా వయసుకు తగ్గ పాత్రలే చేయాలనుకుంటున్నాను.
- మా నాన్నమ్మ 47 ఏళ్లకే హార్ట్ ఎటాక్‌తో చనిపోయారు. మా నాన్నా హార్ట్ ఎటాక్‌తోనే చనిపోయారు. ఇలా జన్యుపరంగా నాకు గుండె సంబంధిత సమస్యలున్నాయి. అయితే ప్రమాదం లేదు. అలాగని అజాగ్రత్త వహించకూడదు. చికిత్స తీసుకుంటున్నాను.

మార్పు రావాలి


• తాప్సీ

కథానాయికగా సౌత్, నార్త్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు తాప్సీ. అయితే హీరోయిన్‌గా మిగిలిపోకుండా నిర్మాతగానూ నిరూపించుకోవాలనుకున్నారామె. తొలి ప్రయత్నంగా తాప్సీ నిర్మించిన హిందీ చిత్రం 'ధక్ ధక్' శుక్రవారం విడుదలైంది. అయితే నిర్మాతగా తనకు చేదు అనుభవం ఎదురైందని తాప్సీ అంటున్నారు. ఓ ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ – ''బాలీవుడ్‌లో స్టార్ సిస్టమ్ వల్ల చిన్న సినిమాలకు నష్టం జరుగుతోంది. కథ వినేటప్పుడే 'హీరో ఎవరు?' అని అడుగుతున్నారు. దాంతో జనాలు 'కంటెంటే కింగ్' అనుకుంటారనే నా భ్రమ తొలగిపోయింది. హీరోని బట్టి పెట్టుబడి ఉంటుంది. ఓ నటిగా నేను ఒక కథ వినేటప్పుడు ఆ నిర్మాతలు ఎంత పెద్దవాళ్లు, కో-స్టార్ ఎవరు? అని అడగలేదు. కొత్త దర్శకులతో, కొత్త నటులతో సినిమాలు చేశాను. కానీ వేరేవాళ్లు అలా చేయడానికి ఇష్టపడటంలేదు. ఎందుకీ తేడా? ఈ విషయంలో ఏ ఒక్కర్నో నిందించాల్సిన అవసరం లేదు. యాక్టర్లు, స్టూడియోలు, ప్రేక్షకులు... అందరూ బాధ్యులే. బాలీవుడ్ అర్థవంతమైన చిత్రాలు చేయడంలేదని అంటుంటారు. కానీ, చేసినప్పుడు మాత్రం సపోర్ట్ దక్కదు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలి. పెద్ద సినిమాలకు పెట్టుబడి పెట్టి, డిజిటల్ రైట్స్ ద్వారా డబ్బు రికవర్ చేసుకోవచ్చని అనుకుంటారు. చిన్న సినిమాలకు పెట్టుబడి పెట్టడం కష్టం.. రిలీజ్ చేసుకోవడమూ కష్టమే. ఈ పరిస్థితి స్టార్స్‌కి, యాక్టర్స్‌కి మధ్య దూరం పెంచుతుంది'' అని చెప్పుకొచ్చారు. ఇక తాప్సీ ఒక నిర్మాతగా వ్యవహరించిన 'ధక్ ధక్' కథ నలుగురు మహిళల చుట్టూ తిరుగుతుంది.

బంజారా నేపథ్యంలో...


• మల్లారెడ్డి, రాకేష్

తెలంగాణ ప్రాంతం బంజారా (తండా) నేపథ్యంలో రూపొందుతున్న సినిమాకు 'కెసిఆర్' (కేశవ్ చంద్ర రమావత్) అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'రాకింగ్' రాకేష్, అనన్య హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా చేస్తూనే, దర్శకత్వం వహిస్తున్నారు 'గరుడ వేగ' అంజి. గ్రీన్ టీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో విభూది క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను తెలంగాణ మంత్రి మల్లారెడ్డి విడుదల చేశారు. మల్లారెడ్డి యూనివర్సిటీలో 50 అడుగుల కటౌట్‌తో 50,000 మంది స్టూడెంట్స్ సమక్షంలో జరిగిన 'కెసిఆర్' టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. మామిడి హరికృష్ణతో పాటు 'కెసిఆర్' చిత్రబృందం పాల్గొంది. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్.

మాస్ స్టెప్స్‌తో..


• కంచర్ల ఉపేంద్ర

కంచర్ల ఉపేంద్ర, సావిత్రి కృష్ణ జంటగా ఎస్‌కే ఆర్యన్ సుభాన్ దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. 'పోకిరీ జులాయిలు...' అంటూ సాగే పాటను చిత్రీకరిస్తున్నారు. కంచర్ల ఉపేంద్ర, వంద మంది జూనియర్ ఆర్టిస్టులు, ఇరవై మంది డ్యాన్సర్లు పాల్గొంటుండగా ఈ మాస్ పాటను చిత్రీకరిస్తున్నారు. ఊటీలో చిత్రీకరించే మరో పాటతో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ''హీరో కావాలన్న మా అబ్బాయి ఆసక్తిని గమనించి, ఐదు చిత్రాలు నిర్మిస్తున్నాం'' అన్నారు కంచర్ల అచ్యుతరావు. ఈ చిత్రానికి సంగీతం: రాము అద్దంకి.

గోవాలో సంతోషం


• సురేష్ కొండేటి

సంతోషం సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డుల వేడుక డిసెంబరు 2న గోవాలో జరగనుంది. సంతోషం 22వ 'సౌత్ ఇండియన్ ఫిలిం అవార్డులు-2023' వేడుక గోవాలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జరగనున్నట్లు, జాతీయ సినిమా దినోత్సవం సందర్భంగా శుక్రవారం హీరోయిన్ శ్రీలీల ఓ వీడియోలో వెల్లడించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ మరియు బాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకకు హాజరు కానున్నట్లు నిర్వాహకుడు, 'సంతోషం' పత్రికాధినేత సురేష్ కొండేటి పేర్కొన్నారు.

నీట్-యూజీ సిలబస్ కుదింపు

నూతన సిలబస్‌ను విడుదల చేసిన ఎన్‌ఎంసీ

- విద్యార్థులపై భారం తగ్గించడమే లక్ష్యం
- కెమిస్ట్రీలో 20 శాతం సిలబస్ కట్...
- ఫిజిక్స్‌లో కష్టమైన కాన్సెప్ట్‌లూ తగ్గింపు

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు 2024 నుంచి నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) సిలబస్‌ను కుదించారు. విద్యార్థులపై భారం తగ్గించేందుకు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సిలబస్‌లో స్వల్ప మార్పులు చేసింది. కెమిస్ట్రీలో అత్యధికంగా టాపిక్‌లు తగ్గించారు. మొత్తంగా కెమిస్ట్రీలో ఎక్కువగా 20 శాతం సిలబస్ తగ్గింది. దీనివల్ల విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఫస్టియర్, సెకండియర్ కలిసి కెమిస్ట్రీలో అత్యధికంగా 9 టాపిక్‌లను తగ్గించారు. ఫిజిక్స్‌లో ఏ టాపిక్ తగ్గించలేదు, కానీ సబ్ టాపిక్స్‌లో కాన్సెప్ట్‌లను కుదించారు. విద్యార్థులు కష్టంగా ఫీలయ్యే సబ్ టాపిక్స్ కాన్సెప్ట్‌లను తీసేశారు. బోటనీ, జువాలజీల్లో మూడు చొప్పున టాపిక్‌లను తీసేశారు. అక్కడక్కడ కొన్ని కాన్సెప్ట్‌లకు కోత పెట్టారు. అన్ని సబ్జెక్టుల్లోనూ కొత్త కాన్సెప్ట్‌లను జోడించారు. ఇంటర్‌లో ప్రాక్టికల్స్‌లో ఉండే కాన్సెప్ట్‌లను ఇప్పుడు నీట్ పరీక్షలో పెట్టారు. ఆ ప్రకారం విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. కాగా, నీట్ యూజీ సిలబస్ తగ్గింపుతో ప్రస్తుత సెకండియర్ విద్యార్థుల కన్నా, ఫస్టియర్ విద్యార్థులకే అధిక ప్రయోజనం అంటున్నారు. నీట్‌ను 2024 మే 5న నిర్వహిస్తారు. ఇంకా నీట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాలేదు.

తొలగించిన పాఠ్యాంశాలు

- **కెమిస్ట్రీ ఫస్టియర్:** పదార్థం స్థితి, హైడ్రోజన్, ఎస్ బ్లాక్ ఎలిమెంట్స్, ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ.
- **కెమిస్ట్రీ సెకండియర్:** ఘనస్థితి, ఉపరితల రసాయన శాస్త్రం, మెటలర్జీ, రోజువారీ జీవితంలో పాలిమర్లు, కెమిస్ట్రీ.
- **ఫిజిక్స్ ఫస్టియర్:** ప్యూర్ రోలింగ్, కనెక్టింగ్ బాడీలు, పాలిట్రోపిక్ ప్రక్రియ, బలవంతమైన, దెబ్బతిన్న డోలనాలు.
- **ఫిజిక్స్ సెకండియర్:** పొటెన్షియల్, నాన్ పొటెన్షియల్ సంభావ్యత, ప్రొటెన్షియో మీటర్, ఎర్త్ మ్యాగ్నటిజం, రేడియో యాక్టివిటీ, ట్రాన్సిస్టర్లు, ఆంప్లిఫయర్లు.

జువాలజీ యూనిట్-2: వానపాములు, యూనిట్-5లో శరీర నిర్మాణశాస్త్రం, జీర్ణక్రియ శోషణం, జ్ఞానేంద్రియాలు (చెవులు, కళ్లు), యూనిట్-10లో జీవావరణం, పర్యావరణం, పర్యావరణ సమస్యలు, పశుసంవర్ధకం.
బోటనీ ఫస్టియర్: ప్లాంట్ ఫిజియాలజీలో ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్, మార్ఫాలజీ.
బోటనీ సెకండియర్: స్ట్రాటజీస్ ఫర్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్.
బోటనీలో కొత్తగా చేర్చినవి: బయో మాలిక్యూల్స్, ఎంజైములు, ప్రాపర్టీలు, మాల్వేస్, లెగుమనీస్ సహా మరికొన్ని అంశాలు.

ముందే సిలబస్‌ను తగ్గిస్తే బాగుండేది

"సిలబస్ తగ్గింపు విషయాన్ని ఆలస్యంగా చెప్పడం వల్ల పిల్లలకు అంతగా ఊరట ఉండదు. ఇది ఎప్పుడో ముందే చెప్పాల్సింది. అలా చేసుంటే వాటిని చదవాల్సిన అవసరం ఉండేది కాదు. వాటిని ఇప్పటికే పిల్లలు చదివేశారు. అయితే రివిజన్‌లో చదవకుండా చూసుకోవాలి. ఏదిఏమైనా సిలబస్ తగ్గింపు పిల్లలకు ప్రయోజనం కలిగించేదే." – శంకర్‌రావు, డీన్, శ్రీచైతన్య కాలేజీ

బోనాలపై భారీ చిత్రం

1,042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రం



ఆత్మకూరు(ఎం): తెలంగాణ సంప్రదాయ పండుగల్లో ప్రధానమైన బోనాల పండుగకు విశ్వవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు భారీ చిత్రాన్ని వేశాడొక కళాకారుడు. బోనాల పండుగ విశిష్టతను తెలియజేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం కొరటికల్ గ్రామానికి చెందిన మహేశ్వరం నరహరి ఈ భారీ చిత్రాన్ని చిత్రించారు. ఇందుకోసం 15 కిలోల కారం, 15 కిలోల పసుపు ఉపయోగించారు. 1042 చదరపుటడుగుల కాన్వాస్‌పై చిత్రించేందుకు 10 గంటల 33 నిమిషాల సమయం తీసుకుందని ఆయన వివరించారు.

ఎయిర్‌పోర్టులో కావూరి కుమార్తె అరెస్ట్

- పాత కేసులో రాజస్తాన్ పోలీసుల లుక్అవుట్ నోటీస్
- ఓ భూయజమానిని ఆర్థికంగా మోసం చేశారని కేసు



శంషాబాద్: రాజస్తాన్ పోలీసుల లుక్‌ఔట్ నోటీసు మేరకు మాజీ ఎంపీ కావూరి సాంబశివరావు కుమార్తె శ్రీవాణిని శంషాబాద్ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గురువారంరాత్రి ఎయిర్‌పోర్టు నుంచి దుబాయ్ వెళ్లేందుకు వచ్చిన శ్రీవాణిని అడ్డుకుని రాజస్తాన్ పోలీసులకు సమాచారం అందించారు. అప్పటివరకు ఆమెను ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. శుక్రవారం ఉదయం రాజస్తాన్ పోలీసులు వచ్చి కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ జడ్జి ముందు హాజరుపర్చారు. తమ స్థలంలో మట్టిని తవ్వి తరలించిన విషయంలో ఆర్థికంగా మోసం చేసినట్లు సంబంధిత భూయజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదైనట్లు సమాచారం. ఆ కేసులో విచారణకు ఆమె హాజరుకాకపోవడంతో అక్కడి పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు. తాజాగా కోర్టు ముందు హాజరుపర్చిన అనంతరం ఆమెను రాజస్థాన్‌కు తరలించారు.

కొన ‘ఊపిరి’ నిలబెట్టారు!



రోహిత్‌తో వైద్యులు, వైద్య సిబ్బంది

- విజయవంతంగా రెండు ఊపిరితిత్తుల మార్పిడి
- పురుగుల మందు తాగిన యువకుడికి నిర్వహణ
- ప్రపంచంలో 4వ అరుదైన ట్రాన్స్‌ప్లాంట్
- యశోద ఆస్పత్రి ఘనత

రాంగోపాల్‌పేట్: విషం తాగి తీవ్ర ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన ఓ యువకుడికి యశోద ఆస్పత్రి వైద్యులు అరుదైన ఆపరేషన్‌తో ప్రాణం పోశారు. ఒకేసారి డబుల్ లంగ్స్ ట్రాన్స్‌ప్లాంట్‌ను విజయవంతంగా చేసి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలో ఇలాంటి శస్త్ర చికిత్స నాలుగవది కావడం గమనార్హం. శుక్రవారం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆస్పత్రి డైరెక్టర్ గోరుకంటి పవన్, సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్‌లు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా మర్రాయిగూడెంకు చెందిన 23 ఏళ్ల రోహిత్ గత నెలలో వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగి, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లడంతో అతన్ని సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చేర్చారు. విషం ఊపిరితిత్తుల్లోకి వెళ్లి కోలుకోలేని పల్మనరీ ఫైబ్రోసిస్ పరిస్థితి ఏర్పడింది. అలాగే కిడ్నీలు, కాలేయం కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆయనకు మెకానికల్ వెంటిలేటర్స్ వైద్యం అందించిన తర్వాత 20 రోజులకు పైగానే ఎక్మోపై చికిత్స అందించారు. అయినా ఊపిరితిత్తుల పనితీరు మెరుగుపడలేదు. దీంతో రెండు ఊపిరితిత్తులను మారిస్తేనే యువకుడి ప్రాణాలు నిలబెట్టవచ్చని వైద్యులు భావించారు. కానీ భారతదేశంలో ఇలాంటి కేసుల్లో ఎక్మో వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడిన వాళ్లు లేరు. శరీరంలో ఎటువంటి పురుగుల మందు అవశేషాలు లేవని నిర్ధారించుకున్నాక ఊపిరితిత్తుల మార్పిడి కోసం జీవన్‌దాన్‌లో నమోదు చేశారు. జీవన్‌దాన్ చొరవతో ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ హరికిషన్, థొరాసిక్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ కేఆర్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ మంజునాథ్ బాలే, డాక్టర్ చేతన్, డాక్టర్ శ్రీచరణ్, డాక్టర్ మిమి వర్గీస్‌లతో కూడిన బృందం ఆరు గంటల పాటు శ్రమించి విజయవంతంగా రెండు ఊపిరితిత్తులను మార్చారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో రోహిత్‌ను డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు.

అమ్మాయి జన్మిస్తే 111 మొక్కలు

- శ్యాంసుందర్ పలివాల్ వినూత్న కృషి..షార్ట్ ఫిల్మ్‌ను షేర్ చేసిన ఎంపీ సంతోష్ కుమార్

సాక్షి, హైదరాబాద్: ఆడబిడ్డ జన్మను పర్యావరణ పరిరక్షణకు ముడిపెడుతూ పద్మశ్రీ శ్యామ్ సుందర్ పలివాల్ చేస్తున్న కృషిని ఎంపీ జె.సంతోష్ కుమార్ అభినందించారు. దాదాపు ముప్పై ఏళ్లుగా రాజస్తాన్ బలోత్రా జిల్లాలో శ్యాంసుందర్ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫాదర్ ఆఫ్ ఎకో ఫెమినిస్ట్‌గా పేరొందిన శ్యాంసుందర్ తన సొంత గ్రామం పిప్లాంత్రితోపాటు చుట్టుపక్కల ఎక్కడ ఆడపిల్ల పుట్టినా, ఆ అమ్మాయి పేరు మీదు నూటా పదకొండు మొక్కలు నాటడం, నాటించడం చేస్తున్నారు. పర్యావరణ క్షీణతతో ఎంతటి విపత్తును ఎదుర్కొంటున్నామో, ఆడబిడ్డల నిష్పత్తి పడిపోతే సమాజం అంతే ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని ఆయన చెబుతుంటారు. సుందర్ పలివాల్ కృషిలో భాగస్వామ్యమైన ఆస్టల్ ఫౌండేషన్, ఆయా గ్రామాల్లో నాటిన మొక్కల పరిరక్షణ కోసం 13 కిలోమీటర్ల పైపులైన్‌ను ఏర్పాటు చేసింది. హాస్పిటల్‌లో అమ్మాయి పుడితే ఊరు ఊరంతా తరలిరావటం, వేడుకగా మొక్కలు నాటే పండగను భావోద్వేగంగా చిత్రీకరించిన షార్ట్ ఫిల్మ్‌ను ఎక్స్(ట్విట్టర్)లో సంతోష్ కుమార్ షేర్ చేస్తూ పలివాల్ అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు.

విమలక్కకు ‘సుద్దాల’ పురస్కారం



విమలక్కను పురస్కారంతో సత్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధారాణి. చిత్రంలో ఆర్.నారాయణమూర్తి, సుద్దాల అశోక్‌తేజ, కోయి కోటేశ్వర్‌రావు, రచ్చ భారతి, ప్రొఫెసర్ కాశీం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం(హైదరాబాద్): ప్రజాగాయని, అరుణోదయ విమలక్కకు సుద్దాల హన్మంతు- జానకమ్మల జాతీయ పురస్కారాన్ని అందజేశారు. సుద్దాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారంరాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రాధారాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం జస్టిస్ రాధారాణి మాట్లాడుతూ ప్రజావాగ్గేయకారుడు సుద్దాల హన్మంతు పేరిట అవార్డు ప్రదానం చేయడం గొప్ప అదృష్టమన్నారు. ప్రజాకవిగా, కళాకారుడిగా అంతకుమించి క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టుగా జీవితాంతం కష్టజీవుల కోసం, కమ్యూనిస్టు ఉద్యమం కోసం కృషి చేసిన హన్మంతు మహనీయుడని కొనియాడారు. ఆయన గొప్ప ప్రజావాగ్గేయకారుడని పేర్కొన్నారు. ప్రజానటుడు, సినీదర్శకుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ కులోన్మాద, మతోన్మాద, రాజ్యోన్మాద శక్తులను ధిక్కరించడానికి, ప్రజలను మేలుకొల్పడానికి ప్రజావాగ్గేయకారుడుగా సుద్దాల హన్మంతు చేసిన కృషి మరువలేనిదన్నారు. తెలంగాణ పాటకు, ఆటకు జరుగుతున్న సత్కారమే విమలక్కకు అవార్డు అని పేర్కొన్నారు. అవార్డు గ్రహీత విమలక్క మాట్లాడుతూ సుద్దాల హన్మంతు పురస్కారం అందుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోయి కోటేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుద్దాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ రచయిత్రి ఐనంపూడి శ్రీలక్ష్మి, ‘మోదుగుపూలు’ ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ప్రభుత్వ వాస్తు సలహాదారు సుద్దాల సుధాకర్‌తేజ, సుద్దాల హన్మంతు కూతురు రచ్చ భారతి, కుటుంబసభ్యులు సుద్దాల ప్రభాకర్, బల్లా కౌముది, సుద్దాల స్వప్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుద్దాల పుర ప్రముఖులు యాగమాటి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.